అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

ARUNATARA

సంపుటి: 44 సంచిక: 11 హైదరాబాద్ 331 డిసెంబర్, 2016 పేజీలు: 68 వెల: రు. 20

పూలు రాలిన చోట
పుప్పొడి వెదజల్లబడే ఉంటుంది
పుప్పొడి నెత్తురులోంచి
పిడికిలి తేటగా తేరుకొని ఉంటుంది

హైదరాబాద్ బుక్‌ఫెయిర్ 2016

అరుణతార

బుక్ స్టాల్ 242 & 243 కు
అందరికీ ఆహ్వానం!

తేదీలు : **15 డిసెంబర్ 2016 నుంచి 26 డిసెంబర్ 2016 వరకు**

సమయం : మ 2-00 గం. నుండి రా 8-30 గం. వరకు

సెలవు రోజులలో : మ 12-00 గం. నుండి రా 9-00 గం. వరకు

స్థలం : ఎన్‌టిఆర్ స్టేడియం,

ఇందిరాపార్కు ఎదురుగా, హైదరాబాద్‌లో

జరగనున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో అరుణతార బుక్ స్టాల్‌కు అందరికి ఆహ్వానం. విరసం ప్రచురణల కోసం, అరుణతార పత్రిక కోసం ఇంకా విలువైన కథలు, కవిత్వం, నవల, సాహిత్య వ్యాసాలు, చరిత్ర, తత్వశాస్త్రం, జీవిత చరిత్రలు, పిల్లల సాహిత్యం, ఇంకా అనేక వైవిధ్యభరితమైన పుస్తకాల కోసం అరుణతార/విరసం బుక్ స్టాల్‌ను తప్పక సంప్రదించండి.

ఎప్పటికప్పుడు మా వివరాలను

virasam website : www.virasam.org లో చూడండి.

likepage: //viplava rachayitala sangham arunatara

facebook : //viplava rachayitala sangham virasam



KLVA101M 194

అరుణతార
సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక
సంపుటి : 44 ◆ సంచిక : 11 ◆ డిసెంబర్, 2016 వెల : రు. 20/-

సంపాదకీయం

నోట్ల రద్దు ఎవరి ప్రయోజనాల కోసం?

● సిఎస్ఆర్ ప్రసాద్

జాతీయవాద ముసుగులో సామ్రాజ్యవాద పెట్టుబడులకు సేవ చేస్తున్న నరేంద్ర మోది పెద్ద నోట్ల రద్దు ప్రకటనతో మరోసారి తన 'ప్రభు భక్తిని' చాటుకున్నాడు. సాధారణ ప్రజానీకంపై యుద్ధం ప్రకటించాడు. తొలి ఊపులో దేశభక్తి పేరిట స్వాగతించిన ప్రజలు క్రమక్రమంగా చర్య తీవ్రతను అర్థం చేసుకొని అసలు వాస్తవాలను గ్రహిస్తున్నారు. 'నల్ల'ధనాన్ని వెలికి తీయటం, తీవ్రవాదులు, మావోయిస్టుల మూలాలను దెబ్బతీయటం, అవినీతిని తొలగించటం అనే మూడు ప్రకటిత లక్ష్యాలకు, పెద్దనోట్ల రద్దుకు సంబంధం లేదన్న వాస్తవం కూడా ప్రజలకు తెలిసి వస్తోంది.

అయితే ఈ మొత్తం వ్యవహారంలో మోది నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న రాజకీయ పక్షాలేవీ సమస్య మూలాల్లోకి వెళ్లి, దాని వెనకవున్న భావజాలాన్ని ప్రజలకు తెలియచెప్పకుండా, నిర్ణయం మంచిదే గాని, అమలు సక్రమంగా లేదని ప్రచారం చేస్తున్నాయి. నిజానికి అక్రమమార్గాల్లో రాజకీయ నాయకుల దగ్గర, దళారీ గుత్త పెట్టుబడిదార్ల వద్ద పోగైన 'నల్ల'డబ్బు నోట్ల రూపంలో ఉండదని అందరికీ తెలిసిందే. వాళ్ళు తమ అక్రమ సంపాదనని బంగారం రూపంలో, షేర్ల రూపంలో, బినామీ స్థిరాస్తుల రూపంలో దాచుకుంటున్నారు. లేదా దేశ సరిహద్దుని దాటిస్తారు. ఈ వాస్తవాన్ని పక్కన పెట్టి నోట్ల రద్దు ద్వారా, రాజకీయ అవినీతికి తెర పడుతుందని ప్రజల్ని నమ్మించాలనుకోవడం పచ్చి మోసం, వంచన.

రాజకీయ అవినీతి, గుత్త పెట్టుబడిదార్ల అవినీతి నిర్మూలన ప్రజల చైతన్యవంతమైన, క్రియాశీలక పోరాటాల ద్వారానే సాధ్యం. దాంతో పాటు ఆర్థిక వ్యవస్థలో సరైన విలువలను ప్రవేశ పెట్టడం, సరకుల ఉత్పత్తి దశలోనూ, పంపిణీ, వినిమయం దశలలోనూ పారదర్శక పద్ధతుల్ని చేపడితేనే అవినీతి నిర్మూలన సాధ్యం. ఇదంతా జరిగినప్పటికీ స్వంత ఆస్తి వ్యవస్థ ఉన్నంత కాలం అక్రమ సంపాదనకు అవకాశాలు ఉండనే ఉంటాయి.

ప్రభుత్వం ఊహిస్తున్నట్లుగా నోట్ల రద్దు మూలంగా, ప్రజల దగ్గర నుండి బ్యాంకులకు దాదాపు 10 లక్షల కోట్ల రూపాయలు డబ్బు వచ్చి చేరితే అది ఎవరి కోసం, ఎందు కోసం ఉపయోగిస్తారని కూడా ఆలోచించాలి. దీన్ని అర్థం చేసుకోవటానికి ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న సంక్షోభాన్ని గుర్తించాలి. మొండి బకాయిల పేరుతో ఇప్పటికి దాదాపు 3 లక్షల కోట్ల రూపాయలు అప్పులను రద్దు చేయటంతో బ్యాంకులు దివాళా తీసే పరిస్థితి ఏర్పడింది. ఈ స్థితి నుంచి బ్యాంకింగ్ రంగాన్ని కాపాడటానికి వెంటనే 1. 25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు అవసరమని అంతర్జాతీయ క్రెడిట్ రేటింగ్ సంస్థ "మూడీ" (MOODY) ప్రకటించింది. ఇప్పుడు ప్రజల నుండి బ్యాంకులకు ప్రవహిస్తున్న ఈ డబ్బంతా ఎవరి జీవితాన్ని ఉద్ధరించడానికి ఉపయోగపడుతుంది? భారతీయ బ్యాంకులు ఇప్పటి వరకు అనుసరించిన రుణ విధానాన్ని పరిశీలిస్తే.. ఈ ప్రజాధనాన్ని అప్పుల రూపంలో గుత్త పెట్టుబడిదారీ సంస్థలకు ఇచ్చేస్తారని తెలుస్తుంది. ఇదే 'కాకుల్ని కొట్టి గద్దలకు వేయటమంటే'!

మరొక అంశం ప్రజలు కష్టపడి సంపాదించుకున్న డబ్బుని పొదుపు ఖాతాల నుండి వినిమయ మార్కెట్లోకి మళ్లించడం. ఇది ఎప్పటి నుండో అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశిస్తున్నదే. భారత దేశపు మార్కెట్లు ఇంకా సాంప్రదాయక మార్కెట్‌గానే ఉండిపోయాయని, దాన్ని త్వరితగతిన ఆధునికీకరించాలని సామ్రాజ్య వాద ప్రపంచీకరణ శక్తులు ప్రభుత్వం మీద ఎప్పటి నుంచో వత్తిడి తెస్తున్నాయి. అంతే కాకుండా భారత దేశంలో నగదు రూపంలో కాకుండా, కార్డుల రూపంలో ఆర్థిక లావాదేవీలన్నీ పెద్ద ఎత్తున జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని కూడా ప్రభుత్వం మీద అంతర్జాతీయ సంస్థల ఒత్తిడి వుంది. దీన్నే మోదీ, చంద్రబాబు క్యాష్ లెస్ ఎకానమీ అని అంటున్నారు.

ఈ పద్ధతుల్లో లావాదేవీలన్నీ జరిగితే అవినీతికి ఆస్కారమే ఉండదని పాలకులు ఊదరగొడుతున్నారు. దీనికి సంబంధించిన కొన్ని వాస్తవాల్ని తెలుసుకోవాలి. ఒక దేశపు జి.డి.పి.లో నోట్ల రూపంలోనూ, నాణాల రూపంలోనూ ఉండే డబ్బు గురించి బ్యాంకు ఇంటర్నేషనల్ సెటిల్మెంట్ ఇచ్చిన నివేదికలో ఇలా ఉంది. ప్రపంచం మొత్తం మీద క్యాష్ లెస్ వ్యవస్థ అమలులో స్వీడన్ మొదటి స్థానంలో ఉంది. జపాన్ జి.డి.పి లో డబ్బు శాతం 20.04% కాగా, బ్రెజిల్లో అది 4% మాత్రమే! ఈ లెక్కల ప్రకారం జపాన్ కంటే బ్రెజిల్లో ఆర్థిక అవినీతి ఎంతో తక్కువగా ఉండాలి. కానీ వాస్తవం దీనికి పూర్తి విరుద్ధంగా ఉందని ఆ నివేదిక పేర్కొంది. అంటే వివిధ కార్డుల ద్వారా ఆర్థిక లావాదేవీలు జరిగినంత మాత్రాన అవినీతి ఆగదన్నమాట.

సిటీ బ్యాంకు 2014లో ఒక దేశంలో డిజిటల్ డబ్బును ప్రవేశ పెట్టి క్యాష్ లెస్ ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఆయా దేశాల ప్రజల సంస్కృతి ఆటంకంగా ఉంటుందని పేర్కొంది. ఆ సంస్కృతిని మార్చకుండా, డిజిటల్ డబ్బును బలవంతంగా రుద్దితే అస్తవ్యస్థ పరిస్థితి ఏర్పడుతుందని, సాధారణ ప్రజలు జీవన స్థితికి అది పెను ప్రమాదమని నివేదిక పేర్కొన్నది.

అంటే నోట్ల రద్దు గాని, క్యాష్ లెస్ ఆర్థిక లావాదేవీలు గాని మోది, చంద్రబాబులు చెప్తున్నట్లు అవినీతిని నిలుపుదల చేయటానికి కాదు. భారత దేశపు మార్కెట్లపై, ప్రజల డబ్బుపై ప్రజల వినిమయ సంస్కృతిపై సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థల నియంత్రణను వాళ్ళు కోరుకున్నంతలో కేంద్రీకరింపచేయడానికే. ఇదీ అసలు రహస్యం.

(మిగతా 30 వ పేజీలో)

అరుణతార నిర్వహణ, శాశ్వత నిధుల కోసం మా ప్రకటన చూసి
ఒక విప్లవ సాహిత్య అభిమాని - హైదరాబాదు, రూ.1,00,000/-,
వి. రాజేశ్వరి - నెల్లూరు రూ.7,500/-, విరాళంగా ఇచ్చారు. వీరికి ఉద్యమాభినందనలు. - సం.

ఎడిటర్
దువ్వూరి వెంకట రామక్రిష్ణారావు

రచనలు, విరాళాలు
పంపించాల్సిన చిరునామ:
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి,
హైదరాబాద్ - 500 040.

* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com కూ పంపవచ్చు

కార్యాలయం:
12-15-963, మాణికేశ్వరినగర్,
ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్,
తార్నాకా, హైదరాబాద్-500007.

సంపాదకవర్గం:
ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్

విరసం కార్యదర్శి చిరునామా
పి. వరలక్ష్మి
5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.

డి. టి. పి. అండ్ లే అవుట్
ఆర్. భాగ్యలక్ష్మి, డి. వైజయంతి
కవర్ డిజైన్ : పి. వరలక్ష్మి, ఆర్. భాగ్యలక్ష్మి

ఫొటోలు :
గూగుల్ సైట్

Like Page:
//viplava rachayitala sangham arunatara

facebook :
//viplava rachayitala sangham virasam

Virasam website :
www.virasam.org,
www.virasam.in
www.arunatara.in

గమనిక : మిత్రులారా, కామ్రేడ్స్! అరుణతార డిటిపి, డిజైనింగ్, ప్రింటింగ్, పోస్టింగ్, రవాణా ఇలా అన్ని ఖర్చులు చాలా పెరిగిపోయాయి. అనివార్య పరిస్థితులలో విడి ప్రతి వెలను ఫిబ్రవరి 2016 సంచిక నుంచి రూ. 20 కు పెంచవలసి వచ్చింది. ఇది గమనించగలరు. ఎప్పటిలానే మీ ఆదరాభిమానాలను, సహకారాన్ని ఆశిస్తున్నాం. అలాగే ఫిబ్రవరి 2016 సంచిక నుంచి అరుణతార సంచికల క్రమాన్ని సంపుటి 44 గాను సంచిక 1 గాను సరిచేసాం. ఈ విషయాన్ని గమనించగలరు. - సం.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

విడి సంచిక వెల - రు. 20; సంవత్సర చందా - రు. 240;
రెండు సంవత్సరాల చందా - రు. 450; మూడు సంవత్సరాల చందా - రు. 680;
ఐదు సంవత్సరాల చందా - రు. 1100; దశాబ్ది చందా - రు. 2200/-

అరుణతార చందాదారులకు విజ్ఞప్తి!

ఏ కారణం చేతనైనా మీకు అరుణతార అందకపోతే పిన్‌కోడ్‌తో సహా మీ చిరునామాను మరోసారి **8500809250** మొబైల్ నంబర్‌కు మెసేజ్ పెట్టగలరు. గమనిక : ఈ నెంబర్ కేవలం మెసేజ్‌ల కొరకు మాత్రమే! - సం.

విషయసూచిక

పాట / కవిత్వం (7-13)

ఎగిరే జెండావి నీవే పృథ్వన్నో - **రేవల్లె సాంబశివరావు**

ఓ మల్లెపువ్వో... - **కట్టెల లింగస్వామి (కలీమ్)**

ప్రభాకరా.. లాల్‌సలామ్ - **భూపాల్**

దుఃఖాన్ని మోసిన గజ్జె - **మురళి**

షహీదా కవితలు రెండు - ఇరువైపులా మహమ్మద్ అలీ; ఒక రాజకీయ అధ్యాపకురాలి ప్రయాణం

మౌనభారం - **మహమూద్**

వడ్డెబోయిన శ్రీనివాస్ కవితలు మూడు - నెత్తుటి నెమలీక; రాజ్యం ముఖం మీద; శృతీ నిర్భయే

నాగేశ్వర్ కవితలు రెండు - పుప్పొడి; చుక్కలు

జనతన సర్కార్... - **బాలసాని రాజయ్య**

ధిక్కార స్వప్నం - **కెనరీ**

ఆవిష్కర్తలు - **శాఖమూరి రవి**

కథలు (14-20)

కటకటాలు - **కృపాకర్ మాదిగ**

'వాళ్లు' - **తాయమ్మ కరుణ**

ప్రత్యేక వ్యాసాలు (21-30)

అమెరికాలో ఆదివాసీ ధిక్కారం - **అశోక్ కుంబము**

బుద్ధిజీవులకు ఆదివాసీల ప్రశ్న - **కాత్యాయనీ విద్మహే**

సోషలిజమే ప్రత్యామ్నాయం (31-35, 41)

సోవియెట్ రష్యాలో మహిళా, శిశు సంరక్షణ - **బి. ఎస్. రాజు**

ఆల్ప్స్ పర్వత శ్రేణుల్లో ప్రేమగీతం - **బాసిత్**

వ్యాసం (36-39)

మిరమిట్లు గొలిపే అక్రమ సంపదకు మూలం నేరం నేరస్తుల్నివదిలేసి బాధితులకే శిక్ష - **కూర్మనాథ్**

సాహిత్య వ్యాసాలు (40-44)

అన్నాబావు సాఠే సాహిత్య పరిచయం - **మచ్చ ప్రభాకర్**

రచయితగా ప్రభాకర్ - **కాశీం**

పుస్తక పరిచయం (45)

చలసాని ప్రసాద్ లేఖలు - **సజ్జా వెంకటేశ్వర్లు**

సంస్మరణ వ్యాసం (46-48)

"వేర్ ఈజ్ ద ఫ్రెండ్స్ హోమ్?" - **శివలక్ష్మి**

వ్యాసాలు (49-55)

కట్టకముందే ... ప్రాణాలు తోడేస్తున్న నేనో కెమికల్ ఫ్యాక్టరీ - **పి. వరలక్ష్మి**

క్యూబా విప్లవ సారథి కాస్ట్రో - **ఎ. నర్సింహారెడ్డి**

పుస్తక పరిచయం (56)

పిల్లలకు, తల్లిదండ్రులకు 'పాల్గుణ' ఆదర్శం - **వచ్చల కిరణ్‌కుమార్**

సీరియల్ (57-60)

కార్ల్ మార్క్స్ పెట్టుబడి - సరుకులు-డబ్బు - 4 - **లూయిస్ కాస్ ఫ్రై**, అనువాదం : **ముక్తవరం పార్థసారథి**

పత్రికా ప్రకటనలు (61)

కరపత్రాలు (62-63)

కామ్రేడ్ చలసాని ప్రసాద్ మొదటి వర్ధంతి సభ - **విరసం సిటీయూనిట్**

నూరేళ్ల బోల్షివిక్ విప్లవానికి యాభై ఏళ్ల మహత్తర శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవానికి జేజేలు పలుకుదాం - **విరసం**

విరసం వద్ద అందుబాటులో ఉన్న విరసం, ఇతర ప్రచురణల సూచి (64-66)

www.virasam.org అంతర్జాల పత్రికలో నవంబరు సంచికల్లో వచ్చిన రచనల విషయసూచిక:

నవంబర్ 1 సంచికలో...

సంపాదకీయం - మానవ హననంగా మారిన రాజ్యహింస - పాణి

సాహిత్యం/వ్యాసాలు - చంద్రబాబుకు బహిరంగలేఖ - పౌర హక్కుల సంఘం

సాహిత్యం/వ్యాసాలు - పులికనుము పూర్తయ్యేనా? - పాణి

సాహిత్యం/వ్యాసాలు - ప్రభాకరుడే గంగాధరుడు - వివి

సాహిత్యం/కవిత్వం - నువ్వేనా? అదినువ్వేనా? - ఉదయ మిత్ర

సాహిత్యం/కవిత్వం - ఈ రాక్షస గీతి వింటారా? - రివేరా

సాహిత్యం/కథలు - నేల మీదే - సిద్ధార్థ

సాహిత్యం/సమీక్షలు - యంత్ర భూతమైన ప్రేమలు పత్ర హరితాలు కావాలని.. - రివేరా

దండకారణ్య సమయం -ఆరని మంటలు... విద్యార్థి

సంభాషణ - ఇప్పుడు... దండకారణ్య సందర్భం - ఎ.ఒ.బి., ఆర్.కె, ఆదివాసులు - వరవరరావు

సంభాషణ - మనందరి కలలు వాళ్లు... - స్వేచ్ఛ

సంభాషణ - పౌరహక్కులు వర్సెస్ పోలీసులు - పి.వరలక్ష్మి

నవంబర్ 15 సంచికలో...

సంపాదకీయం - ఉద్దేశం మంచిదే అంటున్నారు, ఏమిటా ఉద్దేశం? - పి.వరలక్ష్మి

సాహిత్యం/వ్యాసాలు - ఇందుకేనా తెలంగాణ? - విద్యార్థి

సాహిత్యం/వ్యాసాలు - ప్రభాకరుడి వెలుగుల ప్రయాణం - సి. కాశీం

సాహిత్యం/వ్యాసాలు - అక్కడ డేనియల్ ఉన్నాడు - సంఘర్ష్

సాహిత్యం/కవిత్వం - చెల్లని బతుకు - రాంకి

సాహిత్యం/కవిత్వం - ఎవరు వాళ్ళు? - మెలనీ

సాహిత్యం/కథలు - రాతి పలక - ఉదయమిత్ర

సాహిత్యం/సమీక్షలు - దిక్కుమొక్కులేని జనం - కూర్మనాథ్

దండకారణ్య సమయం - మధ్యభారతంలో... యుద్ధ బీభత్సం - సాధన

సంభాషణ - ఆ శిరస్సు, స్తనాలు ఏమయ్యాయి? - పద్మకుమారి, కార్యదర్శి, అమరుల బంధుమిత్రుల సంఘం



అనుకోకుండా అరుణతార బోల్షివిక్ విప్లవం మీద వచ్చిన నవంబర్ సంచిక నా దృష్టికి వచ్చింది. పత్రిక చాలా ఎడ్యుకేటివ్‌గా ఉంది. రష్యా విప్లవం గురించి తెలుసుకోవాలని అనుకొనే ఈ తరం వాళ్లకు చాలా ప్రేరణగా ఉంది. శ్రీశ్రీ అనువాదం చేసిన మయకొవిస్కీ రాసిన లెనిన్ కావ్యం నుంచి కొంత భాగం రీ ప్రింట్ చేయడం చాలా బాగుంది. ఈ సంవత్సరం పొడుగునా బోల్షివిక్ విప్లవం గురించి ఇలా ఒక్కో వ్యాసం అయినా అచ్చు వేస్తే బాగుంటుందేమో ఆలోచించండి. ఎందుకంటే అప్పట్లో ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేసిన ఈ విప్లవాన్ని వీలైనంతగా ప్రచారం చేయాలి కదా? అప్పట్లో కొన్ని పుస్తకాలు చాలా పాపులర్‌గా ఉండేవని కొన్ని రచనలనుబట్టి తెలుస్తోంది. అలాంటి పుస్తకాల మీద మళ్లీ చర్చ జరిగేలా రచనలు ఉంటే మంచిది. సోషలిజం స్థాపించడానికి పార్టీ చేసిన ప్రయత్నం ఇప్పుడు అందరికీ తెలిసేలా, అర్థమయ్యేలా చెప్పాలి. వీలైతే ఇలాంటి విషయాల మీద చిన్న చిన్న పుస్తకాలు అచ్చువేయాలి. తక్కువ ధరతో వాటిని కాలేజీల్లో చదివే విద్యార్థుల దగ్గరికి తీసికెళ్లి చదివించాలి. స్మార్ట్ ఫోన్ల హడావిడిలో తలమునకలుగా ఉన్న విద్యార్థులకు మన దేశంలో సోషలిజమే వస్తే ఎంత బాగుంటుందనిపించేలా ఈ ప్రచారం సాగాలి. దీనికి మీరు శక్తివంచన లేకుండా పని చేస్తారని నా నమ్మకం. అరుణతార నవంబర్ సంచికను నేను నాకు పరిచయం ఉన్న వాళ్లందరికీ ఇచ్చి చదివించాను. ఇంత కంటే నేనేం చెయ్యలేను కాబట్టి ఇది చేశాను. ఇంకా ఏమైనా చేతనైతే బోల్షివిక్ విప్లవం ప్రచారం కోసం చేస్తాను.

మద్దిలేటిరెడ్డి,
తాడిపత్రి.

ఎడిటర్ గారికి..

నేను త్రిపురనేని మధుసూదనరావు సారు స్టూడెంట్‌ను. తిరుపతిలో ఆయన మా క్లాసులో పాఠం చెప్పి వేరే రూంలోకి వెళితే వెనుకే వెళ్లి ఆ క్లాసులో కూడా కూచొని పాఠం వినేవాళ్లం. ఆయన మమ్మల్ని చాలా దగ్గరికి తీసుకొని మాట్లాడేవాడు. అరుణతారలో వెన్నెలకంటి రామారావు సారు గురించి రాసిన వ్యాసం చూస్తే నాకు అప్పటి విషయాలన్నీ గుర్తుకు వచ్చాయి. ఆ వ్యాసంలో ఉన్న సాహిత్యం సంబంధించిన విషయాలు అర్థం చేసుకునే శక్తి నాకు లేదు. అప్పట్లో కూడా మధుసూదనరావు చెప్పే రాడికల్ పాలిటిక్స్ నాకు కొంచెం కొంచెం అర్థమవుతుండేవి. కానీ ఆయన మాట్లాడుతోంటే చాలా ఇంట్రెస్టుగా ఉండేది. మా బ్యాచ్‌లో చాలా మంది ఆయన అభిమానులు ఉండేవాళ్లు. ఇప్పటికీ సమాజంలో ఏం జరుగుతున్నాయి? వాటిని ఎలా అర్థం చేసుకోవాలి? అనే దానికి అప్పట్లో సారు చెప్పిన విషయాలే ఇప్పటికీ ఉపయోగపడుతున్నాయి. ఆ వ్యాసం చూశాక అప్పటి విషయాలు మీకు చెప్పాలనిపించింది.

- రాజేంద్రనాయుడు,
పాకాల, చిత్తూరు జిల్లా.

పాఠకులకు మనవి

అరుణతారలో వస్తున్న రచనల మీద ఉత్తరాలు, సెల్ ఫోన్ మెసేజ్‌లు, ఎక్కువగా మెయిల్స్ వస్తున్నాయి. అయితే వాటిలో ఫలానా రచన బాగుందని మాత్రమే చాలా వరకు ఉంటున్నాయి. అప్పుడప్పుడు ఏదో ఒక రచన బాగా లేదని ముక్తసరిగా అభిప్రాయాలు వస్తున్నాయి. ఈ అభిప్రాయాలను అరుణతార తప్పక గౌరవిస్తోంది. అయితే ఒక రచన బాగున్నా, బాగలేకపోయినా ఎందుకు మీకు అలా అనిపించిందో కొంచెం వివరాలతో రాస్తే పత్రిక నిర్వహణకు, ఆ రచయితలకు కూడా ఉపయోగంగా ఉంటుంది. అరుణతారలో రావాల్సిన రచనలపై కూడా మీ సూచనలు ఇస్తే మరీ మంచిది.

-సంపాదకవర్గం

విరసం అంతర్జాల పక్ష పత్రిక

www.virasam.org కి రచనలు పంపండి.

మిత్రులారా..

విరసం వెబ్ మాగజైన్‌ను సాహిత్య, విప్లవాభిమానులు ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు. కొన్ని రచనలను విరివిగా చదువుతున్నారు. వీడియోల్‌పట్ల చాలా ఆసక్తి చూపుతున్నారు. అయితే రచనల అవసరం చాలా ఉంది. కవిత్వం, వ్యాసాలు, అనువాదాలు, పుస్తకసమీక్షలు పంపించండి. సామాజిక సమస్యలపై ఎప్పటికప్పుడు విశ్లేషణ వ్యాసాలు రాయండి. అరుణతారకు రచనలు పంపించి సహకరించినట్లే అంతర్జాల పత్రికకు కూడా పంపించాలని మనవి. మీ రచనల కోసం ఎదురు చూస్తున్నాం.

www.virasam.org team
site e-mail ID : virasam1970@gmail.com

ఎగిరే జెండావి నీవే పృథ్వన్నో

★ రేపల్లె సాంబశివరావు

గుడిసె గుడిసెల మీద పృథ్వన్నో
ఎగిరే జెండావి నీవే పృథ్వన్నో
మా ఇంట్లో దీపమైతివే ముస్సన్నో
నా చంకలో బిడ్డవైతివే ముస్సన్నో

గూడెం గూడెం తిరిగి నీవు
మీటింగుకు పిలిచినావు
రాజకీయ రంగు మొత్తం
కళ్ళముందు పెట్టినావు .
సంఘాలు పెట్టి నావన్నో పృథ్వన్న
సాయుధంగ నడిపినావన్నో పృథ్వన్న... ॥కోరస్॥

కూడు పెట్టె భూమి మీద
దృష్టి నీవు పెట్టినావు
నీటికున్న విలువజెప్పి
నీరు నిలువ డ్యాము కట్టి
విషపు మందులు చల్లకుండనే పృథ్వన్నో
రతనాల పంట తీశావే పృథ్వన్నో... ॥కోరస్॥

మా అక్కల చెరిచినారు
మా గూడెం కాల్చినారు
చిత్రహింసలెన్నో పెట్టి
జైళ్ళోన పెట్టినారు
పటపటమని పళ్ళు కొరికెవో పృథ్వన్నో
ప్లాన్లు గీసి ధాడి చేస్తవో పృథ్వన్నో... ॥కోరస్॥

బడా బాబులందరికి
బాక్సైట్ కట్టబెట్టి
గ్రీన్‌హంటు పేరు మీద
మా బిడ్డల చంపినారు
చావు బతుకు పోరులోన పృథ్వన్నో
పోరాడి చస్తమన్నో పృథ్వన్నో... ॥కోరస్॥

ఏ తల్లి కన్నదో
ఏ తండ్రి పెంచెనో
మా గూడెం వస్తివి
మా కోసమే చస్తివి
మా గుండెలు మండినాయన్నో పృథ్వన్నో
నీ పోరు మేము చేస్తమో పృథ్వన్నో ॥కోరస్॥

ఓ మల్లెపువ్వో...

★ కట్టెల లింగస్వామి (కలీమ్)

ఓ మల్లెపువ్వో... పోరు మల్లెపువ్వో....
ఎగిసెగిసి పడుతున్న ఎర్రమల్లెపువ్వో. "ఓ మల్లెపువ్వో"

దారెంట పోయేటి చామంతి పువ్వో
మా మనస్సుల్లో నిలిచిన మందార పువ్వో "ఓ మల్లె పువ్వో"

దాసిరెడ్డిగూడెంలో వికసించినా పువ్వు
దారి పొడుగుతా పరిమళించిందో.... "ఓ మల్లే పువ్వో"

పేదల కష్టాలు కడతేర్చ ఆ పువ్వు
దండులో కలిసి దయగా మారిందో.... "ఓ మల్లె పువ్వో"
రాచకొండలోనా రణం చేసినా పువ్వు
ఆలేరు, క్రిష్ణపట్టిలో అగ్గిరాజేసిందో.... "ఓ మల్లె పువ్వో"

నల్లమల్ల అడవుల్లో నాగేటి సాలల్ల
పోరు విత్తనాలు నాటినా పువ్వో.... "ఓ మల్లె పువ్వో"

అన్నల కొండ మన్యం కొండలో
మావో పువ్వెయి వికసించినాదో "ఓ మల్లె పువ్వో"

అడవిలోన దళపతి అయ్యి
దండూకు ముందు దారి చూపెనో.... "ఓ మల్లె పువ్వో"

వికసించినా పువ్వును బెజ్జంగి అడవిలో
చంద్రబాబు కుక్కలు చిదిమి వేసాయో.... "ఓ మల్లె పువ్వో"

రక్తం రుచి మరిగిన చంద్రబాబును
రణంలోనే మేము తేల్చుకుంటామో.... "ఓ మల్లెపువ్వో"

(మల్కాన్ గిరి అమరుడు కా. చామల కిష్టన్న స్మృతిలో)

ప్రభాకరా.. లాల్‌సలామ్

★ భూపాల్

మోసానికి బలి ఐతివ
మా జనతన యోధుడా!
సలాం ప్రజల లాల్‌సలామ్
ప్రభాకరా లాల్ సలామ్... ॥మోసానికి॥

అడవి నిన్ను ఆదరించె - సెలయేరులు సేదతీర్చె
మేఘాలని నీడనిచ్చె - గాలిపొరుదారి చూపె

ప్రభాకరా! ప్రగతి ధురా!
ప్రజా కళాకారుడా! ఓ... సాయుధ వీరుడా!... ॥మోసానికి॥

నవ్వు లేడదాచినావు - మాట్లాడగ అలిగినావు
మములముందె పలకరించె - మర్యాదను మరచినావు!
ప్రభాకరా!... పడుకుంటివ?
ప్రజల మేలుగొల్పవా!... ఓ... సాయుధ వీరుడా! ॥మోసానికి॥

సమూలమగు మార్పు కొరకు - సాంస్కృతికమె సరిపోదని
సాయుధ సూర్యుని ముట్టి - ఆశయ ఆయుధమెత్తి!
ప్రభాకరా! పదమిడితివ
జనతన రాజ్యంలోనా... ఓ... సాయుధవీరుడా!... ॥మోసానికి॥

ప్రపంచాన ఏ పాలన - ప్రజకు విషం పెట్టలేదు
పండుకున్న వాళ్ల చంపె - పరమనీచ చర్యలేదు
ప్రభాకరా!... విద్రోహం
పొంచి కాటు వేసిందా!... ఓ... సాయుధవీరుడా!... ॥మోసానికి॥

మల్కన్‌గిరి ఏడిచిన - మరణించిన వీరులకూ!
మా నెత్తుటి లాల్‌సలామ్ - మిలీష్యాల జన జోహార్
మీ నెత్తుటి అప్పులనూ!
ఈ ప్రజలే తీర్చగలరు... ఓ... కాపుక ప్రభాకరా!
ఓ... సాయుధవీరుడా!.. ॥మోసానికి॥

దుఃఖాన్ని మోసిన గజ్జె

★ మురళి

నాలోతడి ఆరిపోయిందో
నీలోని దుఃఖం ఆవిరైపోయిందో
మన స్పందన మోడుబారినప్పుడే
అడవి అర్థం చేసుకున్నది

చెట్టుని ముద్దుపెట్టుకున్న గజ్జె
రక్తంతో తడిసిన వేళ మౌనం
కూడా మనిషిని ఎన్‌కౌంటర్ చేసినట్టే

చీకట్లో తూటా విషమై వచ్చిందో
ఖనిజమై కాటేసిందో
రాలిన మూడుపదుల వెన్నెల తుంపర్ల సాక్షిగా
నిజం నది ఒడ్డుమీద కుందేలులా
తిరుగుతూనే ఉంది

కన్నీళ్ళు ఎంతకాలం దాచుకుని ఏం చేద్దాం
కనీసం వీరుల కాళ్ళముందు మోకరిల్లి
మొత్తం ఒంపుకొని మనసును నిమ్మళం చేసుకుందాం.

★ షహీదా కవితలు రెండు

ఇరువైపులా మహమ్మద్ అలీ

నల్లజాతి అధ్యక్షుడు సాక్షిగా
అమెరికా జాత్యంహంకార విషపు తూటాలకు
పిట్టల్లా రాలిపోతున్న నల్లవారి శవాల మధ్య
'బ్లాక్ లైవ్స్ మ్యాటర్' నిరసన హోరుల మధ్య
అలీ! నువ్వెలాగూ అనివార్యంగా గుర్తొస్తావు

నీ దేశంలో నల్లవారిపై అణచివేతను ప్రశ్నించినందుకు
పీడితుల ధిక్కారానికి అత్యంత గుర్తించదగిన ఒక చిహ్నంగా
నిలిచిపోయినందుకు

అంతేనా
ఎక్కడెక్కడ సామ్రాజ్యవాదం కరాళనృత్యం చేస్తుందో
ఎక్కడెక్కడ దళారీ పాలకులు దాని కాళ్లకు గజ్జెలు కడుతుంటారో
ఎక్కడెక్కడ ప్రజలు సామ్రాజ్యవాదంపై, దళారీ పాలకులపై
తిరగబడుతున్నారో
ఎక్కడెక్కడ వారి ప్రతిఘటనలో 'కిరాయి మూకలు'
'కుక్కచావులు' చస్తున్నారో
ఎక్కడెక్కడ తిరిగొచ్చిన వారి శవాలు తల్లులకు కడుపుశోకాన్ని
మిగులుస్తున్నాయో
అక్కడల్లా కూడా అలీ! నువ్వు గుర్తొస్తావు

ఎక్కడో ఏడేడు సముద్రాల అవతల
వియట్‌కాంగ్‌తో నాకు శత్రుత్వం ఏమీ లేదు
వారి పైకి నేను ఆయుధాన్ని ఎత్తను అన్నందుకు
నా దేశంలో నల్లవాడిగా నన్ను అణచివేస్తున్నవాడి తరపున
ఇంకో దేశపు సామాన్యుడి మీద నేను యుద్ధం చేయను అన్నందుకు

క్రీడా శిఖరాలను అధిరోహించగల నిండు యవ్వనంలో
అవకాశాలను వదులుకుంటాను గానీ
దారిద్ర్యంలో అనామకంగానైనా లేదా జైల్లోనైనా మగ్గిపోతాను గానీ
నాలాగే పీడితులైన వియత్నమీయుల మీదకు దండెత్తను
అన్నందుకు

అమెరికా సామ్రాజ్యవాదం కప్పుకోజూసిన మోసపు పరదాలన్నిటినీ
నీ ధిక్కారంతో తుత్తునియలు చేసి
ప్రపంచమంతటా ఆ పీలికలను వెదజల్లినందుకు
(ఔను, నిస్సందేహంగా ప్రతి దేశంలోనూ)

తమ విముక్తికైన యుద్ధాన్ని చేస్తున్నవారిపై యుద్ధానికి వెళ్లకూడదు
అన్నందుకు
తమది కాని యుద్ధంలోకి వెళ్లి ఎవరూ సమిధలు కావద్దు

అన్నందుకు
'కిరాయి మూకలు' కావద్దు అన్నందుకు
'కుక్కచావులు' చావద్దు అన్నందుకు
అలీ! నువ్వు నాకు గుర్తొస్తావు
అలీ! అలీ! అందుకే నువ్వు నాకు ఇరువైపులా గుర్తొస్తావు

నువ్వు గుర్తు రావడమే కాదు
సామ్రాజ్యవాద యుద్ధాలను అంతర్యుద్ధాలుగా మార్చడానికి
ఆయుధాలను శ్రమజీవులపైన కాకుండా
ఉమ్మడి శత్రువులైన పాలకవర్గాల పైన ఎక్కుపెట్టాలని గుర్తింపజేయడానికి
ప్రపంచవ్యాప్తంగా రాజ్య బలగాల అట్టడుగు వర్గాల రిక్రూట్లందరికీ
నిన్ను గుర్తు చేయాలి కూడా

ఇవ్వాళటికివ్వాళ
భారత, పాకిస్తాన్ దళారీ సామ్రాజ్యవాద ఏజెంట్లు
మనల్ని మరోసారి యుద్ధంలోకి తోస్తామని రంకెలేస్తున్న వేళ
సరిహద్దుల కిరువైపులా ఉన్న అద్దాల్లో
తుపాకి గురి చూస్తే కనిపించేది మన ప్రతిబింబాలేనని అర్థం కావాలన్నా
అలీ! నువ్వు గుర్తు రావలసిందే
అలీ! నిన్ను గుర్తు చేయాల్సిందే.

ఒక రాజకీయ అధ్యాపకురాలి ప్రయాణం

ఆమెకు అక్షరదోషాలు లేకుండా రాయడం రాకపోవచ్చు
దోపిడీ రహస్యాలను పొల్లుపోకుండా అర్థం చేయించడం
మాత్రం తెలుసు

ఆమె మార్క్సిస్టు మహాగ్రంథాలను చదివి ఉండకపోవచ్చు
వర్గపోరాట పరిష్కారాల అరటిపండును ఒలవడం
మాత్రం తెలుసు

ఆమె అనారోగ్యం వల్ల ఎక్కువ దూరాలు నడవలేకపోయి ఉండచ్చు
విద్యార్థులను ప్రపంచమంతా చుట్టించి తీసుకురావడం మాత్రం తెలుసు

ఆమె భాషాశాస్త్రాలను అధ్యయనం చేసి ఉండకపోవచ్చు
కోయ భాషను పట్టుపడితేనే విద్యార్థుల హృదయాల్లోకి దారి అని
మాత్రం తెలుసు

ఆమెకు అనువాదంలోని కిటుకులు ఎవ్వరూ నేర్పకపోయి ఉండచ్చు
దండకారణ్యానికొచ్చే పరిశోధకులకు దుబాసీగా అందిరావడం
మాత్రం తెలుసు

ఆమె పాఠశాల చదువులూ, ఉపాధ్యాయ శిక్షణలూ పొంది ఉండకపోవచ్చు
ఉపాధ్యాయ బాధ్యతనిచ్చారంటే శ్రమతో సాధించి తీరాలని
మాత్రం తెలుసు

పరిమితులూ అనారోగ్యాలూ అడ్డంకులెన్నైతేనేం
రాజకీయ గురువుగానే ఆమె సుదీర్ఘ, సంతోషకర, సంతృప్తికర ప్రయాణం

ఆ ప్రయాణంలో
అందినమేరకు సహాయాన్నీ, దొరికినమేరకు అవకాశాలనూ
అందిపుచ్చుకుంటూ, సద్వినియోగం చేసుకుంటూ
ఒకోసారి ఆమె ముందు, విద్యార్థులు ఆమె వెనుక
ఒకోసారి విద్యార్థులు ముందు, ఆమె వారి వెనుక

తెలియనివాటి నుండి తెలిసినవాటికీ
సరళమైనవాటి నుండి సంక్లిష్టమైనవాటికీ
నిమ్న స్థాయి నుండి ఉన్నత స్థాయికీ
నేర్పడం నుండి నేర్చుకోవడానికీ
నేర్చుకోవడం నుండి నేర్పడానికీ

విరామం లేకుండా, సంతృప్తిపడిపోకుండా
ఒకరు పైనా, ఒకరు కిందా కాకుండా
ఎల్లప్పుడూ తోటి ప్రయాణీకులుగా

జ్ఞానం వైపుగా
ఆ జ్ఞానాన్ని శ్రమజీవులందరిపరం చేసేవైపుగా.

(1-03-2016న బొట్టెంతోగు 'ఎన్‌కౌంటర్లో' అమరురాలైన కామ్రేడ్ యూసుఫ్‌బీ (సోనీ) స్మృతిలో. అప్పటికి అనేక ఏండ్లుగా దండకారణ్యంలో రాజకీయ అధ్యాపకురాలిగా బాధ్యతలు నిర్వహిస్తూ వుండింది).

మౌనభారం

★ మహమూద్

దీన్ని మరణమని చెప్పలేను
అలాగని బతకడమూ కాదు
ఇదో అలౌకిక అసమంజస నిరర్థక నిర్బంధ స్థితి
నిన్ను నువ్వు ఓ బలహీన క్షణాన
ఊపిరికి వేలాడే మాయా సంకెళ్ళ మధ్య పొందుతావు
పెదవిపై కొన్ని ప్రశ్నల ముళ్ళ కంపలు మొలిచి
సమాధానపడే ఊహను పొడుస్తుంటాయి
మస్తిష్కంలోని ఊహలన్నీ రక్తసిక్తమై

చివరి క్షణాలను లెక్కిస్తుంటాయి
ఎవరు ఎందుకు ఎప్పుడు చేసారో తెలియని ఈ క్షతగాత్ర కాలపు భారాన్ని
భుజాల మీద మోస్తూ
బతకడం ఓ కల్తీ కక్కుర్తిరా అని నీకర్థం చెప్పే ఒకేలాంటి ముఖాల బారులలో
ముక్కలు ముక్కలైన నిన్ను నువ్వు ఏరుకోవడమే పనిగా పెట్టుకుంటావు
ఎవరినెవరినో నిశ్శబ్దనిందనలోకి లాగూతూ నిలబడతావు
కోపం అగ్నిపర్వతమౌతుంది
అది నిన్నే దహించి వేస్తుంది
నింద ఎంత పెద్ద దేశద్రోహమో
చానళ్ళు వార్తా కరపత్రికలు చెప్పగా విని
చప్పగా మారిపోతావు
ఈ అరుచినే వాళ్ళు దేశభక్తి అంటారు
నువ్వు అప్పుడు కూడా సమాధానపడని మౌనప్రశ్నవే.

★ **వడ్డెబోయిన శ్రీనివాస్ కవితలు మూడు**

నెత్తుటి నెమలీక

ఆకుల్ని చదివి
ఆకయ్యే మృదుత్వం
చెట్టు కౌగిలించుకొని
ప్రాణవాయువై వీచిన కఠినత్వం
ఆదివాసీని పీల్చుకొని
ఆదివాసిగ మౌల్యైయ్యే వేడిత్వం
ఏక నెత్తుటి ముద్దయ్యే కాలం వేలాడ్తున్న
అయ్యో! పాపం సానుభూతుల
అన్యాయపు శ్వాసల్ని ధిక్కరిస్తూ
యవ్వనాన్ని ధరించిన వీరత్వం

ఒంటినిండా
మట్టిని అలుక్కొని
కొంచెం పచ్చబడి
ప్రేమించే మరణించడం నేర్పించే
నెత్తుటి నెమలీక

అతన్ని
దూరం నుంచో దగ్గరి నుంచో
చూసినప్పుడు
నన్ను వెల్గించే కొవ్వొత్తిలా కన్పించాడు

నేనతన్ని
దూరం నుంచో దగ్గరి నుంచో
విన్నప్పుడు
నా బతుకూ మాట్లాడుతున్నాడు

నేనతన్ని
దూరం నుంచో దగ్గరినుంచో
నడిచినప్పుడు
నేను ముడుచుకున్న కాళ్ళు చేతులు విడిపించాడు

నేనతన్ని
దూరం నుంచో దగ్గరి నుంచో
పిలిచినప్పుడు
నాకు అడివిగ బదులిచ్చాడు

నేనతన్ని
దూరం నుంచో దగ్గరి నుంచో
ఎర్రజెండాగా పట్టుకున్నప్పుడు
నా నెత్తుటి అక్షరమై పరిమళించిండు.
(వివేక్ కోసం)

రాజ్యం ముఖం మీద

సాగర్,
బతికించడం కాదు
చావు మీద మనుగడ సాగించే రాజ్యానికి
మనుషులు కావాలి

కలలు కనే మనుషుల కళ్ళు చిట్లే
దృశ్యాల సెలేన్ ఎక్కించడానికి
క్రూరంగా చిదిమి చంపబడే మనుషులు కావాలి
సలసలల నెత్తుటి అలలు సాగిలపడే
భయంకరం కావాలి

విద్యాసాగర్‌రెడ్డీ
నిను లొంగిపొమ్మని
జన జీవన స్రవంతి వెండితెరపై
వినోదించి వినోదించి
నిన్ను చిక్కుచేసి
చిందర వందర చేసి
వాళ్ళే అభియోగాలై వేలాడినప్పుడు
నువ్వు
ఆదివాసి గుండెల్లో చిరునామవగానే
నిను వెతికి వేటాడి వేటాడి
నీతో ఆసిడ్ హోళీ ఆడి
నిన్ను అడివి నుండి చింపేశామనుకొంటుంటే -
నువ్వే

జన జీవన ప్రవంతిని
జన హసన ప్రవంతిగా నీ చావును
రాజ్యం ముఖం మీద అతికించావ్.

శృతీ నిర్భయే

ఎవరికి చెప్పాలి?
తను కొట్లాడి తెచ్చుకున్న రాజ్యమే!

ఎవరికి ఫిర్యాదు చేయాలి?
నేరస్తుల పట్టుకోవాల్సిన వాడే!?

ఇది ప్రజాస్వామ్య రోదన!

మర్మస్థానం మీద
మృగరాజ ముద్రలు
జన్మస్థానాన్ని
జాగా లేకుండా మింగేసిన ఆసిడ్ పులి!

పేగులు కరిగిపోయిన దేహంలో
చిట్లిన ఎముకల లెక్క చిక్కడం లేదు శృతీ!

నీ తల్లిదండ్రులిచ్చిన రూపాన్ని కూలగొట్టి
గడ్డకట్టిన మాంసం ముద్దుల ఒంటి నిర్మాణం ఎవరు చేశారు తల్లీ?

కిరాయి మట్టి వానల పెంకుటింట్లోని
చిన్నారి నవ్వులు ఇవాళ
మాడి... పెదాల మధ్య కాలిన వాసనేస్తున్నాయి
ఆనాటి బుడి బుడి అడుగుల పాదాల కింద
ఇవాళ కత్తినాటిన నెత్తుటి దృశ్యం
నీ మూడవ నాల్గవ తరగతి చేతులతో
తాగడానికి నువ్విచ్చిన నీళ్ళే
ఇవ్వాళ మళ్ళీ
నా కళ్ళలోంచి నీ కోసం కార్తున్నాయి
ఏమో తల్లీ!
నీ కోసం నినాదాల నిరసనల నదులు నడుస్తాయోలేదో
నీ చీకటి కోణాన్ని చూపించ కొవ్వొత్తులు పూస్తాయోలేదో
శృతీ - నువ్వూ నిర్భయవే!

అవకాశమున్నా -
అరెస్టుకు చేతులు మాయం చేసుకొని
ఆయుధాలకు చేతులిచ్చి
ఎవ్వడి భద్రత కోసమో
నీ తల్లిదండ్రుల సొమ్ము నా సొమ్ము మన సొమ్ముతో
పెంచి పోషించి ఊళ్ళు అడవుల మీదకు వదిలిన
రాజ్యాంగాతీత దేవుని కోడెల ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో
మహిళైతే చాలు
మళ్ళీ మళ్ళీ విలాస వస్తువుగానే
'చెప్పుడు ఉద్యమ రాజ్యం' ప్రకటించింది.
ఎవడ్రా!?
ఇది స్త్రీలంటే దేవతలని కొలిచిన దేశమన్నది.

★ నాగేశ్వర్ కవితలు రెండు

పుప్పొడి

పూలు రాలిన చోట
పుప్పొడి వెదజల్లబడే ఉంటుంది

పూరేకులు
ఆకులు
కసిగా తొక్కేసి
తూళ్ళు తెగ్గోసి
విజయం
ప్రకటించుకుంది రాజ్యం

ఎర్రమల్లె పూలు కదా
రాలినచోట
రక్తపు గింజల్ని నాటే ఉంటాయి
బెజ్జంగి
రామగూడ
మల్కాన్‌గిరి
ఆదివాసి అరచేతుల్లో
ఆలివ్‌గ్రీన్ ఆయుధమేదో
పురుడు పోసుకునే ఉంటుంది

పూలు రాలిన చోట
పుప్పొడి వేదజల్లబడే ఉంటుంది
పుప్పొడి నెత్తురులోంచి
పిడికిలి
తేటగా తేరుకునే ఉంటుంది.

చుక్కలు

చుక్కల సమూహం మీద
కత్తుల వాన కురిసింది
మబ్బు జాడ లేదు
మట్టి వాసన లేదు
ఉరుములేదు మెరుపులేదు

ముందస్తు హెచ్చరిక ఏమాత్రం లేదు

వాన కోతకు
వక్షస్థలం తెగిపోతుంది
తలలేని మొండెమే మిగులుతుంది
పొట్టలోంచి పేగులు తన్నుకొస్తాయి
కాళ్ళు చేతులు మెడ తెగ్గోయబడుతాయి

దశాబ్దాల
పేగు బంధాలను వలపోస్తూ
బెజ్జంగి అడవి బోరుమని ఏడుస్తోంది

గాయపడ్డ చుక్కల కోసం
కటాఫ్ ఏరియా చుట్టూ
కత్తుల కంచె మొలుస్తుంది

అడవి కాళ్ళకింది
అపారమైన సంపద కోసమే కదా
వేట మొదలెట్టింది

చుక్కలు పూసిన అడవి మీద
వేటగాడి బాక్సైట్ దాహం
గ్రీన్‌హంట్ గుదిబండయ్యింది

అడవి
ఆదివాసి
అనంతమైన చుక్కలది
చిక్కగా అల్లుకున్న వర్గబంధం

చుక్కలు రాలిన చోట
వేన వేల చుక్కలు కనురెప్పలు తెరుస్తోన్న వేకువ.

జనతన సర్కార్...

★ బాలసాని రాజయ్య

కొత్త మానవులు పురుడు పోసుకున్నారు
దండకారణ్యంలో దండు కడుతు,
దండులా దరిద్ర్యాన్ని తరిమేస్తున్నారు
కట్టుబాటు సంప్రదాయాలను చేరిపేస్తూ
సాగుతున్న జనతన సర్కార్...

కొత్త మానవులు పురుడు పోసుకున్నారు
ఆదివాసులు విల్లంబులు ఎత్తిపడుతు,
రక్తం ధారపోస్తు కొత్త వంతెన నిర్మిస్తున్నారు
చెయ్యి చెయ్యి కలుపుతు ఐక్యత చాటుతూ
సాగుతున్నది జనతన సర్కార్...

కొత్త మానవులు పురుడు పోసుకున్నారు
జల్ జంగల్ జమీన్‌పై హక్కు మావంటు,
పోడు భూములను దున్నుత పోరుబాటు సాగిస్తున్నారు
ఎండిన డొక్కలు కడుపు నిండ బువ్వ తింటూ
సాగుతున్నది జనతన సర్కార్...

కొత్త మానవులు పురుడు పోసుకున్నారు
పచ్చని అడవిలో చెరువులు జలకలల,
సేంద్రియ పంటలు చెంగుతున్న చేపలు
కోయిల రాగాలు కోరస్ నాట్యం చేస్తూ
సాగుతున్నది జనతన సర్కార్

కొత్త మానవులు పురుడు పోసుకున్నారు
దోపిడీదారులకు కాలం చెల్లిందంటు,
యుద్ధంలో ముందుంటున్నారు
సమ సమాజ స్థాపన కోసం రాజ్యాన్ని ఎదిరిస్తూ
సాగుతున్నది జనతన సర్కార్

ధిక్కార స్వప్నం

★ కెనరీ

ఒక తెలవారుజాము మసక వెలుతురులో
నేను, తొలిసారిగ ధిక్కారం ముఖం చూసాను
ఇంతకు ముందెన్నడూ చూడని
ప్రశాంతమైన రూపు చురుకైన చూపు కలగలిసిన
మానవీయత నిజప్రతిని చూసాను
అంతకు మించి, అపుడు వీచిన సుగంధం
నా మనసుని ఉద్వేగంలో ముంచెత్తింది
నా భుజాలపై వాలిన వెలుతురు కిరణాల
వెచ్చందనానికి ఎంతో పులకించి పోయాను

మొన్న గోధూళి వేళ
నేను, ధిక్కారాన్ని స్పష్టంగా చూసాను
దగ్గరకు వెళ్ళి ఇష్టంగా స్పృశించాను
అద్భుతమైన సాహసానికి అబ్బురపడ్డాను
నీకింత ధైర్యమెక్కడిదని అడిగాను
బదులుగా ఒక చిరునవ్వు సమాధానం
చిరునామా అడిగాను
చూపుడు వేలు పచ్చందనం వైపు చూపింది

నిన్న రాత్రి, వెన్నెల వెలుగులో

నేను, ధిక్కారాన్ని అతి దగ్గరగా చూసాను
రక్తం అలికిన నేలపై తల తెగిపడివుంది
నాకు, నోటిమాట రాలేదు
కన్నీటితో గడ్డకట్టుకుపోయాను
కొందరు, వడివడిగా అలజడిగా వచ్చి
వేరుచేయబడ్డ తలనూ మొండాన్నీ మూటగా కట్టుకొని
మౌనంగా వెళిపోయారు

ఈ రోజు ఉదయమే
నేను, ధిక్కారాన్ని మళ్లీ చూసాను
పడిలేచిన కెరటం వలె
నెత్తుటి మడుగును చీల్చుకుని లేచి నిలబడ్డ
స్వప్నాన్ని, నేనిప్పుడు ఆలింగనం చేసుకుంటున్నాను.

ఆవిష్కర్తలు

★ శాఖమూరి రవి

నాన్నా
వాళ్ళు
మనకు ఏమౌతారని
ఎందుకట్లా వెక్కి వెక్కి ఏడుస్తున్నావు

మనకే కాదమ్మ
వాళ్ళకి మనమేమికాదు

మరి ఎందుకు
ఎ.ఓ.బి.లో అని ఏడుస్తున్నావు

"ఇదేమిటమ్మ" అడిగాను
"రాయి" అంది
"ఎట్లావుంది" అన్నాను
"వంకరటింకరగా ఉంది" అన్నది

"మరి ఇదేమిటమ్మా" అన్నాను
"శిల్పం" అంది
"ఇదెలా ఉంది" అన్నాను
"అద్భుతంగా ఉంది" అన్నది

వాళ్ళు
మానవులను
"నూతన మానవులుగా ఆవిష్కరించేవాళ్ళు" అన్నాను

ఏమైందో ఏమో
పాప కనుపాపల బలిమెల జలజల ఏడ్చింది.

రచనలకు ఆహ్వానం!

అరుణతార అనేక ఇబ్బందుల మధ్యనే విప్లవ సాహిత్య సాంస్కృతిక రంగంలో కృషి చేస్తోంది. విరసం అధికార పత్రికగా ప్రజా ఉద్యమాల పక్షాన నిలబడి ప్రగతిశీల విలువలను నిలబెట్టడంలో సోదర సాహిత్య, రాజకీయ, సామాజిక పత్రికలతోపాటు తన వంతు బాధ్యత నిర్వర్తిస్తోంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పెచ్చరిల్లిన ఈ తరుణంలో విప్లవోద్యమంతోపాటు అనేక ప్రజా ధిక్కార స్వరాలు, నిరసనలు, పోరాటాలు వెల్లువెత్తుతున్నాయి. సామాజిక సంబంధాలను, విలువలను, ప్రజా ఆకాంక్షలను పాలకవర్గ విధానాలు ధ్వంసం చేస్తున్నాయి. ప్రజలు తమ వనరుల నుంచి, స్థావరాల నుంచి విస్థాపనకు గురవుతున్నారు. ప్రజల సహజీవన సంస్కృతి మీద దారుణమైన అణచివేత కొనసాగుతోంది. ఆదివాసుల పోరాటాల మీద రాజ్యం అతి పెద్ద స్థాయిలో యుద్ధం ప్రకటించిన సందర్భంలో మనం ఉన్నాం. అణగారిన ప్రాంతాలు, కులాలు, మహిళలు, మత మైనార్టీలు తీవ్ర అభద్రతలోంచే ఆత్మగౌరవం కోసం, న్యాయమైన ఆకాంక్షల కోసం పెనుగులాడుతున్నారు. ఈ సంఘర్షణను తెలుగు సృజనాత్మక సాహిత్యం అద్భుతంగా వ్యక్తీకరిస్తోంది. మారుతున్న ఈ సామాజిక సందర్భాన్ని తెలుగు రచయితలు గతం కంటే శక్తివంతంగా వివిధ ప్రక్రియల్లో ప్రజానుకూల చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నారు, సామాజికవేత్తలు విశ్లేషిస్తున్నారు.

ఈ వ్యక్తీకరణలకు, విశ్లేషణలకు అరుణతార మరింతగా వేదిక కావాలని మా ఆకాంక్ష. కథ, కవిత్వం, పాట, విమర్శ, పుస్తక సమీక్ష, అనువాదాలతోపాటు విశాల ప్రజా సాహిత్య సాంస్కృతిక రంగంలోని ఏ విషయం మీదైనా రచనలు పంపండి. సాహిత్య, కళా సిద్ధాంత, భావజాలపరమైన వాదాలను, విమర్శలను, వివిధ భాషా సాహిత్యాల్లోంచి ప్రగతిశీల రచనలను అనువాదం చేసి పంపించండి. సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాల మీద, ఉద్యమాల మీద విశ్లేషణలు, నివేదికలు పంపించండి. రాజ్యహింసా రూపాల మీద వ్యాసాలు పంపండి. అమరులైన ప్రజా ఉద్యమ కార్యకర్తలు, బుద్ధిజీవులు, రచయితలపై స్మృతి వ్యాసాలు పంపించండి.

మీ రచనల వల్లే అరుణతార తాను నిర్దేశించుకున్న సాహిత్య, సాంస్కృతిక కర్తవ్యాలను, ప్రజా ఉద్యమ బాధ్యతలను మరింత శక్తివంతంగా నిర్వర్తించగలుగుతుంది. మీ రచనల వల్లే పత్రిక ప్రమాణాలు మరింత బలోపేతమవుతాయి. పత్రికలో వస్తున్న రచనల మీద ఎప్పటికప్పుడు అభిప్రాయాలను, విమర్శలను రాసి మా కృషిని మెరుగులు దిద్దండి. అన్ని రకాలుగా మీ నుంచి సహకారాన్ని కోరుతూ...

– సం.

arunatara1977@gmail.com

Virasam website :
www.virasam.org, www.virasam.in
www.arunatara.in

కటకటాలు

● కృపాకర్ మాదిగ

పొద్దు గూకుతా ఉంది.
లోకానికి చీకటి పడతతంటే,
నా మనసంతా భయం కమ్ముకుంటంది.
ఈ రోజు రాత్రికి వంతు నాదేనేమో?
ఎదురు లాకప్‌లోకి ప్రతి రోజు ఒకరో ఇద్దర్రో
కొత్తవారిని తీసుకొస్తుంటారు. అట్లా వచ్చి
పోతున్న వారి మొకాలు మెరుపులు,
పిడుగులు, కుండపోత వానలూ దాచుకున్న
మేఘాల్లా గంభీరంగా ఉన్నాయి. రాత్రి
సద్దుమణిగి, పొద్దుపోయిందంటే చాలు,
ఒక్కొక్కరుగా ఇద్దరు ముగ్గురు నిందితుల్ని
ప్రతి రాత్రీ పై అంతస్తులోకి తీసుకుపోయి
తలుపులు, కిటికీలు, చీకట్లు, నిశ్శబ్దాలను
చీల్చుకొని వారి ఆర్తనాదాలు మెట్ల మీదగా
మా చెవుల్లోకి దిగబడుతున్నాయి.

నిటారుగా, చక్కగా మెట్లెక్కి వెళ్ళిన కుర్రాళ్ళు నెత్తుటి చారికలతో, కదుములు గట్టిన మొకాలతో, చొక్కాలు ఊడబెరికిన అర్ధనగ్న శరీరాలతో, పొద్దుపోయాక పచ్చి పుండ్లౌతున్నారు. మెట్ల మీదుగా బందికాడుతూ, పందెంలో ఓడిపోయిన పుంజుల్లా మూలుగుతూ, మరలా లాకప్‌లోకి వస్తున్నారు. విరిగిన లాఠీల్లా కనిపిస్తున్నారు.

లాకప్ డెత్‌లూ, మిస్సింగ్ హత్యలూ, బూటకపు ఎన్‌కౌంటర్లూ, వాటిల్లో బాధితులైన స్నేహితులూ, కామ్రేడ్లూ, వారి శోకతప్త కుటుంబీకులూ, శ్రేయోభిలాషులూ ఒక్కసారి కళ్ళ ముందు గిర్రున తిర్రిగారు. అక్రమ అరెస్టులు, హెబియస్ పిటీషన్లూ గుర్తుకొచ్చాయి. మా విషయంలో హెబియస్ కార్పస్ పిటీషన్ వేసే దిక్కేలేదు. ఎందుకంటే, మేమిక్కడున్నట్లు మమ్మల్ని ఎరిగిన వారికెవరికీ తెలియదు.

తీవ్ర ఆందోళనతో నాకు నిద్ర ఎగిరిపోయింది. వళ్ళంతా కోపంతో బిగుసుకుపోయింది. పల్లు కొరికాను. పిడికిళ్ళు గాల్లోకి లేచాయి. గోడకి గుద్దులు పడ్డాయి.

లింకన్ నాకంటే ఆరేడేళ్ళు పెద్దోడు. మా నాయకుడు. కామ్రేడ్. లా చదివాడు. చురుకైన మనిషి. కలుపుగోలుగుంటాడు. మంచి వక్త. విద్యార్థి సంఘానికి రాష్ట్ర నాయకుడు. మేమిద్దరమూ వామపక్ష కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేస్తున్నాము. ఇద్దరం టాలెంటెడ్ కావడం వల్లా, దళిత సమాజాలకు చెందిన వారిమి కావడం వల్లనేమో అసంకల్పితంగానే మంచి స్నేహితులం అయ్యాము. నేను సరదాగా వరసలు కలిపి లింకన్‌ని 'మావా' అని పిలుస్తుంటాను. అతను కూడా 'ఏం అల్లుడూ' అని బదులౌతాడు.

మేం అరెస్టయిన రోజు లింకన్ చదువుకుంటున్న కాలేజీలో విద్యార్థుల సమావేశం జరిగింది. ఇద్దరం హాజరయ్యాం. అతని ఇల్లు జిల్లా కేంద్రంలో ఉంది. ఆ టౌన్లో బస్సు దిగి, రోడ్డెమ్మిట నడుచుకుంటూ, మాట్లాడుకుంటూ వాళ్ళింటికి పోతున్నాము. ఇంతలోనే యాణ్ణించో ఊడిపడ్డట్టు ఇద్దరు ఐడి పార్టీ పోలీసులు మా దారికడ్డంగా వచ్చి 'లింకన్ నీ మీద వారెంటుంది. మా సిఐ నిన్ను తీసుకురమ్మన్నాడు. ఒకసారి స్టేషన్‌కి పోదాం పద' అన్నారు.

పరీక్షలకు తయారౌతూ హాస్టల్లో ఉన్నందువల్లా, తగిన సమాచారం లేనందువల్లా, తాను కోర్టు వాయిదాకి హాజరు కాలేకపోయినానని, కొంచెం టైం ఇస్తే, వచ్చి సరెండర్ అవుతానని లింకన్ వారితో అన్నాడు. అందుకు వాళ్ళు వొప్పుకోలేదు. కాసేపు వాళ్ళకీ మాకూ వాదులాట జరిగింది. ఇక చేసేది లేక వారి వెంట పోలీసు స్టేషన్‌కి వెళ్ళాము. సిఐ సీట్లో లేడు. సిఐ మీతో మాట్లాడేంత వరకూ మీరిక్కడ ఉండాల్సిందేనంటూ మా ఇద్దర్నీ లాకప్పులో పెట్టేశారు. లింకన్ మావతో కలిసి నడుస్తున్నందుకు కొసరు కేసుగా వీళ్ళకి నేను దొరికినట్టున్నాను. నన్నూ లోపల వేసేశారు!

ఆకలి దంచేస్తుంది. లింకన్ కానిస్టేబుల్‌ని పిలిచి, మా ఇద్దరికీ అన్నం తెచ్చిపెట్టమని డబ్బులిచ్చి బతిమిలాడాడు. సాయంత్రం నాలుగ్గంటలకు తెచ్చిన ఆ పిచ్చి అన్నాన్ని ఆబగా తినేశాం.

చీకటి పడుతుండగా వచ్చిన సిఐ ముందు మమ్మల్ని ప్రవేశపెట్టారు. పేపర్ వర్క్, ఫోన్లు, ఫైళ్ళలో ఉన్న సిఐ, చాలా సేపటికి తలఎత్తి మమ్మల్ని ఎగాదిగా చూసి 'తర్వాత మాట్లాడతాను పోండ్రా' అన్నాడు. ఇక కానిస్టేబుళ్ళు మళ్ళీ మమ్మల్ని లాకప్‌లో పెట్టి తాళం వేశారు.

రాత్రయింది. దప్పికవుతోంది. కనీసం మంచినీళ్ళు, కింద చాపవంటి సౌకర్యాలేవీ లేవక్కడ. ఇక్కడే కాదు. ఏ లాకప్‌లోనూ ఉండవు. నిందితులందరూ నేరస్తులు కారనీ, వారికి ప్రాథమిక మానవ సౌకర్యాలు కల్పించాలనీ, వారితో మర్యాదగా వ్యవహరించాలనే స్పృహ ఇక్కడి పోలీసులకెవరికీ లేదు.

లాకప్ గదంతా కలియజూశాను. పదడుగుల పొడవూ, ఎనిమిదడుగుల వెడల్పూ ఉంది. గోడల మూలలన్నింటి నిండా కిళ్ళీల, ఉమ్ముల మరకలు పచ్చిగా ఉన్నాయి. తాగి పడేసిన బీడీ ముక్కలు, సిగరెట్ పీకలు, కాలిపోయిన అగ్గిపుల్లలూ అక్కడక్కడా నేలమీద పడి ఉన్నాయి. మూత్రంతో నానిపోయిన చెత్తా చెదారం. ముక్కులు పగిలిపోయే దుర్వాసన వస్తోంది. చెత్తకుండీలో దిగబడ్డట్టు భరించనలవిగాకుండా

పరిసర వాతావరణమంతా ఉక్కిరిబిక్కిరిగా ఉందిక్కడ.

పైన గోడలకేసి చూశాను. గోడల మీద లైంగిక అవయవాల బొమ్మలు, భంగిమలు, వాటి చర్యలూ, బొగ్గులు, పెన్నులు, పెన్సిళ్ళతో పేర్లు, రాతలు, బొమ్మలతో గోడలన్నీ నిండిపోయాయి. అక్కడక్కడా నెత్తుటి రాతలూ ఉన్నాయి. దేహార్తి, అసమ్మతి, నిర్బంధం నుండి విముక్తి, స్వేచ్ఛా కాంక్షా రేకలతో ఆందోళనాకర మనస్సుల్లాగా గజిబిజిగా గోడలన్నీ నిండి ఉన్నాయి.

స్టేషన్ ప్రాంగణంలో వెనక వైపున టాయిలెట్స్‌కి దగ్గరగా ఎదురెదురుగా రెండు లాకప్ గదులు. అందులో ఒకటి మేమున్నది. దోమలు చెండాడుకుంటున్నాయి. నిద్రొచ్చే పరిస్థితి లేదు. ఎంత సేపని నిల్చొంటాం? నేలపై జారగిలబడి వీపులు గోడలకు ఆన్చినాం.

నోరెండిపోయింది. మంచి నీళ్ళు కావాలి. దారి లేదు. ఎలా? 'సార్ కానిస్టేబుల్ గారూ, కసిని మంచినీళ్ళివ్వండీ' అని రెండు మూడు సార్లు కేకేసి పిలిచా. స్టేషన్ సెంట్రీ కాసేపటికి నిద్ర మత్తుతో వచ్చి, విసుగ్గా మొకంబెట్టి 'యాందీ?' అన్నాడు. 'మంచీలు కావాల'న్నాను. కొద్ది సేపటికి ఒక ప్లాస్టిక్ లోటాతో నీళ్ళు తెచ్చి 'ఇయిగో' అన్నాడు. ఇనప తలుపు సందులోంచి లోటా జేరుకొని గటగటా తాగేశా. 'థాంక్స్ సార్. ఒకసారి తలుపుదీస్తే, వొంటేలుకు బోయొస్తా'నన్నాను. 'తలుపు తాళం తియ్యడం ఇపుడు కుదరదు, తెల్లారే. అదిగో అక్కడ పోసుకో' అంటా మా లాకప్ గదిలో మూలనున్న చిన్న కంతకేసి చూపించి విసురుగా వెళ్ళిపోయాడు. అక్కడా? ఎట్టా? అని మనసులో రొవంత విస్తుబోయి, మూత్రం బిగబట్టుకొని, తెల్లారేదాకా గమ్ము నుండి పోయాను.

మా పరిస్థితేంటి? మమ్మల్ని ఎన్‌కౌంటర్ చేస్తారా? తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతారా? థర్డ్ డిగ్రీలిచ్చుకుంటూ స్టేషన్లు మార్చుతారా? అసలు మమ్మల్ని వదిలిపెడతారా లేదా? 'చెరసాలలు ఉరికొయ్యలు విప్లవాన్ని ఆపలేవు' రోడ్ల మీద ఊరేగి కదం తొక్కిన నినాదం గుర్తుకొచ్చింది. 'బతకాలంటే చావడం నేర్చుకో! అడుగడుగునా పోరాటం నేర్చుకో' నినాదం మనసులో సుళ్ళు తిరుగుతోంది. 'ఉగరా ఉగరా!' కవిత బొమ్మ కడుతోంది. జాషువా తాత పద్యం, చెరసాల ఇనుప పంజరమందు మూన్నాళ్ళు గడిపిన ముద్రికల్ గలుగువారు / పోలీసు లాటీల పోటులు చవిజూచి కాయలేర్పడ్డ యుంగముల వారు / నగ్న సత్యలక్ష్మి నాలుక లేనిదై మూర్ఛవోయె రుద్ర భూమియందు' మనసులో మెదిలింది.

లింకన్ వైపు జూస్తూ, 'మనల్ని ఎప్పుడొదిలి పెడతారు మావా?' అనడిగా. 'రేపు ఆఫీసరొచ్చాక మాట్లాడి వదిలిపెడతార్లే కంగారు పడకు అల్లుడూ' అని భరోసాగా అన్నాడు. రెప్పలు బరువెక్కుతుండగా తెల్లారినట్టు కలకలం బయలు దేరింది.

తలుపులు తెరుస్తున్న చప్పుడు వినపడగానే పైకి లేచి నిలబడ్డాం. కానిస్టేబుల్ బైటకు రమ్మనంగానే, పోయి పక్కనే ఉన్న కక్కసు దొడ్ల దగ్గర నిలబడ్డాం. కానిస్టేబుల్ అక్కడే ఉన్న ఒక పాత ప్లాస్టిక్ జగ్గు నిండా నీళ్ళు బోసి దొడ్లోకి వాడుకొమ్మన్నాడు. చెరో రెండు అగ్గిపుల్లలిచ్చి, వాటితో పళ్ళు తోముకోమన్నాడు. మళ్ళా జగ్గు నిండా నీళ్ళు పోశాడు. శుభ్రం కాకపోయినా, వాకే అనిపించాం. నీళ్ళకీ నిర్బంధాలేనా? ఏంటీ గతి పట్టింది? అని లింకన్, నేనూ ఒకరి మొహాలొకరం చూసుకున్నాం మళ్ల మమ్మల్ని చీకటి కొట్లోకి తోలి తాళం వేశారు. తినడానికి ఏమైనా తెచ్చిపెట్టమని బతిమాలి ఒక కానిస్టేబుల్‌కి డబ్బులిచ్చాం.

ఆ టౌన్లో రెగ్యులర్‌గా ఓ సంగతి జరుగుతుంటది. హోటళ్ళలో రాత్రి మిగిలిపోయిన అన్నం తెచ్చి, అందులోకి ఇంత చేప పులుసు ఇచ్చి, పొద్దున్నే అక్కడక్కడా రోడ్ల మీద పెట్టి అమ్ముతుంటారు. బిచ్చగాళ్ళు, చిత్తు కాగితాలు ఏరుకునేటోళ్ళు, రిక్షా వాళ్ళు; దేశ దిమ్మరులు, చిన్నా చితకా పని పాటలు చేసుకునే పేదవాళ్ళు చౌకగా దొరికే ఈ అన్నం కొనుక్కొని తింటుంటారు. దీన్ని స్థానికులు 'గంపకూడు' అని పిలుస్తారు. లాకప్పుల్లోని వారికి సరఫరా చేసే రివాజు ప్రకారం మాకు కూడా పొద్దున్నే 'గంపకూడు' తెచ్చి పెడితే తిన్నాం. ఆ విధంగా మా బ్రంచ్ ముగిసింది. విప్లవం అంటే విందు భోజనం కాదని తెలుసుగానీ, గంపకూడని ఈ లాకప్‌లోనే తెలిసింది.

. మధ్యాహ్నం దాటింది. మా ఇద్దర్నీ సిఐ దగ్గరికి తీసుకుపోయారు. మా జిల్లాలో గుళ్ళనీ, గొప్పోళ్ళనీ దోచే ఒక గజ దొంగ ఉండేవాడు. అతని పేరు టైగర్ నాగేంద్ర. పేదవాళ్ళ అవసరాలకు సాయాలు చేస్తూ, గొప్ప అభిమానాన్ని సంపాదించుకున్నాడు. నాగేంద్ర ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారాడు. అతన్ని పట్టుకోవడానికీ, అవసరమైతే కాల్చి చంపడానికీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక సాయుధ దళానికి అధిపతిగా ఈ సిఐ పని చేశాడు. చివరకు టైగర్ నాగేంద్రని ఈ సిఐ కాల్చి చంపాడు. ఇదీ ఈ సి.ఐ. నేపథ్యం.

'ఏరా లింకన్ అబ్‌స్కాండింగ్‌లో ఉన్నవేంది? మాకు దొరక్కుండా ఎన్నాళ్ళిలా తప్పించుకు తిరుగుతావ్? అంత లెక్కలేనితనమా? మాకే కళ్ళు గప్పుతావా నా కొడకా?' సిఐ తిట్టుకుంటూ, దురుసుగా లింకన్ మీదికి దూకాడు. లింకన్ వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేసాడు. ఒక ఊరిలో దళితుల మీద జరిగిన అగ్రవర్ణాల దాడి సంఘటనకు నిరసనగా జిల్లాలో రాస్తారోకో, బందుల్లో లింకన్ పాల్గొన్నాడు. జన జీవనాన్ని అస్తవ్యస్తం చేసాడన్న అభియోగంతో లింకన్‌పై కేసు నమోదు చేశారు. కోర్టు వాయిదాలకు క్రమం తప్పకుండా హాజరయ్యే లింకన్ ఫైనలియర్ పీజీ పరీక్షలూ, ఉద్యమ కార్యక్రమాల వత్తిడితో ఒకసారి కోర్టు వాయిదాకి హాజరు కాలేకపోయాడు. ఇదే ఇప్పటి మా దుస్థితికి కారణం.

సిఐ నా వ్యక్తిగత వివరాలు అడగడం మొదలు పెట్టాడు. ఏ వివరాలు అడిగినా, తడుంకోకుండా అన్నీ తప్పే చెప్పాలని నేను ముందే నిర్ణయించుకొని ఉండినా. అమాయకత్వం, దీనత్వంతో నటించి, చెప్పేవన్నీ నిజమేనని నమ్మించి బయటపడాలని నిశ్చయించుకున్నాను. అదే మాదిరిగా అతని ముందు జీవించా.

పందొమ్మిదేళ్ళ ప్రాయం నాది. సన్నగా రివటలా ఉన్నాను. సిఐ 'నా కొడకా! ముడ్డిన పిడికెడు కండ లేదు, నువ్వు నక్సలైట్‌వంట్రా?' అంటూ ఈసారి నా మీదికి దూకాడు. నేను చాలా ఓర్పుతో జీవించి, దెబ్బపడకుండా తప్పించుకున్నాను.

మా ఫోటోలు, వేలిముద్రలు, సంతకాలు, అడ్రసులు, వ్యక్తిగత వివరాలు తీసుకున్నారు. మళ్ళీ మమ్మల్ని కొట్లో బెట్టి తాళం వేశారు.

ఆకలౌతుంది. కోపమొస్తుంది. 'ఈ నా... ఎప్పుడు వదల్తారో లేదో మమ్మల్ని?' అని మనసులో కసిగా తిట్టుకున్నాను. మూడ్రోజులైంది స్నానం లేదు. బట్టల్లేవు. ఇట్టాంటి నరక కూపాల్లో పేదవాళ్ళు, పేద కులాల వాళ్ళే ఎందుకున్నారో!?

తెల్సిన వారికి కబురు చేద్దామంటే అవకాశం లేదు. మా పరిస్థితేంటి? మమ్మల్ని ఎన్‌కౌంటర్ చేస్తారా? తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతారా? థర్డ్ డిగ్రీలిచ్చుకుంటూ స్టేషన్లు మార్చుతారా? అసలు మమ్మల్ని వదిలి పెడతారా లేదా? 'చెరసాలలు ఉరికొయ్యలు విప్లవాన్ని ఆపలేవు' రోడ్ల మీద ఊరేగి కదం తొక్కిన నినాదం గుర్తుకొచ్చింది. 'బతకాలంటే చావడం నేర్చుకో! అడుగడుగునా పోరాటం నేర్చుకో' నినాదం మనసులో సుళ్ళు తిరుగుతోంది. 'ఊగరా ఊగరా!' కవిత బొమ్మ కడుతోంది. జాషువా తాత పద్యం, చెరసాల ఇనుప పంజరమందు మూన్నాళ్ళు గడిపిన ముద్రికల్ గలుగువారు / పోలీసు లాటీల పోటులు చవిజూచి కాయలేర్పడ్డ యుంగముల వారు / నగ్న సత్యలక్ష్మి నాలుక లేనిదై మూర్ఛవోయె రుద్ర భూమియందు' మనసులో మెదిలింది.

తాగి పడిపోయిన రిక్షా అతన్నీ, ఆస్తి కోసం తల్లిదండ్రులపై దౌర్జన్యానికి తెగబడ్డ మరొకణ్ణీ తెచ్చి మా సెల్‌లో వేశారు. వాళ్ళతో ముచ్చట్లు పెట్టుకునే స్థితిలో మేం లేము. ఒక రోజు తర్వాత వారిని తీసుకెళ్ళారు.

రాత్రయింది. పొద్దుబోయింది. పై అంతస్తులో మరణ మృదంగం మొదలయ్యింది. అదురుపాటు, రౌద్రం పెరుగుతున్నాయి. నేరాలు వొప్పుకోవాలని చెయ్యని దానికీ, చేసిందానికీ అమాయకుల్ని, నిందితుల్ని, అర్భకుల్ని చిత్రహింసలు పెట్టే హక్కు వీరికెవరిచ్చారు? ఈ ఆగడాలు ఎప్పటికాగేను? యాండీకత?

'మావ మన ఘడియలు దగ్గరబడ్డట్టుంది. ఈ రోజు రాత్రి మనల్ని పై గదిలోకి తీసుకుపోతారు. ముందు నన్నా? నిన్నా? నడుచుకుంటూ మామూలుగా దిగి రాగలమా? నెత్తుటి మరకల్తో బందికాడుతూ వస్తామా? చెప్పు?' బెరుకుగా అంటున్న నన్ను చూసి లింకన్ నా చెయ్యి గట్టిగా పట్టుకుని కూల్‌గా నవ్వాడు.

ఆ రాత్రి నిమిషాలు లెక్కిస్తూ నిద్ర లేకుండా గడిపాను. లింకన్ పైకి గంభీరంగానే ఉన్నా, అతను కూడా కొంచెం ఆతృత, ఆందోళనల్తోనే ఉన్నట్టున్నాడు. మూడో రోజుకి వచ్చేశాం.

తెల్లారింది. మళ్ళీ జగ్గుడు నీళ్ళతోనే దొడ్లోకి పోవుడు. రెండు మూడు అగ్గిపుల్లలతోనే పళ్ళు తోముడు. గంపకూడు అనబడే సద్దికూడు తినుడు జరిగిపోయాయి. ఎండెక్కింది. కానిస్టేబుల్ వచ్చి తలుపు తీసి, లింకన్‌ని బైటికి రమ్మన్నాడు. కానిస్టేబుల్ వెంట వెళ్ళిన లింకన్ కాసేపటికి తిరిగొచ్చి 'కరుణా నన్ను కోర్టుకు తీసుకెళ్తారంట. రిమాండుకి పంపుతారేమో? మళ్ళీ ఇక్కడికి తీసుకురారేమో? నిన్ను కూడా రేపో మాపో వదిలి పెడతార్లే. జాగ్రత్త' అంటూ నా భుజం తట్టి, తన దగ్గరున్న కొద్దిపాటి డబ్బులో నలభై రూపాయలు నా చేతిలో బెట్టి, మెత్తగా నా చెయ్యి నొక్కి ఉత్సాహంగా నవ్వుతూ వెళిపోయాడు.

ఇక ఇపుడు లాకప్‌లో నేను వొక్కణ్నే. తర్వాత మరో వారం రోజులు భారంగా వొంటరిగానే గడిచిపోయాయి. నిద్ర, స్నానం, బట్టల మార్పిడు వంటివేమీ లేవు. విసుగు, టెన్షన్, క్రోధాలతో రోజులు ఎలా గడుపుతున్నానో నాకే తెలియట్లేదు.

లింకన్‌ని కోర్టుకు హాజరుపరిచి, రిమాండు ఖైదీగా జిల్లా సబ్ జైలుకు తరలించినట్టు తెలిసింది. పోనీలే తనైనా మనుషుల మధ్య పడ్డాడు. వెనకా ముందుగా బెయిలు ఎప్పుడోకప్పుడు వస్తుంది.

నా మీద కేసులు రిజిస్టర్ చేసారో లేదో తెలియదు. కోర్టుకి హాజరు పెడతారో లేదో తెలియదు. పగలైతే విడుదల చేస్తారో లేదో తెలియదు. రాత్రయితే ఏం చేస్తారో తెలియదు. ఎన్ని రోజులిలా లాకప్‌లో మగ్గిపోవడం? ఎవరైనా వచ్చి నన్ను విడిపించమని గోడవతల రోడ్డు మీద పోతున్న బాటసారులను కేకలు పెట్టి పిలిస్తేనో? నా పిచ్చిగాని, రోడ్డు మీద రణగొణ ధ్వనుల మధ్య వెళ్ళే వారికి నా కేకలు వినిపిస్తాయా? వినపడినా రాకపోతే? నా కేకలు మొదట, ఖచ్చితంగా స్టేషన్‌లో డ్యూటీ చేస్తున్న వారికే వినపడతాయి. అప్పుడు పర్యవసానాలు ఎంత ఘోరంగా ఉంటాయో? బుర్ర వేడెక్కిపోతోంది.

మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది రోజులు గోతిలో పడ్డాయి. రెప్పల్లేకుండా రాత్రులు కరిగిపోతున్నాయి. ఒక్క జగ్గు నీళ్ళతో కాలకృత్యాలు, రెండు అగ్గిపుల్లలతో పళ్ళు తోముకోవడం, పుక్కెడు నీళ్ళతో నోటి శుద్ధి తినలేక తినే గంపకూడు, అర్ధరాత్రిళ్ళు పై అంతస్తుల్లోని నేర విచారణా గదుల్లోంచి వినడానికి ఇష్టం లేని, వినక తప్పని కల్లోల సంగీతం, దుర్గంధం నిండిన గాలిలేని గదీ, దోమల వేటా, రెప్పలు మూయని రాత్రిళ్ళు. ఛ! ఇదా మనిషి బతుకు?

గోడవతల మోటారు వాహనాల శబ్దాలు, హారన్ల మోతలు, నలిగిపోతున్న మాటలు అంతా కలగలిసిన గోల. ఇంతకు మించి వెలుపలి ప్రపంచం ఏమీ అర్థం కావట్లేదు.

పదకొండో రోజు మొదలైంది. ఉదయం పదకొండు గంటలయ్యింది. బైట ఈ రోజు రాజకీయ పార్టీలన్నీ కలిసి ఏవో డిమాండ్లపై జాతీయ స్థాయి సార్వత్రిక సమ్మె చేస్తున్నాయంట. ఇందువల్ల ఈ రోజు నాకు గంపకూడు కూడా లేకుండాపోయింది. ఆకలి మంటలు అల్లాడిస్తున్నాయి. ఒక పోలీసు వచ్చాడు. 'నిన్ను వొదిలిపెట్టమని మా సిఐ గారు చెప్పాడు' అంటూ లాకప్ తాళం తీశాడు. బైటికి రమ్మంటూ నాకు సైగ చేశాడు.

లాకప్‌లోంచి బయటికొచ్చాను. ఎల్తురు కళ్ళతో వొంటిని ఒకసారి తడుముకున్నాను. ఎట్లున్నానో తెలుసా? ఈ పదకొండు రోజులు స్నానం లేదు. వొంటికి ఎండ తగల్లేదు. మురికి వొంటి పై అట్టలు గట్టుకపోయి ఉంది. కంపుతో, నాకే కంపరంగా ఉన్నాను. బండ కింద ఎండ తగలని గడ్డిపోచ మాదిరిగా, లేత పసుపు రంగులో ఉన్నాను!

నువు సముద్రంలో ప్రయాణిస్తున్నపుడు ఒక పెద్ద షార్క్ చేప వచ్చి నీ చిన్ని పడవకు కన్నం వేస్తే? అంతకు ముందెప్పుడూ రాని కొత్త సిటీలో, వర్షాకాలాన మోకాటి లోతు నీళ్ళల్లో నువు నడుచుకుంటూ పోతున్నపుడు అకస్మాత్తుగా ఒక మ్యాన్‌హోల్ గొయ్యి నిన్ను లాగేసుకొని పోబోతే? నువు అడవిలో పోతున్నపుడు దారి మళ్ళించబడి, చీకటి పడే సరికి క్రూర జంతువుల సంచార ప్రదేశంలో చిక్కుబడి తప్పించుకురాగలిగితే? ఏ నేరమూ చెయ్యకపోయినా కేవలం అనుమానంతో ఆగంతకులు తీసుకొచ్చి నిన్ను భూ గృహంలో బంధిస్తే? నీ గోడవతల మనుషులెవరూ గమనించని స్థితిలో నువు మగ్గిపోవాల్సి వస్తే? ఒక టర్నాడో సుడి నిన్ను ముంచెత్తబోయి, చిక్కకుండా తప్పిపోతే? హబ్బ! నవ్వుకున్నాను.

పోలీసు స్టేషన్ బయటికొచ్చి గుండెల నిండా శ్వాస పీల్చుకున్నాను. రోడ్డు మీద ఉన్న రాయిని చేతుల్లోకి తీసుకొని స్టేషన్ గోడకేసి బలంగా విసిరికొట్టాను. నడుచుకుంటూ వెళ్ళి జనంలో కలిసిపోయాను.

'వాళ్లు'

● తాయమ్మ కరుణ



తను మాట్లాడుతోంది, తిరుగుతోంది. కానీ తను తనలా లేదే.

"నీతోనే ఉండాలని ఉంది. కానీ వెళ్ళక తప్పదుగా" బ్యాగు భుజానికి వేసుకున్న.

"13న రారాదు"

"రావాల్నా."

"రారా..." కళ్ళలోకి చూస్తూ

ఇలా వెళ్లాలని లేదు. కేవలం తనతో.. కేవలం తనతో మాట్లాడాలి. కానీ ఈ సందర్భంలో కుదరదు. తాను రమ్మన్నది కాబట్టి... వెళ్ళలా వద్దా అనే ఊగిసలాటను పక్కనబెట్టి 'ఈ సందర్భంలో నేను రావడం సంతోషమేమో'బయలుదేరా. ఆ ఊరికి వెళ్లేందుకు ఆటో ఎక్కినప్పటి నుంచి గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఆ 5 కిలోమీటర్లు ఎన్ని జ్ఞాపకాలని!

వాడే కదా ఆమె ప్రాణం. వాడి కోసమే ఎన్ని అవమానాలు, ఇబ్బందులు అయినా పడిందీ... ఒక సంవత్సరమా? రెండు సంవత్సరాల? ఇప్పుడు తను ఎలా ఉంటోంది?

వెళ్లేసరికి ఇంటి ముందర వేసిన టెంట్ కింద కొందరు కుర్చీల్లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఇంటికి సున్నాలు వేసి ఉన్నాయి. టిఫిన్లు తినేవాళ్లు తింటున్నారు. చాయ్ తాగేవాళ్ళు తాగుతున్నారు. కిచెన్లో అందించే వాళ్ళు అందిస్తున్నారు. వెళ్లి బ్యాగు లోపల పెట్టాను. తను మంచం మీద కూచుంది. చుట్టూ ఉన్నవాళ్లు తింటూ తాగుతూ మాట్లాడుతున్నారు. తను వుంది. కానీ నిజంగానే చైతన్యవంతంగా ఉందా? తానే నన్ను పలకరించింది. మొన్న కలిసినప్పుడు కూడా ఇలాగే "బాగున్నావా?" అంది. ఎవరు పలకరించాలి? నేను తననా? తను నన్నా? నాకు బోరున ఏడవాలని అనిపించింది.

"వెళ్లి మొఖం కడుక్కుని స్నానం చెయ్యి" అంది.

"ఆ వెళ్తా. ముందు సెల్ఫోన్ ఛార్జింగ్ పెట్టాలి." ఛార్జింగ్ పెట్టాను. డ్రెస్ తీసుకుని స్నానికి వెళ్ళా.

"అక్కా నీళ్లు వేడి పెడతా. ఈ లోగా మొఖం కడుక్కోండి" తన అక్క కూతురు అన్నది.

"సరే". 'ఫోన్ను ఛార్జింగ్కు పెట్టడం ఏమిటి? ఇలా బట్టలు తీసుకుని బయటకు రావడం ఏమిటి? ఏం చేస్తున్నాను? ఆ మనిషిని పలకరించలేదే.'

గబాగబా లోపలి వెళ్లి తన చేతిని చేతిలోకి తీసుకున్నా. "ఇంతకీ నువ్వెలా ఉన్నావు?"

నవ్వింది. ఆ నవ్వుకు ఎన్ని అర్థాలు!

అంతకు మించి ఏం మాట్లాడాలో కూడా తోచలేదు. మాటలు దొరకడం లేదు.

అయినా అంతా అర్థమవుతుంటే ఏం మాట్లాడాలి? కొద్దిసేపు తన చెయ్యి పట్టుకుని అలాగే కూచున్నా. ఎదుటి వ్యక్తిపట్ల వున్న అభిమానాన్నీ అంత మందిలో చూపడం, వారితో మాట్లాడటం చాతకాదు. తర్వాత అక్కడ ఉండలేక బయటికి వచ్చి కూచున్న. వాతావరణం ప్రశాంతంగా ఉంది. మనసేమో ఖాళీ అయింది. నిజంగా ఖాళీగా ఉందా? ఉంటే గుండెల మీద ఇంత భారమెందుకు?

వీధిలో చివరి ఇల్లు. ఇంటి ముందర అంతా మట్టినే. ఇంటి పని పూర్తైనట్టు లేదు. ఒక హాలు. హాలులోకి... కిచెన్, బెడ్రూమ్ దర్వాజలు. బయట టాయ్లెట్. దాని ఎదురుగా మూడు బొప్పాయి చెట్లు. వాటికి కొన్ని కాయలు. టాయ్లెట్ పక్కనుంచి వేసిన కంచెకు కాకర తీగ. కొన్ని పూలమొక్కలు. ఆ పక్కన అన్నీ పొలాలు. దుక్కి దున్నివిత్తడానికి సిద్ధంగా ఉన్నాయి. దూరంగా పచ్చని చెట్లు. బహుశా ప్లాంటేషనేమొ. ఇంటి ముందర చర్చి. చర్చికి ఇంటికి మధ్యలో ఖాళీ జాగా. అందులో ఆకు కూరలు, కూరగాయల మొక్కలు. అంతా సాఫీగా ఉంటే చాలా ప్రశాంతమైన వాతావరణమే. ఈ ఇంట్లో నిజంగానే ప్రశాంతంగా ఉందా? నిద్ర మాత్రలు వేసుకోకపోతే నిద్ర రాకపోయేదట. ఇది ఇప్పటిమాటా? చాలా ఏండ్లుగా సాగుతున్న వ్యవహారమే కదా.

ఆయనంటే వెళ్లాడు. వీడు కూడా వెళ్లడమేమిటి? వాడికి తెలియదు - తన ప్రతి ఆలోచనా, కదలికా, పని తనకోసమేనని. అయినా వదిలేసి వెళ్లిపోయాడే.

''ఎందుకురా నాన్నా? నన్ను ఒంటరిని చేశావు'' అని నిలదీయాలనుకుంది. ఎక్కడా? మాట్లాడనిస్తేనా? మాటలతో మాయచేశాడు. భగత్సింగ్ గురించి చెప్తున్నాడు. తనెందుకు ఈ మార్గాన్నీఎంచుకున్నాడో చెప్తున్నాడు. తనేమి అడుగాలనుకుంటుందో తెలిసే ఇదంతా చెప్తున్నాడా? వాడినేనా తను చూస్తున్నది? ఇంత తెలివి, జ్ఞానం ఎప్పుడు నేర్చుకున్నాడు! పైగా "ఇంత అమాయకంగా ఉన్నావు. నాన్నెట్లా చేసుకున్నాడమ్మా" అంటాడు. నిన్న మొన్నటి వరకూ వీడు నా కొంగుచాటు బిడ్డడు కాదూ.

ఈ ఇల్లు ఇంతకుముందు కట్టుకుని ఉంటే వాడు తనను విడిచి వెళ్లేవాడు కాదేమో. అయినా పిచ్చిగానీ, విచ్చుకున్న ఆలోచనను ఎలా తుంచగలదు తను. పోనీ ఏదో ఒక రోజు ఈ అమ్మను కవడానికి వాడు రాడా? "అరే కన్నా.. ఇదిగ్గిరో అమ్మ నీ కోసం ఇల్లు కట్టిందిరా" అని చూపాలనుకుంది. నిజానికి వాడి కోసమే తను ఈ ఇల్లు కట్టిందేమో. వాడికి ఇష్టమైన పప్పు, నెయ్యి వేసి పెట్టాలనుకుంది. వాడికి ఇష్టమైన ఇడ్లీ, దోశ వేసి ఇవ్వాలనుకుంది. వచ్చినా ఇంటికి వస్తాడా? రాడేమో. అయినా మనసులో చావని ఆశ. మొన్నటి వరకూ అదే ఆశతో బతికింది. వాళ్లు

ఏదో ఒకరోజు కలుస్తారు కదా. ఆ ఏదో ఒకరోజు కోసం ఎదురుచూస్తూనే ఉంది.

వాడు రానే వచ్చాడు. వాడి కోసం కట్టిన ఇంట్లోకి వాడు రానే వచ్చాడు. కానీ వాడుగా రాలేదు. తీసుకువచ్చారు.

"వేరేవాళ్ల ఇంట్లో ఉంటే బయట టెంట్ వేసి అక్కడి నుంచి అటే పంపించేసి ఉండేవాళ్లు. ఇల్లు కట్టాను కద. ఇంట్లోకి తీసుకురమ్మని ముందు రూములో పడుకోబెట్టాను రా" మొన్నటిసారి కలిసినప్పుడు తను నాతో చెప్పిన మాటలు. అనేటప్పుడు ఏదో తృప్తి. నాకు మాత్రం గుండెలు మెలిపెట్టే బాధ.

"నీళ్లు మరిగాయక్కా తీసుకురానా?" ఒకమ్మాయి అడిగింది.

"కాగాయా? నేను తెచ్చుకుంటాలేరా".

స్నానం చేసి వచ్చేసరికే హడావుడి - రమ్మని పిలుపు వచ్చిందని. ఇంటికి దగ్గర్లోని ఖాళీ జాగాలో వేసిన టెంట్‌లోంచి "కార్యక్రమం కాసేపట్లో మొదవుతుంది" మైక్‌లో ఎవరో అనౌన్స్ చేస్తున్నారు.

వాడి పేరు పృథ్వి. వాడికి ఆ పేరును ఎంత ప్రేమగా పెట్టుకున్నారని! "ఈ నేల కోసమే కదా మనిషి పోరాటం, ఆరాటం. అందుకే ఆ పేరు పెట్టుకున్నాం". ఇప్పుడు వాడు నిజంగానే భూమి తల్లి ఒడిలో.

"అమ్మా జెండా ఎగురేద్దావురామ్మా" ఎవరో పిలిచారు.

వెళ్లింది. జెండా ఎగురవేసి, ఆకాశంలో రెపరెప లాడుతున్న దానివైపు చూస్తుంటే ఎంత ప్రయత్నించినా ఆగక దూకిన కన్నీళ్ళు.

"ఏంట్రా? ఇంత ఎత్తుకు ఎదిగావు?"

అరుణ అరుణ బాటలో

అరుణ బావుట నీడలో

అమరులైన ఓ అమర వీరులారా... పాట సాగుతోంది.

Red salutes పొజిషన్లో నిలబడి కోరస్ ఇస్తూ జనం.

నిన్నుచూసి గర్వపడాలా? ఏం చేయాలిరా నేనిప్పుడు? నువ్వు సంతోషంగా ఉంటే నాకు అంతకంటే కావాల్సిందేముందమ్మా అన్నావు కదరా.

తెలుసారా? రెండు, మూడు నెలల నుంచి ఎందుకనో చాలా ఆందోళనగా ఉంటోంది. కూచోబుద్ధికాదు, నిలబడ బుద్ధికాదు, పని చేయబుద్ధి కాదు, తిండి తినబుద్ధికాదు. ఎందుకని? హాస్పటల్‌కి వెళ్లా. డాక్టర్ ఏమీ లేదన్నాడు. ఎందుకట్లా ఉంటున్నావు అని అందరూ అడిగారు. ఏం చెప్పాలి? 'ఏమో తెలియదు. ఆందోళనగా ఉంటోంది'. ఆ రోజు కాఫీ కప్పు పట్టుకుని వంటింట్లోంచి ముందు గదిలోకి వచ్చి టీవీ చూస్తున్నా. స్క్రోలింగ్‌లో వాడి పేరు. కప్పు చేతిలోంచి ఎప్పుడు జారిపోయిందో తెలియదు. బహుశా అందుకేనేమో ఇన్ని రోజులుగా కన్నపేగు అంతగా తల్లడిల్లింది.

"ఇంటికొకరిని రమ్మన్నారు. మీ నాన్న వెళ్లారు కదరా. నువ్వు నాతో రారా".

"అమ్మా యాక్సిడెంట్ అయి చనిపోతున్నవాళ్లు ఎందరు లేరమ్మా" అన్నాడు. "నేను చెడ్డ పని చేస్తలేను కదమ్మా" అన్నాడు.

ఇడ్లీనో, దోశనో లేకుంటే టిఫిన్ తినని వాడు... ఇష్టంగా జావ తాగుతున్నాడు. ఎంత ఆశ్చర్యపోయిన్నో. ఎంత మారాడు వీడు. చాలా పెద్దవాడు అయ్యాడు అనుకున్నా.

వాడిని వదిలి వచ్చేటప్పుడు చెయ్యి మీద, నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాడు. "అమ్మా నీ ప్రతి ఆలోచన నాకు తెలుస్తుందే" అన్నట్టుగా తల్లిలా నన్ను గుండెకు హత్తుకున్నాడు. అదే చివరసారి వాడిని చూడటం.

"ఎందుకు నాన్న మళ్లీ వెళ్తున్నావు. ఇంటికి పోదాం రా" ఆందోళనతోనే అడిగా.

"నిన్ను వదిలిపెట్టి ఎక్కడికి వెళ్తానే. ఎప్పుడూ నీతోనే ఉంటాను" ఎంత నమ్మకంగా చెప్పాడురా.

ఏమనుకున్నాడో బస్టాండు వరకు వచ్చి బస్సెక్కిచ్చి వెళ్లాడు. కనిపించకుండా పోయే వరకు వాడినే చూస్తూ కూచున్నా. ఇప్పుడిక అందుకోలేనంత దూరం వెళ్లిపోయాడు. మొన్న కలిసినప్పుడు చెప్పుకుంటూ పోయింది. ఏడవదేంటి? గుండెలు పగిలేలా ఏడిస్తే బాగుండు.

ఏడ్వడం బలహీనతకు చిహ్నమా? రాళ్లే కదా చెమ్మగిల్లవు. తడి ఉన్నవాళ్లే కదా ఇతర్ల దుఃఖాన్ని చూసి కంటనీరొలికేది. అవును, వీళ్లకే కదా తడి ఎక్కువ. అందుకే కదా ప్రజల సంపదను గద్దలు తన్నుకుపోకుండా పహారా కాస్తున్నారు. అందుకే కాదు తనూ ప్రాణంగా చూసుకున్న వాడు తండ్రి బాటన వెళ్లినందుకు మౌనంగానైనా ఆమోదించింది, లోలోన ఎక్కడో గర్వపడింది.

ఆపుకుంటూ వచ్చిన దుఃఖపు తెర ఇక మాట్లాడనీయలేదు.

మీటింగ్ మధ్యలో వెళ్లి "ఇంటికి వెళ్దామా" అడిగా "ఈ పాట అయిపోయిన తర్వాత వెళ్దాం"

మీటింగ్లోనే కూచున్నా. ఏవేవో ఆలోచనలు.

"పెండ్లి చేసుకున్నాడా" మొన్నటిసారి కలిసినప్పుడు అడిగా.

"ఇంకా చేసుకోలేదు. నువ్వు లేకుండా నేనెట్లా చేసుకుంటానమ్మా" అన్నాడు.

యెవరినైనా ప్రేమించాడా? అడిగే ధైర్యం లేకపోయింది.

అప్పుడెప్పుడో చెప్పింది. టెన్త్ లోనో ఏమో.... ఓ అమ్మాయి గురించి పదే పదే చెప్తుంటే "ఆ అమ్మాయి అంటే ఇష్టమారా" అని అడిగితే "అవునే " అనే సమాధానం.

"ఎవర్రా ఆ అమ్మాయి?"

"ఓ పోలీసాయన కూతురు"

వాడిది స్నేహమే కావచ్చు. కానీ తన భయం తనది. వాడి నాన్న ఏమైనా అందరి నాన్నల లాంటి వాడా?

"అంతకు మించి వెల్లకురోరే"

"యెందుకు?"

యధాలాపంగా అడిగాడా? వాడి మనసులో ఇంకే ఉద్దేశ్యమైనా ఉందా? ఎదుగుతున్న వయసు. చెప్పడానికి నాన్న లేడు. తన అనుమానాలు, తన భయం తనవి.

"ప్రేమ గీమ అనేవ్. బొక్కలో వేస్తారు"

"అమ్మా.... " విసుగ్గా అని "ప్రేమిస్తే జైల్లో వేస్తారే?" వాదన కోసమే కావచ్చు...

"మీ నాన్న సంగతి తెలుస్తే ఊరుకుంటారేమిరా?"

ఇంత కాలం వాడికి నాన్న గురించి అంతా తెలిసినట్టే ఉండేది. ఏమీ తెలిసేదీ కాదు. ఏదో ఎందుకో దాస్తున్నారు. తనను ఎన్నిసార్లు

అడిగినా దాటవేసేది.

"నాన్న ఎక్కడ ఉంటాడమ్మా?"

ఇక చెప్పక తప్పలేదు.

వాళ్లు ఏం చేస్తారు? అడవుల్లో ఎందుకు ఉంటున్నారు? వాళ్ళు ఇంటికి వస్తే పోలీసులు ఎందుకు పట్టుకుంటారు? వాడికి అప్పటికప్పుడు నాన్నని చూడాలనిపించింది, చాలా అడగాలనిపించింది. ఆయన అసలు ఎట్లా ఉంటాడు?

"అమ్మా, నాన్న దగ్గరికి ఎప్పుడు తీసుకెళతావే " ఒకటే పోరు.

"పోదాం లేరా " అని అప్పటికి తప్పించుకున్నా వాడు వింటేగా.

రమ్మని అక్కడి నుంచి పిలుపు. వాడసలు ఒకచోట కూచుంటేనా? బయటి నుంచి క్యాంపులోకి ఎవరు వచ్చినా లైన్లో నిలబడి లాల్‌సలాం చెప్తూ చేతులు కలపడం రివాజు. అభిమానాన్నంతా చేతుల్లోకి ఒంపుకుని కలిపే ఆ కరస్పర్శ ఎన్నినేర్పుతుందని. ఎన్ని అనుమానాలను పటాపంచలు చేస్తుందని.

ఫొటోలో తప్ప ప్రత్యక్షంగా చూడని కొడుకుని చూస్తున్న ఆయన మనసు ఎంత ఉద్వేగానికి లోనైందని. సంతోషాన్నీ బయటకు కనిపించనీయ వద్దని ఆయన ఎంత ప్రయత్నించినా అర్థమైపోయింది. ఆ రోజు ఆయన మాట్లాడుతుంటే చూడాలి - మొఖం వెలిగిపోయింది. నిజానికి వాడు ఆయన కొడుకు అని ఎవరూ చెప్పలేదు. అట్లా చెప్పరు కూడా. జిరాక్స్ కాపీనే కదా. ఎవరూ చెప్పకుండానే అందరికీ తెలిసిపోయింది. ఆ ముగ్గురికి అవి అపురూపమైన క్షణాలు.

సంతోషంగా ఉండాల్సిన ఆ కుటుంబం ఇలా ఎందుకుంది? కారణమేంటి? తన గురించి మాత్రమే తను చూసుకుంటే ఎవరికీ ఏ ప్రమాదమూ ఉండేది కాదేమో. వాళ్లు భిన్నమైన వాళ్ళా? నిజంగా భిన్నమైన వాళ్లేనా? మనులషుందరూ మంచిగా బతకాలనుకునే నేరం చేసినవాళ్లు. నిజంగానే వాళ్లు నేరస్తులా?

క్యాంపులో అందరితోపాటు వీడూ నీళ్ల క్యాన్లు రెండిటిని ఆ చేతిలో ఒకటి, ఈ చేతిలో ఒకటి మోసేవాడు అందరిలా. చాలా బక్క ప్రాణి.

'వద్దులే' అన్నా వినేవాడు కాదు. టీ తాగేటప్పుడు ఈ విషయాలను మాట్లాడుకుంటుంటే ఆయనకు ఎంత సంతోషమో. పట్టనట్టే ఉండేవాడు కానీ అన్నీ వినేవాడు. క్యాంపులో ఉన్న ఆ పది పదిహేను రోజులు వాడికి పట్టాపగ్గాలు లేవు. అట్లని తండ్రి దగ్గర కూచుని మాట్లాడిందీ లేదు. అందర్లో కలిసిపోయాడు. అది 'ఆయన'కు మరింత సంతోషాన్నిచ్చింది.

వాడి మీద రాసిన పాట మీటింగ్‌లో పాడుతున్నారు.

"మన కామ్రేడ్స్ పిల్లలు ఎందుకనో పార్టీకి దూరంగా ఉంటున్నారని అన్న బాధపడేవాడు. పృథ్వి అన్న బాధను తీర్చాడు." పక్కనే వున్న జ్యోతి అంటోంది.

తాము కష్టపడ్డా పిల్లలను సుఖంగా ఉంచాలను కుంటున్నారు కదా తల్లిదండ్రులు. అందుకే అందరికీ దూరంగా పెంచుతున్నారు, చదివిస్తున్నారు. అదే అసలైన ప్రేమ కదా. ఈయనేంటి? ఇట్లా ఆలోచించారు? అందునా ప్రాణాలకు గ్యారంటీ లేని చోట తన కొడుకు పని చేయాలనుకున్నాడు. బయట మాత్రం గ్యారంటీ ఉందా? ఎలా బతుకుతున్నాం? అసలు బతకనిస్తున్నారా? ఇదిగో ఈ మీటింగుకు రావడానికి ఎన్ని తంటాలు పడాల్సి వచ్చింది. వంద నోట్లు దొరికితేనా? అప్పు అడిగినా ఇచ్చే స్థితి లేదే. కొత్త కొత్త టెన్షన్లు వచ్చి పడుతుంటాయి. ఈ టెన్షన్లు ఎవరికి వారు కొని తెచ్చుకున్నవేనా? కాదే. కానీ ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నారు కదా. అయినా వీటితో సంబంధం లేకుండానే జీవితం 'వెల్లమారి' పోతోంది కదా. ఇట్లా కాక ఎట్లా జీవించాలి? ఎట్లా జీవించాలో వాళ్లకు తెలుసునా? అందుకేనా ఈ పోరాటం. మరి, జనానికి తెలుస్తోందా?

నేను బాగుంటే చాలు. పక్కవాడు ఏమైతే నాకేం అనుకునే రోజులు కదా. వీళ్లేంటి తమకంటూ ఏమీ కూడబెట్టుకోవడం లేదు. తమ బాగు చూసుకోకపోతే పోయారు. ప్రాణాలనే ఇచ్చేస్తున్నారు కదా.

పాట అయిపోయింది. ఎవరో మాట్లాడుతున్నారు.

తండ్రిని కలిసి వచ్చిన తర్వాత వాడు అస్సలు చదువుకుంటేనా? ఏదో సాధించిన గర్వం. తల్లి ప్రేమ వాడిని ఎక్కడికీ వెళ్లనీయదనీ, కట్టిపడేస్తుందనీ అనుకున్న. అమాయకురాలిని కాదూ. ఇంతకుముందులా మాట్లాడటమూ తగ్గించాడు. పెద్దవాడు అవుతున్నాడనుకున్నా కానీ దూరమవుతున్నాడనీ గమనించుకోలేకపోయారా. ఇల్లు కాలేజీ తప్ప ఎక్కడికీ వెళ్లేవాడు కాదు. వెళితే తను ఆందోళన పడుతుందని వాడికి తెలుసు. అయినా చాలా సబ్జెక్టుల్లో ఫెయిల్. ఏమైంది వీడికి? అడిగితే సమాధానం ఉండదు. ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు. అంత పెద్ద కష్టం ఏం వచ్చిందని వీడికి? పిల్లాపాపతో సంతోషంగా జీవించాలని కదా తన ఆరాటం. తండ్రేమో అట్లా. వీడేమో ఇట్లా. పట్టలేని కోపం వచ్చేది. ఎవరికి చెప్పుకోవాలి?

తండ్రి చెప్తేనైనా వింటాడేమో అనుకున్నా.. ఆయనను కలిసాక వెంటనే బయటకు రాలేకపోయినం. కొద్దిరోజులు అక్కడే ఉండాల్సి వచ్చింది. తండ్రే ఏమి చెప్పాడో.. వాడేమీ ఆలోచించుకున్నాడో.. తెలియదు. నన్ను బయటకు తీసుకువచ్చి వదలిపెట్టి, 'మళ్లీ కలుస్తానమ్మా' అంటూ వెళ్లిపోబోయాడు. ఏదో జరుగుతోందని నాకు అప్పుడే అర్థమైంది.

"ఎందుకు నాన్న మళ్లీ వెళ్తున్నావు. ఇంటికి పోదాం రా" ఆందోళనతోనే అడిగా.

"నిన్ను వదిలిపెట్టి ఎక్కడికి వెళ్తానే. ఎప్పుడూ నీతోనే ఉంటాను" ఎంత నమ్మకంగా చెప్పాడురా.

ఏమనుకున్నాడో బస్టాండు వరకు వచ్చి బస్సెక్కిచ్చి వెళ్లాడు. కనిపించకుండా పోయే వరకు వాడినే చూస్తూ కూచున్నా. ఇప్పుడిక అందుకోలేనంత దూరం వెళ్లిపోయాడు. మొన్న కలిసినప్పుడు చెప్పుకుంటూ పోయింది. ఏడవదేంటి? గుండెలు పగిలేలా ఏడిస్తే బాగుండు.

ఏడ్వడం బలహీనతకు చిహ్నమా? రాళ్లే కదా చెమ్మగిల్లవు. తడి ఉన్నవాళ్లే కదా ఇతర్ల దుఃఖాన్ని చూసి కంటనీరొలికేది. అవును, వీళ్లకే కదా తడి ఎక్కువ. అందుకే కదా ప్రజల సంపదను గద్దలు తన్నుకుపోకుండా పహారా కాస్తున్నారు. అందుకే కాదు తనూ ప్రాణంగా చూసుకున్న వాడు తండ్రి బాటన వెళ్లినందుకు మౌనంగానైనా ఆమోదించింది, లోలోన ఎక్కడో గర్వపడింది.

ఒక్కసారి బోరున ఏడవవే తల్లి.

తను ఏడిస్తే వాడు చూడలేడనా? నిజంగా వాడిప్పుడు తనను చూస్తున్నాడా? ఎక్కడి నుండి చూస్తూ ఉండి ఉంటాడు. ఈ జనంలో లేడా వాడు? లేకపోతే పొద్దుటి నుంచి మీటింగు జరుగుతున్నా కదలరేంటి? ప్రతీ మాటను అంత శ్రద్ధగా వింటున్నారేమిటి? ఇంకా ఎంతో కాలం బతకకపోవచ్చు ఆ అవ్వ.. పాట పాటకి ముందు వరుసలోకి వచ్చి కూచుంటోంది. ఎందుకు? వయసుల తేడా లేకుండా అందరిలోకీ తొంగి చూస్తున్నాడా వాడు?

"అక్క రమ్మంటోంది" ఒకమ్మాయి వచ్చి చెప్పింది.

వెళ్లాను. "ఇంటికి వెల్దామా"

మీటింగు నుంచి బయలుదేరాం. "చూసావా వాణ్ని?"

"ఆ... ఎదురొమ్మున మూడు తూటాలు." తన గుండెలను తడుముకుంటూ...

నీ గుండెలకంత నిబ్బరం ఎక్కడి నుంచి వచ్చిందిరా నాన్న? కొండను ఢీకొనాలని నిశ్చయించుకున్నారేమిట్రా..? బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ! అవును పాములు... చీమలు... వాటి వాటి బలాబలాలు మీకు బాగు తెల్సు.

"ఎట్లా జరిగిందట?"

"వీళ్లు కవర్‌గా ఉండి ఫైరింగ్ చేస్తుంటే ఒక బ్యాచీ కొండ ఎక్కిందట. ఎక్కినవాళ్లు ఫైరింగ్ చేస్తుంటే ఆ కవర్లో వీళ్లు ఎక్కుతున్నారట. అప్పుడే మెషిన్‌గన్‌తో కాల్పులు ప్రారంభమైనవట. కొండ ఎక్కుతున్న వాడల్లా రాలిపోయాడట. చూస్తూనే ఉన్నారట మిగతావాళ్లు. ఆ తర్వాత ఇంకో రెండు."

"ఈ ఇల్లూ, ఈ మనుషులను వదిలి ఎక్కడికైనా పారిపోవాల నుందిరా"

తన చేతిని గట్టిగా పట్టుకుని గుండెల్లో దాచుకున్నా. అయినా ఇప్పుడేం తెలుస్తుంది మనిషి లేనితనం. చుట్టూ ఉన్న వాళ్లు వెళ్లిపోయాక... కాలం గడుస్తున్నా కొద్దీ అప్పుడు కదా తెలిసేది. ఇక రారు వాళ్లు. ఎన్నటికీ రారు. అల్లల్లాడిపోతుంది పోదూ మనసు. ఏమి చేయలేము. ఏమీ చేయలేము. కొద్దిసేపు అలాగే ఉండిపోయాం.

"వచ్చిన దగ్గరి నుంచి నీతో మాట్లాడటమే కుదరలేదు. ఇందుకే ఈ రోజు రావడం నాకు ఇష్టం లేకుండే" అసందర్భమే కావచ్చు. తనను మాట్లాడించాలి.

"వస్తే ఏమైంది. వాడికి సంతోషం కదా"

ఇప్పటికీ వాడి సంతోషం కావాలి తనకు. అవును వాడు సంతోషంగా ఉండాలి. తను ఎట్లా ఉంటె వాడు సంతోషంగా ఉంటాడు?

ఇప్పుడు వాడూ, వాడి సంతోషం అమె ఒక్కదాని సొంతమా? కళ్ళల్లో పెట్టుకొని చూసుకుంటూన్న అమ్మని కూడా కాదని వెళ్ళిపోయాడే. కాళ్ళా వెళ్ళా పడ్డా వినలేదే. తన స్వార్థం కోసం వదిలేసి పోయాడా? పోనీ ఓ అమ్మాయి ప్రేమ కోసం అమ్మని వదిలేసాడా? అట్లా చేసినా బాగుండునే. ప్రాణాలతో ఉండిపోవునే.

ఇన్నేండ్లల్లో వాళ్లు ఏమి సాధించారు -ప్రాణాలు పోగొట్టుకోవడం తప్ప. మొన్నీ మధ్యే ఓ పెద్ద మనిషి.

నిజంగా వాళ్లు ఏమీ సాధించ లేదా? సాధించనే లేదా?

అనగనగా ఓ అడవి. ఆ అడవికో రాజు. పులిరాజు. ఆ రాజు ఎలాంటి వాడయ్యా అంటే దొర. తన ఇలాకాలో ప్రతి ప్రాణి పుట్టేదీ, గిట్టేదీ తన కోసమే. ఇది రాజుగారి శాసనం. ఆ అడవిలోని అడ ప్రాణులన్నీ వాడి సొంతమే. అంతేనా? ప్రతి ప్రాణీ శ్రమా వాడిదే. ఆ అడవిలోని ప్రతి జీవీ వాడి కోసమే. ఎంత చెమటోడ్చినా నోటి కాడి ముద్ద తన్నుకు పోయేవాడు. ఏ ప్రాణి అయినా ప్రశ్నించిందా? తెల్లవారి చచ్చి పడి ఉండేది. లేదూ ప్రశ్నిస్తే ఇదే గతని అడవిలోని బక్క జీవులన్నింటినీ పోగేసి చావ బాదేవాడు. తరాలు గడిచినా ఆ జీవుల తల రాతలు మారలేదు.

అదిగో అప్పుడు ప్రవేశించాయయ్యా కొన్ని కుందేళ్లు, మరికొన్ని లేళ్ళు. వాటికి తోడుగా కొన్ని రకాల పక్షులు. ఇక నీ ఆటలు చెల్లవన్నాయి. జీవులనన్నింటినీ ఏకం చేసాయి. భయపడిన జంతువులతో... మీ ప్రాణాలకు మా గుండెలు అడ్డేస్తాము అన్నాయి.

అదిగదిగో అట్లాంటిదయ్యా వాళ్ల తెగువ.

రాజు ఊకుంటాడా? సింహం దగ్గరికి వెళ్ళాడు. చెప్పుకున్నాడు తన గోడు. తెచ్చుకున్నాడు తోడు - గద్దలను, నక్కలను, తోడేళ్ళను, కొన్ని సర్పాలను.

ఉంటే ప్రాణం... పోతే ప్రాణం.. కదిలాయయ్యా చిన్నా పెద్దా జంతువులన్నీ చీమల దండులా.

ఏమిటీ....!? పాములు పుట్టలనొదిలి వెళ్లిపోయాయా? పులులు తమ రాజ్యాలను విడిచి పారిపోయాయా!? ఎట్లెట్లా?

ఊర్లకు ఊర్లు... పట్టణాలకు పట్టణాలు ఇదే చర్చ కాదా సార్. వాళ్ళ చేత ప్రభావితులు కాని వాళ్ళెవరూ? ద్వేషం వెళ్ళ గక్కుతూనో.. అభిమానంతోనో.

మరి వాల్లేమి సాధించ లేదని అంటారేమిటి సార్?

నిజంగా వాళ్లు ఏమీ సాధించ లేదా? సాధించనే లేదా?

మరి ఈ బూడిద రంగు కుక్కలా సృష్టి ఎందుకు సార్? ఎక్కడో ఏడేడు సముద్రాల ఆవల ఉన్న రాబందు దృష్టి వీళ్ళ మీద సారించెను ఎందుకు సార్?

వాళ్ళ నెత్తురుతో పల్లెలు, అడవులు తడిసిపోతే ఎం జరగలేదు అంటారేమిటి సార్?

"రష్యా, చైనా దెబ్బతిన్నాయి. ఎందుకు అనేది పక్కన పెడదాం. మీ మాట ప్రకారం కమ్యూనిజం ఓడిపోయింది అనుకుందాం -కాసేపటి వరకు. మీకు మంచిదే కదండీ. మరి పిడికెడు మంది కూడా లేని వాళ్ళ కోసం ఇంత శ్రమ ఎందుకు పడుతున్నారండీ? వాళ్ళ కోసం అడవుల వెంట ఎందుకు తిరుగుతున్నారండీ? వాళ్ళ మానాన వాళ్ళు ఎదో జనంతో మీటింగులు పెట్టుకుంటున్నారు. మీకొచ్చిన నష్టమేమి ఉందండీ? వాళ్ళను చూసి ఇంత భయపడుతున్నారెందుకండీ? అంటే వాళ్ళ దగ్గర ఎదో ఉంది." పోలీసులు వేసిన పాప్లేట్లపై రుక్మిణక్క మాట్లాడుతోంది. మైకులో ఇంటి వరకూ వినిపిస్తోంది.

"ఇంకా ఎంత కాలం బతుకుతాంరా? ఏదైనా సంఘంలో పని చేద్దాం."

"సరే చేద్దాం."

"పిల్లలను పోగొట్టుకున్న నా లాంటి తల్లులు ఎందరో ఉన్నారు కదా. వాళ్ళ కోసం ఏదైనా ఆశ్రమం నడపాలని."

"సరే"

"వాడు పైనుంచి చూస్తుంటాడు కదా అని. నమ్మకాలు లేవు కానీ మనసుకు అలా అనిపిస్తుంది."

మూఢ నమ్మకాలు లేవు కానీ వాడి నమ్మకాలు, విశ్వాసాలు పోతూ పోతూ తల్లికి ఇచ్చి పోయాడా?. నమ్మకమూ, విస్వాసం... వీటికి అర్థాలు మారి చాలా కాలమే కాలేదూ. ఎవరి నమ్మకాలు వారివి. నా కోసమే నేను. వాళ్ళ విస్వాశాల కోసం నేనెందుకు మారాలి? అవును, ఎవరి కోసమో నువ్వెందుకు మారాలి? నీ కోసమైనా నువ్వు మారకూడదా. గంటలు గంటలు ఏటీఎంల దగ్గర క్యూ లైన్లలో నిలబడుతున్నావు కదా? నా బతుకు నేను బతుకుతుంటే రోడ్డుకెందుకు ఈడ్చావని నిలదీయకూడదా? నీ కోసమే. ఇంకెవరి కోసమో వద్దు. కేవలం నీ కోసమే. ఇలాంటివి ఇంకెన్ని ప్రశ్నించాలి? వాళ్ళు..వాళ్ళు వాళ్ళ కోసం బతకలేదు. కనీసం నువ్వు నీ కోసమైనా బతకకూడదా?

"వెళ్తాను"

"ఈ రాత్రికి ఉండరాదు"

"ఉండాలనే ఉంది. కానీ ఇట్లా కాదు."

ఇంట్లో నుంచి బయటకి తను కూడా వచ్చింది. ఉంటానని చేతులు కలిపా.

గుండెలకు హత్తుకుని నొసటి మీద ముద్దు పెట్టుకుంది - వాడిలాగే. అచ్చం వాడిలాగే.

అమెరికాలో ఆదివాసీ పోరాటాలు

● అశోక్ కుంబము

ప్రపంచ వ్యాప్తంగ రాజకీయ పండితులు, మేధావులు, మీడియా అమెరికా అధ్యక్ష్య ఎన్నికల ఫలితాలను, జరగబోయే పరిణామాలను విశ్లేషిస్తుంటే అమెరికన్ ఆదివాసులు (Native Americans) మాత్రం ఎవరు గెలిచినా, ఓడినా మాకేంటి అనడంలో ఆశ్చర్యమేమి అనిపించదు. ఎందుకంటె, వాళ్ళు తరతరాలుగ అమెరికన్ రాజ్య వ్యవస్థతో మోసగించబడి, తిరస్కరించబడి బ్రతుకుతున్నవాళ్ళు. ఇప్పటికి నిత్య వివక్ష, అణిచివేత అనుభవిస్తున్న వాళ్ళు. మార్టిన్ లూథర్ కింగ్ అన్నట్లు "అమెరికా మారణహోమం నుండి పుట్టిన దేశం." ఆ దేశ నిర్మాణంలో తెగిన తలలన్నీ ఆదివాసులవి, నల్లజాతి బానిసలవె. అంతేకాదు, వాళ్ళ జీవితాలలో చూసిన ఎంతోమంది వినాశకరమైన నరహంతుకులతో పోల్చుకుంటే ట్రంప్ ఒక లెక్కా కాదు, సరికొత్త పరిణామం అంతకన్నా కాదు.

అలాగని ఎన్నో వర్గాలకి, సమూహాలకి ట్రంప్ గెలుపు తెచ్చిన భయం అర్థరహితమూ కాదు. చారిత్రాత్మక ఆక్స్ ఫర్డ్ సమావేశంలో మాల్కం ఎక్స్ అన్నట్లు "ఒకడు దైవదూత రూపంలో వచ్చి దయ్యంలా పడుతాడు. మరొకడు తన దయ్యం రూపాన్ని ముందే ప్రకటించి వస్తాడు." రూపాలు వేరైన సారంలో ఇద్దరు ఒక్కటే. అందుకే అధ్యక్ష ఎన్నికలో ట్రంప్ గెలిచినా, హిల్లరీ గెలిచినా వాళ్ళ పరిస్థితి ఏది మారదని ఆదివాసులకు స్పష్టత వుంది. అమెరికన్ రాజ్యానికున్న దురాక్రమణ, అణిచివేత, సామ్రాజ్యవాద స్వభావాన్ని మార్చలేని ఏ రాజకీయ ప్రక్రియల మీద వాళ్ళకి నమ్మకం లేదు. ఇది వాళ్ళకి పుస్తక జ్ఞానం కాదు. అనుభవ సారం. వాళ్ళ చరిత్ర నిండా కన్నీళ్ళే. వాళ్ళను పలకరిస్తే మాయని గాయాలను తడిమినట్లుంటది. మొత్తం మానవ చరిత్రలోనే మరే జాతి అనుభవించంత హింసను, నరమేధాలను అనుభవించిన ఈ జాతులు, ఇప్పుడు మళ్ళీ పునర్జీవనం పొంది అమెరికన్ రాజ్యంతో, అది కాపాడే బహుళజాతి సంస్థలతో పోరుచేస్తున్నాయి. గడిచిన ఐదు వందల ఏండ్లలోసర్వం కోల్పోయి సహితం ఇప్పుడు మళ్ళీ పోరాట మార్గం ఎంచుకున్న ఈ ఆదివాసులు, ట్రంప్ ను చూసి భయపడే అన్ని వర్గాలకు ఏమిచేయాలో చేసి చూపిస్తున్నారు.

నార్త్ డకోట రాష్ట్రంలోని చమురు నిక్షేపాలనుండి ముడి చమురును నాలుగు రాష్ట్రాల గుండా ఇలనాయి రాష్ట్రానికి తరలించడానికి Energy Transfer Partners అనే ఆయిల్ కంపనీ దాదాపు 1800 మైళ్ళ దూరం పైప్ లైన్ వేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్ట్ ద్వార రోజు 5.7 లక్షల బ్యారెల్స్ ముడి చమురును సరఫరా చేయవచ్చని అంచనా. దీనికంతటికి కాబోయె వ్యయం 370 కోట్ల డాలర్లు . ఈ ప్రాజెక్ట్ కు రాజ్యం మద్దతు పలకడంతో అన్ని అనుమతులు వెనువెంటనే వచ్చేసినవి. పైప్ లైన్ పని మొదలయ్యి నార్త్ డకోట కు చేరే సరికి "స్టాండింగ్ రాక్" అనే చిన్న ఊరిలో వుండె లకోట తెగ ఆదివాసులు (లకోట అంటే సుయన్ భాషలో "స్నేహితులు" అని అర్థం. లకోట వాళ్ళ మండలికం కూడ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దానికి కారణాలు: మొదటిది, ప్రతిపాదిత పైప్ లైన్ ఆదివాసులు "పవిత్ర భూమిగ" పిలుచుకునే వాళ్ళ పూర్వీకుల బొందల గడ్డలు తొవ్వుకుంటూ పోతుంది. ఇది వాళ్ళ చారిత్రిక, సాంస్కృతిక విధ్వంసానికి సంబందించింది. ముఖ్యంగ చరిత్రలో డాక్యుమెంట్ కాబడిన "వూండెడ్ నీ మారణకాండ" (Wounded Knee Massacre) లో చంపబడిన దాదాపు 300 మంది లకోట ఆదివాసులను పూడ్చి పెట్టిన "Wounded Knee" అనే ప్రాంతం ఇక్కడె వుంది. (ఈ మారణకాండ ఆధారంగ డీబ్రౌన్ అనే నవలా రచయిత 1970లో "Bury My Heart at Wounded Knee" అనే పుస్తకాన్ని ప్రచురించిండు. అదే పేరుతో, ఈవ్స్ సిమనోవ్ అనే ఫ్రెంచ్ కనేడియన్ దర్శకుడు 1976 లో సినిమాగ కూడ తీశాడు.) ఇక రెండోది, పైప్ లైన్ వాళ్ళకు తాగునీరు అందించే మిజోరి నది మరియు ఇతర నీటి వనరుల గుండా పోతుంది. ఒకవేళ, నీళ్ళలో పైప్ లైన్ ప్రమాదం జరిగితే లక్షలాది మందికి నీటి సమస్య ఎదురవుతుంది. వాళ్ళు అనుమానిస్తున్నట్లుగ, అలాంటి ప్రమాదాలు ఇప్పటికే చాల జరిగాయి. వాళ్ళ ప్రాంతంలోనె కేవలం 2012-2013 సంవత్సరంలో 300లకు పైగ పైప్ లైన్స్ ప్రమాదానికి గురైనవి. అంతేకాదు ఒక్కసారి పైప్ లైన్ వేసిన తరువాత వాటి మీద నిఘా కాని, నియంత్రణ కాని చేసే పటిష్టమైన యంత్రాంగం, సాయుధ బలగాలను పంపింది. వందలాది ఆదివాసులను నిర్బందించారు. "డెమోక్రసీ నౌ" వంటి ప్రత్యామ్నాయ మీడియ ఆ "కుక్కల" దాడిని చిత్రించి సెప్టెంబర్ 3న ప్రపంచానికి చెప్పేవరకు, ప్రధాన స్రవంతి మీడియాలో ఎలాంటి చలనం కలగలేదు. ఎంత హింస ప్రయోగిస్తున్నా, ఆదివాసులు వెనకడుగు వేయకుండ

పోరాడుతున్నారు. దాదాపు వందకు పైగా పెద్దలు, పిల్లలు పైప్ లైన్ కు అడ్డంగ టెంట్లతో క్యాంప్ వేసుకొని అక్కడే వుంటున్నారు. ఎముకులు కొరికే చలిలో (దాదాపు జీరో డిగ్రీస్ సెంటిగ్రేడ్స్) ప్రాణాలు పణంగ పెట్టి పోరాడుతుంటె, వాళ్ళు గడ్డ కట్టుకు పోయేలా పోలీస్ బలగాలు అతిచల్లని నీళ్ళను నీటి ఫిరంగులతొ కొడుతున్నారు. దీని మూలంగ, హైపోతెర్మియ (అంటే శరీర ఉష్ణోగ్రత త్వరగా తగ్గిపోయి (ప్రాణాంతక పరిస్తితి రావడం) వచ్చి క్యాంప్ ఖాళిచేసి పోతారని ఒక భయంకర ప్రయత్నం చేస్తున్నారు. దీనికి తోడు, రబ్బర్ బుల్లెట్లు, పెప్పర్ స్ప్రేలు, చివరికి హ్యాండ్ గ్రనేడ్లు కూడ ప్రయోగిస్తున్నారు. నిమోనియ వంటి వ్యాదులు రావడానికి రాత్రుళ్ళు హెలికాప్టర్స్ ద్వారా కొన్ని రసాయనాలను చల్లుతున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసిన వాళ్ళు అక్కడి నుండి కదలడం లేదు. ఇప్పడి వరకు జరిగిన విద్వంసం ఇక సాగనియ్యమని తెగేసి నిలబడ్డారు. “Enough is enough” అని నినదిస్తున్నారు. వాళ్ళకు ప్రజాస్వామిక శక్తులు, పర్యావరణ కార్యకర్తలు అండగా నిలుస్తున్నారు.

ఈ వ్యాసం రాస్తున్న సమయానికి, ఆశ్చర్యంగ 2000 మంది మాజి సైనికులు ఆదివాసులకు రక్షణ కవచంగ నిలబడుతామని స్టాండింగ్ రాక్ కు బయలుదేరి పోతుండ్రు. అది ఇప్పుడు, కేవలం ఆదివాసి అస్తిత్వ పోరాటమే కాదు, మనిషిని ప్రకృతిని ఏకం చేసే పెట్టుబడిదారి వ్యతిరేక పోరాటమయ్యింది. ఆదివాసులు “నీటి రక్షకులుగా” మారారు. వాళ్ళు కేవలం ఈ భూమి మాది, నది మాది అనడంలేదు. మేము ఈ నదికి, భూమికి చెందినోళ్ళము. మమ్ముల ప్రకృతి నుండి వేరుచెయ్యొద్దంటున్నరు. ఈ పోరాటం చేయడం అంటే “మా గాయాలను మేమె నయం చేసుకోవడం” అంటుండ్రు. నిజమే, ఆ గాయాలకు వందల సంవత్సరాల చరిత్ర ఉంది. కొలంబస్ వాళ్ళను “కనిపెట్టి”నప్పటి నుండే ఆ చరిత్ర మొదలయ్యింది.

ఈస్ట్ ఇండియాకు పోవాలని బయలుదేరిన కొలంబస్ సముద్రమార్గం లొ దారితప్పి చివరికి 1492లో అమెరికన్ ఆదివాసుల “కొత్త ప్రపంచం”లోకి అడుగుపెట్టిండు. అక్కడున్న ఆదివాసులు ఇండియన్లను పోలివున్నారని వాళ్ళకు “రెడ్ ఇండియన్ల”ని పేరు పెట్టిండు. అక్కడున్న బంగారు గనులు కొల్లగొట్టడానికి తనతో తీసికెళ్ళిన మందిని, మందుగుండును, గుర్రాలను, వేటకుక్కలను ఉపయోగించి ఆదివాసులను బానిసలుగ మార్చుకున్నడు. (కొలంబస్ వారసులు ఇవే అణిచివేత పద్దతులు ఇప్పటికి వాడుతుండ్రు!) ఆదివాసుల అమాయకత్వం, మంచితనం గురుంచి యురొప్ లో ప్రచారం కావడంతో అక్కడి నుండి వలసలు మొదలయినవి. యూరప్ లో కొన్ని మత విశ్వాసాల మీద దాడి జరిగినప్పుడు, రాజకీయ అభద్రత పరిస్తితి వచ్చిన ప్రతి చారిత్రిక సందర్భంలోను, అమెరికన్ ఆదివాసుల “కొత్త ప్రపంచమే” యురోపియన్లకు సురక్షిత ప్రాంతమయ్యింది. (ఈ వలసల కాలంలోనె refuge, refugee అనే పదాలు బాగ వాడుకలోకి వచ్చాయి. సరిగ్గ అదే కారణాలతొ ఇప్పుడు రావాలనుకునే refugees ను రానివ్వనని ట్రంప్ శపథం చేస్తుండు).

అలా మొదలయిన వలసలు సమూహాలుగ సమీకృతమై రాజ్యాలను నిర్మాణం చేసుకోవడం మొదలుపెట్టారు. 1607లో వర్జీనీయాలో మొదటి వలస రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇక అది మొదలు, వలస రాజ్యాల సంఖ్య పెరుగుతూ పోయింది. ఇదే క్రమంలో వలసదారులు వాళ్ళ ఉత్పత్తి అవసరాల కోసం, బానిసల కోసం ఆఫ్రీకా నుండి నల్లజాతి వాళ్ళను బలవంతంగా తీసుకొచ్చారు. బ్రిటిష్ రాచరిక పెత్తనం దాని 13 వలస రాజ్యాలపై పెరగటంతో, దానికి వ్యతిరేకంగా వలసవాదులు తిరుగుబాటు చేశారు. అదే అమెరికన్ విప్లవం. పేరులో విప్లవం వుంది కాని అందులె ఎలాంటి సామాజిక న్యాయం లేదు. ఎందుకంటే అది కేవలం వలస రాజ్యాల అధిపతుల స్వేచ్ఛ కోసమె. వాళ్ళందరు బానిస యజమానులె. వందలాది బానిసలను సొంత ఆస్థిగ కల్గివుండి, వాళ్ళనే వ్యాపార వస్తువుగ చేసినవాళ్ళు. అందుకె ఆ తిరుగుబాటులో ఆదివాసులను, నల్ల బానిసలను కూడ సైనికులుగా వాడుకున్నరు. “విప్లవం” తర్వాత వాళ్ళకు విముక్తి కల్పిస్తమని నమ్మించి మోసం చేసిండ్రు. చివరగ, 1776లో 13 వలస రాజ్యాలు కలిసి కొత్తగ అమెరికా రాజ్యం పుట్టుకొచ్చింది. స్వాతంత్ర్య ప్రకటన రాసిన (మూడవ అమెరిక అధ్యక్షుడు) తామస్ జెఫ్ఫర్సన్ “మానవులంత సమానంగ సృష్టించబడ్డారు” అని ప్రకటించాడు. కాని ఆదివాసులు, నల్ల జాతీయులు కూడ మానవులే అని మరిచిపోయిండు. ఆ ప్రకటన చేసేనాటికే ఆయన 175 మంది బానిసలకు యజమాని.

అయితె 17వ శతాబ్దం నుండే వలస రాజ్యాలు ఆదివాసులతో అనేక ఒప్పందాలు చేసుకున్నాయి. వాళ్ళు నివసించే భూబాగంపై వాళ్ళకే హక్కులు ఇవ్వబడ్డాయి. కాని, ఆ ఒప్పందాలను తుంగలో తొక్కి వాళ్ళ కాళ్ళకింది భూమిని లాగె ప్రయత్నం మొదటినుండి జరుగుతూనె వచ్చింది. ముఖ్యంగా ఏడవ అమెరికన్ అధ్యక్షుడు (డెమొక్రాటిక్ పార్టీ వ్యవస్థాపకుడు కూడ అయిన) ఆండ్ర్యూ జాక్సన్ 1830లో తెచ్చిన “ద ఇండియన్ రిమూవల్ ఆక్ట్” మూలంగ భూమిని గుంజుకునే ప్రయత్నం చట్టబద్దమయ్యింది. అతను సాగించిన నరమేధానికి వలసవాదులు అతనిని “పదునైన కత్తి”

అని పొగిడితె, ఆదివాసులు మాత్రం "ఇండియన్ కిల్లర్" గానె గుర్తుపెట్టుకున్నారు. ఈ కొత్త చట్టంతో 80 వేల మంది ఆదివాసులను వాళ్ళ విశాల భూభాగం నుండి తొలగించి కొన్ని నిర్దేశిత "ఇండియన్ ప్రాంతాలకు" (వాటినే రిజర్వేషన్స్ అంటారు) బలవంతంగా నెట్టివేశారు. ఈ ఒక్క చట్టం ద్వారనే 1.5 కోట్ల ఎకరాల భూమిని వలసవాదులు తమ ప్రాంతంలో కలుపుకున్నారు. ఆండ్ర్యూ జాక్సన్ కొనసాగించిన మారణహోమాన్ని మరవని ఆదివాసులు అమెరికన్ 20 డాలర్ నోట్ పై వున్న అతని బొమ్మని తొలిగించాలని చాల కాలంగ డిమాండ్ చేస్తున్నారు. (చివరిగ, 2020 నుండి ఆండ్ర్యూ జాక్సన్ బొమ్మ తొలిగించి బానిస తిరుగుబాటు నాయకురాలు హ్యారియత్ టబ్మన్ (1820-1913) బొమ్మను ముద్రిస్తమని ఒబామ ప్రభుత్వం ప్రకటించింది. హ్యారియత్ టబ్మన్ బానిసత్వం నుండి తప్పించుకొని వందలాది బానిసల విముక్తికై పోరాటం చేసింది. నేరమయమైన రాజ్యాన్ని సాయుధంగానె ఎదిరించాలని ప్రతిపాదించి, ఆచరించిన జాన్ బ్రౌన్ తొ కలిసి పనిచేసింది. బ్రౌన్ ను రాజ్యం డిసెంబర్ 02, 1859 లో ఉరి తీసినప్పుడు అతను అమరుడని కీర్తించింది. మరో బానిస తిరుగుబాటు నాయకుడు ఫ్రెడెరిక్ డగ్లస్ తో కూడ కలిసి పనిచేసిన చరిత్ర టబ్మన్ కు వుంది.)

ఆండ్ర్యూ జాక్సన్ తెచ్చిన చట్టానికి కొనసాగింపుగ, 1851లో "ఇండియన్ అప్రోప్రియేషన్స్ ఆక్ట్" ను తీసుకొచ్చి ఆదివాసులను రిజర్వేషన్లకు పరిమితం చేసి, వాళ్ళు అనుమతి లేకుండ తెల్లవాళ్ళ భూభాగంలోకి అడుగుకూడ పెట్టవద్దని నిబంధనలు విధించిండ్రు. అంతటితో ఆగకుండ 1887లో "ది జెనెరల్ అలాట్మెంట్ ఆక్ట్" ని తీసుకొచ్చిండ్రు. దాని ముఖ్య ఉద్దేశం సామూహిక జీవనం చేసే ఆదివాసి జీవితాలలోకి వ్యక్తిగత ఆస్తిని ప్రవేశపెట్టి, వివిధ తెగల సంస్కృతిని, అస్తిత్వాన్ని, ఐక్యతను దెబ్బతీయడం. అందులో భాగంగానే వాళ్ళ రిజర్వేషన్ భూములను చిన్న చిన్న పార్సెల్స్‌గ చేసి తెగ సభ్యులను హక్కుదార్లు చేసిండ్రు. సభ్యులు ఆ భూమిని 25 ఏండ్ల తరువాత ఎవరికైన అమ్ముకోవచ్చు. ఈ దుర్మార్గ చట్టాల మూలంగ 1776 నుండి 1887 నాటికి, 150 కోట్ల ఎకరాల భూమి ఆదివాసుల చేతుల నుండి వెళ్ళిపోయింది. ప్రతి చట్టం ఆదివాసుల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తూనె వచ్చాయి. హక్కుల కోసం పోరాడిన ప్రతిసారి మారణకాండ జరుగుతూనే వచ్చింది. గొప్ప ప్రజాస్వామికవాదని లోకమంత పొగిడె అబ్రహం లింకన్ 1862లో తమ హక్కుల కోసం డకోట యుద్ధంలో వీరోచితంగ పోరాడిన వందలాది ఆదివాసులను నిర్బంధించి, మొత్తం అమెరికా చరిత్రలోనె ఎప్పుడు జరుగని విధంగా ఒకేసారి 38 మంది ఆదివాసులను తెల్లప్రజల హర్షధ్వానాల మధ్య బహిరంగంగా ఉరితీయించుండు.

అలాగె, ఇప్పుడు బడిపిల్లల పుస్తకాలలో "టెడ్డీ బేర్" గ పిలువబడె తియొడోర్ రూజ్వెల్ట్ తన అధ్యక్ష పదవీ కాలంలో (1901-1909) ఒకవైపు సామ్రాజ్యవాద విస్తరణ చేస్తూనె మరోవైపు ఆదివాసుల అన్ని హక్కులు అణిచివేసిండు. "చనిపోయిన ఇండియన్స్ మాత్రమే మంచి ఇండియన్స్" అని ఆదివాసి జాతిని అంతరింపచేసే తన కోరికను ప్రకటించిండు. అంతేకాదు, మేలైన మానవజాతే (అంటే తెల్లజాతే) మిగలాలని లక్షలాది ఆదివాసులకు సంతానోత్పత్తి కలగకుండ బలవంతపు శస్త్ర చికిత్సలు చేయించిండు. (సరిగ్గా హిట్లర్ కూడ ఇదే జాత్యహంకార యుజెనిక్స్ పద్ధతులు వాడాడు). కోట్లాది ఎకరాల ఆదివాసి భూములను దురాక్రమణ చేసి వాటిని నేషనల్ పార్కులు గ మార్చి గొప్ప "ప్రకృతి సంరక్షకుడిగ" పేరు తెచ్చుకుండు. అందుకే, మౌంట్ రష్మోర్ నేషనల్ పార్క్‌లో గ్రనైట్ కొండపై చెక్కిన "జాతిపితలలో" రూజ్వెల్ట్ ఒకడయ్యాడు. ఆశ్చర్యంగానే, ఆ నెత్తురంటిన చేతులతోనె 1906 నోబెల్ శాంతి పురస్కారం కూడ అందుకున్నాడు.

వీటన్నింటికి పరాకాష్ట 1953లో తెచ్చిన "ది ఇండియన్ టెర్మినేషన్ పాలసి." దీనితో ఆదివాసి రిజర్వేషన్లకు ఇవ్వబడిన నామమాత్రపు స్వయంప్రతిపత్తి కూడ రద్దు చేయబడి, వాళ్ళను "అమెరికనైజ్" చేయాలని ఒక సాంస్కృతిక విధ్వంసం కొనసాగించిండ్రు. ఆదివాసి ఆచార సాంప్రదాయాలను, జీవిత విధానలను అనాగరికమని వ్యతిరేకిచ్చిండ్రు. "వాళ్ళలో వున్న అనాగరికతను చంపి, నాగరిక మానవుడిని నిలబెట్టాలని" వందలాది పిల్లలను బలవంతగ బోడింగ్ స్కూల్స్‌లోకి నెట్టివేసిండ్రు. వాళ్ళ భాషను, అలవాట్లను, తినేతిండిని, కట్టేబట్టను పూర్తిగ మార్చేసిండ్రు. ఆ పిల్లలను తమ సాంస్కృతిక సంపదకి దూరం చేసి తమ సమూహాల మధ్యే ఒంటరి అయ్యేల చేసిండ్రు. వాళ్ళ గతమంతా చెరిపేసి, భవిష్యతంతా తెల్లవాళ్ళతో ఎలా బ్రతకాలో బలవంతంగానైన నేర్పించాలనుకున్నరు. ఒక వైపున రాజ్యం నరమేధం చేసుకుంటూ పోతుంటే, మరోవైపు మిషినరీలు మిగిలివున్న ఆదివాసులను క్రైస్తవీకరించే పనిలోపడ్డవి. ఆదివాసుల జీవితాలలో వ్యవస్థీకృత రాజ్యము, కట్టుబాట్ల కంచె వేసె మతం ఎప్పుడు లేవు. కాని చివరికి అవే వాళ్ళ కుతికలకు బిగుసుకున్నవి. ఆదివాసుల పోరాటాల ఫలితంగ, 1975లో "టెర్మినేషన్" పాలసీని రద్దుచేసి రిజర్వేషన్లకు కొంత స్వయంప్రతిపత్తి ఇచ్చినప్పటికి, సాంస్కృతిక సామ్రాజ్యవాదం చేసిన గాయం తరాలు దాటినా ఇంకా సలుపుతూనె వుంది. వందల ఏండ్లుగ ఇంతటి హింస కొనసాగుతుంది కాబట్టే చేగువేర "అమెరిక మానవ జాతికే శత్రువని" ప్రకటించిండు.

మొత్తంగ అమెరికన్ రాజ్యం ఆదివాసులతో చేసుకున్న దాదాపు 700 ఒప్పందాలలో దేనికి కట్టుబడి వుండలేదని చరిత్ర, వర్తమానం చెప్తూనెవున్నాయి. ఇప్పుడు చేపట్టిన పైప్ లైన్ ప్రాజెక్ట్ కూడ ఆ ఉల్లంఘనలో భాగమె. దానిని వ్యతిరేకిస్తె రాజ్యం, పెట్టుబడి హింసను ప్రయోగిస్తాయని తెలిసి కూడ, ఆదివాసులు పోరులో నిలబడి వున్నారు. "మేము ఈ నేల మూలవాసులం. ప్రకృతిలో ప్రకృతిగా బ్రతికినోళ్ళం. ఈ ప్రకృతిని కాపాడుకుంటం. కేవలం మా కోసమె కాదు, మీ కోసం మీ పిల్లల భవిష్యత్ కోసం కూడ మీము పోరాడుతం" అని గడ్డిపోచలు చేతుల్లో పట్టుకొని ప్రమాణం చేస్తుండ్రు. అంతరించి పోతుందనుకున్న జాతి చూపుతున్న తెగువ పోరాడె శక్తులన్నింటికి సంక్షోభ సందర్భంలో ప్రాణవాయువుగ మారనుంది. గెలుపు, ఓటముల అంచనాలు ఏవైనా, రాజ్యం అండతో తెగబలిసిన కార్పోరేట్ మద గజాన్ని ఇప్పుడు నిలువరిస్తున్నది ఏకమైన గడ్డిపోచలే!

ప్రత్యేక వ్యాసం

బుద్ధిజీవులకు ఆదివాసుల ప్రశ్న

● కాత్యాయనీ విద్మహే

అక్టోబర్ 24 ఉదయం, ఆంధ్రా ఒడిశా సరిహద్దులలో, మల్కనగిరి జిల్లా బెజ్జంగి అటవీ ప్రాంతంలో, బలిమెల రిజర్వాయర్ సమీపంలో, ఆంధ్ర ఒడిశా పోలీసు బలగాలు కలిసి మావోయిస్టులపైన ప్రారంభించిన ఎన్ కౌంటర్ కొనసాగింపు, మృతదేహాల బీభత్స దృశ్యాలు, మృతదేహాల గుర్తింపు కొరకు వచ్చిన రక్తసంబంధీకుల, ప్రజాసంఘాల, ప్రజల ఆందోళన ఇవన్నీ చూస్తూ దుఃఖంతో గుండె బరువెక్కని వాళ్ళు, ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయలకు, రాజకీయ విశ్వాసాలకు చోటు లేకుండా చేస్తున్న పరిస్థితుల పట్ల క్రోధం కలగని వాళ్ళు ఎవరూ లేరంటే అతిశయోక్తి కాదు.



మావోయిస్టులతో పాటు నిరాయుధులైన ఆదివాసీల పై కూడా కఠినంగా కాల్పులు చేసి చంపిన ప్రభుత్వ అప్రజాస్వామిక అమానుష ధోరణి భారతీయ పౌరులందరినీ ఆందోళనకు గురి చేసింది. ఆ పరిస్థితులలో రెండు తెలుగు రాష్ట్రాల పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పడిన జాతీయస్థాయి నిజనిర్ధారణ కమిటీ తో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడి ప్రజలను కలవటానికి, మాట్లాడటానికి, వాళ్ళ జీవన విధానాన్ని పరిశీలించటానికి అవకాశం కలిగింది.

నవంబర్ 5వ తారీకు ఉదయం ఏడున్నరకు విశాఖ పట్నం నుండి బయలుదేరి పాడేరు మీదుగా పెదబయలు, కుజబంగి, బంగారుమెట్ట, పెద్దపుట్టు, రోడ కోట, సీగుల పుట్ట చిన్న సరియపల్లె లు దాటుకుంటూ కుముడా వరకు టవేరా బండ్లలోప్రయాణించి, అక్కడినుండి మహీంద్రా జీపులలో మూలపుట్టు దగ్గర ఒడిషాలోకి ప్రవేశించి, జాంగూడా దాటి బెజ్జంగి చేరేసరికి సాయంత్రం అయిదవుతున్నది. అక్కడినుండి జీపులు కూడా వెళ్లవని ట్రాక్టర్ మీద పోవాల్సి ఉంటుందని తెలిసింది. చలితో చీకటి కమ్ముకొస్తున్న ఆ రాత్రి ప్రయాణం సాధ్యం కాదని మర్నాడు ఉదయానికి వాయిదావేసి బెజ్జంగిలో ఆ రాత్రి విడిది చేసాం.

మర్నాడు ఉదయం ఏడు గంటలకు బయలుదేరి సంఘటనా స్థలానికి వెళ్ళాం. ఆరోజు మర్నాడు కూడా అంద్రపల్లి, బెజ్జంగి పంచాయితీ గ్రామ ప్రజలను కలిసి ఎంకౌంటర్ కు సంబంధించిన సమాచారాన్ని సేకరించాం. సాయంత్రం 5 గంటలకు బయలు దేరి జీపులలో పాడేరు చేరుకున్నాం. అక్కడ నుండి వేరే జీపులు మాట్లాడుకొని విశాఖ చేరేసరికి రాత్రి పన్నెండు గంటలు దాటింది. నవంబర్ 5, 6, 7 తేదీల ఈ ప్రయాణంలోనే విన్నవీ, కన్నవీ నా దృష్టిని ఆకర్షించి ఆలోచింప చేసినవి మూడు అంశాలు. అవి - 1. ఆదివాసీ జీవితం 2. విప్లవోద్యమం 3. అక్టోబర్ 24 ఎన్‌కౌంటర్. నాకు అర్ధమైనంత వరకు, పరస్పర సంబంధం కలిగిన ఈ మూడంశాలకు సంబంధించిన నా పరిశీలనలను పంచుకొనటానికి ప్రయత్నిస్తాను.

1

నవంబర్ 5 వ తేదీన పాడేరు నుండి ఎగుడుదిగుడు రాళ్ళ బాటలగుండా, మధ్య మధ్య ఏ కొండల నుండో ప్రవహిస్తూ బాటలకు అడ్డంగా సాగిపోయే ఏటి నీటి పాయలు దాటుతూ దట్టమైన అడవులలో మా ప్రయాణం సాగింది. పోతూ ఉంటే హఠాత్తుగా కొన్ని ఎత్తు తక్కువ గుడిసెలు, రేకులు కప్పినవో, పెంకులు కప్పినవో, చెదురు మదురుగా సిమెంట్ కప్పులతోనో ఇళ్ళు కనిపిస్తాయి. అరచేయంత విచ్చిన పచ్చటి పూలతోకూడిన గుమ్మడి తీగలు పాకిన అందమైన ఇళ్ళువెనక్కు పరుగెడుతూ ఉంటాయి. జీపులో పోతుంటే వాకిటి ముందు కూర్చున్న మనుషులు, బియ్యం చెరుక్కుంటూనో మరేపని చేసుకుంటూనో కనిపించే మహిళలు, నీటిపాయల వద్ద గిన్నెలు కడుక్కొంటూనో, బట్టలు ఉతుక్కుంటూనో ఉండే మహిళలు, పిల్లలు, ఏపక్క నుండో కట్టెల మోపుతో బాటమీదికి వచ్చే మనుషులు -దృశ్యాలు దృశ్యాలుగా కనబడుతుంటారు.

ఊరికి వూరికి మధ్య వరి, రాగులు, సామలు, కొర్రలు, గంటెలూ మొదలైన తృణ ధాన్యాల సాగు భూమి కమతాలు, పసుపు మడులు, పసుపు పూల తివాచీ పరచినట్లుగా ఆవ చేలు కనబడు తుంటాయి. అక్కడక్కడా గంజాయి సాగు అవుతున్నది. ఆకుపచ్చని అడవిలో మేకలను, ఆవులను మేపుకొనే మనుషుల కదలికలు దృష్టిని ఆకర్షిస్తాయి. ఇవన్నీ దాటుకుంటూ మూలపుట్టు ముఖ ద్వారం నుండి ఒడిశాలోకి ప్రవేశించి

జామ్ గూడా దాటి బెజ్జంగిలోకి ప్రవేశించేసరికి సాయంత్రం అయిదు గంటలు. అంతవరకు వెలుగును, వెచ్చదనాన్ని ఇస్తూ వెలిగిపోతున్న సూర్యుడు నిమిషాలమీద కమ్ముకొస్తున్నచీకటిలో పశ్చిమం వైపు ఎప్పుడు జారుకున్నదీ గమనించలేకపోయాం. విద్యుత్ సౌకర్యం లేని ఆ వూళ్ళో పంచమి వెన్నెల వెలుగులో అతి తక్కువ వ్యవధిలో భోజనాలకు, పడకలకు జరిగిన ఏర్పాట్లు అక్కడి మనుషుల ఔదార్యాన్ని, సహజ స్నిగ్ధ స్నేహ స్వభావాన్ని మాకు ఎరుక పరిచింది. వాళ్ళు మాట్లాడే ఒడియా భాష మాకు అర్థం కాదు, మేము మాట్లాడే తెలుగు వాళ్లకు తెలియదు. అయినాచిన్నచిన్న మాటలు, సంజ్ఞలు హావభావాలు అవసరాలు తీర్చుకొనటానికి సరిపోయిన ఆ సందర్భం అద్భుతం.

చలి కాచుకొనటానికి ప్రతి ఇంటిముందూ మండే నెగడు. ఎవరికి వాళ్ళం ఎదో ఒక ఇంటిముందున్న నెగడు దగ్గరకు చేరాం. మీరెవరు, ఎందుకు ఇక్కడికి వచ్చారు అన్నప్రశ్న లేదు. చిరునవ్వు పలకరింపులు... ఎదో మాట్లాడుతూ ఒకరిని ఒకరు తెలుసుకొనే ప్రయత్నం. అక్కడ ప్రధానంగా మాతో మాట్లాడింది ఆడవాళ్లు. వాళ్ళింట్లో పడుకొనటానికి వీలవుతుందా అని రకరకాలుగా అడిగిన ప్రశ్న వాళ్లకు అర్థమయ్యాక ఇంతకంటే మంచి వసతి ఉందని, మరొక దాబా ఇంటి ముందు గదిలో చాపలు, పక్క బట్టలు కూడా ఇచ్చి వారు చేసిన ఏర్పాట్లు మరిచిపోలేనివి. నలభై ముగ్గురితో కూడిన మా కమిటీ మొత్తం ఆ రాత్రి ఆ వూళ్ళో ఎవరో ఒకరి ఇంట అలాంటి ఆదరణ నే పొందింది. మర్నాడు పొద్దున వాళ్ళిచ్చిన డికాషన్ టీలోని వెచ్చదనం, కమ్మదనం వాళ్ళ సహజ మానవీయ ప్రవృత్తి నుండి వచ్చినవే కావాలి.

6వ తారీకు ఉదయం బెజ్జంగి నుండి ప్రారంభమైన ట్రాక్టర్ ప్రయాణంలోఆఖరు మజిలీ గుసుంపోదర్. దదులు కట్టిన ఇళ్ళు, ఇళ్లల్లో ఆవుల మందల పాకలు, వంగ మొక్కలు, గుమ్మడి పాదులు, బొప్పాయి చెట్లు, జామచెట్లు సమృద్ధిగా ఉన్న ఆ ఊరి బొమ్మ ఆలా కళ్ళలో నిలబడిపోయింది. ఆ రోజు మధ్యాహ్నం నుండి తెల్లవారి 9 గంటల వరకు రామ్ గూడా గ్రామంలో ఉన్నాం. పర్వత శ్రేణులను చుట్టుకొని ప్రవహించే బలిమెల ఒడ్డున ఉన్నవూరు అది. చుట్టుపక్కల వరి, రాగులు, అరటి బొప్పాయి, గుమ్మడి సాగు అవుతున్నాయి. ఇళ్ళు ముప్పయ్ వరకు ఉంటాయేమో... దాదాపు ప్రతి ఇంటికి ముందు ఒక వరండా, నిప్పారని పొయ్యి ఉన్నాయి. పొయ్యి మీద నీళ్లు కాగుతుంటాయి. చలి కాచుకొనటానికి ఆ పొయ్యి ముందే కూర్చుంటారు. అతి సహజంగా అవన్నీ మా ఇళ్ళే అన్నట్లుగా ఆ ఇళ్ల వరండాలలో సర్దుకు పోయాం మేమందరం.

7వ తారీకున డింగీలో బలిమెల దాటి గుసుంపోదర్ వరకు నడిచి వెళ్లి ఆంధ్రపల్లి పంచాయతీ గ్రామంలో రామ్ గూడా, బచ్చలిపోదర్, గుసుంపోదర్, ఆంధ్రపల్లి ప్రజలతో మాట్లాడి అక్కడి నుండి మరింత ముందుకు సాగి బెజ్జంగి గ్రామపంచాయతీ పరిధిలోని బెజ్జంగి ఖుజూర్ గూడ, ముకుడపల్లి, సిమిలిపోదర్, సింగోయ్, దోంగూడ ప్రజలను కలిసి మాట్లాడటం జరిగింది. ఈ మొత్తం ప్రయాణ క్రమంలో చూసిన దృశ్యాలు, చేసిన సంభాషణలు అక్కడ ఆదివాసీ జనజీవితాన్ని గురించి నాకొక అవగాహనను కలిగించాయి.

జీవన స్థితి గతులు: ఆదివాసీలలో కోర్జా, డిడోయి, కువి, బోండా (రిమో) తెగలు ఉన్నాయి. మద్యం వ్యాపారం, వడ్డీ వ్యాపారం చేస్తూ ఆదివాసీలను దోచుకొనే వర్గం సొండీలు. కోర్జా తెగలోఅభివృద్ధి చెందిన ధనిక వర్గ దొరకు పదిహేడు గదుల ఇల్లు కరెంటు, కరెంటు లేనప్పుడు వాడటానికి జనరేటర్ కూడా ఉన్నట్లు తెలిసింది. బోండా తెగ బాగా వెనక పడిన తెగ. ఈ తెగ లో పెళ్ళికాగానే మహిళలకు తలవెంట్రుకలు, ఒంటిమీద బట్టలు తీసేసే ఆచారం ఉంది. నార తాళ్లతో అల్లిన చిన్న బట్ట ముందువైపు మాత్రం కడతారు. శరీరమంతా పూసల దండలు వేస్తారు.

తృణ ధాన్యాల పంట చేలు, కాయగూరల తోటలు కనిపిస్తున్నా అతి తక్కువ కుటుంబాల వారే తిండికి సరివడా పండించుకోగలుగుతున్నారని, చాలా మంది ఒకపూట తిండితో సరిపెట్టుకుంటున్నారని, గడవని పరిస్థితిలో గత్యంతరం లేక ఆదివాసీ ధనిక రైతాంగం దగ్గర, ఆదివాసేతర షావుకార్ల దగ్గర కూలి పనులకు పోతుంటారని తెలిసింది. మధ్య, ఉన్నత వర్గ రైతాంగం గంజాయి సాగుకు అలవాటు పడ్డది. అందులో మిగులు అడవి బాటలమీదికి ఎన్ ఫీల్డ్ మొదలైన మోటర్ సైకిళ్లను తీసుకొచ్చింది. లంపెన్ వర్గాన్ని తయారు చేసింది. పోడు భూములు ఐదారేళ్లకు సారం కోల్పోతుండటం వల్ల, పండించిన సోళ్ళు, సామలు బతకటానికి సరిపోక పేద ఆదివాసీ రైతు కూడా గంజాయి సాగుకు దిగుతున్న పరిస్థితి కనబడుతుంది.

రాగుల జావతో, రేషన్ బియ్యం అన్నంతో బతుకీడ్చే వారెందరో...

ఆదివాసీ రైతు షావుకారు చక్రబంధంలో గిజగిజ లాడుతుంటాడు. పంట వేసినప్పుడు తీసుకునే అప్పు తీర్చటానికి పంట అతనికే అమ్మాలి అన్న ఒప్పదం జరుగుతుంది. షావుకారు నిర్ణయించిందే ధర. నూటికి ఇరవై చొప్పున కట్టే వడ్డీ, తరుగు పేరుతో క్వింటాలుకు అదనంగా కొలిచే అయిదు కిలోల ధాన్యం, రవాణా వ్యయం కింద అయిదు నుండి పది శాతం వరకు చెల్లించాల్సిన డబ్బు కానీ ధాన్యం కానీ ః అన్నీ కలిసి తడిసి మోపెడై ఆదివాసీ రైతును ముంచేస్తుంటాయి. ఈ షావుకార్ల నుండే రాజకీయ నాయకులు ఉంటారు. పత్రికావిలేఖరులు ఉంటారు. దుకాణాలు దాదాపు వీళ్ళవే. మండల్ కేంద్రంగా వీళ్ల పనులు నడుస్తుంటాయి.

ఆదివాసీలలో చేపలు పట్టటం మరొక ప్రధాన జీవనాధారం. అడవిలో ఎక్కడ బడితే అక్కడ కొండలనుండి వచ్చే నీటి ప్రవాహాలతో ఏర్పడే కాలువలు, గుంటలు, బలిమెల రిజర్వాయర్ వెనక తట్టు నీటి వనరులు చేపలు పట్టుకొనే నెలవులు. ఆహారానికే కాదు, అమ్ముకొని సొమ్ము చేసుకొని ఇతర అవసరాలు తీర్చుకొనటానికి కూడా చేపలు పడుతుంటారు వాళ్ళు. వెదురు గడ్డలు, కట్టెలు మొదలైన జీవనావసరాల కోసం అడవి లోపలికి వెళ్ళటం వారికి పరిపాటి.

విద్య:

ప్రతి గ్రామపంచాయితీకి ఒక హై స్కూల్ ఉన్నప్పటికీ –బడి వయసు పిల్లలు అందరు బడికి పోతున్నట్లు కనబడదు. ఒంటి మీద సరి అయిన బట్టలు లేకుండా పిల్లలు ఇళ్ల ముందు తిరుగుతూ కనిపించారు. బడికి పోరా అని పెద్దలను విచారిస్తే బడి లేదు అన్న సమాధానం వచ్చింది. గ్రామపంచాయితీ బడి వరకు నడిచిపోగల వయసు వాళ్ళది కాకపోవటం, సమీపంలో వాళ్ళను పంపగల ప్రాథమిక పాఠశాల లేక పోవటం దానికి కారణం కావచ్చు. పాఠశాలలకు బయట నుండి టీచర్లు రాకపోవటం ఒక సమస్య అయితే సంక్షేమ హాస్టళ్లకు వచ్చే డబ్బును, ఆహార పదార్థాలను పిల్లల వరకు రానీయక దోచుకు తినటం మరొక సమస్య. ముకుడ్ పల్లి వంటి కొన్ని ఊళ్ళల్లో తల్లి తండ్రులు పనికి పోతూ పిల్లలకు మొబైల్ ఫోన్లు కొని స్తున్నారు. వాటికి అలవాటుపడి పిల్లలు బడికి వెళ్ళకుండా కాలక్షేపం చేస్తుండటం ఇంకొక సమస్య. ఈ ప్రాంతంలో అక్షరాస్యత అయిదు నుండి పది శాతం వరకు ఉంటుంది అంతే.

వైద్యం :

ఉండేది సహజ సుందరమైన ప్రకృతి మధ్యనే అయినా మలేరియా, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడి ఏడాదికి ఇరవై మందివరకు మరణిస్తుంటారు. సాధారణ పరిస్థితులలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలకు అక్కడ పరిష్కారమే లేదు. అత్యవసర పరిస్థితులలో రోగి ని ఆసుపత్రి వరకు తరలించటం పెద్ద సమస్య.

జీవిత సంస్కృతి :

వక్షస్థలం పై నుండి ఒక కొంగు, వీపు వైపు నుండి ఒక కొంగు తీసి భుజం మీద ముడిపెట్టే జాకెట్టులేని చీర కట్టు పద్ధతి అక్కడి ఆడవాళ్ళది. కానీ చాలామందికి జాకెట్టు వేసుకొనటం అలవాటైంది. బెజ్జంగి లో అలికి ముగ్గులు పెట్టిన వాకిళ్లు, ఆవరణ మధ్యలో నాలుగైదు అడుగుల పొడవు వెడల్పులతో అడుగు ఎత్తు అరుగులు, కొన్ని ఇళ్లల్లో మరింత వైశాల్యం కల అరుగులు ఉన్నాయి. వండుకొనే రాతెండి గిన్నెలు, గరిటలు, తినటానికి తాగటానికి వాడే స్టీలు పళ్ళాలు, గ్లాసులు వాటి మీదే పెట్టుకున్నారు. వంట పొయ్యి, స్నానాలు చాలావరకు ఇళ్ళముందే.

మరీ ఆశ్చర్యం కలిగించిన అంశం ఏమిటంటే బెజ్జంగి లో మాకు పడుకొనటానికి వసతి ఇచ్చిన ఇంటిముందు తులసి కోట ఉండటం. ఆ తులసికోట ముందు దీపం పెట్టి ఉండటం. తులసి పూజ, కార్తీక స్నానాలు ఆదివాసి సంస్కృతిలోకి ఎప్పుడు ప్రవేశించాయో కానీ తెల్లవారు ఝామునే లేచి ఆ ఇంటి మహిళ వాకిలి చిమ్మి ముగ్గుపెట్టింది. ఆమెతో పాటు మరో నలుగురు స్త్రీలు అయిదుగంటలకల్లా స్నానాలు చేసి వచ్చితులసికోట ముందు దీపం పెట్టి చెంబుతోతెచ్చిన నీళ్లు చెట్టు పాదులో పోసి పూలు పెట్టి రెండు చేతులూ పైకెత్తి ఓ అని అరుస్తూ చేసిన ప్రార్ధనను ఆ తొలి వేకువలో చూసాను

అక్కడ ఆడవాళ్ళు ఇంటిపని చేస్తారు. కానీ అది మైదాన గ్రామీణ పట్టణ మధ్యతరగతి ఎగువ మధ్యతరగతి కుటుంబాల ఇంటిపని పని వలే అంత సంక్లిష్టమైనది కాదు. ఒక కూర అన్నంతో వంటపని అయిపోతుంది. ఒక దీర్ఘ చతురస్రపు రాయి మీద రుబ్బు రాయి వంటి మరొక రాయిని ఉపయోగిస్తూ పచ్చడి నూరుకుంటారు. మొక్క జొన్న గింజలు వేసిన రాగి జావ తయారుచేస్తారు. బిందెమీద బిందెగామూడు నాలుగు బిందెలు ఒకదానిమీద ఒకటి పెట్టి ఏటి కాలువల నుండి మంచినీళ్లు నెత్తిమీద మోసుకు వస్తారు. ఏడెనిమిదేళ్ళు వచ్చిన పిల్లలు నీళ్లు తీసుకు రావటం లోనూ, వండిన గిన్నెలు తిన్నపళ్ళాలు కడుక్కు రావటంలోనూ సహాయ పడతారు.

గుమ్మడికాయ ఆహారంలో ప్రధానంగా ఉంటుంది. గుమ్మడి కాయతోనే కాదు ఆకుతో కూడా కూర చేసుకుంటారు. తోటకూర, పాల కూరలతో చేసే పొడికూరల రుచితో ఉంటుంది ఆ కూర. పచ్చి బొప్పాయి కూర కూడా చేసుకుంటారు. పాలు, పెరుగు వినియోగం కనిపించలేదు. అంత లోతట్టు అడవిలోనూ తుంగ చాపలు కాక ప్లాస్టిక్ చాపలే అందరి ఇళ్లలోనూ వాడటం కనిపించింది.

కేవలం గోచీ మాత్రమే పెట్టుకున్న పెద్దమనుషుల నుండి టీ షర్టులు వేసుకొన్న కుర్రకారువరకు కనబడతారు. స్త్రీలలో ఎక్కువ శాతం జాకెట్టు వేసుకున్నా చీరకట్టు పద్ధతి చాల వరకు సంప్రదాయకమైందే. ఎక్కువమంది ఒంటిమీద పాతపడ్డ చిరుగులు పడ్డ బట్టలే ఉన్నాయి.

భారత దేశపు పౌరులే అయినా విద్యా వైద్య సౌకర్యాలకు, సహజ అభివృద్ధిలో వాటాకు పరాయీకరింపబడిన ఆదివాసీలు దుర్భర జీవన యాతన తో పాటు పోలీసు పెత్తనాన్ని ఎదుర్కోవలసి వస్తున్నది. అడవిలో ఉన్న తాము మనుషులమే కానీ జంతువులం కామని వాళ్ళు అంటున్నారు. ఇవ్వాల్సినవేవీ ఇయ్యని సర్కార్ అనుక్షణం తమను అనుమానిస్తూ అవమానిస్తూ వేధిస్తున్నదని క్రోధాన్ని వెలిగక్కుతున్నారు.

ఆదివాసీల కు ప్రభుత్వ విద్య వైద్య సౌకర్యాలు ఏ మేరకు అందుబాటులోకి వస్తున్నాయో, వాళ్ళు విద్యావంతులు కావటానికి అవరోధంగా ఉన్న పరిస్థితులు ఏమిటో, ప్రభుత్వ పథకాలు ఆదివాసీలకు ఎంతవరకు అందుబాటులోకి వచ్చాయో అభివృద్ధి పథం లో వారిని ఏ స్థాయికి తీసుకువెళ్ల గలిగాయో ఆ వాస్తవాలు తెలిస్తే గానీ వాళ్ళది ధర్మాగ్రహం అని గుర్తించలేం. విప్లవ రాజకీయాల వైపు వాళ్ళ నడకను అర్థం చేసుకోలేం.

2

"మేం మనుషులం. ప్రేమించేవారిని ప్రేమిస్తాం. మావోయిస్టు వాళ్ళు మా గురించి ఆలోచిస్తున్నారు. మా కోసం, మా గ్రామం కోసం చేస్తున్నారు. మాకు భూమి గురించి చెప్పారు. వైద్య సహాయం అందించారు. మా కష్టం చూసి కదిలిపోయినవాళ్ళు, మాకోసం మాతో ఉన్నవాళ్లు మావోళ్ళు"

"ఇంటి అవసరాలకు ఏమి కొనుక్కోవాలన్నా, తాసీల్ పనులు వేటికైనా మేం చిత్రకొండకు పోవాలి. రెండు మూడు గంటల ప్రయాణం, ప్రయాన అటుంచితే మేమెప్పుడూ అనుమానితులుగానే చూడ బడుతుంటాం. మావాది కొరకు సామాను మోస్తున్నా రంటూ, వాళ్లకు సాయపడుతున్నారంటూ పోలీసులు మమ్మల్నిపట్టుకొని వేధిస్తుంటారు. జైళ్లలో పెడుతున్నారు. చంపుతున్నారు. జీవనావసరాలకోసం అడవి లోపలోకి వెళ్లాలంటే - మావోఇస్టులని మగవాళ్ళను కాల్చి చంపుతారేమోనని భయం. ఆడవాళ్ళ మీద అత్యాచారాలు చేస్తారేమోనని భయం. మా చోటులో మాకు స్వేచ్ఛగా తిరిగే వీలు లేకుండా పోయింది. మమ్మల్నిఇంత కష్ట పెట్టేవాడు మావోడు ఎట్లా అవుతాడు?" ః

బెజ్జంగి అడవులలో అక్టోబర్ 24 నుండి నాలుగురోజుల పాటు మావోయిస్టుల పై జరిగిన దాడి విషయంలో వాస్తవాలను తెలుసుకొనటానికి వెళ్లి, నవంబర్ 6, 7 తేదీలలో అం డ్రుపల్లి, బెజ్జంగి పంచాయితీ గ్రామాల ప్రజలను కలిసి మాట్లాడినప్పుడు వ్యక్తమైన ప్రజల మనోభావాలు ఇవి. మాయా బజార్ సినిమాలో నైనా ఘటోత్ గజుడి సైన్యానికి అస్మదీయులు ఎవరో తస్మదీయులు ఎవరో గురువు చెప్పాల్సివచ్చింది కానీ ఆంధ్ర ఒడిశా సరిహద్దుఅటవీ ప్రాంత ప్రజలు

స్వీయ అనుభవాల నుండి అస్మదీయులు ఎవరో తస్మదీయులు ఎవరో సకారణంగా నిర్ధారించు కున్నారు.

ప్రజల విశ్వాసాన్ని ఇంతగా చూరగొనటానికి మల్కన గిరి జిల్లాలో మావోయిస్టులు చేసిందేమిటి?

మల్కనగిరి ఒరిస్సాలో ఒక వెనకబడిన జిల్లా. అటవీ ప్రాంతం, ఆదివాసులు ఎక్కువగా ఉన్న ప్రాంతం. రోడ్డు రవాణా మార్గంతో సంబంధం లేని జీవితం. సరుకుల కోసం మార్కెట్‌కు విద్యాలయాలయాలకు, వైద్య శాలలకు వెళ్లటం అక్కడి ప్రజలకు పెద్ద సమస్య. అటవీ సంపద నీటి వనరులు పుష్కలంగా ఉన్న ప్రాంతం అయినా ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారు. అటువంటి చోట కట్టబడిన(1977) బలిమెల వంటి బహుళార్థ సాధక ప్రాజెక్టులు ఆ వనరులను పట్టణాల అభివృద్ధికి పెట్టుబడిగా మార్చాయి. సీలేరు నది మీద ఆంధ్ర, ఒడిశా ప్రభుత్వాల మధ్య ఒప్పందంతో బలిమెల వద్ద కట్టబడిన ఆ రిజర్వాయర్ 89 గ్రామాల, 1200 కుటుంబాల 12 వేల ప్రజల నిర్వాసిత సమస్యను ముందుకు తెచ్చింది. వారిలో దాదాపు తొమ్మిది వేలమంది ఆదివాసీలు. పేదరికం, వలసలు, మొదలైన సమస్యలతో సతమవుతున్న ఆదివాసీల మధ్య పని చేయటానికి మల్కన గిరి జిల్లాలోకి ప్రవేశించారు. 2009 నాటికి నారాయణ పట్నం కేంద్రంగా భూమి సమస్య పై ఆదివాసీలను కూడగట్టి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్మించగలిగారు. మద్యం వ్యాపారం, వడ్డీ వ్యాపారం చేసే సొండీల ఆక్రమణలో ఉన్న 200 ఎకరాల భూమిని ప్రజాపరం చేయటానికి ఉద్యమం నిర్మించారు. విజయవంతంఅయ్యేవరకు ప్రజల వెంటే ప్రజలతోనే ఉన్నారు. భూమిని ప్రజలకు పంచి, స్వాధీన పరచి వ్యవసాయం చేసుకొనడానికి వెసులు బాటు కల్పించారు. ఆ క్రమంలో పోలీసు దాడులను, అణచివేత చర్యలను ప్రతిఘటించి ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్లారు ఆదివాసీలు. ఇప్పటికీ ప్రజల అధీనంలో ఆ భూములు సాగు అవుతూనే ఉన్నాయి. ఆ రకంగా వ్యక్తుల దగ్గర పోగుపడ్డ భూమిని స్వాధీనం చేసుకొని భూమి లేని వాళ్లకు పంచటం ఒక కార్యక్రమంగా తీసుకొని ఆదివాసీ హృదయాలను గెలుచుకున్నారు మావోయిస్టులు.

ఇక్కడ నేలకు నీటి నిలువ సామర్థ్యం తక్కువ. అందువల్ల ఉత్పత్తి తక్కువ. కొండలమీద వ్యవసాయంలో సాగు నీరు ఉండదు కనుక ఐదారేళ్లు పంటలు వేసాక పోడుభూమి సారం కోల్పోతుంది. పంట లేక, తిండి లేక ఆదివాసీ జీవితం దుర్భరం అవుతుంది. అటువంటి పరిస్థితులలో ఆదివాసీలను కూడగట్టి చర్చించి శ్రమ దానంతో చెక్ డాములు నిర్మించుకొనటానికి ప్రోత్సహించి నీటి సమస్యను పరిష్కరించారు. అలాగే కొండలపై మట్టి వర్షాలకు కోతకు గురికాకుండా రాతి కట్టలు కట్టటం నేర్పారు.

రైతాంగ సదస్సులను నిర్వహించి వ్యవసాయ ఉత్పత్తిలో అభివృద్ధి మార్గాల గురించి ప్రజలతో చర్చించారు. శ్రమ సహకార సంఘాలను ఏర్పరచారు. సమిష్టి వ్యవసాయాన్ని ప్రోత్సహించారు. ఈ పద్ధతిలో ఎవరి భూమి వాళ్ళు సాగు చేసుకొనటం కాక అందరూ కలిసి సాగు యోగ్యమైన భూమి అంతటిని ఏక ఖండంగా చేసి పని చేశారు. ఈ క్రమంలో సాగు భూమి లేని వాళ్ళు ఎంత ప్రయోజనం పొందారో, భూమి ఉన్నవాళ్లు కూడా వ్యక్తిగతంగా అంతగా లాభ పడ్డారు. 26, 27 గ్రామాలలో ఈ విధంగా శ్రమసహకార పద్ధతిలో జరిగిన వ్యవ సాయం వల్ల వచ్చిన ఫలితాల ప్రభావంతో మిగిలిన చోట్ల కూడా ప్రజలు ఇలాంటి పద్ధతిలో వ్యవసాయానికి చొరవ తీసుకున్నట్లు తెలిసింది. పశువుల పెండను ఎరువుగా వాడటం అధిక దిగుబడికి కారణమవుతుందని ఈ క్రమంలోనే వాళ్ళు అర్థం చేసుకున్నారు. పశు సరక్షణలో మెరుగైన మార్గదర్శకత్వం మావోఇస్టులనుండి వాళ్లకు లభించింది.

తక్షణం కనబడే అధిక మొత్తపు ధనలాభ ప్రలోభం గంజాయి సాగులో కీలకమైనది. మధ్య, ఉన్నత వర్గ రైతులు గంజాయి సాగు లో ఉన్నారు. అందువల్ల వచ్చే డబ్బు లంపెన్ వర్గాన్ని, నేర ప్రవృత్తిని పెంచి మనుషులను శ్రమకు దూరం చేయటం గురించి అవగాహన కలిగించే ప్రచార కార్యక్రమం మావోయిస్టులు తీసుకున్నారు. గంజాయి పెట్టటం తగ్గించి ధాన్యం, కూరగాయలు పండించటం వైపు ఆదివాసీలను చైతన్య పరచటంలో మావోయిస్టుల పాత్ర ఉన్నది.

నిత్య జీవిత అవసరాలకోసం చేయవలసిన ప్రయాణాలలో సౌకర్యాల కల్పనా కోసం ఆదివాసీలను కూడగట్టటం మావోయిస్టులు చేసిన మరొక పని. అందులో భాగంగానే బలిమెల వాగులో పడవలు పెట్టాలన్న డిమాండ్ పెట్టి సాధించుకోగలిగారు. చేపలు పడితే కట్టాల్సిన పన్ను రద్దు కోసం కూడా ఉద్యమించారు.

ఆదివాసీలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు రావటంలోనూ మావోఇస్టులు విశేష కృషి చేశారు. కటాఫ్ ఏరియాల గ్రామ నిర్మాణాల నుండి కొంతమందిని ఎంపిక చేసి తగిన శిక్షణ ఇచ్చి ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి వైద్య బృందాలను ఏర్పరచారు. 26 గ్రామాలలో అటువంటి వైద్య బృందాలు పని చేస్తున్నాయి. ఆ బృందాలు పక్క గ్రామాలకు కూడా వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నాయి. ఇంటింటికి 100 రూపాయలు వసూలు చేసి తెప్పించిన మందులతో ఈ బృందాలు స్థానిక ప్రజల ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తున్నాయి. మలేరియా మొదలైన వ్యాధులను నివారించటానికి నీళ్లు కాచుకుని తాగటం నేర్పారు. ఈ వైద్య విధానం యొక్క ప్రభావ ఫలితమే ప్రభుత్వం 'మెడికల్ లాంచ్' ఏర్పాటు చేయటం.

విద్య విషయంలో మావోయిస్టులు ప్రస్తుతానికి వయోజనులకు రాత్రి బళ్ళు నడిపే తొలి దశలో ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల సక్రమ నిర్వహణకు బాధ్యులుగా అధ్యాపకులను చైతన్య పరిచేందుకు వ్యూహాలతో ముందుకు కదులుతున్నారు. దాని ఫలితం కొన్నిగ్రామాలలో బడికి వచ్చే పిల్లల సంఖ్య పెరుగుదలలో ప్రతిఫలిస్తున్నది.

కాఫీ ప్లాంట్ల లోకి చొచ్చుకు పోయిన మావోలు ఈ నాడు బాక్సయిట్ సమస్య పై సంఘటితం అవుతున్న గిరిజనులకు వెన్నుదన్ను అవుతున్నారు.

ఈ విధంగా ఆంధ్ర ఒడిశా కటాఫ్ ఏరియాలోమావోయిస్టుల ప్రజాపునాది బలపడటం ఆంధ్ర ప్రాంతంలోకి విస్తరించే అవకాశాలను సూచిస్తున్నది. ఆ ప్రమాదాన్ని అరికట్టే ముందస్తు చర్యగానే అక్టోబర్ 24న ఎంకౌంటర్ ను భావించాల్సి వుంది. కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం బాక్సయిట్ తవ్వకాలు ప్రారంభించాలి. అందుకు అవరోధంగా ఉన్న ఆదివాసీ వ్యతిరేకతను రూపుమాపాలి. నిరసన గళాలను నొక్కియ్యటానికి భయోత్పాతాన్నీ రక్తపాతాన్నీ సృష్టించటం ఒక్కటే మార్గం. ఆ మార్గం లో రచింప బడిన ఒక బీభత్స సమావాకారం ఆ ఎన్‌కౌంటర్.

3

నవంబర్ 6 వ తేదీ ఏడుగంటలకల్లాబెజ్జంగి నుండి సంఘటనా స్థలం వైపు బయలు దేరిన 22 మంది బృందం సభ్యులలో ఒక దానిగా ట్రాక్టర్ లోనా ప్రయాణం ప్రారంభమైంది. గంటన్నర ప్రయాణం తరువాత గంగార్ పుతోర్ దాటి గుసుంపోదర్ లో ట్రాక్టర్ వదిలేసి సన్నని

ఎత్తువంపుల కాలిబాటలవెంబడి నడుస్తూ కాలువలు దాటుతూ, మూడువైపులా ఎత్తుగా విస్తరించి ఉన్న తూర్పు కనుమల దట్టమైన అడవికి, మరొక వైపు విశాలంగా వ్యాపించిన గోదావరికి ఉపనది అయిన సీలేరు మీద బలిమెల దగ్గర నిర్మించిన రిజర్వాయర్ బ్యాక్ వాటర్ కు మధ్య ఉన్న మైదాన ప్రాంతాన్ని చేరుకున్నాం. ఎన్ కౌంటర్ జరిగిన ఉత్తరపు కొండ పైకి ఎక్కి పరిశీలించాం.

అక్కడ చెదిరిన పొయ్యిరాళ్లు, కుమ్మరించి చెల్లాచెదరు చేయబడిన అడవిదొండా(పొటల్స్), గోబీ, ఉల్లిపాయలు, పచ్చిమిరపకాయలు, ఎండుమిరపకాయలు, ఆవాలు, వెల్లులి, టీ ప్యాకెట్లు, పాలడబ్బాలు, పంచదార, మొక్కజొన్న కండెలు మొదలైన వంట దినుసులు, కింద కుమ్మరించబడి పాడైపోయిన అన్నపు కుప్పలు, మామిడికాయ పచ్చడి కనిపించాయి. మావోయిస్టులకు సంబంధించిన వస్తువులు ఒకచోట పోగేసి కాల్చినట్లున్నారు.... బూడిద రాసి మధ్య రాగి రంగుకు మారి వంకర్లు తిరిగిన పళ్ళాలు, గ్లాసులు, టిఫిన్ డబ్బాలు, కారియర్లు కనిపించాయి. పళ్ళాలు గ్లాసులు 32 ఉన్నాయి. టిఫిన్ డబ్బాలు, కారియర్లు కలసి పది పదిహేను ఉంటాయి. గొడుగు ఊచలు, రెక్సిన్ గొడుగు గుడ్డలు, ప్లాస్టిక్ కాన్లు, హోమియో మందులు, చెప్పులు, బూట్లు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కాలిన పది రూపాయల నోట్లు కూడా కనిపించాయి. కాల్చివేయబడిన కిట్లను కదిలిస్తే కాలని చిన్న చిన్న టూత్ పేస్ట్ ట్యూబులు, బొట్టుబిళ్లలు, స్కార్ఫ్ లు, చున్నీలు బయట పడ్డాయి. పొడవైన జుట్టు ఎవరిదో ఎండిన ఆకులలో చిక్కుకుపోయి కనిపించింది. 23వ తేదీ వార్త పేపర్, జులై, ఆగస్టు అరుణతార సంచికలు కూడా అక్కడ ఉన్నాయి. బులెట్ల జాడలు మాత్రం ఏమీ కానరాలేదు. ఆ గుట్ట దిగేవరకు ఎవరూ గాయపడి ఉండరని పరిసరాల స్థితిని బట్టి ఊహించవచ్చు.

ఆ గుట్ట దిగితే తూర్పు గుట్ట ఎక్కటమే తరువాయి. కానీ అటువైపు నుండి కాల్పులు జరుగుతుండటంతో దక్షిణం వైపు గుట్టపైకి రిట్రీట్ అయ్యేక్రమంలో బహుశా వాళ్ళు అనివార్యంగా కొంత భాగం వరి, మరికొంత భాగం గంజాయి సాగు అవుతున్న మైదాన ప్రాంతం దాటవలసి వచ్చి ఉంటుంది. వంగి నేలకు అంటుకు పోయిన వరి మొక్కలు అవుననే సాక్ష్యం ఇస్తున్నాయి. పడమటి వైపు నుండి, తూర్పు వైపు నుండి చుట్టుముట్టి ఆంధ్ర గ్రేహౌండ్ పోలీసులు జరుపుతున్న వరుస కాల్పులను ప్రతిఘటిస్తూ బులెట్ గాయాలతో వరి చేనును గంజాయి మొక్కలను వేరు చేసే రెండు మూడు ఆ డుగుల వెడల్పు కయ్య దగ్గర చాలా మంది నేలకు ఒరిగిన ఆనవాళ్లు కనిపించాయి. తొక్కిడి పడ్డ పంటచేలు, కాలువ దగ్గర గాయపడ్డ అబూబకర్ వంటి నుండి చింపబడిన యూనిఫారం ముక్కలు, కాలువ దాటాక మైదానంలో పడి ఉన్న బూట్లు, పెద్ద వానల తరువాతకూడా నేలమీద మిగిలిన నల్లటి రక్తం మరకలు అక్కడ జరిగిన హత్యాకాండకు సాక్ష్యాలుగా మిగిలాయి. అక్కడి నుండి ముందుకు వెళితే పంటపొలాల వెంబడి పోలీసులు మకాం వేసిన ఆనవాళ్లను తెలిపే వాడి పడేసిన మంచినీళ్ల సీసాలు, మజ్జిగ ప్యాకెట్లు, కూల్ డ్రింక్ పాకెట్లు, వివిధ ఆహారపదార్థాల ప్యాకెట్లు, వాటిని తెచ్చిన పాకేజీ పెట్టెలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బలిమెల జలాశయం సమీపంలో హెలికాప్టర్ ఆగిన ప్రాంతాన్నిదూరం నుండే గుర్తించాం. అక్కడి నుండి పదిపదిహేను నిమిషాల నడకతో రామ్ గూడ గ్రామం చేరుకున్నాం. పర్వత శ్రేణులను చుట్టుకొని ప్రవహించే బలిమెల జలాశయం ఒడ్డున ఉన్నవూరు అది. చుట్టుపక్కల వరి, రాగులు, అరటి, బొప్పాయి, గుమ్మడి సాగు అవుతున్నాయి. ఇళ్ళు ముప్పయ్ నలభై వరకు ఉంటాయేమో... దాదాపు ప్రతి ఇంటికి ముందు ఒక వరండా, నిప్పారని పొయ్యి ఉన్నాయి. పొయ్యి మీద నీళ్లు కాగుతుంటాయి. చలి కాచుకొనటానికి ఆ పొయ్యి ముందే కూర్చుంటారు.

నిరాయుధులైన ఆదివాసీలు తొమ్మిది మంది ఈ ఘటనలో చంపబడ్డారు. మృతుల కుటుంబ సభ్యులను, సంబంధీకులను కలిసి మాట్లాడాం. బచ్చల్ పొదర్ గ్రామానికి చెందిన లొకన్ పాంగిని చంపిన పోలీసులు ఆ విషయాన్ని ప్రకటించలేదు. నాలుగైదు రోజుల తరువాత పురుగులు పట్టి పాడై పోయిన దశలో గుర్తు పట్టిన వాళ్ళు కబురు చేస్తే వెళ్లి చూసుకున్నారు తల్లి దండ్రులు. తమ వూరికి తీసుకు పోవటానికి కూడా వీల్లేనంతగా పాడైన శవాన్ని ఉన్నచోటే దహనం చేసి రావాల్సి వచ్చింది. 28 ఏళ్ళ ఎదిగిన కొడుకును కోల్పోయిన తండ్రి మాలియా పాంగి నాకొడుకు చేసిన నేరం ఏమిటి? వాని దగ్గర అస్త్రశస్త్రాలేమైనా ఉన్నాయా? ఆధార్ కార్డు ఉంది. వాడిని చంపినందుకు పోలీసులకేమిటి శిక్ష అని వేదనతో, దుఃఖంతో అడుగుతున్నాడు.

ఘటనా స్థలానికి అత్యంత సమీపంగా ఉన్న ఆ గ్రామ ప్రజలతో మాట్లాడితే ఆసక్తికరమైన అనేక విషయాలు తెలిసాయి. 24 నాడు తెల్లవారిన కాసేపటికే కాల్పుల ధ్వనులు విన్నారు వాళ్ళు. ఒక కామ్రేడ్ పరిగెత్తుకుంటూ ఊళ్లోకి వచ్చి ఒక ఇంట్లోకి జొరబడి మళ్ళీబయటకు వచ్చి తప్పించుకు పోయాడు. అతని వెనువెంట ఊళ్లోకి వచ్చిన పోలీసులు ఆ ఇంటిపై ఫైరింగ్ జరిపారు. (గోడలమీద బులెట్ తగిలిన గుర్తులు కనిపిస్తున్నాయి కూడా) ఇంటి పైకి ఎక్కి పెంకులు తీసి చూసారు. వాడేమైనాడని ఊరి వాళ్ళను ఆరా తీశారు.. మాకు తెలీదు అంటే తుపాకీ చూపి బెదిరించి బయటకు రావద్దని హెచ్చరించి వెళ్లారు. అందరూ వెళ్లి వెనక వైపు రెండు ఇళ్లల్లో సర్దుకుని కూర్చున్నారు. దాదాపు ఒక గంట కాల్పులతో అడవి దద్దరిల్లి పోయిందని, ఆ తరువాత కూడా రోజంతా చెదురుమదురుగా కాల్పులు జరగటం వినవడుతూనే వున్నదని వాళ్ళు చెప్పారు. ఆరోజు ఎవరూ వొండు కోలేదు. తినలేదు. కాలకృత్యాల కు వూరిబయటకు పోవటానికి కూడా భయ పడ్డారు. నాలుగు రోజులపాటు తుపాకీ కాల్పుల మోతలు వినబడుతుంటే బిక్కు బిక్కు మంటూ గడిపారు.

పెద్ద ఎత్తున ఆంధ్ర గ్రేహౌండ్స్, ఒడిశా పోలీసులు కలిసి వెనక నుండి గుట్టలను ఆక్రమించి గుట్టల వైపు చేల దగ్గర, ఊరి దిక్కు విస్తరించుకొని ఉండటం కనిపించిందని గ్రామస్థులు చెప్పారు. అదనపు బలగాల కోసం ఏమో 24 వ తేదీ ఒక హెలికాప్టర్ నాలుగు ట్రిప్పులు కొట్టటం గమనించామని వాళ్ళు చెప్పారు. అదే రోజు ఉదయం బలిమెల బ్యాక్ వాటర్ లో చేపలు పట్టటానికి పోయిన గ్రామస్థుడిపై కూడా పోలీసులు కాల్పులు జరిపారు. ఒక బులెట్ పక్కనుంచి పోయింది. వెంటనే అతను బోటులో బోర్లా పడుకొని బులెట్ దెబ్బ తగలకుండా జాగ్రత్తపడ్డాడు. నెమ్మదిగా నీళ్ళలోకి జారి పడవను నెట్టుకుంటూ బతుకు జీవుడా అని ఒడ్డుకు చేరుకున్నాడు. నేను పోలీసులకెప్పుడూ ఏ హానీ చేయలేదు. నేను ఈ గ్రామస్థుడిని. వాళ్ళు నా మీద కాల్పులు ఎందుకు జరపాలి అంటాడు అతను ఆవేదనగా.. ముకుంద్ కిలో, నకుల్ కిలో కూడా ఇలాగే పొద్దున్నే చేపలు పట్టటానికి వెళ్లారు. అటు ఫైరింగ్ మొదలైంది. ఇటు పడవ మీద వెళ్తున్నవీళ్ళ మీదకూడా పోలీసులు కాల్పులు జరిపారు. నీళ్లలో దూకి ప్రాణాలు కాపాడుకొన్నామని చెప్పారు వాళ్ళు.

శవ పంచనామాకు రమ్మని చెప్పి వస్తుంటే ఎక్కడకు వస్తున్నారు అని మళ్ళీ వెనక్కి పంపారని, శవాల దగ్గరకు పోనియ్యలేదని చెప్పారు.

ఇందంతా అయ్యాక పోలీసులు ఊళ్లోకి వచ్చి ఇంటింటికి 1500 రూపాయలు ఇచ్చారని పంట చేలు తొక్కి పాడు చేసినందుకు పరిహారం అని చెప్పారని రామ్ గూడా గ్రామస్థులు చెప్పారు. ఏడాదిపాటు తిండిపెట్టే వరి, చోళ్ళు పంటలను పాడుచేసి పదిహేను వందలు ఇస్తే ఏ మూలకి సరిపోతాయి అని వాళ్ళు ప్రశ్నిస్తున్నారు.

రామ్ గూడ వూర్లో నుండి చేలకు పోయే కాలిబాట వెంబడి దట్టమైన పొదలు కప్పిన లోతయిన కయ్య ఒకటి వుంది. 24 నాటి పోలీసు కాల్పులను తప్పించుకొని ఒక మహిళ అందులో దాక్కున్నది. రెండు రోజులకు ఒక వ్యక్తి ఆ బాటన పోతున్న అలికిడి కనిపెట్టి చెట్టు కొమ్మ ఊపిఆమె తన ఉనికిని తెలిపే ప్రయత్నం చేసింది. ఆ వ్యక్తి కయ్య లోకి తొంగి చూచి అయ్యో అక్కా అని పైకి తీసే ప్రయత్నం చేసే లోగానే పోలీసులు కనిపెట్టి దగ్గర నుడి ఫైరింగ్ చేసి చంపారు. ఆమె పేరు చిలుక అని చెప్పారు. నాలుగు రోజులు వరుసగా కూంబింగులు చేస్తూ దొరికినవాళ్లను దొరికినట్లు శక్తివంతమైన ఆయుధాలతో కాల్చి పారేస్తూ పోయారు. ఆ క్రమం లోనే గాయపడి గుట్టమీద దాక్కుని ఉన్న గౌతమ్ ను, నరేష్ ను నాలుగు రోజుల తరువాత పట్టుకొని కాల్చేసినట్లు తెలిసింది.

ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 21 మంది మావోయిస్టులను వేటాడి, వేటాడి చంపటం స్పష్టంగా కనబడుతున్నది. చనిపోయిన వాళ్ళు: 1. ప్రసాద్ (బకురు వెంకట రమణ) 2. దయ (కిష్టయ్య) 3. గంగాధర్ (ప్రభాకర్) 4. కిరణ్ (సువర్ణరాజు) 5. బిర్సు(కేశవరావు) 6. ఎర్రాలు (ననగలు) 7. మున్నా(పృథ్వి) 8. గౌతమ్ (?) 9. మురళి (?) 10. మధు (దాసు) 11. దాసు (సాధూరాం) 12. నరేష్ (సురేష్) 13. బుద్ధి (బద్రి సోరి) 14. మంజుల (ఉంజి) 15. లత (భారతి) 16. మమత (బొట్టు కుందన) 17. తిలక (?) 18. గంగ (గంగా మాధవి) 19. రజిత (కామి) 20. జ్యోతి (సుమనోవా)21. కమల (లక్కీ)

నిరాయుధులైన ఆదివాసీలు తొమ్మిది మంది ఈ ఘటనలో చంపబడ్డారు. మృతుల కుటుంబ సభ్యులను, సంబంధీకులను కలిసి మాట్లాడాం. బచ్చుల్ పొదర్ గ్రామానికి చెందిన లొకన్ పాంగిని చంపిన పోలీసులు ఆ విషయాన్ని ప్రకటించలేదు. నాలుగైదు రోజుల తరువాత పురుగులు పట్టి పాడై పోయిన దశలో గుర్తు పట్టిన వాళ్ళు కబురు చేస్తే వెళ్లి చూసుకున్నారు తల్లి దండ్రులు. తమ వూరికి తీసుకు పోవటానికి కూడా వీల్లేనంతగా పాడైన శవాన్ని ఉన్నచోటే దహనం చేసి రావాల్సి వచ్చింది. 28 ఏళ్ళ ఎదిగిన కొడుకును కోల్పోయిన తండ్రి మాలియా పాంగి నాకొడుకు చేసిన నేరం ఏమిటి? వాని దగ్గర అస్త్రశస్త్రాలేమైనా ఉన్నాయా? ఆధార్ కార్డు ఉంది. వాడిని చంపినందుకు పోలీసులకేమిటి శిక్ష అని వేదన తో, దుఃఖంతో అడుగుతున్నాడు.

బచ్చుల్ పొదర్ గ్రామానికి చెందిన దంపతులు ఖోర బేసు, డిపై -పార్టీ వచ్చింది చూచి వస్తానంటూ వెళ్లిన కూతురు జమ్మిని ఎన్‌కౌంటర్‌లో పోలీసులు పొట్టన పెట్టుకున్నారని వాపోయారు. జమ్మికి 19 ఏళ్ళు. ఆయుధం లేని బిడ్డను ఆంధ్ర నుండి వచ్చి పోలీసులు ఎందుకు చంపినట్లు అని అడుగుతున్నారు ఆ దంపతులు. ఇదే ఊరుకు చెందిన కమల కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో దుర్మరణం పాలైంది. ఆ అమ్మాయి వయసు 18 ఏళ్ళు. తండ్రి బిందు కిలో. తల్లి కిందు కిలో.

పోలీసుల ఫైరింగ్‌లో చనిపోయిన జయరాం కిలో ఖుజుర్ గూడకు చెందినవాడు. అతడి అన్న నంద కిలో, తండ్రి రుహిణ కిలో: భూమి సమస్యపై చెప్పుకోటానికి పోయినాడని పొద్దుబోవటంతో అక్కడే ఉండిపోయాడని, పొద్దున్న ఎన్ కౌంటర్ పేర పోలీసులు ఒక రైతును పొట్టన బెట్టుకున్నారని వాపోయారు. అరెస్టు చేసి జైల్లో పెట్టక చంపటం ఎందుకు?వాడి దగ్గర ఆయుధాలేమీ లేవు కదా అంటున్నారు వాళ్ళు. ఈ వూరికే చెందిన పొదలాం సనబాసియా 18 ఏళ్ళ పిల్లవాడు. కొంలు 15 ఏళ్ళ వాడు. ఇద్దరూ మీటింగ్ కని వెళ్లారు. ఉదయం ఇంటికి రావలసిన వాళ్ళు ఫైరింగ్‌లో ప్రాణాలు కోల్పయారు. తలను మొండెం నుండి వేరుచేసేంత తీవ్రస్థాయిలో కొంలు మీద కాల్పులు జరిగాయి.

ఖుజుర్ గూడా నుండి పార్టీ వాళ్లకు ఆహర పదార్థాలు తీసుకు వెళ్లిన లైఖనో గోలారిని పట్టుకొని హెలికాప్టర్ ఎక్కించారు. లైఖనో కు 30 ఏళ్ళు. పెళ్లయింది. భార్య సోమ్లా గోలారి. ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతను ఏమైనాడో ఇప్పటికీ తెలియదు. ఒరిస్సా పోలీసులే పట్టుకున్నారని అంటున్నారు.

తమ ఊరివాళ్ళు చనిపోయారని తెలిసి శవాల కోసం మల్కన గిరి ఎస్పీ ఆఫీసు కు వెళ్తితే మావోయిస్టులతో సంబంధాలున్నాయి అంటూ బాగా సతాయించి కానీ ఇవ్వలేదని ఖుజుర్ గూడా యువకులు చెప్పుకొచ్చారు. శవాలకు గుండెల మీద గురి చూసి కాల్చిన బులెట్ గాయాలు ఉన్నాయని, కడుపు మీద, భుజాల మీద తీవ్రంగా కాల్పులు జరిపిన గుర్తులు ఉన్నాయని, కొంలు తల మొండెం నుండి వేరయి కనిపించిందని చెప్పారు. బాడీలను వూరికి షిఫ్ట్ చేయటానికి సహాయం అడిగితే మాకు సంబంధం లేదని పోలీసులు తప్పుకున్నా తీరును వాళ్ళు తప్పు పట్టారు. పోలీసు కు గాయమైతే హెలికాప్టర్ లో తరలించారు, వెంటనే 40 లక్షల పరిహారం ఇచ్చారు, మా ఆదివాసీలు ఈ దేశం మనుషులు కాదా?అని ప్రశ్నించారు. మమ్మల్ని కొండల్లో జంతువులుగా చూస్తున్నారు. గవర్నమెంటుకు మేం అక్కర లేని వాళ్ళం అని వేదన పడ్డారు. తమ వూరికి చెందిన జయరాం కిలో, సోనా బసియా, కొంలు శవాలతోపాటు సిమిలి పొదర్ గ్రామం నుండి చేలో పండిన కూరగాయలు తీసుకు వెళ్లి ఇస్తానని వెళ్ళి ఫైరింగ్ లో చనిపోయిన శామల పాంగి (16 ఏళ్ళు) శవాన్ని కూడా తీసుకు వచ్చామని 12 వేల డబ్బు ఖర్చు అయిందని చెప్పారు.

ముకుడ్ పల్లి గ్రామానికి చెందిన 22 ఏళ్ళ సిందె కిలో కూరగాయలు మోసిస్తానని వెళ్లి కాల్పులలో మరణించిందని ఆమె తల్లి దామి తండ్రి సోలి విలపిస్తూ చెప్పారు. కొద్రు గూడకు చెందిన కోమలి, దాకల పొదరు కు చెందిన కావేరి ముదిల, లచ్చి ముదిల, దక్కర్ పోదర్ కు చెందిన లచ్చు, పన్నుకూడా కాల్పులలో మరణించినట్లు తెలిసింది.

ఈ విధంగా బాధిత ఆదివాసీలను కలిసి మాట్లాడే క్రమంలో మాకు మరొక ఘటన గురించి తెలిసింది. 24వ తేదీ సింగోయ్ గ్రామానికి చెందిన యువకులు కొందరు ఆధార్ కార్డు కోసం మోటార్ సైకిళ్ళ మీద పోతున్నారు. పనస పుట్టు వూర్లో పోలీసులు పట్టుకున్నారు. కొట్టారు. రెండు మూడు బ్యాచ్ లు గా విడదీశారు. ఒక్కొక్కరిని విడివిడిగా ప్రశ్నించారు. తెలుగులో అడుగుతుంటే తెలుగు తమకు రాదని, వాళ్ళు అడిగేదేమీ తమకు తెలియటం లేదని చెప్పారు. మరొక ముగ్గురు బాదువా మేస్త్రీలను పట్టుకొని కొట్టారు. వాళ్లలో ఇద్దరికీ మరి ఎనిమిది మంది యువకులకు ఆలివ్ గ్రీన్ దుస్తులు వేసి జీడీ మామిడి తోటలో ఎన్ కౌంటర్ చేయటానికి తీసుకు వెళ్లారు. విషయం తెలిసి పనసపుట్టు ప్రజలు పెద్ద సంఖ్యలో వెళ్లి పోలీసులతో ఘర్షణ పడ్డారు. చంపితే మా అందరినీ చంపండి, లేకపోతే మా వాళ్ళను వదిలి పెట్టండి -అని పట్టు పట్టి వాళ్ళను విడిపించుకోగలిగారు.

ఈ మొత్త సమాచారం ఏమి చెప్తున్నది?

బలిమెల గుట్టకు 23వ తేదీన మావోయిస్టు ముఖ్య నాయకులు వస్తున్న సమాచారం పోలీసులకు వుంది. పక్కా సమాచారంతోనే మేము వెళ్ళాం అని పోలీసు వర్గాలు కూడా చెప్తున్నాయి.

స్థానికుల నుండే వాళ్లకు ఆ సమాచారం తెలిసి ఉండాలి. లేకపోతే అంత భారీ ఏర్పాట్లతో రావటం పోలీసుల కు సాధ్యం కాదు.

ఇది మావోయిస్టులు, పోలీసుబలగాలు ఎదురుపడ్డప్పుడు సహజంగా ఆత్మరక్షణ కోసం పరస్పరం జరుపుకునే ఎదురుకాల్పుల ఘటనకాదు. మావోయిస్టులను మట్టు పెట్టటానికి పెద్ద తలకాయలను కొట్టి ఆ తలలకు కట్టిన వెలను బహుమతిగా పొందే లక్ష్యంతో శిక్షణ ఇయ్యబడిన ఆంధ్ర గ్రేహౌండ్స్‌తో జరిపిన దాడి.

మావోయిస్టులు బలిమెల గుట్టల మీద సమావేశమైంది దైనందిన వ్యవహారాల నిమిత్తమేనని భూ సమస్య తదితర అంశాలమీద మాట్లాడటానికి స్థానికులు రావటాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. రాజకీయ విశ్వాసాలు కలిగి ఉండటానికి, వాటిని ప్రచారం చేసుకొనటానికి ఉన్న సహజమైన హక్కును వినియోగించుకొనే హక్కును మావోఇస్టులకే కాదు ఆదివాసీలకు కూడా నిరాకరిస్తున్నది ప్రభుత్వం. ఎన్ కౌంటర్ పేరు మీద జరిగిన ఈ దాడి దానినే నిరూపిస్తున్నది.

ఏకపక్ష కాల్పులు, గాయపడి పట్టు బడ్డవాళ్లను అరెస్టు చేయక కాల్చి చంపటం, ప్రాణాలు తీయటమే కాక శరీరాలను ఛిద్రం చేయటం, ఆడవాళ్ళను చంపి స్థనాలను కోసేయ్యటం, నాలుగు రోజుల పాటు వెతికి వెతికి పట్టుకొని మావోయిస్టులను చంపటం నిరాయుధులైన సాధారణ ఆదివాసీలను వాళ్ళ రాజకీయ విశ్వాసాల కారణంగా హెచ్చరికలు కూడా లేకుండా కాల్చి చంపటం, ఆదివాసీలలో భయోత్పాతాన్ని సృష్టించటానికి వారిపై ఎక్కడబడితే అక్కడ కాల్పులు జరపటం, మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని వేధించటం, హింసించటం ఇవన్నీప్రణాళికా బద్ధంగా జరిగిన అణచివేత వ్యూహంలో భాగమే. అపారమైన ఖనిజ సంపదల పై సహజ హక్కులున్న మూలవాసులను నిర్లక్ష్యం చేసి, మాయంచేసి బహుళజాతి సంస్థలకు ఆ సంపదలను కట్టబెట్టే కుట్రలో భాగమే.

భారత దేశ పౌరులే అయిన ఆదివాసీలనుసామాజిక అభివృద్ధికి ఉపాంతీకరిస్తున్న, శాంతియుతమైన, గౌరవకరమైన జీవితానికి పరాయీకరిస్తున్న ప్రభుత్వ పని విధానం ఈ సంఘటనలో నగ్నంగా బయటపడింది.

ఎన్ కౌంటర్లన్నీ పోలీసు హత్యలే అని ఈ ఘటన మరొకసారి నిరూపించింది. సమస్యమావోయిస్టులు ఆయుధాలు కలిగి ఉండటం కాదు. శాంతిభద్రతల సమస్య అసలే కాదు. చైతన్యవంత మవుతున్న ఆదివాసీల అవసరాలకు, హక్కులకు దన్నుగా మావోయిస్టులు నిలబడటమే. ఈ స్థితిని, సంబంధాన్ని నిర్మూలించటానికే ఎన్‌కౌంటర్ ధ్వంస రచన.

దీనిని ఖండించటం, న్యాయవిచారణకు డిమాండ్ చేయటం, బాధిత ఆదివాసీలు కోరుతున్నట్లు వారి పక్షాన నిలబడటం, వారి వేదనా స్వరాన్ని ప్రధానస్రవంతి సమాజంలో వినిపించటం బుద్ధిజీవుల బాధ్యత. కర్తవ్యం.

(3వ పేజీ తరువాయి)

మోది ప్రభుత్వం తీసుకున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయం అనాలోచితమైన అపరిపక్వ చర్య అని ఎకానమిస్ట్ పత్రిక రాసింది. ద్రవ్య నియంత్రణకు సంబంధించిన కీలక అస్త్రాన్ని ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా ప్రయోగించిందని కూడా ఆ పత్రిక అభిప్రాయపడింది. దేశంలో ఇప్పటికీ 95 శాతం లావాదేవీలు నగదు రూపంలోనే సాగుతున్నాయని, ఆన్‌లైన్ ద్వారా వాటిని నిర్వహించటానికి అవసరమైన మౌలిక వసతులు అభివృద్ధి చెందలేదని కూడా ఆ పత్రిక అభిప్రాయపడింది.

ఇదంతా యిట్లుండగా తోటివాడు తొడ కోసుకుంటే, తాను మెడ కోసుకుంటున్నట్లు చంద్రబాబు వ్యవహరిస్తున్నాడు. డిశంబరు చివరికల్లా నవ్యాంధ్రప్రదేశ్ నగదు రహిత రాష్ట్రాలలో మొదటిదిగా నిలవాలని ఆయన వెర్రికేకలు వేస్తున్నాడు. అందుకోసం 4జి స్మార్ట్ ఫోన్లు పది లక్షలు కొంటున్నాడు. దానికయ్యే ఖర్చు 500 కోట్ల రూపాయలట. రాయలసీమ సాగు నీటి అవసరాల కోసం, సిద్దేశ్వరం అలుగు నిర్మాణానికి 500 కోట్లు ఖర్చు పెట్టడానికి వెనుకాడుతున్న చంద్రబాబుకు బడా స్మార్ట్‌ఫోన్ కంపెనీలకు పెద్ద మొత్తంలో లాభాలు చేకూర్చడానికి ఎక్కడలేని హుషారు పుట్టుకొచ్చింది. ఈ ఫోన్లంటినీ డ్వాక్రా మహిళల కిస్తారట. వాటినుపయోగించటంలో వాళ్లకు నిరుద్యోగులైన విద్యావంతులు సహాయం చేయాలట. వాళ్లకు ఎంతో కొంత భత్యం కూడా చెల్లిస్తాడట. ఇంతా చేసి చివరికి ఒక లక్షమందికి ఉపాధి కల్పించానని ప్రకటించుకుంటాడు. ఈయన్ను చూసి కేంద్రం కూడా ఇలాంటి ఆర్భాటాన్నే ప్రకటించింది.

ప్రపంచంలో అమెరికాతో సహా ఏ ఒక్క దేశంలోనూ, నూటికి నూరు శాతం నగదు రహిత లావాదేవీలు లేదని అంకెలు తెలియజేస్తున్నాయి. అలాంటిది వెనుకబడిన ఈ దేశంలో నూరు శాతం నగదు రహిత లావాదేవీలను అమలు చేసి అవినీతి రహిత సమాజాన్ని రూపొందిస్తామని పాలకులు ప్రగల్భాలు పలుకుతున్నారు.

దీన్ని నమ్మదలుచుకున్నవాళ్ళు కొన్ని వాస్తవాల్ని పరిగణనలోనికి తీసుకోవాలి. మనదేశ జనాభాలో 68 శాతం ప్రజలు ఇప్పటికీ గ్రామాల్లో ఉంటున్నారు. దేశంలోని అనేక గ్రామాల్లో బ్యాంకులు కాదు గదా ఏ.టి.ఎం. యంత్రాలు కూడా లేవు. మన దేశంలో సగటున ప్రతి లక్ష మందికి 13 బ్యాంకులు, 18 ఏటిఎంలు ఉన్నాయి. వీటిల్లో కూడా అత్యధిక భాగం పట్టణాల్లో ఉన్నవే. మొత్తం ఏటిఎంలలో 18 శాతం మాత్రమే గ్రామాల్లో ఉన్నాయి. నగదు రహితలావాదేవీలు అత్యధికంగా ఉన్న బ్రెజిల్‌లో ప్రతి లక్ష మందికీ 47 బ్యాంకులు, 129 ఏటిఎంలు ఉన్నాయి. మన దేశంలో అత్యధిక గ్రామాలకు విద్యుత్ సరఫరా లేదు. ఒక వేళ ఉన్నా అది నిరంతర సరఫరా కాదు. దేశంలో ఇంటర్నెట్ విప్లవం వచ్చేసిందని ఎంత చెప్పుకుంటున్నా ఇప్పటికీ కేవలం 27 శాతం మంది మాత్రమే ఇంటర్నెట్ వాడకం దార్లున్నారు.

ఇంకో అంశం కూడా ఉంది. మన దేశ జనాభాలో దాదాపు 10 కోట్ల మంది ఆదివాసీలే! అట్లానే దాదాపు 17 కోట్ల మంది దళితులు, వీళ్ళు కాక పనుల కాలంలో పొట్ట కూటి కోసం కొన్ని కోట్ల మంది వలస పోతుంటారు. వీళ్ళందర్నీ నగదు రహిత లావాదేవీల పరిధిలోనికి తేవాలని ప్రయత్నించటం, ఈ పాస్ యంత్రాలతో రేషన్ సరఫరా చేస్తామనడం హాస్యాస్పదం, అవివేకం! వీళ్ళు గాక, రకరకాల పేర్లతో భూనిర్వాసితులైన మిగులు మనుష్యుల సంఖ్య కూడా తక్కువేమీ కాదు. పైగా ఆ స్మార్ట్ ఫోన్లలో సమాచారం అంతా ఆంగ్లంలోనే ఉంటుంది. ఏతావాతా దీనివల్ల జరగబోయేదేమిటంటే పునాది వర్గాల ప్రజలు, ఆర్థిక రంగం నుండి ఇప్పటికంటే మరింతగా అంచులకు నెట్టివేయబడడమే! మొత్తం మీద అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదార్లు కోరుకుంటున్న ఒక పాశవిక క్రీడ ప్రారంభమైందన్న మాట.

సోషలిజమే ప్రత్యామ్నాయం

సోవియెట్ రష్యాలో

మహిళా, శిశు సంరక్షణ

● బి. ఎస్. రాజు

> ప్రొటెక్షన్ ఆఫ్ వుమెన్ ఎండ్ చిల్డ్రన్ యిన్ సోవియెట్ రష్యా అనే పుస్తకాన్ని : ఏలిస్ విత్రో ఫీల్డ్ అనే రచయిత్రి రాశారు. దీని ముద్రణ: ఇ.పి.డట్టన్,1932. సోవియట్ యూనియన్‌లో మహిళా, శిశు సంక్షేమానికి అనుసరించిన విధానాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. నూరేళ్ల మహత్తర బోల్ష్విక్ విప్లవం సందర్భంగా..ఈ పుస్తకాన్ని పరిచయం చేసుకుందాం.. సం.

అక్టోబర్ విప్లవం తరవాత సోవియెట్ రష్యాపై పాశ్చాత్త్య దేశాలనుండి కుప్పల తెప్పలుగా రచనలు, విశ్లేషణలు, సాహిత్యం, సినిమాలు వచ్చాయి. వీటిలో నూటికి 95 శాతం అభూత కల్పనలు, అవాస్తవాలు, వక్రీకరణలు, దూషణలు మిగిలిన 5 శాతం క్షేత్ర స్థాయి వాస్తవ పరిశీలనలు, విశ్లేషణలు అని చెప్పవచ్చు. 1917-1953 కాలపు సోవియెట్ రష్యా సోషలిస్టు సమాజ నిర్మాణ క్రమంలో వివిధ రంగాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను, అనూహ్యమైన మార్పులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, యథార్థ చిత్రణలతో తటస్థ రచనలు చేసిన పాశ్చాత్త్య రచయితలు ఈ అయిదు శాతంలోనికి వస్తారు. అలాకాక, సోషలిస్టు భావజాలంతో ఆ యా దేశాల సోషలిస్టు, కమ్యూనిస్ట్ ఉద్యమాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, సాహిత్యకారులు ఎందరో ఉన్నారు, వారు ఈ తటస్థుల కోవలోనికి రారు. రచయిత్రి 'ఏలిస్ విత్రో ఫీల్డ్' రాసిన 'సోవియెట్ రష్యాలో మహిళా శిశు సంరక్షణ' అనే క్షేత్రస్థాయి పరిశీలనాత్మక రచన, ఈ ఐదు శాతం రచనల్లో కెల్లా విలక్షణమైనది, శాస్త్రీయమైనది. ఎన్నా లూయి స్ట్రాంగ్, ఏన్నా జె హేన్స్, సర్ ఆర్థర్ న్యూషోమ్ - జాన్ ఆడమ్స్ కింగ్స్బురీ ద్వయం, వెబ్ దంపతులు, జెరోమ్ డేవిస్, స్టువర్ట్ చేజ్ వంటివారు కూడా ఈ కోవకు చెందిన వారే.

అమెరికా రచయిత్రి 'ఏలిస్ విత్రో ఫీల్డ్' జీవిత కాలం 1909-1960. ఆమె రాసిన 'సోవియెట్ రష్యాలో మహిళా, శిశు సంరక్షణ' అనే పుస్తకం 1932లో ముద్రించ బడింది. ఆమె వృత్తి రీత్యా సెక్స్ రీసెర్చర్, క్రిమినాలజిస్ట్, సోషల్ సైంటిస్ట్. లైంగిక అత్యాచారాల కేసులపై ఆమె విస్తృతంగా పనిచేసింది. ఈ రచనకై ఆమె అవలంబించిన నిజాయితీ, శాస్త్రీయతా దృక్పథం గురించి ముందుగా మాట్లాడు కుని, ఆ తరువాత ఆమె రాసిన పుస్తక సమీక్షలోనికి వెడదాం. అమెరికాలో పుట్టి పెరిగిన చాలా మంది ఏకపక్ష (బయాస్డ్) దృక్పథంతో ఉండటం అక్కడి వ్యవస్థ ద్వారా సహ జంగా అలవడే ఒక లక్షణం. ఈ లక్షణాన్ని కళ్ళకు గంతలు కట్టిన జట్కా గుర్రంతో పోల్చవచ్చు. ఇక సోషలిజం, కమ్యూనిజం, సోవియెట్ రష్యా విషయాల కొస్తే ఈ జట్కా గుర్రాలకు చిందులూ, శివాలే కదా! అటువంటి సమాజం నుండి ఎదిగి వచ్చిన రచయిత్రి అక్టోబర్ విప్లవం, సోవియెట్ సోషలిస్టు నిర్మాణంపై అమెరికా ప్రచార-ప్రసార మాధ్యమాల రాతల్లో, ప్రకటనల్లో, రచనల్లో ఉన్న అసత్యాలను తన వ్యక్తిగత చైతన్యంతో గుర్తించ గల్గింది. సోవియెట్ యూనియన్ లో చోటుచేసు కుంటున్న పరిణామాలపట్ల ఉత్తేజితురాలై అక్కడ ఏదో మంచి జరుగుతోందని గ్రహించింది. సోవియెట్ యూనియన్లో మహిళ, శిశు సంరక్షణ పట్ల అద్భుతమైన ప్రయోగాలు, ఆచరణ జరుగు తున్నాయని చూచాయగా వింది. ఈ అంశం ఆమె మనసుకు నచ్చింది. దీనిపై దృష్టి కేంద్రీక రించి అధ్యయనం చెయ్యాలని, స్వయంగా సోవియెట్ రష్యా వెళ్లి అక్కడి వాస్తవాలను కళ్లారా చూసి, శాస్త్రీయ దృష్టితో అర్థం చేసుకుని, ఆ విషయాలను గ్రంథస్తం చేయాలనే నిర్ణయానికి వచ్చింది. 1929-31మధ్య కాలంలో సోవియెట్ రష్యా దర్శించి, ముఖ్యంగా మాస్కో నగరం, దాని చుట్టూ ఉన్న ప్రాంతాల్లో మహిళా, శిశు సంరక్షణలో సోవియెట్ తాత్త్వికత, బోల్షెవిక్ స్పిరిట్, ప్రణాళికాబద్ధ ఆచరణ, వాటి తీరుతెన్నులు లోతుగా అధ్యయనం చేసి గ్రంథస్తం చేసింది.

ఆమె తన పుస్తకానికి రాసిన ప్రవేశికలో ఇలా రాసుకుంది.. "సోవియెట్ రష్యా గురించి రాయాలన్నా, మాట్లాడాలన్నా, అఖరికి ఆలోచించాలన్నా కమ్యూనిస్టు పాలసీపై ఒక యాథాలాప ఉవాచతో మొదలుపెట్టడమనే అలవాటుకు గురైవడం తరచుగా జరుగుతూ ఉంటుంది. దీనికి కారణం బహుశా బోల్షెవిక్ ఆశయాల పట్ల సరైన అవగాహన లేకపోవడమే గాక సోవియెట్ రష్యాకున్న ప్రస్తుత చారిత్రిక స్థితిగతుల యెడల అసంపూర్ణ సమాచారం, ఆ స్థితిగతులు సోవియెట్ రాజ్య భావనా ఆదర్శానికి ఏమేరకు సారూప్యత కలిగి ఉన్నాయో అనే పరిశీలన కరువవ్వడం. దీన్నుండి బయటపడాలంటే ముందుగా కమ్యూనిజం పట్ల మనకున్న అవగాహనను మనం సానబెట్టుకోవాల్సి ఉంటుంది. సోవియెట్ రష్యాలో మాతా, శిశు సంరక్షణ గురించి నేను చేపట్టిన అధ్యయన క్రమంలో కమ్యూనిజం గురించి నాకు తెలిసిన జ్ఞానాన్ని తరచుగా సరిచేసుకోవాల్సిన అవస రాన్ని నేను గుర్తించాను. చాలా విషయాలు, సోవియెట్ సూత్రాలపై నాకున్న అభిప్రాయాలతో సరితూగడం లేదు. నన్ను నేను సరిదిద్దుకుని అక్కడి వ్యవస్థను పరిశీలించినపుడు వారు అవ లంబిస్తున్న పద్ధతులన్నీ సోవియెట్ రష్యాలోని ప్రస్తుత పరిస్థితులకు నిర్దుష్టంగా అతుకుతు న్నాయని చెప్పగలను. అన్నిటికన్నా మిన్నగా ఓ విషయం మనసులో పెట్టుకోవాలి. అదేమంటే, ఇప్పుడు రష్యాలో కమ్యూనిస్టులు చేస్తున్న పనులన్నీ వారు అంతిమంగా

చేరుకోవాలనే గమ్యానికి వేసే తొలి అడుగులు మాత్రమే! ఇవే వారు సాధించాలనుకున్న గమ్యాలు మట్టుకు కాదు. వారు ఏ ఆశయాలను సిద్ధించుకోవడానికి విప్లవ తిరుగుబాటు చేశారో, అవి నెరవేర్చుకోవడానికి ఇప్పటి పరిస్థితుల్లో సాధ్యమయ్యే మంచి పనులు, ఉన్నతమైన కార్యక్రమాలు చేస్తున్నారు. ఇది గమనించాల్సిన విషయం. వాళ్ళు కలలు గనే కమ్యూనిస్టు వ్యవస్థను సాకారం చేసుకోవాలంటే వాళ్ళు చాలా దూరం ప్రయాణించవల్సి ఉంది. ఇప్పుడు వారికి అందుబాటులో ఉన్న బడ్జెట్ ఎన్నో రెట్లు పెరగాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవస్థలో నివసించే అనేకానేక ప్రజల పూర్తి అభిమానం, సహకారం పెరగాల్సి ఉంది. అంతేగాక రష్యా చుట్టూ ఉన్న దేశాల స్నేహం మాట ఎట్లా ఉన్నా కనీసం వారి తటస్థ వైఖరన్నా సోవియెట్ రష్యాకు ఎంతో అవసరం. సోవియెట్స్ గురించి ఇక్కడ ఒకే ఒక్క విషయం నేను చెప్ప దల్చుకున్నాను. 'వారికి ఉన్నదానితోనే చాలా మంచి పనులు చేస్తున్నారు, ఇప్పటివరకు వారు సాధించిన సమాజ ప్రగతి అసాధారణమైనది, చాలా అభినంద నీయమైనది.' ఇటువంటి నిజాయి తీతో, వాస్తవిక దృక్పథంతో, విషయ సేకరణ చేసి రచయిత్రి గ్రంథస్థం చేసింది కాబట్టే, ఆమె రాసిన 'సోవియెట్ రష్యాలో మహిళా, శిశు సంరక్షణ' అనే పుస్తకం ప్రజావైద్య ఆరోగ్య రంగంలో సోషలిస్టు ఆలోచనలకు ప్రామాణికంగా నిలిచింది.

ఈ పుస్తకంలో మొత్తం 22 అధ్యాయాలు ఉన్నాయి. మొదటి అధ్యాయం- కమ్యూనిస్ట్ (స్టేట్) వ్యవస్థలో మహిళా, శిశు సంరక్షణ తాత్వికత గురించి చర్చిస్తుంది. మహిళా, శిశు సంరక్ష ణ పట్ల బోల్షెవిక్ల ఆలోచన, సోషలిస్టు వ్యవస్థకు, కమ్యూనిస్ట్ వ్యవస్థకు మహిళా, శిశు సంరక్షణ ఎలా కేంద్ర బిందువౌతుందో, ఈ అంశాన్ని వారు ఎన్ని కోణాల నుంచి, ఎంత లోతుగా ఆలోచించారో, మార్క్స్, లెనిన్ ఆలోచనలను ఉదహరిస్తూ ఈ అధ్యాయంలో ఆమె వివరించింది. అక్టోబర్ విప్లవం ముందు నుండీ కూడా కార్మిక సోవియెట్‌లలో ఈ విషయం పై ప్రస్తావన ఎలా ఉంటూ వచ్చిందో, అక్టోబర్ విప్లవం విజయవంతమైన తక్షణం, ఈ అంశంపై బోల్షెవిక్ మహిళా సదస్సు లు నిర్వహించి, క్షేత్ర స్థాయి కార్యక్రమాలకై వెంటనే 'మాత శిశు సంరక్షణ ఇన్‌స్టిట్యూట్' ఉండాలని ఎలా నిర్ణయించారో వివరిస్తుంది. ఇటువంటి ఒక సమావేశంలో రచయిత్రి పాల్గొని అందులో జరిగిన చర్చ, తీసుకున్న నిర్ణయాలను ఆమె చాలా శాస్త్రీయతతో వివరించింది. అలా సృష్టించబడదే ప్రపంచంలోనే మొదటి వ్యవస్థ "ద ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ మదర్ అండ్ చిల్డ్రన్', 'మాతా, శిశు సంరక్షణా సంస్థ'. ఈ సంస్థ సాధించిన అద్భుతాలను, ఏదైనా ఓ కార్యక్రమం తీసుకుంటే అప్పటి సోవియెట్ వ్యవస్థ ఎంత నిబద్ధంగా, శాస్త్రీయంగా, ప్రజారంజకంగా పనిచేసేదో ఆమె ఈ అధ్యాయంలో వివరించింది.

రెండవ అధ్యాయంలో - మహిళా శిశు సంరక్షణ పట్ల కమ్యూనిస్ట్ సైద్ధాంతిక ఆచరణాత్మక భావ నల ప్రాముఖ్యత గురించి రచయిత్రి చర్చిస్తుంది. సోవియెట్ యూనియన్లో మహిళల హక్కుల పట్ల న్యాయపరమైన దశలను మూడవ అధ్యాయం వివరిస్తుంది. కుటుంబ నియంత్రణ, గర్భ నిరోధకం అంశాలపై అప్పటి సోవియెట్ రష్యాలో పాటించిన విధివిధానాలను 4వ అధ్యాయం తెలియచేస్తుంది. 5వ అధ్యాయం కమ్యూనిస్ట్ ప్రభుత్వం, మహిళల, పిల్లల మధ్య అనుబంధ సంబంధాలను తెలియచేస్తుంది. 6వ అధ్యాయం ఊయల కేంద్రాలు, శిశువిహార, మందిరాల గురించి, వాటి సామాజిక ప్రాముఖ్యత గురించి, తాత్వికత గురించి, సోవియెట్ నూతన మానవ నిర్మాణంలో అవి పోషించే పాత్ర గురించి ఉంటుంది. బహుశా ప్రపంచంలో ఎక్కడా కూడా ఈ 'క్రెష్' వ్యవస్థను అంత అమోఘంగా, శ్రామిక ప్రజారంజకంగా నిర్వహించిన సమాజం, నాటి సోవియెట్ సమాజమొక్కటే అని ఘంటాపదంగా చెప్పవచ్చు. అటువంటి అద్భుత వ్యవస్థ చేజారిపోవడం ఒక మానవ విషాదం.

ఏడు, ఎనిమిది, పదవ అధ్యాయాల్లో ఈ ఉయ్యాలకేంద్రాల, శిశు మందిరాలపై ఎంతో విలువైన సమాచారాన్ని రచయిత్రి సేకరించి పాఠకులకు అందించింది. ఇది వెలకట్టలేని సమాచారం. 9వ అధ్యాయం తల్లుల సంరక్షణ పట్ల సోవియెట్ వ్యవస్థ తీసుకుంటున్న చర్యల వివరాలను తెలియచేస్తుంది.

ఇంకా ఇళ్లు ఐనవారు లేని అభాగ్య మహిళలకై హాస్టల్ వసతి, తల్లీ -పిల్లల హాస్టళ్లు, 'వేశ్యల వైద్యం-సంర క్షణ-వసతి గృహాలు-పని కేంద్రాలు', సమాజంలో వివిధ సమస్యలను ఎదుర్కుం టున్న మహిళల పట్ల సోవియెట్ ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమ వివరాలు 14, 15,16, అధ్యాయాల్లో చాలా సమాచారం ఈ పుస్తకంలో ఉంది.

పిల్లలకు ప్రత్యేక పాల ఆహార కేంద్రాల వివరాలు, ఉయ్యాల కేంద్రాలలో పాటించే ఆహార నియమాలు (డైట్), ఊయల కేంద్రాల రోజువారీ దినచర్య: వీటి సోదాహర వివరణ, గణాంకాలు, పట్టికలతో సహా ఒక్కో అధ్యాయంలో రచయిత్రి ఇచ్చింది. ఇదంతా చదివి, ఇవాళ మనం నివ సిస్తున్న సమాజంతో పోల్చుకుంటే, ఇది కలా, నిజమా లేక అభూత కల్పనా అని అనిపిస్తుంది. నాకైతే అలానే అనిపించింది. ఈ ఉయ్యాల, శిశు విహార కేంద్రాల్లో పిల్లలకు అందించిన పోషకాహారం, అలనాటి సోవియెట్ సమాజ ఆర్థిక స్థితిగతుల్లో సమకూర్చడమంటే కేవలం నిజమైన శ్రామిక వర్గ వ్యవస్థ నిర్మాణానికి కట్టుబడి ఉన్న బోల్షెవిక్ కమ్యూనిస్టులకే అది సాధ్య పడుతుంది తప్ప, వేరే దోపిడీ పీడనలపై ఆధారపడ్డ సమాజాలకు ఏమాత్రం సాధ్యంకాదు, అసలు అలా సాధ్యపర్చాలనే స్పృహతోనే ఆ వ్యవస్థలు ఉండవు అనేది నిర్వివాదం.

అప్పటి సోవియెట్ వ్యవస్థలో, గర్భిణీ స్త్రీలకు ప్రసవానికి ముందు, ప్రసవానంతరం సమకూరిన వైద్య, ఆరోగ్య సౌకర్యాలు; మహిళలకు సంబంధించిన ప్రత్యేక చట్టాలు, సోవియెట్ మహిళా శిశు సంరక్షణా వ్యవస్థను మాస్కో నగర మహిళలు ఎలా అర్థం చేసుకుంటున్నారు? అనే అంశాలపై కూడా రెండు అధ్యాయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

గొప్ప విషయమేమంటే, మహిళలకు, ఎదిగే పిల్లలకు విషయాలు సులభంగా అర్థమయ్యే రీతిలో గోడ పట్టికలు, బొమ్మలు, చిత్రాలు ప్రతిచోటా ప్రదర్శించడం. ఇదొక కళగా, విద్యగరిపే సైన్స్ గా మలచుకోవడం సోవియెట్ తాత్వికతకు చిహ్నమని రచయిత్రి చెబుతుంది. కేవలం చెప్పటంతో సరిపెట్టక ఆమె ఎన్నో ఉపయోగకరమైన పట్టికలను ఈ పుస్తకంలో పొందుపర్చింది.

మహిళలకు, పిల్లలకు ఇంత మహోన్నత ఆశయాలతో ఖర్చులేని వైద్యాన్ని, సంరక్షణను ఒన కూర్చిన సోవియెట్ రష్యా సమాజం వంటి సమాజం ఇంకొకటి లేదనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఈ పుస్తకం చదివిన వారెవరైనా ఈ ముగింపుకే వస్తారని నా భావన. మన మహోన్నత దేశంలో ఇప్పటి 5 నక్షత్రాల కార్పొరేట్ హాస్పిటల్స్, ప్రభుత్వ వైద్యాలయాలు ఈ అద్భుత 'సోవియెట్ మాతా శిశు సంరక్షణా వ్యవస్థ' ముందు సిగ్గుతో తలదించు కోవలసిందే!

ఆల్ప్స్ పర్వత శ్రేణుల్లో ప్రేమగీతం

పశ్చిమ యూరోప్‌లోని ఆల్ప్స్ పర్వత శ్రేణుల్లో ఉదయించిన సాహసోపేత ఉద్విగ్న ప్రేమగీతమే 'ఆకాశపు అంచుల్లో' అనే నవల ఇతివృత్తం. అయితే ఆ ప్రేమగీతాలాపన వెనుక పనిచేసినవి మాత్రం సాధారణ మానవుల భావోద్వేగాలు కావు. అవేమిటో, ఎంతటి ఉద్విగ్నభరిత పరిస్థితుల్లో ఎటువంటి భావాల కలయికలో సాధ్యమయ్యిందో తలచుకుంటే ఆ ప్రేమ ఎంతటి విచక్షణాయుతమైందో అర్థం అవుతుంది. పూర్తి యుద్ధ కాలంలోని ఉన్నత మానవుల మధ్య చిగురించిన ప్రేమ ఇది. విప్లవం వల్లనే సాధ్యమయ్యే ప్రేమ ఇది.

● బాసిత్

రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి పరిస్థితుల్లో, ఫాసిజం పట్ల ప్రపంచ వ్యాప్తంగా నిరసన వెల్లువెత్తుతున్న కాలంలో రష్యాలోని సహకార వ్యవసాయక్షేత్రాల వల్ల కలిగిన విముక్తి, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం భావనల పట్ల అచంచల గౌరవం ఏర్పడిన ఓ ఇటాలియన్ అమ్మాయి, ఓ సోవియట్ సైనికుడు జర్మన్ నాజీల నిర్బంధ శిబిరం నుండి తప్పించుకుపోయే క్రమంలో పరిచయం అవుతారు. అట్లా అనుకోని పరిస్థితులలో కలుసుకున్న వాళ్ళు ఫాసిజం పట్ల ద్వేషం, స్వేచ్ఛాప్రియత్వం, యుద్ధ వ్యతిరేకత, విప్లవం పట్ల అచంచల విశ్వాసం వల్ల ఒక్కటవుతారు.

ఈ ప్రేమోద్విగ్న సాహస గాథను నవలగా మలిచిన రష్యన్ రచయిత 'వసీల్‌బికోవ్' సోవియెట్ ప్రభుత్వ సాహిత్య పురస్కార గ్రహీత. నిడమర్తి ఉమా రాజేశ్వరరావు అనువదించిన ఈ నవలను తెలుగులో 'రాదుగ ప్రచురణాలయం' 'ఆకాశపు అంచుల్లో' పేరుతో 1983లో ముద్రించింది.

నాజీల నిర్బంధ శిబిరం నుండి ఓ యుద్ధఖైదీ తప్పించుకున్నాడు. అతని పేరు ఇవాన్ తెరిష్కా. తన సహచర యుద్ధ ఖైదీలు నిర్బంధ శిబిరంగా వ్యవహరించబడే కార్ఖానాలోంచి బయట పడే మార్గం గురించి ప్రయత్నాలు చేస్తారు. ఆ ప్రయత్నంలో వాళ్లకు అమెరికా బి-29 విమానం నుంచో, బ్రిటిష్ మస్కిటో విమానం నుంచో జారిపడిన పేలని బాంబు ఒకటి దొరుకుతుంది.

మృత్యుశిబిరం వంటి నిర్బంధ శిబిరంలో పడి ఉండడం కంటే అందులోంచి బయటపడాలనుకుంటున్న సమయంలో ఫ్యూజు పనికిరాకపోయినా ఇంకా వెయ్యి పౌనుల టి.ఎన్.టీ.ల శక్తి ఉన్న బాంబు అనుకోకుండా దొరికింది. దాన్నెలాగైనా ఉపయోగించుకొని బయటపడాలను కుంటారు. మితభాషి అయిన ఇవాన్ మాట్లాడాల్సిన అవసరం లేకుండానే అంతా స్పష్టంగా ఉన్నప్పుడు మాట్లాడవలసిన అవసరం ఎందుకనుకుంటాడు. అయితే తన అవసరం ఉన్నప్పుడు తప్పనిసరిగా తన పాత్రను పోషిస్తాడు. మొత్తం మీద వాళ్లలో ఎవరో ఒకరి ప్రాణాల్ని పణంగా పెట్టి సమ్మెటతో బాంబును మోది తద్వారా సృష్టించిన అలజడిలో మిగిలినవారు తప్పించుకుపోవాలనే నిర్ణయం తీసుకుంటారు. బాంబును సమ్మెటతో మోదాల్సిన వ్యక్తిని వారు లాటరీ ద్వారా నిర్ణయించుకుంటారు. కాని అలా అనుకున్న వ్యక్తి స్రేబ్నికోవ్ క్షయవ్యాధితో బలహీనంగా ఉంటాడు. అతని వల్ల తాము అనుకున్న విధంగా బాంబును బలంగా మోదడం జరుగదని గ్రహించిన ఇవాన్, తనకూ ప్రాణం మీద తీపి ఉన్నప్పటికీ, మృత్యు ముఖంలోకి తానొక్కడు వెళ్లడం ద్వారా తన సహచరులైన గొలోదాయ్, బీటిల్, యానుష్కా, స్రేబ్నికోవ్‌లను నిర్బంధం నుంచి తప్పించడానికి వీలవుతుందని అందుకు ఉద్యుక్తుడవుతాడు. అట్లాగే వాళ్లను దూరంగా పొజిషన్స్ తీసుకొని పారిపోవడానికి సిద్ధంగా ఉండాలని చెప్తాడు. అయితే ఈ ప్రయత్నంలో నిర్బంధ శిబిర జర్మన్ సూపర్వైజరు జాండ్లర్ దృష్టిలో పడతాడు. అతన్ని నమ్మించి, అతనిపై విరుచుకుపడి, ఆ తర్వాత సమ్మెటతో బాంబును మోది పేల్చేస్తాడు. ఆ పేల్చివేతలో తాను మృత్యు ముఖం నుండి బయటపడతాడు. తన జర్మన్ శత్రువు జాండ్లర్ మూలుగుతూ కనిపించాడు. ఇదే అదనుగా జాండ్లర్ చేతిలోని ఆయుధాన్ని లాక్కొన్ని సుడి తిరుగుతున్న పొగ, ధూళి మేఘంలోంచి దూకేస్తూ నిర్బంధ శిబిరం నుండి ఇవాన్ పారిపోతాడు. తన సహచరులు ఏమైందీ తెలియదు. వాళ్లు కూడా తలా ఓ వైపు పారిపోయి ఉంటారని ఇవాన్ భావిస్తాడు.

ఇట్లా పలాయనం చిత్తగించడం ఇవాన్‌కు కొత్తకాదు. పోయినసారి సైలీషియా నుంచి స్వదేశానికి పారిపోయినప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నమైంది. అప్పుడు ప్రకాశవంతమైన ఆకాశంలోని నక్షత్రాలు తన స్వదేశానికి దారి చూపించాయి. తినడానికి తోటల్లోని కూరగాయలు, తాగడానికి పాలు ఏదో ఒకటి లభించేది.

ఈసారి అట్లా కాదు. అపరిచితమూ, నిగూఢమూ అయిన ఆస్ట్రియన్ ఆల్ప్స్ పర్వతాలు, బొత్తిగా అజ్ఞాత ప్రాంతం. అయితే అతనిలోని స్వేచ్ఛా పిపాస, గెరిల్లా కేంద్రానికి చేరాలనే ఉత్సుకత అతన్ని ఆశావహంగా గమ్యం వైపు నడిపిస్తున్నాయి.

అడవి అంచులోనే జర్మన్ సైనికులు వదిలిన జాగిలం ఇవాన్ తెరిష్కాను

వెంబడిస్తుంది. జాండ్లర్ నుంచి లాక్కొచ్చిన పిస్తోలులో ఎన్ని తూటాలు ఉన్నాయో తెలియదు. ఒకసారి పేలిస్తే గురి తప్పింది. పిస్తోలుని పరిశీలిస్తుండగానే కుక్క మీదికి వచ్చింది. గుర్రమని ఆ తోడేలు జాతి కుక్క అతని మందపాటి లాగును చీరింది. చీరిన చోట మోకాలిపైన ఇవాన్‌కు గాయమైంది. అయితే ఇవాన్ దాని మెడపట్టీని మెలిపెట్టి, దాని ప్రక్క టెముకలు విరిగేలా తన్ని, అది మూలుగుతూ ఉంటే అక్కణ్నుంచి కదిలాడు.

కాని అతనికి మరో పిచ్చివాడి బెడద వెంటాడుతుంది. అతను ఒక జర్మన్ ఖైదీ. అతని వల్ల తక్షణ ప్రమాదమేమీ లేకపోయినా, రష్యన్ ఖైదీల మాదిరిగా జర్మన్ అధికారుల పట్ల కఠిన వైఖరి ఉండే అవకాశం లేదు. అతను ఏ దశలో అయినా తమ అచూకి జర్మన్ అధికారులకు చెప్పి తమ మీదికి కుక్కలను ఉసిగొల్పవచ్చు.

తాను చేరాలనుకున్న గెరిల్లా శిబిరం (ట్రియెస్టీ) అది ఇటాలియన్ దైనా, యుగోస్లావుదైనా ఏమంత దగ్గర్లో లేదు. లోయలు, సాంద్రమైన పట్టణ జనాభా, రద్దీ అయిన మోటారు రోడ్లు, మొత్తం ఆల్పు పర్వతాల గుండా చాలా దూరమే వెళ్లాలి. నిర్బంధ శిబిరంలో నల్ల ఉరితాళ్లను వేల్లాడడం కన్నా ఇలా ఎన్ని కష్టాలకోర్చైనా గమ్యం చేరుకోవాలనే పట్టుదల ఏర్పడింది. 'గమ్యం చేరుకోవడమే ముఖ్యం' అని నిర్ధారించుకున్నాడు.

అయితే ఇప్పుడున్న స్థితిలో తాను గమ్యాన్ని చేరుకోవడం కష్టం. తిండి లేదు. చలిని తట్టుకోవటానికి కోటూ, బూట్లు లేవు. నిర్బంధ శిబిరంలో ఉన్నప్పటి కొయ్య స్లిప్పర్లు తప్పించుకునే క్రమంలో ఎక్కడో జారిపోయాయి. ఎలాగైనా తిండిని, మిగతా వాటిని సాధించాలి. ఎట్లా అని ఆలోచిస్తున్న క్రమంలో అతనికి గుట్ట క్రిందుగా రోడ్డు మీద వెళ్తున్న ఆస్ట్రియన్ వృద్ధుడు కనిపిస్తాడు. అతన్నుంచి ఏదైనా, వీలైనంత సాధించాలని అనుకున్నాడు. అతని పైకి దూకి హఠాత్తుగా బ్రెడ్డు, కోటు లాక్కున్నాడు. అతనొక ఫారెస్టర్. అతని పట్ల తాను చూపిన కృతఘ్నతకు ఇవాన్ బాధ పడతాడు. అక్కడకి దగ్గర్లో అతని ఇల్లు ఉందని చెప్తాడు. సుదీర్ఘ గమ్యం చేరుకోవడానికి ఇలాంటి 'తప్పు' చేయక తప్పదని చెప్పుకున్నా, అతని మనస్సులో అపరాధ భావం వెంటాడుతుంది.

అప్పటికే జర్మన్ సూపర్వైజరు జాండ్లర్‌తో పోరాడి నిర్బంధ శిబిరం నుంచి తప్పించుకు వచ్చే క్రమాన్ని మహిళా బారక్ నుంచి గమనించిన 'ఇటాలియన్ రాజకీయ ఖైదీ' ఇవాన్ను వెంబడిస్తూ అక్కడికి చేరవస్తుంది. ఆ అమ్మాయి, 'తాను కూడ నాజీలను ద్వేషిస్తుందని చెప్తుంది. తాను మానసికంగా కమ్యూనిస్టుననే చెప్తుంది. ఆ అమ్మాయి తన పేరు 'సినోరీనా జూలియా' అని చెప్తుంది. అతన్ని, ఆమె తన ఇటాలియన్ యాసతో 'ఈవన్' అని దీర్ఘం తీస్తు పిలుస్తుంది. ఆమెకు తన పేరు ఎట్లా తెలుసో, అతను అడుగుతాడు. తాను ఊహించానని, ఎందుకంటే రష్యాలో ఎక్కువ మంది పేర్లు ఇవాన్ (ఈవన్)తోనే మొదలవుతాయని తనకు తెలుసని చెప్తుంది. ఇవాన్‌కు ఇవన్నీ పట్టవు. ఇటలీలాంటి బూర్జువా దేశానికి చెందిన అమ్మాయి కమ్యూనిస్టు అయ్యే అవకాశం లేదని, తనను తాను కమ్యూనిస్టుననుకునే ప్రతి ఒక్కరినీ కమ్యూనిస్టుగా జమ వేస్తే ఎంత మంది కమ్యూనిస్టులవుతారోనని కొట్టి పారేస్తాడు. అవన్నీ బూర్జువా అమ్మాయి పోసుకోలు కబుర్లని ఇవాన్ వాటన్నింటిని తీసి పారేస్తాడు. గమ్యం వైపు సాగుతూ ఉంటాడు.

కాని వాళ్ల మధ్య సంభాషణ కొనసాగక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. ఆ అమ్మాయి తనను తాను 'కమ్యూనిస్టునని' చెప్పుకోవటం ఇవాన్ మనస్సు అంగీకరించడం లేదు. దాంతో అతను ఉండబట్టలేక 'ఇలా మేం ఎవర్ని బడితె వారిని 'కమ్యూనిస్టులు' అనం' అనే అర్థంలో 'పార్టీ కార్డులు ఉన్నవాళ్లనే మేం 'కమ్యూనిస్టులని అంటాం' అని తేల్చి చెప్తాడు. 'అబ్బో మీ రూస్‌లాండ్ (రష్యా) వేరే... విముక్తి, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం... పూర్తిగా భిన్నమేలే' అంటూ ఆ అమ్మాయి తన విషయ పరిజ్ఞానాన్ని వెళ్లగక్కుతుంది. అమ్మాయితో సంభాషణ వ్యక్తిగత విషయాల్లోకి వెళ్తుంది. తాను పెద్ద అడవులు, నదులు, సరస్సులతో కూడిన విశాలమైన బైలో రష్యా రిపబ్లిక్‌కు చెందిన వాడినని, తన స్వంత గ్రామం తెరెష్కీ రెండు నీలి సరస్సుల నడుమ ఎంతో అందమైనదనీ, నాన్న చనిపోయాక, అమ్మకు తోడుగా కుటుంబ పోషణలో బరువు, బాధ్యతలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అతడు అసంకల్పితంగానే చాలా విషయాలు చెప్తాడు.

వాళ్ల సంక్లిష్ట ప్రయాణంలో పర్వత శిఖరాలు, చరియలు, బీళ్లు, లోయలు దాటుతూ ఉంటారు. నీలాకాశం కింద, బూడిద వన్నె మేఘాల ముసుగు కింద కప్పబడిన పర్వతాల మీద వాళ్లు ఎన్నో అడుగులు కలిసి నడుస్తారు. సమయం గడుస్తున్న కొద్దీ భారమవుతున్న ప్రయాణాన్ని తేలిక చేయడానికి "మనం త్వరలోనే గమ్యాన్ని చేరుకొని గెరిల్లా దళంలో కలుస్తాం" అంటూ ఆ అమ్మాయికి ధైర్యాన్ని నూరిపోస్తుంటాడు. వాళ్ల మధ్య విశ్వాసం ప్రోది చేసుకొంది.

అయితే గమ్యం సాగుతూనే ఉంది. ఆ అమ్మాయి అంతా అయిపోయింది. తానిక ముందుకు సాగలేనని ఉండలా చుట్టుకొని చల్లని బండరాళ్లపైన కదలకుండా ఉండిపోతుంది. ఆమెను నడిపించడానికి చేసిన ప్రయత్నాలన్ని వమ్ము కావడంతో ఇవాన్ ఆమెను వదిలి ముందుకు కొద్దిగా సాగుతాడు. కాని మనస్సు ఎక్కడో గింజుకుంటుంది. దాంతో అతను వెనక్కి వచ్చి ఆమెను అనివార్యంగా భుజాల పైకి ఎక్కించుకుంటాడు. ఆమె కోపంగానో, ప్రేమగానో అతన్ని బాదుతుంది. కొడుతుంది. ఉన్నట్టుండి పెనుగులాట మానేసి అతని మెడ చుట్టూ చేతులు వేసి 'ఒక కన్నీటి బిందువును అతని మెడ మీద కార్చింది'. బహుశా ఆ కన్నీటి బిందువు అతని గుండెలోకి ఇంకింది! 'ఏమైతే అది అవుతుందిలే' అనుకుంటూ పర్వత చరియల్లోకి గమ్యం వైపు నిబ్బరంగా సాగుతాడు.

గాలి ముఖాలకు ఛెళ్లున తగులుతూ ఉంటే, కారు చీకట్లో సుడులు తిరిగే మంచు కురుస్తున్న రాత్రి భుజంపై అమ్మాయిని మోస్తూ కొంచెం సుఖంగా, కొంచెం కష్టంగా దారిలో కొంచెం విశ్రమిస్తూ గెరిల్లా ప్రేమనూ, బాధ్యతనూ, స్నేహాన్ని పంచుతూ, ఆకాశం అంచుల్లో కమ్యూనిస్టు యోధుడు గమ్యమే గమనంగా ముందుకు సాగుతాడు.

అలిసిన యోధుడు ఒత్తైన మెత్తటి గడ్డి తగిలిన చోట విశ్రమిస్తాడు. జూలియా కూడా నిద్రలోనే ఒత్తిగిల్లుతుంది. ఉజ్వల సూర్యకాంతి మీద పడడంతో నిద్రలేచిన ఇవాన్ పక్కన జూలియా కనిపించకపోవడంతో ఆసక్తిగా అంతటా కలియజూస్తాడు. ఓ జలపాతం కింద ఆమె స్నానం చేస్తూ కనిపిస్తుంది. సిగ్గుతో కూడిన సంతోష భావాలను అధిగమించలేక ఇవాన్ గడ్డి మీద వెల్లకిలా దొర్లాడు. తుమ్మెద రెక్కల్లాంటి ఆమె జుట్టు ఎండలో మెరుస్తుండగా

బాలస్నిగ్ధమైన నవ్వుతో ఆమె అతని దగ్గరికి వస్తుంది. అతని ఒంటరి తుంటరి తప్పును క్షమిస్తుంది. అతని చేతుల్లోంచి పాపి మొక్కల గుచ్ఛాన్ని స్వీకరిస్తుంది.

జూలియా తండ్రి ఆమెకు నచ్చని వ్యక్తికి (సినోయార్ జంగరీకి) ఇచ్చి పెళ్లి చేయాలనుకున్నాడు. ఆమె నెపోలీలో యుద్ధంలో పాల్గొన్న మారియోను ఇష్టపడింది. అతను జర్మన్ల చేత చంపబడ్డాడు. ఆమె మారియా దగ్గరికి వెళ్లినపుడు జరుగుతున్న జర్మన్ వ్యతిరేక పోరాటంలో పాల్గొంది. జూలియా, జర్మన్ వ్యతిరేక పోరాటంలో పాల్గొనడం ఇవాన్‌కు సంతోషాన్ని కలుగజేస్తుంది. కొద్ది సేపటి మౌనం తర్వాత జూలియ ఇటాలియన్ ప్రేమగీతాన్ని పాడ్తుంది. చాలా ప్రయాసపడి రష్యన్ యుద్ధ గీతం 'కత్యూషా'ను కూడా పాడి రష్యా మీద తనకు గల గౌరవాన్ని, ప్రేమను వ్యక్తం చేస్తుంది. అయితే ఆమె రష్యన్ మాటల్ని గుర్తించదానికి వీల్లేని విధంగా విరుస్తూండడంతో ఇవాన్ ఆమెకు సవ్యంగా, అర్థవంతంగా పలికిస్తూ ఆ యుద్ధ గీతాన్ని, పాడడం నేర్పిస్తాడు. తిండి మీదికి ధ్యాస మళ్లింది. ఆస్ట్రియన్ ఫారెస్టర్ నుండి లాక్కున్న 'బ్రెడ్' కొంచెమే మిగిలింది. ఎంత కమ్యూనిస్టు క్రమశిక్షణతో రేషన్ పాటించినా బ్రెడ్ బాగా తగ్గిపోయింది. చుట్టూ వాళ్లకు స్ట్రాబెర్రీ పళ్లు కనిపించాయి. వాళ్లు వాటిని కడుపార తిన్నారు.

సంభాషణ మళ్లీ ఆకలి పైకి మళ్లింది. 1933లో రష్యాలో పంటలు దెబ్బతిని గడ్డి తినవలసిన పరిస్థితి వచ్చిందని, అతని తండ్రి ఆకలితోనే మరణించాడని అతడు చెప్తాడు.

కాని ఆమె రష్యాలో 'ఆకలి' ఉండడాన్ని అంగీకరించలేకపోయింది. రష్యాలో విప్లవం విజయవంతం అయ్యాక సహకార వ్యవసాయ క్షేత్రాలు (కొల్ఖోజ్‌లు) ఏర్పడ్డాక 'ఆకలి' ఉండే అవకాశం లేదని, ఇవాన్ అబద్ధం చెపుతున్నాడని, 1942లో జర్మన్లకు లొంగిపోయిన వాసోవ్ మనిషి ఒకడు తనతో నిర్బంధ శిబిరంలో కొల్ఖోజ్‌లతో ఆకలి ఉందని వాదించాడని, అది తప్పని తనకున్న పరిజ్ఞానంతో వాదిస్తుంది. ఇవాన్ కూడా 'వాసోవ్' లాంటి వాడేనని నిష్ఠూరమాడింది.

ఏం జరిగిందో ఇవాన్ చెప్పబోయినా, ఆమె అంగీకరించదు. స్వేచ్ఛను, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని ప్రతిపాదించే 'కొల్ఖోజ్'ల నిలయమైన రష్యాలో 'ఆకలి' అనే మాటను ఆమె అంగీకరించకపోవడం సహజమే. ఎందుకంటే, ఇటలీ బూర్జువా దేశమైనప్పటికీ అక్కడ, రష్యా గురించి అపురూపంగా చెప్పుకోవడం ఆమె విన్నది కనుక. అట్లాగే ఫాసిస్టు జర్మన్‌లను ఎదిరించి ఇటలీని, ఫ్రాన్స్‌ని, గ్రీసుని రష్యా కాపాడిన విషయం ఆమె చదివింది. అందుకే రష్యా అంటే గౌరవం. అయితే సహకార వ్యవసాయ క్షేత్రాల నిర్వహణలోని కొన్ని అంతర్గత వివరాలు ఆమెకు తెలియవు.

బూర్జువాలకు దన్నుగా ఉండేవాళ్లు రష్యాలోనూ అప్పట్లోనే ఉన్నారు. సహకార వ్యవసాయ క్షేత్రాలలో అలాంటివాళ్లు కొన్ని సమస్యలను సృష్టించారు. అలాంటి వాళ్లలో కొందరిని సైబీరియా పంపించారు. కాని కొందరు ఎలాగో ఉండిపోయారు. 1937లో 'అనతోలి ఎవ్‌గేనిచ్' అనే నిజాయితీపరుడైన టీచర్ కొల్ఖోజ్‌లలో జరుగుతున్న అవకతవకలను గురించి 'కల్ఖోజ్' అధ్యక్షుడితో వాదించాడు. కాని గిట్టనివారు ఆయనపై 'పితూరి' చెప్పడంతో ఆయనకు పదేళ్ల శిక్ష పడింది. కాని గ్రామస్తులందరు టీచర్ 'అనతోలి ఎవ్‌గినిచ్'ను బలపరిచారని ఇవాన్ ఆమెకు ఏర్పడ్డ అసంతృప్తిని తొలగించాడు.

రష్యన్లందరు మంచివాళ్లని తాను రష్యాని ప్రేమిస్తానని వ్లాసోవ్ మనిషొకడు 'కల్ఖోజ్' చెడ్డదనడన్నా తాను తట్టుకోలేకపోయానని జూలియా చెప్తుంది. రష్యన్ సైనికుడైన ఇవాన్ వీరుడని, అతను అసాధారణ రష్యన్ వ్యక్తి అని, (అనామలీయ ఫినామెనాలె) అని తాను 'రష్యన్ను' ప్రేమిస్తుందని ప్రకటిస్తుంది. తాను సాదా సైనికుణ్ణని చెపుతూనే ఇవాన్ ఉద్విగ్నుడయ్యాడు.

మేఘరహిత, అంచులు కోల్పోయిన ఆకాశం పల్లెం కింద వాళ్లు ఒక్కటయ్యారు. పాపి పూల మొక్కల నుండి విరజిమ్మే మత్తెక్కించే పరిమళాల నడుమ తప్పనిసరైన, అప్పటికి అజ్ఞాతమైనదేదో ఆ పారవశ్యంలో వాళ్లకు అనుభూతమయ్యింది. తేరుకొనే సరికి ఆకాశం గిర్రున తిరిగింది. 'భూమాత అతనికి పురాతన అమృతాన్ని కుడిపింది.' ఆమె అతనికి యజమానురాలైంది. భూగర్భపు లోతులు, పర్వతాలు, భూవాహినులన్నీ నిశ్శబ్దమైపోయి, జీవితపు మహత్తర రహస్యానికి తమ అంగీకారాన్ని తెలిపాయి.

అయితే అతను అదంతా స్వప్నం అనుకున్నాడు. కాని అది అత్యంత సంతోషకరమైన స్వప్నం కంటే కూడా సంతోషకరమైనదిగా తేలింది.

పాపి మొక్కల నడుమ ఏకమైన మనుషులు చాలా ఉబుసుపోక కబుర్లు చెప్పుకున్నారు గమ్యం వైపు సాగుతూనే.

బైలో రష్యాలోని అందమైన తెరిష్కా గ్రామంలో తాము కలిసి కాపురం చేసే కమ్మని కల వాళ్ల మాటల్లో వ్యక్తం అవుతుంది. తెరిష్కా గ్రామానికి ఆమె వెళ్లాలని అనుకుంటే తనకు అభ్యంతరం ఉండనక్కరలేదని, ఇంతటి అత్యుత్తమమైన భార్య తనకి ప్రపంచంలో మరెక్కడా లభించదని అతనూ నిర్ధారించుకుంటాడు.

అంతా సాఫీగా సాగిపోతుంది అనుకునే సమయంలో, ఆ పిచ్చివాడు మళ్లీ దాపురించాడు. అతని వెంట మరికొంత మందీ దాపురించారు. వాళ్లెవరో కాదు జర్మన్ సైనికులేనని గ్రహిస్తాడు ఇవాన్. కాని వాళ్లు నేరుగా ముందుకు రాకుండా ప్రమాదకరమైన తోడేలు జాతి కుక్కలను పైకి ఉసిగొల్పారు. వాటి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో వాళ్లు దిశారహితంగా పరుగెత్తారు. మృత్యు సన్నిధిలో సైతం ఆమె రష్యన్ యుద్ధగీతాన్ని ఈసారి మరింత అర్థవంతంగా పాడుతుంది. హిట్లర్ తొత్తులను కసితీరా తిడుతూ, జూలీయా, ఇవాన్‌లు మార్గాంతరాలు వెతుకుతారు. అటు చూస్తే బయలు, ఇటు అగాధం తప్పదు. ఆ దశలో ఆమెను మంచుకొండల్లోని ఆగాధం వైపు నెట్టాల్సిందే. ఏ కారణంగానైనా ఆమె తన కోసం తన ముందే చనిపోవడం అతనికి ఇష్టం లేదు. తానేమైనా ఫరవాలేదని దుస్సహ నిర్ణయంతో ఆమెను అగాధం వైపు తోస్తాడు. ఇవాన్ పైకి కుక్కలు ఎగబడతాయి. 'క్షణకాలం మేఘాచ్ఛాదిత ఆకాశం అతని కళ్ల ముందు మెదిలింది. ఆ తర్వాత అది శాశ్వతంగా కనుమరుగైపోయింది.

అగాధంలో పడిపోయిన జూలియా చనిపోలేదు. ఆమె కోలుకొని, ఎన్నో ఏళ్ల వెతుకులాట అనంతరం ఇవాన్ బంధువులకు లేఖ రాస్తుంది. బృహత్తర కష్టనష్టాల విపత్కర సమయంలో తామెలా కలిసింది, తమ మధ్య అంకురించిన ప్రేమ ఎంత గాఢమైందీ ఆమె ఆ ఉత్తరంలో రాస్తుంది. ఇవాన్ వల్ల తనకు కలిగిన కొడుకు సహాయంతోనే తాను ఇటాలియా నుంచి రష్యన్ భాషలోకి ఉత్తరాన్ని తర్జుమా చేయించుకున్నానని చెప్తుంది. మృత్యువునే పాదాక్రాంతం చేసుకొనే వీరోచిత

(మిగతా 41వ పేజీలో..)

మిరమిట్లు గొలిపే అక్రమ సంపదకు మూలం నేరం నేరస్తుల్నివదిలేసి బాధితులకే శిక్ష

● కూర్మనాథ్



దేశ ప్రజల మీద మరో పెద్ద విపత్తు వచ్చి పడింది. 130 మంది కోట్ల ప్రజలు రోడ్డున పడ్డారు. సుమారుగా పదిలక్షల మంది కంటే ఎక్కువ వుండని అవినీతి పరులు కూడపెట్టిన అక్రమధనాన్ని ముట్టుకోకుండా 130 కోట్ల మందిని అష్ట కష్టాలకు గురిచేస్తున్నారు. (పది లక్షలు మరీ తక్కువనుకుంటే కోటిమంది అనుకోవచ్చు.) తాము కష్టపడి సంపాదించుకున్న డబ్బుని ప్రభుత్వం రాత్రికిరాత్రి చిత్తు కాగితాలతో సమానమని ప్రకటించడంతో హతాశులయ్యారు. ఉద్యోగాలు మానుకుని, పొలం పనులు మానుకుని, ఇంటిపనులు వదిలేసి, అనారోగ్యాలతో రోజూ గంటలకొద్దీ బేంకుల చుట్టూ, ఏటీఎంల ముందూ దైన్యంగా గడుపుతున్నారు. అవమానాలకు గురవుతున్నారు. అనారోగ్యాలకు గురవుతున్నారు. పిల్లల చదువుల కోసం, వ్యవసాయం కోసం, పిల్లల పెళ్ళిళ్ళ కోసం, ఇతరేతర అత్యవసరాల కోసం దాచుకున్న డబ్బును బ్యాంక్ లలో వేసుకోడానికి, తీసుకోడానికి నానా యాతన పడుతున్నారు.

అక్రమ ధనాన్ని ('నల్ల' ధనం అని అనడం పట్ల అభ్యంతరాలు వున్నాయి) వెలికి తీయడం కోసం పెద్దనోట్లను రద్దు చెయ్యాలనే నరేంద్ర మోడీ దుర్మార్గమైన నియంతృత్వ నిర్ణయం వల్ల దేశం అల్లకల్లోలం అయింది. కోట్ల మంది ప్రజలు జీవనోపాధి కోల్పోయారు. రైతులు విలువైన రబీ పంటని కోల్పోయే ప్రమాదం ఏర్పడ్డది. ఖరీఫ్ పంట ఫలితం చేతికందక ఇబ్బంది పడుతున్నారు. రోజుకి వంద, రెండు వందలు వ్యాపారం చేసుకునే లక్షలాది మంది చిరువ్యాపారులు ఉపాధిని కోల్పోయారు.

అందరూ కరెన్సీ మార్చుకునే పనిలో పడడటం వల్ల ఆర్థిక కార్యకలాపాలు నిలిచిపోయాయి. వాణిజ్య రంగం స్తబ్దతకి గురైంది. నిర్మాణరంగం కుదేలయ్యింది. దొరికిన నాలుగో ఐదో వందరూపాయల నోట్లు అయిపోతాయేమోనన్న భయంతో ప్రజలు ఖర్చు పెట్టడం ఆపేసారు. అత్యవసరమైతేనో తప్పదనుకుంటేనో తప్ప ఎవ్వరూ ఖర్చు పెట్టడం లేదు. ఒకరి ఖర్చు మరొకరి ఆదాయం. వారి జీవనోపాధి. దేశవ్యాప్తంగా ప్రజలు ఖర్చు పెట్టడం ఆపెయ్యడంతో ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, హాకర్లు, కూరగాయలు పండించే రైతులు, కూలీలు, చెప్పులు కొట్టేవాళ్ళు, హమాలీలు, ఆటోలు నడుపుకునే వాళ్ళు, ట్రాలీలు, ట్రాక్టర్లు నడిపేవాళ్లు, కోళ్ల ఫారాలు వున్నవాళ్లు .. ఒకరేమిటి, నోట్లరద్దు విధ్వంసం వల్ల నష్టపోనివారు లేరు.

ఒక్కసారిగా అన్ని వస్తువులకూ, సర్వీసులకూ డిమాండ్ పడిపోయింది. ఇప్పుడప్పుడే ఈ పరిస్థితి మెరుగుపడే అవకాశం కనబడడంలేదు. సాక్షాత్తూ ఆర్థికమంత్రి జైట్లీనే కరెన్సీ కష్టాలు మరో ఆరు నెలల పాటు తప్పదని అంటున్నాడంటే పరిస్థితి ఎంత తీవ్రంగా వుందో అర్థం చేసుకోవచ్చు. వస్తువులకు డిమాండ్ పడిపోవడంవల్ల దాని ప్రభావం పరిశ్రమలమీద పడుతుంది. పరిశ్రమలు తమ సామర్థ్యం కంటే చాలా తక్కువగా ఉత్పత్తి చేస్తే ఆ పరిశ్రమల ఆర్థిక మూలాలపై దెబ్బ పడుతుంది. అది ఉద్యోగుల ఉద్వాసనకు దారితీస్తుంది. పెద్ద పరిశ్రమలు దెబ్బ తింటే దాని ప్రభావం వాటి మీద ఆధారపడే చిన్న, మధ్య తరహా పరిశ్రమలమీద పడుతుంది. పెద్ద పరిశ్రమలకి ఉన్నంత పరపతి, ఆర్థికబలం చిన్న మధ్య తరహా పరిశ్రమలకి ఉండదు. ఎప్పటికప్పుడు వర్కింగ్ కేపిటల్ కోసం దేవులాడుకునే పరిస్థితి ఉంటుంది. ఎప్పుడైతే డబ్బు ప్రవహించడం ఆగిపోతుందో అప్పుడు ఆ పరిశ్రమల మనుగడ కష్టమైపోతుంది. ఒకటి మరొకదానికి దారితీస్తుంది. ఆర్థికరంగం సంకోచిస్తుంది.

ప్రజలు వస్తువులు కొనడం మానెయ్యడం వల్ల, లేదా తగ్గించెయ్యడం వల్ల వర్తకరంగం దెబ్బతింటుంది. ఇప్పటికే నాలుగు లక్షల ఉద్యోగాలు పోయాయని ఒక అంచనా. రిటైల్ షాపులు వేలాది మంది ఉద్యోగుల్ని తొలగించాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నియంతృత్వ నిర్ణయం వల్ల దేశంలో వున్న దాదాపు ఐదుకోట్ల చిన్న, మధ్యతరహా పరిశ్రమల మనుగడ ప్రమాదంలో పడింది. దేశ ఆర్థిక రంగానికి ఈ రంగం ఎంత కీలకమైందంటే దేశ పారిశ్రామిక ఉత్పత్తిలో సగం ఈ రంగం నుంచే వస్తుంది. దేశ ఎగుమతుల్లో 45 శాతం ఈరంగం ఎగుమతులే. ప్రతియేటా 15 లక్షల కొత్త ఉద్యోగాలు ఈ రంగం సృష్టిస్తోంది. ఈ రంగం కనీసం రెండుమూడేళ్ల పాటు లేచి నిల్చునే పరిస్థితి కనబడడం లేదు. అంటే అన్ని సంవత్సరాలపాటు అవి కొత్త ఉద్యోగాల్ని ఇవ్వలేవు. ఇవ్వలేవు సరికదా, ఎన్నో ఉద్యోగాల్ని తీసివేసే ప్రమాదం వున్నది. పైగా వేలకొద్దీ పరిశ్రమలు మూతపడే ప్రమాదం కూడ వుంది. బతికి బట్టగలిగే పరిశ్రమలు తమ సామర్థ్యానికి ఎంతో తక్కువగా మాత్రమే ఉత్పత్తి చేయగలవు.

దేశం మొత్తం కరెన్సీలో దాదాపు 86 శాతం పెద్దనోట్లే (రూ. 500, 1,000) ఉండేవి. ఓ ఆరుశాతం వందరూపాయల నోట్లు, మిగతావి ఇంకా చిన్న నోట్లు. ఒక్కసారిగా పెద్దనోట్లు రద్దుచెయ్యడం వల్ల, ప్రత్యామ్నాయంగా రెండువేల నోట్లను మాత్రమే (500 నోట్లు వచ్చేయని అంటున్నారు గాని ఎక్కడా కనిపించడం లేదు) అందుబాటులోకి, అందులోనూ అరకొరగా, తేవడం వల్ల వంద రూపాయల నోట్ల ఎద్దడి ఏర్పడింది.

విచిత్రం ఏంటంటే దేశంలోని ఆరుశాతం మంది దగ్గర, ప్రభుత్వం, బేంకులు, ఆర్బీఐ దగ్గర 96 శాతం డబ్బు ఉంటే, మిగతా 94 శాతం మంది దగ్గర ఆరు శాతం డబ్బు వుంది. ఆరు శాతం మంది (లేదా ఇంకా తక్కువ మంది దగ్గర) పేరుకుపోయి వున్న అక్రమ ధనాన్నివెలికి తీయడానికి 94 శాతం

మంది ప్రజల్ని నానా అగచాట్లకు గురిచేస్తున్నారు. డబ్బులు కోసం బేంకులు, ఏటీఎం ల దగ్గర గంటలతరబడి ప్రాణాలు పోగొట్టుకున్న వారు 82 మంది. ప్రాణాలు కోల్పోయిన వాళ్ళ సంఖ్య కంటే ప్రభుత్వం కొట్టిన దెబ్బకు తీవ్ర అనారోగ్యానికి గురైన వాళ్ళు ఎన్నో రెట్లు ఎక్కువ ఉంటుంది.

మరి 130 కోట్ల మందిని ఇలా ఎందుకు క్షోభకి గురిచేస్తున్నారు? అక్రమ ధనం ఎవరిదగ్గర వుంది? ఏయే రూపాల్లో వుంది? అసలు ఆ అక్రమ ధనం సృష్టికి ఎవరు కారణం? దానికి వ్యవస్థపరమైన రక్షణ కల్పిస్తున్నది ఎవరు? అక్రమ ధనం దానికదే ఒక రోగమా? రోగ లక్షణమా? రోగ లక్షణానికి మందువేస్తే సరిపోతుందా?

గత అనుభవాలు ఏం చెప్తున్నాయి? నల్ల ధనాన్ని అంతం చెయ్యడానికి గతంలో రెండు సార్లు ప్రయత్నించారు. అయితే రెండు సందర్భాల్లోనూ పెద్దనోట్ల విలువ నాలుగైదు వందల కోట్లకు మించి లేదు. సామాన్య ప్రజలకు కలిగిన ఇబ్బంది కూడా లేదు. ఆరెండు ప్రయత్నాలూ తొందర్లోనే విఫలమైపోయాయి. నల్లధనం సమస్య అలాగే ఉండడం మాత్రమే కాదు మరింత జటిలమైపోయింది.

కానీ ఇప్పటి సంగతి వేరు. దేశం మొత్తం కరెన్సీ విలువలో పెద్దనోట్ల వాటా 86 శాతం. ద్రవ్యోల్బణం పెరిగిపోవడం వల్ల వందరూపాయలకు విలువ పడిపోయి అయిదువందల రూపాయల నోటు వాడకం సర్వసాధారణమైపోయింది. చలామణీ నుండి అయిదువందల నోట్లు హఠాత్తుగా మాయమైపోవడం వల్ల ద్రవ్య వినిమయానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. అందువల్ల కరెన్సీ కొరతతో దేశం విలవిలలాడుతోంది.

పువ్వు పుట్టగనే పరిమళించు అన్నట్టు, 'స్వాతంత్రం' వచ్చిన కొన్నేళ్ళకే మన నాయకులు, అధికార్లు, పెట్టుబడి దారులు, కంట్రాక్టర్లు అక్రమధనాన్ని పోగు చెయ్యడం మొదలుపెట్టేరు. దేశం లో అక్రమధనం ఎంత వుందో అంచనా వెయ్యడానికి 1961లో వేసిన వాంచూ కమిటీ అంచనా ప్రకారం 1965-66 నాటికే దేశం లో 700 కోట్ల రూపాయలు, 1969 నాటికి 1,800 కోట్లు వున్నట్టు తేలింది. ఇదే కమిటీలో సభ్యుడైన రంగ్నేకర్ డిసెంట్ నోట్ పెట్టి ఈ అంచనాలు చాలా తక్కువని అన్నాడు.

అప్పుడు మొదలైన నల్లధన ప్రవాహం ఉధ్రుతిని పెంచుకుని దేశ ఆర్థిక మూలాలని చెదలవలె, పీడలవలె తినివేస్తున్నది.

అక్రమధనాన్ని అంచనా వేసిన చోప్రా కమిటీ 1977లో దేశ జీడీపీలో 11.4 శాతం అక్రమధనం వుందని తేల్చింది. ఇది 1980-81 నాటికల్లా 23,678 కోట్లకి (జీడీపీలో 21 శాతం), 1983-84 నాటికి 21 శాతం అంటే రు. 36,784 కోట్లకి చేరుకుందని NIPFP (National Institute for Public Finance and Policy) అంచనా వేసింది.

ప్రభుత్వం అసలు ఉద్దేశం ఏమిటి? ఎవరి ప్రయోజనం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు? పెద్దనోట్ల ఉపసంహరణ పర్యవసానాలు ఏమిటి?

బేంకులలోకి కుప్పలు తెప్పలుగా డబ్బు వచ్చి చేరుతున్నది. లక్షలకోట్ల రూపాయలు బేంకింగ్ వ్యవస్థలోకి రావడం వల్ల డబ్బుకి డిమాండ్ తగ్గుతుంది. వడ్డీరేట్లు తగ్గిస్తారు. పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన వడేరేట్లతో అప్పులిస్తారు. (ఆ తర్వాత వాటిని మొండి బకాయిలుగా ప్రకటించి బేలన్స్ షీట్లనుంచి తొలగిస్తారు. పెట్టుబడిదార్లనుంచి one-time settlements పేరిట ఎంతోకొంత తీసుకుంటారు.) పెట్టుబడిదారులు అప్పులుగా తీసుకుని ఎగ్గొట్టిన డబ్బు మొత్తం 10 లక్షల కోట్ల రూపాయలు. ఇలాంటి మొండి బకాయిలని వసూలుచేసి తీరతామని ప్రభుత్వమూ, ప్రభుత్వ బ్యాంకులూ బీరాలు పలుకుతున్నా అవి మళ్ళీ వెనక్కి వచ్చే అవకాశం లేదని అందరికీ తెలుసు.

నోట్ల రద్దు వల్ల ప్రభుత్వం వెలికితీయాలనుకున్న అక్రమధనం రెండు లక్షల కోట్లు మాత్రమే. బ్యాంక్లకు ఎగ్గొట్టిన పదిలక్షల కోట్లూ వసూలు చెయ్యగలిగితే అసలు సమస్యే లేదు. కానీ బ్యాంకులకు డబ్బు ఎగ్గొట్టిన వాళ్ళు వ్యవస్థకి మిత్రులు, బంధువులు. కాబట్టి వాళ్ళకి కష్టం కలిగే పనులు ప్రభుత్వం చెయ్యదు. నష్టం సంగతి తర్వాత, కనీసం ఆ ఊహ కూడ రాదు.

బ్యాంకులలోకి ప్రవాహం వలె వస్తున్న డబ్బు వల్ల ప్రజలు జమచేసే డబ్బుపై, ఫిక్సెడ్ డిపాజిట్లపై వడ్డీలు విపరీతంగా తగ్గిపోతాయి. బంగారం మీద కూడా పరిమితులు రాబోతున్నాయి. అంటే, బ్యాంకులలో దాచుకున్నా, బంగారం కొనుక్కున్నా వాటిపై వచ్చే రాబడి తక్కువ, తలనొప్పులు (అంటే ప్రభుత్వ దాడులు) ఎక్కువ. మరి ప్రజలు డబ్బును ఎక్కడ పెట్టాలి? 'ఎక్కువ రాబడిని' ఆశచూపే స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ ని ప్రత్యామ్నాయంగా చూపిస్తారు..

ఈ స్టాక్ మార్కెట్ మాయాజాలం అందరికీ అర్థమయ్యే వ్యవహారం కాదు. అది ఒక మాయాప్రపంచం. అందులో కార్పొరేట్లకు మంచి లాభాలుంటాయి. మార్కెట్ ఆపరేటర్లకు, బ్రోకర్లకు, విదేశీ మదుపర్లకు ఆ ఆట ఆయువుపట్లు తెలుసు. కానీ చదువులేని, ఆ పరిభాష అర్థంకాని కోట్లమందికి ఏమి తెలుస్తుంది?

ఇప్పటికే ప్రజల కష్టార్జితంలో భాగమైన ప్రావిడెంట్ ఫండ్‌ని స్టాక్ మార్కెట్లో పెడుతున్నది ప్రభుత్వం. కంపెనీలు, కంపెనీల యజమానులు, ఇంకా ఆ కంపెనీల్లో పెట్టుబడి పెట్టిన పెద్ద పెద్ద ఇన్వెస్టర్లు ప్రజల కష్టార్జితాన్ని దోచుకునే మరో మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నది ప్రభుత్వం.

పెద్దనోట్లని రద్దుచేసి అందుకు ప్రత్యామ్నాయం చూపించలేని అసమర్థ ప్రభుత్వం నగదు రహిత లావాదేవీలు చేసుకుని బతకమంటున్నది. మెజారిటీ ప్రజలు ఈరోజుకీ నగదుతోనే లావాదేవీలు జరుపుతున్నారు. నిరక్షరాస్యత ఇంకా విస్తారంగా వున్న మనదేశంలో ప్రజలు నగదు రహిత దశకు వెళ్ళడానికి ఎన్నో ఏళ్ళు పడుతుంది. చదువుకున్న వారికి కూడా ఈ వ్యవహారం అర్థం కాదు. అర్థం అయిన వాళ్ళు కూడా ఆన్ లైన్ మోసాలకు భయపడి ఆజోలికి పోరు. ఎక్కడో నైజీరియాలో, రష్యాలో, రాష్ట్రాల్లో కూచుని ఇంటర్నెట్ ద్వారా ప్రజలని మోసం చేసే డబ్బు దోచుకుంటున్న వార్తల్ని ప్రతిరోజూ చదువుతూనే వున్నాం. లాటరీలని, ప్రైజులని, ఆస్తుల్లో వాటాలని, ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫర్లని ఇప్పటికే లెక్కకి మించిన మోసాలు రిపోర్ట్ అవుతున్నాయి. పైగా ఇలాటి మోసాలకు గురైన వాళ్లకు చట్టం ఇచ్చే రక్షణ ఏదీ లేదు. అందులోనూ వెయ్యా, రెండువేలకూ జరిగే మోసాలని కనీసం వినడానికి కూడా ఎవరికీ ఓపిక ఉండదు.

ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ట్విట్టర్ ఎకౌంట్ హేక్ అయిందన్న వార్త కూడా ఈవారంలోనే చూసాం. అంటే, అస్థాయిలో వున్న నాయకుడి ఇంటర్నెట్ ఎకౌంట్లకే దిక్కులేదంటే ఎటువంటి రక్షణ లేని, అవగాహనలేని సామాన్య ప్రజల పరిస్థితి ఏంటో ఊహించవచ్చు.

ప్రజల్ని బలవంతంగా ఎలక్ట్రానిక్ వినిమయ ప్రపంచంలోకి నెట్టడం దుర్మార్గం, ప్రమాదకరం. నిజానికి మనదేశంలో ఇంటర్నెట్ వ్యాప్తి అభివృద్ధి చెందిన దేశాలకంటే చాలా తక్కువ. కరెన్సీ తక్కువై ఇప్పటికే క్రెడిట్ డెబిట్ కార్డులున్నవారు ఎక్కువగా వాడడం వల్ల కంప్యూటర్ సర్వర్లు వత్తిడికి గురై పనిచెయ్యడం లేదు. ఇంకా అందరూ చేరితే ఎలా ఉంటుంది?

సమాంతర ఆర్థిక వ్యవస్థ

నిజానికి డబ్బురూపంలో వున్న అక్రమధనం స్వల్పం. అవినీతికి అలవాటుపడ్డ వాళ్ళు తాము అక్రమమార్గాల్లో సంపాదించిన డబ్బుని బంగారంగా, భూములుగా, ఆభరణాలుగా మార్చి దాచుకుంటారు. ఇంకా

ఎక్కువైన వాళ్ళు దొంగ కంపెనీల్లో, విదేశీ బేంకుల్లో, విదేశాల్లోని అక్రమ ధన స్వర్గ ధామాల్లో నిల్వచేస్తారు.

అసలు సమస్య డబ్బా లేకపోతే సమస్యకి కారణమైన అవినీతా? ఇంగితం, బుద్ధివున్న వాళ్ళెవరైనా ఏం చెప్తారంటే ఎక్కడ అవినీతి జరుగుతుందో ఆ మూలాలమీద కన్నుపెట్టాలని. ఆ మూలాలని చావు దెబ్బతియ్యాలని. మాఫియాసామ్రాజ్యాల వల్ల, స్మగ్లింగ్ల వల్ల, మాదక ద్రవ్య అక్రమ రవాణా వల్ల, పరిశ్రమలు తాము ఉత్పత్తి చేసే మొత్తాన్ని తక్కువ చేసి చూపించడం వల్ల, రాజకీయనాయకులు, అధికారులు తీసుకున్న డబ్బును అక్రమంగా దేశాన్ని దాటించి విదేశాల్లో దాచుకోవడం వల్ల, హవాలా వల్ల అక్రమధనం ఉత్పత్తి అవుతుంది.

ఆదాయాన్ని ప్రభుత్వం నుంచి దాచి పన్నులను ఎగవెయ్యడానికి చూస్తుటారు కొందరు. పన్నుల రేట్లు ఎక్కువగా వుండడం, కార్మిక చట్టాలనుండి తప్పించుకుని పనివాళ్ళకి తక్కువ జీతాలివ్వడానికి, ఉద్యోగుల భవిష్యనిధి ఖాతాకి డబ్బుని చెల్లించకుండా వుండడానికి, సంక్లిష్టమైన చట్టాలని తప్పించుకోడానికి ఆదాయాన్ని దాస్తుంటారు. ఇంకొందరు చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలవల్ల సంపాదించిన డబ్బుని ప్రభుత్వానికి ఎలాగూ చెప్పరు. కొందరు అక్రమ సంపాదనల్ని డాలర్లలోకిమార్చుకుంటారు. బినామీ షేర్లు కొంటారు.

రాజకీయనాయకులు, అధికారులు తమ కుర్చీలని అడ్డు పెట్టుకుని సంపాదిస్తారు కాబట్టి వాళ్ళు కూడా ఆదాయాన్ని సమాంతర ఆర్థిక వ్యవస్థలోకి మళ్ళిస్తారు.

చాలా కంపెనీలు ఖర్చులని ఎక్కువగా చూపిస్తాయి. ముడి సరకు విలువలని ఎక్కువచేసి చూపించి, సొంత కంపెనీల మధ్య అమ్మకాలు, కొనుగోళ్ళుచూపించి - ప్రభుత్వానికి ఎంత వీలైతే అంత తక్కువ ఆదాయాన్ని చూపిస్తారు. ఇంకొక లేయర్ లో అమ్మకాలు అనధికార కరెన్సీ (రబ్బరు స్టాంప్ లు వేసి, సీళ్ళ ముద్రలు వేసి)లతో వ్యాపారాలు నడిపిస్తారు. ఇంకొన్ని చోట్ల అధికారంగా ఒక పద్దుల పుస్తకం, అనధికారికంగా మరో పద్దుల పుస్తకం నిర్వహిస్తారు. అనధికార పద్దుల పుస్తకం లో అసలు లెక్కలు వుంటాయి. అవి ప్రభుత్వ ఆదాయ లెక్కలకు దొరకవు.

బ్యాంక్ లు అలాటి వ్యవస్థీకృత సంస్థలు హామీలు ఇవ్వగలిగే ప్రజలకు అప్పులు ఇస్తాయి. (బడా వ్యాపారవేత్తలు దొంగ హామీలు చూపించి, ఆస్తుల విలువని కృత్రిమంగా పెంచి అప్పులు తీసుకుని ఎగ్గొడతారు. అది వేరే సంగతి). కానీ హామీలు ఇవ్వలేని, తక్షణం డబ్బు అవసరం వున్న ప్రజలు - ముఖ్యంగా రైతులు, చిరు వ్యాపారులు - ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు ఇచ్చే రుణాల, చిట్ల మీద ఆధారపడతారు. ఇదంతా కేష్ ఎకానమీ. రోజుకి యాభై రూపాయల కంటే తక్కువ ఆదాయం వున్న వాళ్ళు దేశంలో నలభై కోట్లమంది వుంటారు. వీళ్ళూ, వీళ్ళు ఆధారపడే మనుషులూ, వృత్తులవారూ కూడా కేష్ ఎకానమీ మీద ఆధారపడతారు.

(వీళ్ళ అవసరాలు ప్రభుత్వానికీ, బ్యాంకులకూ ఎన్నడూ పట్టవు. దేశం ఆర్థిక వ్యవస్థ లో దాదాపు 30-40 శాతం వరకూ ఇలాటి informal economy వుంటుంది. ప్రభుత్వ సహకారం ఎన్నడూ అందని ఈ వ్యవస్థ మోడీ బలవంతంగా రుద్దిన నిర్ణయంవల్ల విధ్వంసానికి గురైంది.)

పెద్ద స్థాయిలో వున్న రాజకీయనాయకులు, అధికారులు, లాయర్లు - వీళ్ళకి నేరుగా విదేశీ బ్యాంక్ ఖాతాల్లోకే నేరుగా జమ అవుతాయి. అంతర్జాతీయ స్థాయి ఆయుధ కాంట్రాక్టులు, విమానాల కొనుగోలు ఒప్పందాలు వంటివి జరిగినప్పుడు ప్రపంచం లో ఎక్కడెక్కడి దేశాలు, బ్యాంక్ లు, కంపెనీలలో నిధులు చేరుతుంటాయి.

ఇలా విదేశాల్లో పేరుకుపోయిన సంపదని మారిషస్, సింగపూర్ లాటి దేశాలు కల్పించిన వెసులుబాట్లని ఉపయోగించుకుని రాచమార్గాల గుండా మళ్ళీ మన దేశానికి సక్రమమైన ఆదాయంగా రూపాంతరం చెందుతుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (FDI), విదేశీ పెట్టుబడి సంస్థల ద్వారా కూడా అవినీతి సొమ్ము చేరుతుంది. మన దేశంలోకి వచ్చే FDIలలో దాదాపు 50 శాతం సింగపూర్, మారిషస్ లాటి రెండు మూడు దేశాలనుండే వస్తున్నది. ఇలా అక్రమ సంపాదనాపరులకు స్వర్గధామాలుగా వుండే దేశాలు ప్రపంచంలో 35 దాకా వున్నాయని ప్రభుత్వమే చెప్తున్నది.

స్టాక్ మార్కెట్ల లోకి పార్టిసిపేటరీ నోట్లద్వారా కూడా ఇదే డబ్బు పెట్టుబడిగా వస్తుంటుంది.

ఇవి ఊహాజనితమైన ఆరోపణలు కావు. స్వయంగా ప్రభుత్వం ఒప్పుకున్న విషయాలివి. 2012లో దేశ ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'White Paper on Black Money'లో పేర్కొన్న అంశాలు. ఇన్ని అక్రమమార్గాలద్వారా లక్షల కోట్ల రూపాయల అక్రమ ధనం ప్రతియేటా దేశం సరిహద్దులు దాటుతున్నది.

ఏయేమార్గాల ద్వారా అక్రమధనం పుడుతున్నదో, ఏయేమార్గాల ద్వారా ఎక్కడెక్కడ పోగుపడుతున్నదో ప్రభుత్వానికీ, ఆదాయపన్ను శాఖకీ తెలుసు. కానీ ఆ జోలికి అవి వెళ్ళవు.

GFI అనే సంస్థ 1948 నుండి 2008 వరకు అంటే అరవైఏళ్ళలో ఇలా ఎంత డబ్బు బయటకెళ్ళిందో లెక్క చూసింది. ఈ మొత్తం $213 బిలియన్లు వుండొచ్చని చెప్పింది. దీని విలువ ఇప్పుడు $ 462 బిలియన్లు. ఇంకో లెక్క ప్రకారం ప్రతి ఏటా దాదాపు 35 లక్షల కోట్ల రూపాయల రూపాయల అక్రమ సంపాదన దేశం దాటి వెళ్తున్నట్టు అంచనా.

దేశ ఆయువుపట్లను దెబ్బకొడుతున్న ఇంత పెద్ద అవినీతి భూతాన్ని అలాగే వదిలేసి, ప్రాణాలు తోడేస్తున్న వింత జబ్బు వలె దేశాన్ని పీడిస్తుంటే మనల్ని ఈ జబ్బు లక్షణాల వైపే చూడమని చెప్తున్నాడు మోడీ. చాలా తెలివిగా లక్షణంమీదే దృష్టిపెట్టి జబ్బును చూసీ చూడకుండా వదిలేసాడు. అవినీతి మూలాలమీద దాడి జరగకుండా నోట్లని మారిస్తే ఏం ప్రయోజనం?

అవినీతి మూలాలు ఎక్కడున్నాయి? గుట్టలు గుట్టలుగా పేరుకుంటున్న రాజకీయనాయకుల, పెట్టుబడిదారుల ఆస్తుల, ప్రయోజనాల్లో వున్నాయి. నామమాత్ర ప్రజాస్వామ్యపు పొరకింద పెట్టుబడిదారులు, రాజకీయ నాయకులు వారి అండదండలతో పోలీసు, మాఫియాలు నడుపుతున్న సమాంతర ప్రభుత్వాల్లో ఆ మూలాలు వున్నాయి.

తాము చేసే అక్రమ కార్యక్రమాలకు, తమ ప్రాజెక్టుల అనుమతుల కోసం పెట్టుబడిదార్లు కేంద్రంలో, రాష్ట్రాల్లో వున్న అధికార పార్టీలకు వేలకోట్లు లంచాలు లేదా పార్టీ ఫండ్లు ఇస్తాయి. అధికారపార్టీలకే కాదు, భయంతోనో భక్తితోనో మొహమాటానికో దేశవ్యాప్తంగా వున్న వందల పార్టీలకు కూడా అవి నిధులు ఇస్తాయి. ఇలా పెట్టుబడిదార్లనుంచి సేకరించే నిధులకు లెక్కా పత్రం ఉండదు. రాజకీయ పార్టీలను సమాచార హక్కు చట్టం కిందికి తీసుకురాడానికి ఏ పార్టీ కూడా ఇష్టపడదు. ఆయా పెట్టుబడిదార్లతో తమ సంబంధాలు బయటపడతాయని కావచ్చు. మాకెందుకు తక్కువ ఇచ్చారని మిగతా పార్టీలు నిలదీస్తాయని కావచ్చు, లేకపోతే మిగతావాళ్ళు వెంటపడి వాళ్ళని 'ఇబ్బంది పెడతారని' కావచ్చు పెట్టుబడిదార్ల పేర్లు బయటకు రాడానికి రాజకీయ పార్టీలు ఇష్టపడవు.

తమ అక్రమ వ్యాపారాలని, అక్రమ సంపాదననీ చూసీ చూడనట్టు వదిలెయ్యడానికి రాజకీయపార్టీలకు పెట్టుబడిదారులు ఇచ్చే లంచం ఈ నిధులు.

అక్రమ ధనానికి రెండో ప్రధాన మూలం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం. దేశంలో 543 లోక్ సభ సీట్లు, 245 రాజ్యసభ సీట్లు, 4,120 అసెంబ్లీ సీట్లు

వున్నాయి. ఇవికాక మేయర్ సీట్లు, లెజిస్లేటివ్ కౌన్సిల్ సీట్లు, లెక్కకు మించిన నామినేటెడ్ పోస్టులు వున్నాయి. ఒక్కో పార్లమెంట్ సీటు 25 కోట్ల రూపాయలకు, అసెంబ్లీ సీట్లు పదేసి కోట్లకు పార్టీలు అమ్ముకుంటాయన్నది అందరికీ తెలిసిన సంగతే. సీట్లు అంతేసి డబ్బు పెట్టి కొన్నాక దాదాపు అంతే మొత్తాన్ని ఎన్నికల ప్రచారం కోసం అంతే మొత్తం ఖర్చు పెడతారు.

ఇవికాక మంత్రిపదవులను, నామినేటెడ్ పదవులను టోకున, విడివిడిగా అమ్ముకుంటారని తెలియని వారు లేరు. ఇదంతా అక్రమ ధనమన్న సంగతి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ డబ్బంతా ఎక్కడిది? న్యాయబద్ధంగా సంపాదించిందేనా? ఈ డబ్బుని ఈ అవినీతిపరులు..

మూడో మూలం ప్రభుత్వం చేసే ఖర్చులు. ప్రాజెక్టులకు, సంక్షేమం కోసం, పాలనకోసం, రక్షణ కోసం ఒకటేమిటి ప్రభుత్వం చేసే ఖర్చుపెట్టే ప్రతిరూపాయిలో కొంతభాగం అక్రమధనంగా మారుతుంది. ప్రతిచోటా పెర్సెంటేజ్‌లు ఉంటాయి. ఆర్థికసరళీకరణలు మొదలయ్యేక బహుశా ప్రపంచంలో ఎక్కడాలేనంత అవినీతి భారతదేశంలో జరిగింది. జలయజ్ఞం, మిషన్ భగీరథ, పోలవరం ప్రాజెక్ట్, అమరావతి నిర్మాణం, ఆయిల్, గేస్ .. ఇలాటి ఎన్ని ప్రాజెక్టుల అవినీతి గురించి మనం వినలేదు?

ఒక అంచనా దేశంలో సమాంతర ఆర్థిక వ్యవస్థ జీడీపీలో దాదాపు 50-60 శాతం ఉంటుందంటే ఈ సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంత పెద్ద అవినీతి జంతువుని చిన్న ఎలుకల బోనులో పట్టెయ్యవచ్చని ప్రభుత్వం నమ్మబలుకుతున్నది. అవినీతి సొమ్మును నాయకులు, పెట్టుబడిదారులు, సెలెబ్రిటీలు ఏనాడో దేశాన్ని దాటించేసారు. ఇళ్లల్లో ట్రంకు పెట్టెల్లో దాచుకోరు. సొంత దేశాల్లో నేరపూరిత మార్గాల్లో సంపాదించిన డబ్బుని దాచుకోడానికి ప్రపంచంలో ఎన్నో 'సురక్షిత' దేశాలున్నాయి. ఇటీవల ప్రపంచాన్ని కుదిపివేసిన పనామా పేపర్లలో మనవాళ్ళ పేర్లు కూడా వున్నాయి.

ఇక స్విడ్జర్లాండ్ లాటి దేశాల్లోని బేంకుల సంగతి మనకి ఎప్పటినుండో తెలిసిందే. ఆ డబ్బంతా తెచ్చేస్తే 130 కోట్ల మందికి తలా 15 లక్షలు వస్తాయని ఎన్నికలప్పుడు ప్రజల్ని మభ్యపెట్టేడు మోడీ. నిజానికి మన దేశ ప్రజల కష్టార్జితం అంత పెద్ద మొత్తంలో విదేశాల్లో పేరుకుపోయి వుంది. ఇప్పుడు 130 కోట్లమందికి ఇంత విధ్వంసానికి గురి చేసి వెలికితీద్దామనుకున్న అక్రమ ధనమెంత? రెండునుంచి నాలుగు లక్షల కోట్లు.

మనదేశ జీడీపీ గత సంవత్సరంలో 137 లక్షల కోట్ల రూపాయలు. ఇందులో సమాంతర ఆర్థిక వ్యవస్థ అరవై శాతం అంటే దాదాపు 84 లక్షల కోట్ల రూపాయలు. (నకిలీ నోట్ల మొత్తం విలువ 400 కోట్ల రూపాయలు మాత్రమే జీడీపీలో 0.002 శాతం. అంటే ఇసుకరేణువంత.) సమస్య ఎక్కడుందంటే ఈ 84 లక్షల కోట్ల దగ్గర. కానీ, మనకి (సాపేక్షికంగా) ఒక చిన్న సమస్యని పెనుభూతంలాగా చూపించి మన దృష్టిని అసలు సమస్యనుంచి మళ్లించే ప్రయత్నం చేస్తోంది ప్రభుత్వం.

ఇప్పటిదాకా వున్న లెక్కల ప్రకారం "అక్రమధనం మీద మొదలైన సర్జికల్ స్ట్రైక్ వల్ల వచ్చేది రెండులక్షల కోట్లు. కనీసం ఆ రెండులక్షలు కూడా వచ్చే అవకాశం లేదని అంటున్నారు. రద్దు చేసిన నోట్ల విలువ 14.50 లక్షల కోట్లు. ఇప్పటికే దాదాపు 10 లక్షల కోట్లు బేంకుల వద్ద జమ అయ్యాయి. ఇదికాక ఆర్బీఐ, బేంకుల దగ్గర తప్పని సరిగా ఉండాల్సిన నగదు నిల్వలు మరో నాలుగు లక్షల కోట్లు. ఈ సంఖ్యల మాయాజాలం చూస్తే అసలు అక్రమధనం అసలు ఎక్కడ మాయమైపోయి ఉంటుంది?

ఎక్కడికెళ్ళి వుంటుంది? 30 శాతం వరకూ కమిషన్లు తీసుకుని రద్దయిన (అక్రమ) నోట్లని కొత్త నోట్లుగా మార్చేసుకున్నారు. కమిషన్లు ఇచ్చి ఖాళీగా వున్న బ్యాంక్ అకౌంట్లలోకి వేసుకుంటున్నారు. ఈ విచ్చలవిడి

దందాలలో ప్రభుత్వాలను నడుపుతున్నవారు, రాజకీయనాయకులు, బ్యూరోక్రాట్లు, పోలీసులు, బ్యాంక్ అధికారులు విచ్చలవిడిగా పాల్గొంటున్నారు. నలుపు తెలుపై పోయింది.

సమాంతర ఆర్థిక వ్యవస్థని నడిపే వాళ్ళు ఎవరు? వాళ్లకి వత్తాసుగా నిలుచున్నదెవరు? ఈ వ్యవస్థకి వెన్నుదన్నుగా నిలబడుతున్న వారు, అందులో వాటాదారులు రాజకీయనాయకులు. సమాంతర ఆర్థిక వ్యవస్థకు రక్షణ కలిపిస్తున్నది ప్రభుత్వాన్ని నడిపిస్తున్నవారే. అందుకనే సహారా గ్రూప్ యజమాని సుబ్రతో రాయ్, బేంకుల్ని ముంచిన విజయ్ మాల్యా, గనుల వ్యాపారి గాలి జనార్దన రెడ్డి, పనామా కుంభకోణ నిందితులు... వీళ్ళెవరికీ ఏమీ కాదు. ఇలాటి వాళ్ళెవరికీ ఏమీ కాకుండా ప్రభుత్వ పెద్దలు, అన్ని పార్టీలు కాపాడతాయి. మరి 84 లక్షల కోట్ల సమాంతర ఆర్థిక వ్యవస్థకు చీమ కూడా కుట్టలేని పరిస్థితి వున్నపుడు అక్రమధన ప్రవాహం ఎలా ఆగుతుంది? దేశంలో అక్రమ సంపాదన, అవినీతి బాగా కందెన వేసిన బండిలాగా (well-oiled machine) నడుస్తున్నపుడు అక్రమధన ఉత్పత్తి ఎలా ఆగుతుంది? మహా అయితే వాళ్లకి కొన్ని రోజులపాటు ఇబ్బంది కలుగుతుంది. ప్రభుత్వం పెద్ద నోట్లని రద్దు చేసింది కదా అని ఇక రాజకీయ నాయకులు, అధికారులు హఠాత్తుగా, రాత్రికి రాత్రి దేశభక్తులుగా మారిపోయి లంచాలు తీసుకోవడం ఆపేస్తారా? తీసుకోరు కావచ్చు, ఎవరైనా పాత నోట్లలో లంచాలు ఇస్తే. వాళ్ళు అనుమతులు వాయిదావేస్తారు. లేదాకొత్త కరెన్సీలో ఇస్తే మాత్రమే తీసుకుంటామని, అప్పటిదాకా ఆగుతాం కావలిస్తే అని దయతలుస్తారు. పైగా వెయ్యి రూపాయల బదులు రెండువేలు వచ్చింది కాబట్టి కొత్త నల్ల డబ్బుని దాచుకోవడం సులభం. నోట్ల రద్దువల్ల నష్టపోయిన నాయకులు, పెట్టుబడిదారులు, అధికారులు రాత్రింబవళ్ళు కష్టపడి కొన్ని రోజుల్లోనే నష్టాల్ని పూడ్చేసుకుంటారు. సమాంతర ఆర్థికవ్యవస్థని, ఆ వ్యవస్థకి రక్షణ కలిపిస్తున్న ఎన్నికల రాజకీయాలని కూకటివేళ్ళతో కూలదొయ్యని, నిర్మూలించని ఏ ప్రయత్నమూ అక్రమ సంపాదనని, నల్ల ధనాన్ని నిర్మూలించడం అసాధ్యం. సుసాధ్యం చెయ్యడం పాలకుల లక్ష్యం కాదు. ఎందుకంటే వ్యక్తిగత ఆస్తి పునాదిగా తాము నిర్మించుకున్న మహా సౌధాన్ని వాళ్ళెందుకు కూలగొట్టుకుంటారు? కూలగొట్టడానికి ప్రజలే పూనుకోకుండా వాళ్ళే అప్పుడప్పుడు ఇలా కూలగొట్టే ప్రయత్నమేదో జరుగుతున్నట్టు భ్రమ కలిపిస్తారు. ఇంత మహత్తర కార్యక్రమానికి సహకరించని వాళ్ళంతా (అంటే మనం) దేశ ద్రోహులని అంటారు.

నేరస్తుల్నివదిలేసి, భారత ప్రజల స్వేదంతో వర్ధిల్లుతున్న సంపదని కొల్లగొడుతున్న గజదొంగల్ని కాపాడుతూ ప్రజల్నే దోషులుగా రోడ్లమీద నిలబెడుతున్నారు. అక్రమ సంపాదనలతో వాళ్ళు బ్రహ్మాండమైన పెళ్ళి బారాత్ లు చేసుకుంటూ, పెళ్ళిళ్ళకు ప్రైవేటు విమానాలు ఏర్పాట్లు చేసుకుంటూ ప్రజల ఇళ్ళళ్ళో సంతోషాలను లేకుండా చేస్తున్నారు.

మిరమిట్లు గొలిపే సంపదకు మూలం నేరం అని బాల్జాక్ అంటాడు. నేరస్తుల్ని వదిలేసి బాధితులకే శిక్ష విధించడమే మోడీ ప్రభుత్వ లక్ష్యం.

సాహిత్య వ్యాసం

అన్నాబావు సాఠే సాహిత్య పరిచయం



"ఈ పృథ్వి విష్ణు వేయిపడగల శేషతలపై తిరగడం లేదు శ్రమజీవి చెమట భుజాలపై తిరుగుతుందన్న" చారిత్రక సత్యాన్ని కవిత్వంలో ప్రయోగించి కొత్త ఒరవడిని మరాఠీ సాహిత్యానికి అందించిన పురోగామి, ప్రగతిశీల, దళిత ప్రజాకవి అన్నాభావు సాఠే. అర్ధరాత్రి స్వాతంత్రం వచ్చిన మరుసటి రోజే 16 ఆగష్టు 1947న కుండపోత వర్షంలో 50,000 జన సముదాయ సభలో ఎవరి స్వాతంత్ర్యం అని ప్రశ్నిస్తూ నిలదీసి ధిక్కరిస్తూ "ఏ ఆజాదీ జూఠీహై. దేశ్‌కా జనతా భూకీ హై" (ఈ స్వాతంత్ర్యం బూటకం.. దేశ ప్రజలు ఆకలితో ఉన్నారు) అని నినదించిన గొప్ప దూరదృష్టి గల సాహితీవేత్త, సామాజిక ఉద్యమ కార్యకర్త ఆయన.

● మచ్చ ప్రభాకర్

అన్నాభావు సాఠే, ఏ అంటరాని సమాజం అందులో మాంగ్ కులస్తుడిగా (మాదిగగా) పుట్టి వేల ఏళ్ళ కుల వివక్షత వర్ణ వర్గ వ్యవస్థలో పుట్టాడో ఆ సామాజిక పరిస్థితులను అధ్యయనం చేస్తూ శ్రామికవర్గ దృక్పథాన్ని అందుకొని శాస్త్రీయ దృష్టిని ప్రాపంచిక దృక్పథాన్ని అలవర్చుకొని బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఎదిగిన మహోన్నత సాహితీ వేత్త ఆయన. ప్రజా వాగ్గేయకారుడిగా తన తోటి కమ్యూనిస్టు కళాకారులైన హవన్‌కర్, అమర్‌శేఖ్ బృందంతో లక్షలాది మరాఠీ ప్రజల ముందు జన చైతన్య ప్రజా నాట్య మండలి ప్రదర్శనలిచ్చి ఉర్రూతలూగినన్నా, ప్రజలకు అనలైన రాజకీయాలేమిటో కళా సాహితీ రంగాల పాత్ర ఏమిటో వివరించి చెప్పిన గొప్ప ప్రజా వాగ్గేయకారుడు మహాకవి. కవిగా, నవలా రచయితగా, నాటక రచయితగ, నటుడిగా జానపద పొవడా (ఒగ్గుకథ) కళాకారునిగా, సమీక్షకుడిగా, ట్రేడ్ యూనియన్ కార్యకర్తగా, పార్టీ సభ్యునిగా, ఆర్గనైజర్‌గా, ఉద్యమకారునిగా, వ్యాసరచయితగా ఇలా అనేక రంగాల్లో ఎదిగి అత్యున్నత అగ్రశ్రేణి మరాఠీ సాహితీకారుడిగా సాహితీ సామ్రాట్టుగా భారతదేశ గోర్కీగా గుర్తింపు పొందిన గొప్ప వ్యక్తి. ప్రాథమిక పాఠశాలలో ఎక్కడో వాదేగావ్‌లోని కుగ్రామంలో వారం రోజుల చదువు కాకండా 1.5 రోజుల చదువులో ఉపాధ్యాయుడి వివక్షదుర్భాష భాష భరించలేక ఉద్రేకంతో రాయివిసిరి, బడి వదిలినట్లు పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే కర్రసాముతోబాటు జానపద కళా రంగంలో అభినయంతోబాటు గాయకుడిగ ఆసక్తి పెంచుకొని ఆటపాటలతో మిత్రబృంధంను ఏర్పరుచుకొన్నవాడు... విద్యా గంధం నేర్చుకోని ఒక వ్యక్తి ఈ రోజు విశ్వవిద్యాలయాల్లోని మరాఠీ భాషా సాహితీవేత్తలకు పి.ఎచ్.డి. పరిశోధకులు సహితం సలాం కొట్టే రీతిలో చివరికి మరాఠీ చిత్రసీమలోనూ, హిందీ బాలీవుడ్ రంగంలోనూ తనదైన స్థానాన్ని సంపాదించడం అనూహ్యం, నమ్మలేని కఠోర సత్యం. సోవియట్ రష్యా ప్రభుత్వ పరంగ అక్కడికి వెళ్ళి మరాఠాలో శివాజీపై జానపద కళా ప్రదర్శన ఇచ్చి, ఆ తర్వాత రష్యా విప్లవంపై అంతర్జాతీయ సమస్యలపైనే కాక, దేశంలోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంపై, బెంగాల్ కరువులపై, బట్టల మిల్లు కార్మికుల సమస్యపై, హిందూ-ముస్లిం మత కల్లోలాలపై ఇలా పలు మరాఠీ జానపద ప్రజా కళా రూపాలు రూపొందించి ప్రదర్శనలిచ్చిన నిజమైన జాతీయ అంతర్జాతీయ కళా సాహితీవేత్త.

అత్యంత పేదరికంలో పుట్టి దుర్భర జీవన పరిస్థితులు ఎదుర్కొని ఎక్కడో సాంగ్లీ జిల్లా వాటేగావ్ నుంచి ముంబైకి చేరుకుని ఎన్నో రకాల కూలి పనులు చేసి జీవనం గడిపిన వాడు. రోడ్లపై గుంతలు తవ్వడం, చెత్త ఎత్తడం లాంటి పనులు చేస్తూ పోస్టర్లు తయారు చేయడం పనిలో కుదిరి ఆ తదుపరి బట్టల.మిల్లు కార్మికునిగానూ పనులు చేసినపుడు సమస్త ముంబై నగర శ్రమజీవుల జీవన విధాన చిత్రం మెదడుపై బలమైన ముద్ర వేసింది. ఈ జీవన ప్రయాణంలోనే ఒక పక్క ధనికులు అత్యంత ధనికులుగా ,పేదలు అత్యంత పేదలుగా మారడానికి పెట్టుబడిదారీ వ్యవస్థే కారణమన్న సత్యాన్ని గుర్తించడమే కాక శ్రమజీవుల శ్రమ దోపిడీ మూలంగానే పెట్టుబడిదారీ వర్గాలు దోపిడీ వర్గాలయ్యాయని వారి ప్రయోజనాలు కాపాడడం కోసమే బ్రిటిష్ వలస ప్రభుత్వాలు, ఈ దేశ పాలకవర్గాలు సహకరిస్తున్నాయని గుర్తించగలిగాడు. దారిలోని దుకాణాల, ప్రకటనల పేర్లు చదవడం నేర్చుకొని క్రమంగా పుస్తక పఠనం, పత్రికలు చదవడం వరకు ఎదిగి ఆ తర్వాత పురోగామి సాహిత్యకారుల, కార్యకర్తల పరిచయాలతో ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలలో భాగస్వామ్యంతో మరాఠీ భాషపై తనకున్న పరిధిలో మంచి పట్టు సంపాదించాడు. ఆ తర్వాత చదువుతూనే రాయడం నేర్చుకొని దానిపై మంచి పట్టు సంపాదించి తన రాతలకు ఒక పక్క తక్షణమైన పదును అందిస్తూనే మరోపక్క శోషిత పీడిత జన సమూహాల జీవన వ్యథలపై అద్భుతమైన ప్రజా కళాఖండాలను సాహిత్యాన్ని సృష్టించడం అలవాటు చేసుకున్నాడు. పురోగామి కార్యకర్తల సహకారం, ప్రోత్సాహం సమిష్టి చర్చల మూలంగా అన్నాబాపు సాహిత్యస్థాయి ఎదుగుతూనే వెళ్ళింది. దేశ, విదేశీ ప్రగతిశీల కథ, నవల, నాటక, వ్యాస సాహిత్యం విస్తృత స్థాయిలో

అధ్యయనం చేస్తూనే, ఉద్యమాల్లో పాల్గొంటూనే తన స్వంత కథ, నవల, నాటక, జానపద కళా ప్రక్రియలపై పూర్తిగా దృష్టి సారించి ఎవరూ ఊహించలేని ప్రజా నాయకుల పాత్రలను సృష్టించి జమీందారులపై పెట్టుబడిదారులపై, దోపిడీ పీడనలు జరిపే శక్తులను తమ కథ, నవలల్లో విలన్‌గా చిత్రీకరిస్తూ సమాజంలోని విభిన్న మనస్తత్వాల పాత్రలను జోడించి ప్రజా దృక్పథంతో ప్రేమ అంశం నుంచి మొదలుకొని అన్ని రకాల విషయాలపై ఆద్యంతం ఉత్కంఠ నెలకొల్పేలా రచన కొనసాగిస్తూ శైలిలో శిల్పంలో అగ్రశ్రేణి సాహిత్యకారులకు ఏ మాత్రం తీసిపోని రీతిలో రచనలు కొనసాగించి అతి తక్కువ సమయంలోనే గొప్ప సాహితీ సామ్రాట్టుగా ఎదిగిన వ్యక్తి అన్నాభావు.

ఆయన రాసిన కథలు-16, నవలలు 35, పదికి పైన పొవాడాలు (ఒగ్గుకథలు) తమాషా 1, రష్యా ప్రయాణ అనుభవంతో రష్యా ప్రయాణ అనుభవాల రచన, పాటలు, కవితలు, సమీక్షలు లేఖలు ఇలా ఎన్నో రంగాల్లో తన ప్రతిభా పాటవాన్ని చాటుకోవడం బహుశా భారతదేశ సాహిత్యంలో ఒక్క అన్నభావుకే ఆ కీర్తి దక్కుతుంది. నా జీవితంలో నేనేమి అనుభవించానో వాటినే నేను అక్షరబద్ధం చేసానని మూల పునాదుల నుంచి మొలకెత్తి వికసించే సాహిత్యమే సజీవ సాహిత్యమని ఆయన ప్రజాకళల అంశాలపై చర్చిస్తూ తన మనోగతాన్ని ప్రకటిస్తాడు. ముంబైలోని చిరక్‌నగర్‌లోని ఒక మురికివాడలో 15/10 అడుగుల అతి చిన్న పత్రాల రూంలో ఆయన జీవనం, సాహితీ ప్రస్థానం కొవ్వొత్తుల, కిరోసిన్ దీపాల వెలుగుల మధ్య కొనసాగింది. ఆయన రాసిన "ఫకీరా" నవలకు మహారాష్ట్ర ప్రభుత్వం మొదటి ఉత్తమ నవలగా ఎంపిక చేసి పారితోషికం ఇచ్చింది. అదే నవలపై మరాఠీలో సినిమా తీయడం అది బాక్సాఫీస్‌లో హిట్ కావడం ఆ తర్వాత అన్నాభావు బాలీవుడ్‌లో చొరబడడం చివరికి అందులో ఇమడలేక ఇబ్బందులు ఎదుర్కొనడం "ప్యాసా" చిత్రంలోని ఒక విషాదకర సంఘటనను గుర్తు చేస్తుంది. ఏదేమైనప్పటికీ దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజా వాగ్గేయకారులు, కళాకారులు, కవులు, రచయితలు, సాహితీపరులు అన్నాభావుసాఠే మరాఠీలో వ్రాసిన సాహిత్యాన్ని చదివే అవకాశం లేనప్పటికీ అనువదించబడిన కొంత సాహిత్యం వెలుగులో నేర్చుకోవాల్సిన గుణపాఠాలు ఎన్నో ఉన్నవి. ప్రత్యేకించి తెలుగు సాహితీకారులు, వాగ్గేయకారులు, కవులు, కథా రచయితలు మరాఠీ దళిత, పురోగామి సాహిత్యపరులు, సామాజిక ఉద్యమకారుల నుంచి ఎన్నో కొత్త అంశాలను నేర్చుకోగలిగే అవకాశం కల్పించగలదని భావిస్తున్నాను. అందుకు వీలైన మేరలో తెలుగులోకి అనువదించ బడిన (ఇంగ్లీషు, హిందీ) గ్రంథాలను సీరియస్‌గా చదవాల్సిన ఆవశ్యకత ఉంది.

(35వ పేజీ తర్వాత)

యోధుణ్ణి కన్నటువంటి తెరిష్కా గ్రామం తనకు ఎంతో అపురూపమైందని, రెండు నీలి సరస్సుల మధ్య నున్న ఆ గ్రామస్థులు, ఇవాన్ బంధువులు తనకెంతో ఆత్మీయులని రాస్తుంది. ఆమె ఉత్తరం నిండా గాఢాభివ్యక్తితో కూడిన అనుభూతులు పంచుకుంటుంది. 'ధైర్య సాహసాలకు ప్రసిద్ధుడైన రష్యా మహత్తర పుత్రుణ్ని ఎన్నడూ మరచిపోకండి' అనే విజ్ఞప్తితో ఆమె ఉత్తరాన్ని ముగిస్తుంది.

నవలలో అక్కడక్కడా దొర్లే వివిధ భాషా పదాలు ఏదో భాషా శాస్త్ర మౌలిక ఏక రూపకతను ఎరుకపరుస్తాయి. అందులో కొన్నింటి సామీప్యతను పరిశీలిద్దాం.

'వాస్' అంటే జర్మనీలో 'ఏమిటి', అదే ఇంగ్లీషులో 'వాట్' అంటే 'ఏమిటి'.

'ఇష్' అంటే జర్మనీలో 'నేను'. అదే హిందీలో 'యహ్' అంటే 'నేను' / 'ఇది'.

'గుత్' అంటే జర్మనీలో 'మంచి'. అదే ఇంగ్లీషులో 'గుడ్' అంటే 'మంచి'.

'దు' అంటే జర్మనీలో 'నీవు'. అదే హిందీలో 'తూ' అంటే 'నీవు'.

'క్రాంక్' అంటే జర్మనీలో 'పిచ్చి'. అదే ఇంగ్లీషులో 'క్రాక్' అంటే 'పిచ్చి'.

'కమ్' అంటే జర్మనీలో 'ఇటు రా', ఇంగ్లీషులో కూడా అదే అర్థం.

'బొంబె' అంటే జర్మనీలో 'బాంబు'. అదే ఇంగ్లీషులో 'బాంబ్'.

'లాన్డ్ విర్ షాఫ్ట్' అంటే జర్మనీలో వ్యవసాయం. ఇంగ్లీషులో ఏదో భూమి సంబంధించిన పని అని స్ఫురిస్తుంది.

'మెన్ష్' అంటే జర్మనీలో 'మనిషి'. ఇది తెలుగు మనిషికీ దగ్గరగా లేదూ!

'నైన్' అంటే జర్మనీలో 'లేదు'. హిందీలో 'నై' అంటే 'లేదు'.

'బ్రోత్' అంటే జర్మనీలో 'బ్రెడ్డు' అదే ఇంగ్లీష్‌లో 'బ్రెడ్'కు కొంచెం దగ్గరగా ఉంది.

'హీర్' అంటే జర్మనీలో 'ఇక్కడ'. అదే ఇంగ్లీష్ 'హియర్' అంటే ఇక్కడ.

ఇలాంటివెన్నో పదాలు నవల పొడవుతా చాలా పరిచయమున్న మాటల్లా తగులుతాయి. అవన్నీ విశ్లేషించడం, బహుశా ఇక్కడ సబబు కాదు. కానీ ఇవన్నీ ఇండో-యూరోపియన్ భాషలు ఒకే కుదురు నుండి విడి వడి, వేర్వేరు భాషలుగా అభివృద్ధి అయ్యాయనే వాదనను బలోపేతం చేస్తాయి. అంతకు మించి ఈ నవలలో ఆయా పదాల ఎరుక ఏదో ఆత్మీయ సొబగును ఆస్వాదించేలా చేస్తాయి.

నవల ఆద్యంతం ఉద్విగ్నమే. నవల పొడవూత ఉద్రిక్తతా కొనసాగుతుంది. సస్పెన్స్, థ్రిల్లర్ సినిమాను తలపించే భావోద్విగ్నతను రక్తనాళాల్లోకి నవల పంపు చేస్తుంది. నవల చదువుతూ సంలీనమైన పాఠకులు అక్కడక్కడా రక్తనాళాలు తెగే ఉత్కంఠను ఎదుర్కొంటారు. నవల నిండా సమయోచితంగా సాగిన మనో విశ్లేషణా పాత్రల హృదయాంతరాలను పట్టిస్తుంది. రష్యన్ సాహిత్యంలో ప్రత్యేకంగా చెప్పుకొనే ఒకానొకా అంశం మనకు ఈ నవలలోనూ కనిపిస్తుంది. పాత్ర ఏ దైహిక, అంతరంగిక వేదనతో కుమిలిపోతున్నడో కళ్లకు కట్టేలా అత్యంత ప్రతిభావంతంగా పాత్ర చిత్రీకరణ ఉంటుంది. నవలను ఒక్కసారి చదివితే అందులోని పాత్రలు మన పనిని పాటల్లోకి ప్రవేశిస్తాయి. పని చేసే చోట పాత్రలూ జోక్యం చేసుకొని పనిని చిందరవందరా చేస్తాయి. మనం నడయాడే గదుల్లోకి ప్రవేశించి, విశ్రాంతి గృహాల్లోకి చొరబడి సంస్కారాన్ని నిగ్గదీస్తాయి. పాత్రల చారిత్రక పాత్రను పట్టించుకోమని నిలదీస్తాయి.

రసోద్విగ్న కావ్యాన్ని తలపించే ఈ నవల ఇతివృత్తంలో మూలకందమైన గెరిల్లా త్యాగనిరతి నిరంతరం వెంటాడుతుంది.

రచయితగా ప్రభాకర్

● కాశీం



ప్రజా కళామండలి ప్రభాకర్ సారవంతమైన రచయిత. బహుశా, మనకెవరికి తెలియకుండా మౌనంగా రాసుకుంటూ వెళ్లాడు. తళుకు బెళుకుల ఈ సమాజం తన రచనలను రచనలు కావని అంటుందేమో అనే సంశయంతో తాను మాత్రం రచనను ఆపకుండా కొనసాగించాడు. పైగా రచయితగా గుర్తింపు రావాలని కూడా ఆయన అనుకొని ఉండడు. కళారంగంలో చాలా కాలం పనిచేస్తున్నప్పటికీ రచనా వ్యాసాంగంలోకి మాత్రం చాలా ఆలస్యంగా ప్రవేశించాడు. ముందుగానే ప్రవేశించి ఉంటే ప్రజా సాహిత్యానికి చాలా మేలు జరిగి ఉండేది. చేర్పు ఉండేది. ఆయన రచనలన్నీ 100 పేజీలలోపే ఉంటాయి. కాని ఒక్కొక్కటి ఒక్కో జీవిత శకలం. ఏ వ్యాసానికి ఆ వ్యాసం ప్రత్యేకంగా ఉంటాయి. నిజానికి ఇంతటి నిర్మాణాత్మక రచనలు అతడు అమరుడయ్యాక మనకు తెలియటమే విషాదం. చరిత్రలో కొందరి విషయంలో ఇలా జరుగుతుంది. చాలా ప్రభావశీలమైన కళాకారుడు కావడం వల్ల, ఆ రంగంలో ఆయన కృషిని తప్ప వ్యాస రచయితగా మనం ఆయనను గుర్తించలేకపోయాం.

ప్రభాకర్ సంఖ్య రీత్యా రాసింది కేవలం 12 వ్యాసాలు, 10 పాటలు మాత్రమే. కాని సారం రీత్యా వ్యాసాలు చాలా గొప్పవి. వేటికవిగా విడివిడిగా చూస్తే పరిశోధనాత్మక వ్యాసాలు, సామాజిక శాస్త్రాలలో పరిశోధన చేస్తున్న ఏ విద్యార్థి కూడా ఇంత సమాచారంతో వ్యాసాలు రాయలేరని చెప్పటంలో సందేహం అక్కర్లేదు. ఆయన వ్యాసరచన పద్ధతే భిన్నంగా ఉంటుంది. నేను కూడా ఆయన వ్యాసాలన్ని కలిపి ఇప్పుడే చదువుతుంటే విషయం రీత్యా, శైలి రీత్యా వాటి ప్రత్యేకత నాకు అర్థమయింది. ఒక విషయం మీద వ్యాసం రాయాలని నిర్ణయించుకున్న తర్వాత సమాచార సేకరణ, సేకరించిన దానిని వ్యాసానికి అనుగుణంగా విభజించుకోవటం, విభజించిన దానిని క్రమపద్ధతిలో పేర్లు మార్చుకుంటూ చక్కటి సరళ శైలిలో వ్యాసంగా రూపొందించటం అనేవి వ్యాస రచన నిర్మాణంలో ప్రధాన భాగాలు. అన్నింటి కంటే ముఖ్యంగా వ్యాసానికి చక్కటి లాజికల్ ముగింపునిచ్చే రాజకీయ స్పష్టత ప్రభాకర్ రాసిన ఏ వ్యాసం చదివిన అర్థమవుతుంది. ఈ పద్ధతి అందరికి సాధ్యమయ్యే పని కాదు. వ్యాస రచన మీద ఎంతో మక్కువ ఉండాలి. విస్తృతమైన అధ్యయనం ఉండాలి. ఈ రెండు ప్రభాకర్‌కు ఉన్నాయి. ఏ విషయం మీద రాసినా దాని చరిత్ర, గణాంకాలు, వర్తమానంలో దాని ప్రభావం, భవిష్యత్ పరిణామాలు, పరిష్కార మార్గాలు ఉంటాయి. విశ్వవిద్యాలయ స్థాయిలో చేయి తిరిగిన పరిశోధకుల పరిశోధనా పత్రాలు ఇలా ఉంటాయి. ప్రభాకర్ రచనలన్నీ పరిశోధనా పత్రాలే. ఈ సమాజ మార్పు కోసం పనిచేస్తున్న ప్రతీ కార్యకర్తకు ఇవి కరదీపికలు.

కళా రంగం మీద మూడు వ్యాసాలు, సామ్రాజ్యవాదం మీద ఐదు వ్యాసాలు, జిల్లాల మీద రెండు, విద్యారంగం మీద ఒకటి, స్త్రీల మీద ఒకటి రాసాడు.

కళలో ప్రాథమికమైనది డప్పు వాయిద్యం. ఆదిమ మానవుడి కాలంలో పుట్టి విస్తృతి పొందిన కళారూపం. భూస్వామ్య సమాజాలు ఆవిర్భవించాక భారతదేశంలో విశ్రాంతి వర్గాల కోసం బ్రాహ్మణీయ కళారూపాలు ముందుకు వచ్చాయి, ఫలితంగా అంటబడే కళలు, అంటరానికళలు అని కళలకు-కళా రూపాలకు కులం రంగును పులిమారు. అట్లాంటి అంటరాని కళారూపాల్లో డప్పు ఒకటి. ఇది ఎట్టి మాదిగడప్పు. ప్రతి మనిషి పాట వినపడగానే దానికి లయబద్ధంగా కదులుతుంటారు. నోటితో, వేళ్లతో, కాళ్లతో దరువు వేస్తుంటారు. దీని అద్భుత ఆవిష్కరణనే డప్పు. ఈ డప్పు గురించి ప్రభాకర్ గొప్ప వ్యాసం రాసాడు. బహుశ నాకు తెలిసి తెలుగు విశ్వవిద్యాలయంలోని జానపద కళల శాఖవాళ్లు డప్పు గురించి ఒక పుస్తకం వేసారు. కాని దాని విశ్లేషనంతా సంప్రదాయంగా ఉంది. అందులో సంప్రదాయ వాయిద్యాల కోణం నుంచి డప్పును విశ్లేషించే ప్రయత్నం చేసారు. ఇది మినహా డప్పు గురించి ప్రభాకర్ రాసింది కాకుండా ఇంకేమి ఉండకపోవచ్చు. డప్పును తయారుచేసే క్రమం నుంచి ప్రారంభించి దానికి వాడే చర్మం, కుదురుకు ఉపయోగించే కట్టే, కుదురును-డప్పును తయారుచేసే కులం, డప్పును వాయించే కులం ఇట్లా అనేక విషయాలను ఈ వ్యాసంలో పొందుపర్చాడు. మాష్టి, మాదిగ కులంలో పుడితే తప్పా డప్పు నిర్మాణం గురించే మరో కులానికి తెలిసే అవకాశం లేదు. అయినా అందరికీ అర్థమయ్యే పద్ధతిలో ఈ వ్యాసాన్ని ప్రభాకర్ రాసాడు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో 'జూన్ 2 బంగారు తెలంగాణ' ఆంధ్రజ్యోతి ప్రచురించిన ఆదివారం సంచికలో పసునూరి రవీందర్ రాసిన 'పాటమ్మ నీకు వందనం' అనే వ్యాసంలో పీకేఎం ప్రస్తావన కాని, టీకేఎస్(తెలంగాణ కళాసమితి) గురించి కాని, జేఎన్ఎం గురించి కాని రాయకపోవటాన్ని తప్పుపడుతూ పాట గురించిన వివరమైన వ్యాసం రాసాడు. తెలంగాణలో పాట పుట్టుక మొదలు, ఉద్యమంలో దాని పాత్ర జెఎన్ఎం, పీకేఎం, టీకేఎస్, అరుణోదయ పాత్ర గురించి చారిత్రక సందర్భాలతో సహా వివరించాడు. "ప్రజానాట్యమండలి, ఆర్ట్‌లవర్స్, జననాట్యమండలి, అరుణోదయ, ప్రజాకళామండలి, తెలంగాణ కళా సమితి వేసిన ప్రభావం తెలంగాణ ఉద్యమ పాటకు మూల స్తంభాలు, ప్రేరణ, కానీ పసునూరి రవీందర్ ధూంధాం పాటయే తెలంగాణ ఉద్యమ పాటకు మూల స్తంభంగా నిలిచిందని రాయడం తెలంగాణ సాంస్కృతికోద్యమ చరిత్రకు వక్రీకరణే" అనే నిర్ధారణ చేసాడు. ప్రభాకర్ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్ష తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నెరవేరాలనే లక్ష్యంతో పీకేఎంయే స్వయంగా "నివురుగప్పిన నిప్పు" అనే డాక్యుమెంటరీని నిర్మించింది. అయితే ధూంధాం పాటను గాని, దాని చరిత్రను గాని తక్కువ చేయాలనే దృష్టిని ప్రభాకర్ ఈ వ్యాసంలో ఎక్కడా ప్రదర్శించలేదు. ఒక సామాజిక సందర్భంలో ఏర్పడిన ప్రతి సంస్థకు ఒక పాత్ర ఉంటుంది. వాటి వాటి పాత్రలను బట్టి చరిత్రలో వాటి స్థానం న్యాయబద్ధంగా నిర్ణయించబడాలని ప్రభాకర్ కోరుకున్నాడు. ఒక కళాకారుడికి మాత్రమే కాకుండా ఒక చరిత్ర రచయితకు ఉండవల్సిన సమ్యక్ దృష్టిని ప్రభాకర్ చూపాడు.

ప్రభాకర్ నిజానికి విశ్వవిద్యాలయ స్థాయి విద్యను చదువుకొని డిగ్రీలు పుచ్చుకొని వచ్చిన జ్ఞానంతో వ్యాస రచయితగా మారలేదు. ఒక ప్రభాకరే కాదు ఆయన లాంటి చాలా మంది విప్లవకారులు అంతే. కాకపోతే వారికి సమాజం-ఆచరణ జ్ఞానాన్ని ఇచ్చింది. ఒక సంస్థనైనా, వ్యక్తినైనా, సంఘటననైనా చరిత్రలో భాగంగా చెప్పవల్సి వస్తే, స్థానాన్ని నిర్ధారించవల్సి వస్తే స్వీయాత్మక ధోరణికి తావులేకుండా రాయటం వర్గ దృక్పథం వలన అబ్బింది. వర్గపోరాట రాజకీయాలు గతితార్కిక దృష్టిని ఇచ్చాయి. కనుక ప్రభాకర్ కళారంగం మీద రాసిన వ్యాసాలలో ముఖ్యమైనది జేఎన్ఎం పద్మ మీద రాసిన వ్యాసం. ఆమె మనకెవరికి పరిచయం లేకపోయినా సరే ప్రభాకర్ రాసిన వ్యాసం చదివితే మనకూ పరిచయస్తురాలిగా అన్పిస్తుంది. ఆమె సమగ్ర వ్యక్తిత్వాన్ని ఈ వ్యాసంలో పొందుపర్చారు. అకాడమిక్స్‌లో వ్యక్తుల మీద మోనోగ్రాఫ్‌లు వేస్తుంటారు. అట్లాంటిది ఇది. హుజూరాబాదు తాలూకాలోని కనుకులగిద్ద అనే గ్రామంలో పుట్టిన పద్మ ఆ వూరి కామాంధులకు వ్యతిరేకంగా చేసిన పోరాటం, విప్లవోద్యమం ఆమెకు అండగా నిలబడిన తీరు మన కళ్లకు కట్టినట్లు వివరించాడు. సాయిని ప్రభాకర్ సహకారంతో ఆమె హైదరాబాద్‌కు చేరి యాప్రాల్ ప్రాంతంలో జేఎన్ఎం టీంలో చేరడం, ఆమెకు సహజంగా ఉండే గాత్ర కళను మెరుగు పర్చుకోవడం, సంజీవ్‌తో జీవిత సహచర్యం, బిడ్డ పుట్టటం, ఊగిసలాట, మళ్లీ ఉద్యమం, అమరత్వం వరకు సూక్ష్మ స్థాయి విశ్లేషణ చేసాడు. సామాన్యమైన పద్మ అసమాన్యురాలిగా ఎదిగిన తీరునంతా క్రమ పద్ధతిలో వివరించాడు.

ఇక ప్రభాకర్ వ్యాసాలలో ఎక్కువ ఫోకస్ ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం మీద ఉన్నాయి. పన్నెండు వ్యాసాలలో ఐదు వ్యాసాలు ప్రపంచీకరణ, సామ్రాజ్యవాద ప్రభావంతో ధ్వంసమైన వృత్తులు, సమూహాలు, సంస్థల గురించి రాసాడు. మోడీ, కేసీఆర్, చంద్రబాబు సామ్రాజ్యవాద దేశాల సేవలో తరిస్తున్న విధానాన్ని, ప్రపంచీకరణ ముసుగులో తయారైన చెత్త ప్రజల జీవితాలలో సృష్టిస్తున్న విధ్వంసం, భారీ యంత్రాల ప్రవేశం బహుళజాతి కంపెనీల లాభాల కోణంలో కార్మిక బతుకుల ఛిద్రం, ప్రపంచీకరణ సృష్టించిన కాల్‌మనీ మోసాలు, విధ్వంసమవుతున్న కార్మిక బతుకులు -వివిధ కోణాలలో సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనా పేద దేశాలను ఏ విధంగా ధ్వంసం చేస్తుందో చెప్పాడు. 1952 నుంచి 2016 వరకు పాలకులు ఎవరైనా విధానాలన్నీ సామ్రాజ్యవాదానికి అనుకూలమైనవి. ఈ దేశంలో పెట్టుబడిదారులు, భూస్వాములు దళారీ పాత్ర మాత్రమే వహించడానికి సిద్ధపడ్డారు. బహుళజాతి కంపెనీలు తయారుచేసిన వస్తువులను అమ్మిపెట్టి, కొంత సొంత వ్యాపారం చేసుకుంటూ సంతృప్తి పడుతున్నారు. వీరందరి ప్రయోజనాలను నెరవేర్చడానికి మోడీ అధికారంలోకి వచ్చాడని ప్రభాకర్ ఈ వ్యాసంలో చెప్పాడు. ఆయన ఇందులో ఒక మంచి పరిశీలన చేసాడు. "1952లో కశ్మీర్ విషయంలో ఆర్ఎస్ఎస్ జోక్యం చేసుకొని ఒక్క దేశంలో ఇద్దరు ప్రధానులు ఎలా ఉంటారు? ఒక్క దేశంలో రెండు జాతీయ పతకాలు ఎలా ఎగురుతాయనే వివాదాస్పద వ్యాఖ్యలతో ఉక్కిరి బిక్కిరైన కాంగ్రెస్ ప్రభుత్వం 1954 మే 14 నుంచి భారత రాజ్యాంగాన్ని కశ్మీరకు కూడా అన్వయించాలనే అధికారాలను నాటి రాష్ట్రపతికి ఇవ్వడం జరిగింది." విస్తృతమైన రాజకీయ అవగాహన ఉన్నవాళ్లకు మాత్రమే ఈ విషయాన్ని చెప్పటం సాధ్యమవుతుంది.

సామ్రాజ్యవాదానికి, హిందు మతోన్మాదానికి వైరుధ్యం లేదు. పేకముక్కల్లా కలిసిపోయి ప్రజలను-సంపదను దోచుకుంటున్నాయి. ఆర్ఎస్ఎస్ వనవాసి కళ్యాణ ఆశ్రమాలను నెలకొల్పి ఆదివాసుల భాషను, సంస్కృతిని దెబ్బతీస్తూ సంస్కృతాన్ని నేర్పిస్తున్నారు. విద్యాభారతి పేరుతో దేశంలో 18 వేల పాఠశాలలను నడిపిస్తూ 80 వేల ఉపాధ్యాయులతో 1.8 మిలియన్ విద్యార్థులలో హిందుత్వ భావాలను పెంచుతున్నారు. అభివృద్ధి నిరోధక భావజాలం వైపు విద్యార్థులను మళ్లించే కుట్రను ఈ వ్యాసంలో ప్రభాకర్ విప్పిచెప్పాడు. మెమోరాండం ఆఫ్ అండరస్టాండింగ్(ఎంఓయూ) పేరుతో ఈ హిందుత్వనే దేశాన్ని బహుళజాతి కంపెనీలకు తాకట్టు పెడుతున్నది.

హైదరాబాద్ నగరం మధ్యలో నుంచి రోజు వేల టన్నుల చెత్తను ట్రక్కులు మోసుకెళ్తుంటాయి. ఆ ట్రక్కు ప్రయాణించిన మేర దుర్గంధం వెదజల్లుతుంది. దాని వెనుక కనీసం రెండు నిమిషాలు కూడా ప్రయాణించలేము. మరీ ఈ మొత్తం చెత్తని తీసుకెళ్లి డంపింగ్ యార్డ్‌లో వేస్తే దాని పక్కననే జీవించే ప్రజల సంగతిని మనమెపుడైనా ఆలోచించామా? అవును మనలో భాగమైన ప్రభాకర్ ఆలోచించాడు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ గురించి ఆలోచించాడు. హైదరాబాద్‌లోని 95 లక్షల మంది తిని పడేస్తున్న "డొమెస్టిక్ వేస్ట్" కార్పోరేట్ ఆసుపత్రుల నుంచి వస్తున్న 'హాస్పటల్ వేస్ట్', 'ఇండస్ట్రియల్ వేస్ట్' జవహర్‌నగర్ గుండెపై వేసి కాలబెడుతున్నారు. ప్రభాకర్ తన గుండె మీద కుంపటి మండుతున్నట్లు భావించి మనందరికి అనుభవయోగ్యం చేసాడు. రచయిత అనుభవంలోకి వచ్చిన విషయాన్ని పాఠకులకు అనుభవయోగ్యం చేయటం గొప్ప రచయితల లక్షణం. జవహర్‌నగర్-350, గందంగూడా-20, ఫత్తుల్లాగూడా-45.78, శాంషిగూడా-23.70 ఎకరాల భూమిని ఆక్రమించి చెత్త డంపింగ్ చేసి ప్రకృతి గర్భంలో విషాన్ని నింపుతున్న తీరును ప్రభాకర్ క్షేత్రస్థాయి జ్ఞానంతో చెప్పాడు. చెత్తలో నుంచి నెలకు రెండు మూడు శవాలు బయటికి

వస్తున్నాయంటే చంపి పడేస్తున్నారా? అక్కడే చంపేస్తున్నారా? అనే సందేహాన్ని వెలిబుచ్చాడు. జవహర్‌నగర్ చుట్టుపక్కల నివశిస్తున్న ప్రజల గుడిసెలు ఎప్పుడు అంటుకుంటాయోనని బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. "తినే తిండి నుంచి విసర్జించే పెంట వరకు అన్నింటితో వ్యాపారం చేయగలిగే సామర్థ్యం కలిగిన సామ్రాజ్యవాద పెట్టుబడిదారులు సీడీఎమ్(క్లీన్ డెవలప్‌మెంట్ మెకానిజం) అనే ప్రయోగాన్ని వెనుకబడిన దేశాలకు పరిచయం చేసి, దాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశాలిచ్చింది" ఫలితంగా మన పాలకుల పచ్చదనం, పరిశుభ్రత, హరితహారం ఉన్న ప్రకృతిని ధ్వంసం చేసి కృత్రిమ ప్రకృతి పథకాలు తయారు చేయడం సామ్రాజ్యవాదుల కళ. చెత్త దంపింగ్‌యార్డ్ గురించి సమగ్రమైన సమాచారం కావాలంటే మొదలు ప్రభాకర్ వ్యాసం చదువవల్సిందే.

యంత్ర కోరలు తోమే కార్మికులు ఆ యంత్రాల కింద, వలన నష్టపోవడం ఈ శతాబ్దపు అభివృద్ధి. ప్రపంచీకరణ-సామ్రాజ్యవాద అభివృద్ధి వెలుగులో నీడనే అధికం. ఆ నీడ కింద ఇట్లాంటి కార్మిక జీవాలు బలవుతుంటాయి. నిర్మాణ రంగంలోకి భారీ యంత్రాలు ప్రవేశించడంతో కూనరిల్లిన కార్మికుల జీవితాల గురించి ప్రభాకర్ రాసిన వ్యాసంలో క్రీ.పూ 3,500 సంవత్సరాల కిందటి నిర్మాణ రంగ చరిత్రను జ్ఞాపకంలోకి తెచ్చాడు. ఆనాడు యంత్రాలు లేవు, కాని నిర్మాణాలు ఉన్నాయి. గ్రామంలో ఉండే అన్నిరకాల చేతివృత్తుల వాళ్లు కలిసి భవనాలను నిర్మాణం చేసారు. నేడు నిర్మాణం అంటేనే ధ్వంసమైన అనేక కుల వృత్తుల సమాహారం అనే సూత్రీకరణను ప్రభాకర్ చేసాడు. సామ్రాజ్యవాదులకు మేలు చేసే జీఎంఆర్, ఎల్‌అండ్‌టి, ట్రాన్స్‌టాయ్, ల్యాంకో, జనప్రియ మొదలైన బడా కన్‌స్ట్రక్షన్ కంపెనీలు ప్రవేశించడంతో నిర్మాణ రంగం ఒక పరిశ్రమగా అభివృద్ధి చెందింది. ఫలితంగా ఈ రంగం పెట్టుబడిదారుల చేతుల్లోకి మారిన పరిణామ క్రమాన్నంతా ప్రభాకర్ చెప్పాడు. ఒక రోజులో 200 మంది చేసే పనిని ప్రొక్లెయినర్(జేసీబీ) కొన్ని గంటల్లో చేస్తున్నది. మెట్రో రైలు ఒక పిల్లర్ 15 మంది కార్మికులు నెలరోజులు పనిచేస్తే పూర్తవుతుంది. కానీ యంత్రాలతో కొన్ని గంటల్లో పూర్తిచేస్తున్నారు. ఇట్లాంటి క్షేత్రస్థాయి పరిశీలన ఒక ప్రభాకర్ వలననే సాధ్యమవుతుంది. సామ్రాజ్యవాద సంస్కృతిలో భాగమే కాల్‌మనీ పేరుతో స్త్రీలను వడ్డీ వ్యాపారస్తులు తమ గుప్పిట్లో పెట్టుకొని వ్యభిచార కూపంలోకి దింపుతున్నారు.

ఈ దేశానికి అధికార మార్పిడీ జరిగాక నెహ్రూ చాలానే సోషలిస్టు కలలుకన్నాడు. కానీ ఆ కలలు అతి తొందరలోనే కల్లలయ్యాయి. నవ భారతంలో అన్ని రంగాలను ప్రభుత్వమే నిర్వహిస్తుందని చెప్పిన నెహ్రూ(1947 ఫిబ్రవరి) 1947 ఏప్రిల్ 6న "ఆయుధ సామగ్రి, రైల్వేలు, విద్యుత్, అణుశక్తి తప్ప మిగిలిన పారిశ్రామిక రంగం అంతటా సాధారణంగానే ప్రైవేట్ పెట్టుబడులకు అవకాశం ఉంటుందని" ప్రకటించిన పాలకులు క్రమంగా సామ్రాజ్యవాదులకు ఏ విధంగా తొత్తులుగా మారారో ప్రభాకర్ తన పదిపేజీల వ్యాసంలో విస్తారంగా చర్చించాడు. చరిత్ర మూలాలలోకి వెళ్లి రాసాడు. రైల్వేలోకి ప్రైవేట్ పెట్టుబడులు ప్రవేశించడానికి వీలులేదని ఆనాడు నెహ్రూ చెప్పాడు. కాని ఈనాడు మోడీ రైల్వేల పునర్వవస్థీకరణ పేరుతో ప్రైవేట్ సంస్థలకు అప్పగించటానికి సిద్ధపడ్డాడు. భారత పాలకవర్గాలు 70 ఏళ్లలో దేశాన్ని అమ్మేసి పేద ప్రజలకు జీవించే అవకాశం లేకుండా చేస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలను ప్రభాకర్ ముందు చూపుతో విశ్లేషించాడు.

ఇవ్వాళ తెలంగాణ రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పడుతున్న సమయంలో ప్రభాకర్ 2013లో, 2014లో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల మీద రాసిన వ్యాసాలు సందర్భోచితంగా ఉన్నాయి. హైదరాబాద్ నగరానికి వడ్డాణంలా అల్లుకున్న రంగారెడ్డి ఇవ్వాళ ముక్కలుగా మారిపోయింది. ఆనాడైనా ఈనాడైనా హైదరాబాద్‌లో ఉండే పెట్టుబడిదారులకు ఉపయోగపడేటట్లు రంగారెడ్డిని మార్చుకున్నారే కానీ దానికొక అస్తిత్వం ఉండేలా పాలకులు ఏనాడు ఆలోచించలేదు. 1978 వరకు హైదరాబాద్ రూరల్‌గా ఉన్న ప్రాంతాన్ని 1978లో వెంకట రంగారెడ్డి పేరు మీద రంగారెడ్డి జిల్లాగా మార్చిన చరిత్రను ప్రభాకర్ తన వ్యాసంలో పొందుపర్చాడు. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ఉంచాలనే ఆంధ్ర పెట్టుబడిదారులు కుట్రలు పన్నుతున్న సందర్భంలో 'హైదరాబాద్ తెలంగాణే కా జాన్' అనే వ్యాసాన్ని ప్రభాకర్ రాసి హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ కోరుకునే శక్తులకు బలాన్ని ఇచ్చాడు.

కనుమరుగవుతున్న విద్యా విలువలు పేరుతో ప్రభాకర్ రాసిన వ్యాసం ప్రామాణికమైనదే కాక కొత్త ప్రతిపాదనలు చేసినది కూడా. భారతదేశ విద్యారంగ చరిత్రను చెబుతూనే ఆ చరిత్రలో జరిగిన కుట్రను విప్పిచెప్పాడు. 1983 తర్వాత దేశంలో ప్రారంభించిన ఐఐటిలన్నీ విదేశీ నిధులతోనే అనే నిజాన్ని వివరించాడు. మద్రాస్ ఐఐటి జర్మని, బొంబాయి ఐఐటి రష్యా, కాన్పూర్ ఐఐటి అమెరికా, ఢిల్లీ ఐఐటి బ్రిటన్ నిధులతో మొదలయ్యాయనే రహస్యాన్ని బయటపెట్టాడు. అతడి వ్యాసంలో కొత్త ప్రతిపాదన ఒకటి ఉంది. నిరక్షరాస్యులను చేరదీసి స్వచ్ఛంద సంస్థలు ఏడో తరగతి వరకు చదివించి ఉద్ధరిస్తున్నామనే నెపంతో వారిని కార్పోరేట్ ఉత్పాదక కేంద్రాల్లో షాపింగ్‌మాల్స్‌లలో వస్తువులను అమ్మిపెట్టే సేల్స్‌బాయ్స్, గర్ల్స్‌గా మార్చుతున్నారని ప్రభాకర్ పరిశీలనలో తేలిన విషయాన్ని మనతో పంచుకున్నాడు. విద్య అర్థాన్ని మార్చి సి3(కెరియర్, కాంపిటీషన్, కమోడిటీ) చెప్పే స్థితికి దిగజార్చారు. స్త్రీల మీద రాసిన మరో వ్యాసం కొత్త విషయాలను కార్మిక కోణంలో మన ముందు ఉంచింది. నిర్మాణ రంగంలో స్త్రీలు లేకుండా సాధ్యం కాదు. కానీ స్త్రీలకు తక్కువ కూలీ ఇస్తున్నారు. నిత్యం లైంగిక వేధింపులు ఉంటాయి. కొన్నిసార్లు లొంగని స్త్రీలను హత్యలు కూడా చేస్తుంటారు. దేశంలో ఎన్ని చట్టాలు మారినా స్త్రీల కోసం మెరుగైన చట్టాలు తీసుకురాలేని పాలకవర్గాల నైజం భవన నిర్మాణ రంగంలో స్త్రీలు అనే వ్యాసంలో ప్రభాకర్ వివరంగా రాసాడు.

వ్యాసాలు కాకుండా ప్రభాకర్ పది పాటలు రాసాడు. పీకేఎం ఆశయాలు-లక్ష్యాల మీద, పెడదోవ పట్టిన యువత మీద, వైఎస్ పాలన మీద, బొక్కైట్ జ్వాల, పెళ్లిపైన ఇలా ఈ పాటలలో శిల్పం కంటే సారానికే అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. దాదాపు ఆయన రాసిన అన్ని పాటలు ఫాస్టబీట్‌లోనే ఉంటాయి. తీన్‌మార్ దరువులో నడుస్తాయి. హైదరాబాద్ యువత ఉపయోగించే భాషలో కొన్ని పాటలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా ప్రజలు వ్యవహరించే భాషలో ఇంకొన్ని పాటలు రాసాడు.

ప్రభాకర్, ఐలయ్య, కాగ్నా పేర్లతో ఆయన వ్యాసాలు, పాటలు రాసాడు. ఎక్కువగా అజ్ఞాతంలోకి వెళ్లాక లం పేర్లతో రాసాడు.

ఇవ్వాళ ప్రభాకర్ లేడు. అతని ఆలోచనలు, ఆచరణ అక్షర రూపంలో మన ముందు ఉన్నాయి. అల్పాక్షరాలలో అనల్పార్థం ఉండే వ్యాసాలను పాటలను ఆయన రాసాడు. తక్కువగా మాట్లాడి ఎక్కువ పనిచేయటం ప్రభాకర్‌కు ఇష్టం. తక్కువ రాసినా, రాసిన ప్రతి అక్షరం బలంగా రాసాడు. ప్రామాణికంగా రాసాడు. అనవసరమైన పదాలు, వాక్యాలు తన రచనలో లేకపోవటమే ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం. అది మనందరికి ఆదర్శం.

చలసాని ప్రసాద్ లేఖలు

● సజ్జా వెంకటేశ్వర్లు

విరసం శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం పనిని చలసాని ప్రసాద్‌కు అప్పగించింది 86లో. శ్రీశ్రీకి దగ్గరి వాడుగా చాలా మొత్తాన్ని అప్పటికే పోగేసుకున్నాడు చలసాని. అలాగే కొడవటిగంటి కుటుంబరావు వ్యాస ప్రపంచాన్ని కూడా ఆయనదే పూర్తి బాధ్యతయ్యింది. కొ.కు. వ్యాస పరంపర పోగెయ్యటం అంటే ఒక్క చేతికి సాధ్యపడేది కాదు. కారణం 30ల నుండి 80ల దాకా ఈ వ్యాసాంగం సాగింది. మరో ముఖ్య సంగతేమంటే, పేరు ఊరున్న ఉన్న పెద్ద పత్రికల నుండి. ఏ పేరు ఊరు లేని చిన్న పత్రికలను సమగ్రం చెయ్యాలనుకుంటే ఎంత కష్టమో ఊహించగలం. ఈ మహా ప్రయత్నం చలసాని మాత్రమే చెయ్యగలడు. కారణం ఆయనకున్న మానవ సంబంధాలు అంత బలమైనవి. శ్రీశ్రీ ఆత్మకథ "అనంతం"తో మొదలై లేఖలతో 20 సంపుటాల పనిని, సాహిత్య వ్యాసాలతో మొదలై కొ.కు. లేఖలతో ఈ రెండు ప్రపంచాల్ని రెండు దశాబ్దాలపై చిలుకు కాలాన్ని తీసుకొని ముగించారు చలసాని.

ఈ సుదీర్ఘ ప్రయాణంలో కొందరు అతిసన్నిహితులకు వందల ఉత్తరాలు రాశారు చలసాని. శ్రీశ్రీనీ కుటుంబరావునీ తెలుగు సమాజానికి పూర్తి స్థాయిలో అందించటంలో ఎండా, గాలి, వాన, ఆకలి, నిద్ర, డబ్బు, కుటుంబం, ఊరూ, వాడా ఏవీ పట్టకుండా, పట్టించుకోకుండా, తనతో కూడా నడిచే మిత్రులందరిని పోగేసుకొని కదిలిపోయాడు చలసాని. తెలుగు నేల మీది పెద్ద గ్రంథాలయాలతో పాటు, చిన్న చిన్న గ్రంథాలయాలు, వ్యక్తుల సొంత గ్రంథాలయాలు, మద్రాసు కన్నె మరలాంటి ఇతర రాష్ట్రాల గ్రంథాలయాలు, పత్రికల వాకిళ్ళు, మూతపడిన వాటి లోగిళ్ళు తెరిచి తెరిపించి మరీ వెతుకులాడాడు చలసాని. ఈ క్రమంలో ఒకమాట అంటుండేవాడు చలసాని. ఈ పనిలో ఎవరెవరు తనకు ఎలా సహకరించారో తెలియజేస్తూ, వారి పేర్లతో ఒక్కో శీర్షిక పెట్టి ఒక సమగ్ర ఉపయుక్త గ్రంథాన్ని వేద్దామనేవాడు. అది చాలాసార్లు గుర్తు చేయటం కూడా జరిగింది. అయినా, అది పూర్తి చెయ్యకుండానే దాటిపోయారు. అయినా, సన్నిధానంకు చలసాని రాసిన లేఖల ఈ సంకలనం చలసాని సంకల్పాన్ని చెప్పకనే చెబుతుంది.

ఇందులో మొదటి ఉత్తరం 11-6-87న విశాఖ నుండి రాశారు. ఇదీ ఈ సంపుటిలో కనిపించే తొలి లేఖ. అయితే, లేఖకి వెళ్ళితే, శర్మగారూ, మీకు నిన్నే జాబు రాశానంటాడు చలసాని. అంటే, అచ్చులో చేరని దీని ముందరి ఉత్తరం ఒకటుందని మనకు అర్థం అవుతుంది. శ్రీశ్రీ కుటుంబరావుల కోసం సన్నిధానం వారికి ఈ రెండు దశాబ్దాలపై చిలుకు కాలంలో ఎన్నో ఉత్తరాలు రాసి ఉంటారు చలసాని అని మనం గ్రహించవచ్చును. కానీ, ఈ సంకలనంలోకెక్కింది మాత్రం 23 లేఖలే. ఎన్నో లేఖలు కాలగర్భంలోకి. సన్నిధానం కూడా చలసాని బ్రతికుండగా ఈ పుస్తక ప్రయత్నం చేయలేదు. ఆ మనిషి చనిపోయాకనే ఆ ఖాళీని భరించలేని తనమేదో వెంటాడి ఉంటుంది. ఈ ప్రయత్నానికి అది దారి తీసి ఉంటుంది. ఇలా ఆ కొద్దిపాటి లేఖల్నే మన ముందుకు పుస్తక ప్రయత్నంగా తెచ్చారనిపిస్తుంది.

ఈ పుస్తకానికి మూడు ముందుమాటలున్నాయి. ఒకటి సన్నిధానం ప్రాణస్నేహితుడైన సతీష్‌చందర్ రాసింది. రెండు రంగస్థల, చలన చిత్రనటులు శ్రీ కాకరాల రాసింది. మూడు కవి, పరిశోధకుడు ఆచార్య జయధీర్ తిరుమలరావు రాసినది. కాకరాల సతీష్ చందర్ గార్లు, లేఖలలో ఉండే గొప్ప గుణాల్ని వాటి ప్రత్యేకతల్ని అనేక సందర్భాలతో ముడివడి అని నిర్వహించిన భూమికను చెప్పారు. తిరుమలరావు రాసిన ముందుమాటలో రహస్య ఉత్తరాలు చెత్తబుట్టల్లోకి చేరతాయి. అంటూ చివరి వాక్యంతో ముగించారు. శ్రీశ్రీకీ, చలసానికిగానీ, సన్నిధానం చలసానికిగానీ, ఈ రహస్య లేఖల సందర్భాలు లేవు. కానీ, సన్నిధానం లేఖల సందర్భంలోనూ తిరుమల రావు ధోరణి ఇలా మరోసారి బయటపెట్టుకోవడంలో ఆయనతో ఉన్న వ్యతిరేకత ఎవరిపైనుందో బయటపడింది. ఇలాంటి చర్చకు వేదికైనందుకు సన్నిధానం బాధపడక తప్పదు. ఇలా బాధపెట్టే మానసిక ధోరణితో ఎంత కాలం కొనసాగటం ఏ ప్రయోజకత్వమో తిరుమలరావుకు తెలియాలి.

సన్నిధానం గౌతమీ గ్రంథాలయంలో ఉన్నంత కాలం ఎందరికో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. అవన్నీ నిజంగా సాహిత్య అనుబంధానికి కట్టుపడి భేదాలు విడిచిపెట్టి కొనసాగించిన అనుబంధాలు, ఆప్యాయతలు. శ్రీశ్రీకీ, విశ్వనాథకూ, ఉన్న తేడాను గురించి విమర్శకులు ఎంతైనా మాట్లాడవచ్చు. కానీ, సన్నిధానం వారూ, వారి చూపు ఇందుకు ప్రత్యేకమైనది. అందుకే ఆరుద్ర కోసం అంతగా ఉత్సవాలూ - ఆయన తనకు రాసిన లేఖల్ని పుస్తకంగా కూడా తెచ్చారు. సన్నిధానంకు సాహితీమూర్తులంటే ఏ అరమరికల్లేన్ని ప్రేమాభిమానం. కనుకనే చలసానికీ ఇంతగా సహకరించారు.

చలసాని రాసిన ఈ లేఖలన్నింటిలోనూ కొ.కు. శ్రీశ్రీల రచనల కోసం వెతుకులాడే ఒక ఆరాటం ఉంది. సన్నిధానం గౌతమీ గ్రంథాలయం వేదిక పై నుండి పూర్తిస్థాయి సహకారం ఇచ్చారు. విరసం ప్రచురణలుగా పై ఇద్దరి సర్వస్వాలు తెలుగు వారికి అందాయి. అంటే, సన్నిధానం చేసి సహాయ సహకారాలు మర్చిపోలేనివి. చలసానితో స్నేహం ఇంత దీర్ఘకాలం కొనసాగటం వలన సన్నిధానం వారికి విరసం పట్ల అనుబంధం విడదీయలేనిదిగా మిగిలింది. అద్దేపల్లి 80వ జన్మదినం సభలో మాట్లాడుతూ, నేను సభ్యత్వం లేకపోయినా, విరసం సభ్యుణ్ణేనని ప్రకటించుకున్నారు సన్నిధానం. చలసాని స్నేహంలో అంత మాధుర్యాన్ని చూశాడు గనుకనే ఇప్పుడిలా స్పందిస్తున్నారు.

ఈ లేఖల నిండా అవసరాలనే కాదు, ప్రేమా, ఆత్మీయతలు, బాధలు, బంధుత్వాలు ఒంటరితనాన్ని జయించే గుణాలు, కవిత్వాలు, అన్నింటినీ కలబోసుకున్న మానవ సంబంధం దాని రూపం దర్శనమిస్తుంది.

ఏది ఏమైనా చలసాని దస్తూరిని అచ్చుకెత్తిన ధైర్యం సన్నిధానంకే సొంతం. రేపు విరసం ప్రచురించే చలసాని సాహిత్య సర్వస్వంలో ఈ లేఖలు డిటిపిలో దర్శనమిస్తాయే తప్ప ఇలా రావు.

గోర్కీ పిల్లలకు ఉత్తరాలు రాస్తూ, "తలా తోకా తెలిసుకోలేనంత పాడు దస్తూరీ నాదని మీరనకుండా, బాధ పడకుండా వుండాలనే, ఈ జాబును టైపురైటరు మీద రాయించానంటారు". చలసాని రాసిన లేఖలకూ ఇది తప్పక వర్తిస్తుంది. ఆయన అక్షరాలు అలా ఉంటాయి మరి!

చివరిగా ఒకమాట ఈ పుస్తకం ద్వారా సన్నిధానం చలసాని విరసం సాహిత్యంగా శ్రీశ్రీ కుటుంబరావుల ప్రచురణలో ఎలా బయటకొచ్చాయో చెబుతుంది. సన్నిధానంను మంచి స్నేహితునిగా చలసాని లేఖల ద్వారా విరసం గుర్తుపెట్టుకుంటుంది.

సంస్మరణ వ్యాసం

"వేర్ ఈజ్ ద ఫ్రెండ్'స్ హోమ్?"

● **శివలక్ష్మి**

ప్రఖ్యాత ఇరాన్ దర్శకుడు అబ్బాస్ కియరోస్తమీ, 1987లో పర్షియన్ భాషలో, 87 నిమిషాల నిడివితో, నిర్మించిన గొప్ప మానవతా వాద, సంవేదనా భరిత చిత్రం "నా మిత్రుని ఇల్లు ఎక్కడ ?"

అహ్మద్ అనే ఎనిమిదేళ్ళ బాలుడు తన పుస్తకాలతో పాటు పొరపాటున తెచ్చిన అతని మిత్రుని హోమ్ వర్క్ పుస్తకాన్ని వెంటనే తిరిగి ఇవ్వడానికి పొరుగూరికి చేసే పరుగుల ప్రయాణమే ఈ చిత్ర ఇతివృత్తం.

చిత్రం కథనం ఐదు భాగాలుగా ఉంటుంది.

1. సమస్య

సినిమా మొదటి సీన్‌లో ఒక క్లాస్ రూమ్, దానిలో ఉన్న బాలురు గందరగోళంగా రణ గొణ ధ్వనులతో అల్లరి చేస్తుంటారు. ఇంతలో ఉపాధ్యాయుడు ప్రవేశిస్తారు. ఎవరి స్థానాల్లో వారిని కూర్చోమని అదిలిస్తారు. ఆయన ముందురోజు ఇచ్చిన హోమ్ వర్క్ పుస్తకాలు తియ్యమంటారు. మొహమ్మద్ రెజా నెమజాడ (Mohamad Reja Nematzadeh) అనే బాలుడు హోమ్ వర్క్ పుస్తకాన్ని క్రితం రోజు స్కూల్లోనే మర్చిపోయి నందువల్ల అతను హోమ్ వర్క్ చెయ్యడు. ఇలా చెయ్యడం అతనికిది మూడోసారి. అందువల్ల టిచర్ కి చాలా కోపం వస్తుంది. చదువు పట్ల బాధ్యతగా ఉండాలనీ, ఉపాధ్యాయులు చెప్పినట్లు నడచుకోవాలనీ చెప్పి, పని ప్రాముఖ్యతను గురించి ఇతర విద్యార్థులకు ఉపన్యాసమిస్తారు. తర్వాత, ఇంకోసారి ఇలా ఇచ్చిన హోమ్ వర్క్ చెయ్యకుండా వస్తే, స్కూలు నుంచి బహిష్కరిస్తానని మొహమ్మద్ కు గట్టిగా టిచర్ చెప్తారు.

అహ్మద్, మొహమద్ ఒకే బెంచీలో పక్కపక్కన కూర్చుంటారు. క్లాస్ ఐపోయాక తరగతి గది నుంచి ఇద్దరూ బయటికి వస్తారు. మొహమద్ మోకాలికి దెబ్బ తగిలితే అహ్మద్ టక్కున అతనికి సహాయపడి ప్రేమగా పంప్ లోని నీళ్ళతో మోకాలి గాయాన్ని కడిగి దాని మీద నెమ్మదిగా రాసి, సున్నితంగా తన చేత్తో నిమురుతూ సేద దీరుస్తాడు. తర్వాత ఇద్దరూ విడిపోయి ఎవరింటికి వారు వెళ్ళిపోతారు. అనుకోకుండా పొరపాటున మొహమద్ పుస్తకాన్ని అహ్మద్ ఇంటికి తీసుకు వస్తాడు. వాళ్ళ ఉపాధ్యాయుడు క్రమశిక్షణ పాటించడంలో చాలా నిక్కచ్చి మనిషి. మాటంటే మాటే! అతను చెప్పింది విద్యార్థులు పాటించి తీరవలసిందే! ఇక అహ్మద్‌కి తర్వాత రోజు మొహమద్‌ని ఎక్కడ స్కూలు నుంచి తీసేస్తారోననే కలవరం మొదలవుతుంది.

అహ్మద్ తల్లి రకరకాల పనులతో, చంటిపాపతో సతమతమౌతూ అహ్మద్‌కి చిన్న చిన్న ఇంటి పనులు చెప్తూ ఉంటుంది. అవి చేస్తూనే చిన్నారి అహ్మద్, మొహమద్ పుస్తకం తనతో వచ్చేసిందనీ, హోమ్ వర్క్ చెయ్యకపోతే టిచర్ స్కూలు నుంచి తీసేస్తారనీ, అది పొరుగు గ్రామంలో తిరిగి ఇచ్చెయ్యాలనీ తల్లిని బతిమాలుకుంటాడు. వాడికాశాస్తి జరగవలసిందే, ఇన్ని పనుల మధ్య పక్క ఊరికెలా వెళ్తావు? అని అహ్మద్ కోరికను వెంటనే ఒక మందలింపుతో తిరస్కరిస్తుంది తల్లి. అహ్మద్ బాధను అసలు అర్థం చేసుకోదు. ఇంతలో ఏదో గుర్తొచ్చి స్థానిక బేకరీ నుండి బ్రెడ్ తెచ్చే పనిని పురమాయిస్తుంది. ఈ చిన్న అవకాశాన్ని మహద్భాగ్యంగా భావించి పక్కనున్న "పోష్ టెక్" అనే ఊరికెళ్ళి, పుస్తకాన్ని తన మిత్రునికి ఇవ్వడానికి పరుగు లంకించుకుంటాడు మన కథానాయకుడు అహ్మద్.



2. మొహమద్ గ్రామం "పోష్ టెక్" కు అహ్మద్ మొదటి పరుగు

తనుండే 'కోకేర్' గ్రామం నుండి మొహమద్ ఊరు పోష్ టెక్ కు కొన్ని కిలోమీటర్ల దూరం ఉంటుంది. అహ్మద్ పోష్ టెక్ గ్రామంలో ఇంటింటికీ వెళ్ళి మొహమద్ గురించి అడుగుతున్నప్పుడు పెద్దవాళ్ళెవరూ ఎనిమిదేళ్ళ అహ్మద్ ప్రశ్నలను పట్టించుకోరు. కానీ అదృష్ట వశాత్తూ ఒక క్లాస్ మేట్ కలిసి మొహమద్ ఇల్లు తెలియదు గానీ అతని కజిన్ 'హెమ్మాటి' ఇల్లు తెలుసని అక్కడికి తీసికెళ్తాడు.తీరా ఆ ఇంటికి అహ్మద్ వెళ్ళాక హెమ్మాటి తన ఊరు కోకేర్ కే వెళ్ళాడని తెలిసి తిరిగి కోకేర్‌కి ప్రయాణమౌతాడు.

3. కోకేర్‌కి అహ్మద్ తిరుగు ప్రయాణం

అహ్మద్ తన గ్రామం లోపలికి ప్రవేశిస్తుండగా అక్కడొక దుకాణంలో కూర్చుని ఉన్న అతని తాత చూచి "నువ్వు పక్క గ్రామాని కెందుకు వెళ్ళావు?" అని రకరకాలుగా ప్రశ్నించి అహ్మద్ పట్ల చాలా కఠినంగా ప్రవర్తిస్తాడు. తర్వాత, అహ్మద్ వినబడనంత దూరం వెళ్ళాక పిల్లల్ని నిరంతరం క్రమశిక్షణలో ఉంచాలంటే వారిని పెంచుతున్న క్రమంలో రెండు వారాల కొకసారి బాగా కొట్టాలని తన పక్కన కూర్చున్న ఒక వృద్ధ స్నేహితుడితో చెప్తాడు. అతను "ఏ తప్పూ చేయకపోతే ఎందుకు కొట్టాలి"ని అడుగుతాడు. మానాన్న మమ్మల్ని తప్పు చెయ్యకపోయినా కొట్టేవాడనీ, అలా పెరగడం వల్లే గొప్ప క్రమశిక్షణ అలవడిందని చెప్తాడు.

ఒక వర్తకుని మాటల్లో రెజా నెమజాడ అనే ఇంటి పేరు అహ్మద్ కి వినిపిస్తుంది. ఆ మనిషితో మాట్లాడే ప్రయత్నం చేస్తాడు అహ్మద్. కానీ ఇక్కడ కూడా మిగిలిన అందరు పెద్దల లాగే అహ్మద్ ప్రశ్నను వర్తకుడు ఏమాత్రం ఖాతరు చెయ్యకుండా, శ్రద్ధ పెట్టడం సంగతి అటుంచి బెదిరించి శిక్షలు సిఫార్సు చేస్తానంటాడు. మొరటుగా, పెడసరంగా తన గాడిదనెక్కి పోష్ టెక్ గ్రామం వైపు బయల్దేరతాడు. అతను మొహమద్ తండ్రి అయి ఉండొచ్చనే ఆశతో అతని వల్ల మొహమద్ దొరుకుతాడేమోనని ఆలోచిస్తూ అతని వెంట మళ్ళీ మారథాన్ మొదలెడతాడు మన అహ్మద్.

4. పోష్ టెక్ కు అహ్మద్ మళ్ళీ పరుగు

అహ్మద్ చివరికి వర్తకుని కుమారుణ్ణి చూస్తాడు. కానీ అతను మొహమద్ రెజా కాదు. అప్పటికి సంధ్యా సమయ మవుతుంది. ఒక వృద్ధుడు కనిపించి అతని స్నేహితుని ఇల్లు ఖచ్చితంగా చూపిస్తానని హామీ ఇస్తాడు. ఈ వృద్ధుడు అందరు పెద్దల లాగా కాకుండా విదిలించి కొట్టకుండా స్నేహపూర్వకంగా ఉన్నందుకు సంతోషిస్తాడు అహ్మద్. కానీ అతను సంప్రదాయ చెక్క తలుపులు తయారు చెయ్యడంలో సిద్ధ హస్తుడు.నిజానికి ఇరానియన్ సంస్కృతిలో చెక్కే ఎక్కువగా వాడేవారనీ, ఇప్పుడు బుద్ధి లేని మనుషులు ఆధునికత పేరిట మార్కెట్ మాయలో పడిపోతున్నారనీ చెక్కకు బదులు ఇనుము వాడుతున్నారని, చెక్క వస్తువులు తయారు చెయ్యడంలో తన నైపుణ్యం గురించి కథలు కథలుగా చెప్తూ ఉంటాడు. అహ్మద్ ఆయనకి వినేవారు కావాలని అనుమానించడం ప్రారంభిస్తాడు. చివరికి అదే నిజమవుతుంది. ఇక అహ్మద్ పొద్దు పోతుందని భయపడి మొహమద్ గురించిన తన తపనను అప్పటికి కాస్త తగ్గించుకుని వెనక్కి తిరిగి చీకటిలో ఎప్పటిలాగే పరుగుతో ఇంటి మార్గం పడతాడు.

5. అహ్మద్ మళ్ళీ కోకేర్ కు రెండవసారి వెనుతిరగడం

పరుగు పందెంలో పాల్గొన్నట్లే వెంట ఎవరో తరుముతున్నట్లే అహ్మద్ వచ్చేస్తాడు. ఇంటికి తిరిగి చేరుకున్నాక అహ్మద్ తల్లిదండ్రులు వారి దైనందిన కార్యక్రమాలలో పడి పిల్లవాడి సంగతి ఏమిటి, అటూ ఇటూ తిరుగుతూ స్థిమితంగా ఉండలేక పోతున్నాడేమిటి? అనే ఆలోచనే వారి కుండదు. ప్రేక్షకులు మాత్రం తర్వాత రోజు ఏమవుతుంది, ఈ చిన్నారి అహ్మద్ పడ్డ కష్టం మొత్తం నిరర్థకం కావలసిందేనా? అనే బాధతో ఉత్కంఠగా ఎదురు చూస్తారు.

అహ్మద్ రాత్రి పొద్దు పోయే వరకు మేల్కొని తన సొంత హోమ్ వర్క్ మాత్రమే కాక తన స్నేహితుడి హోమ్ వర్క్ కూడా చేసి అతనికి శిక్ష లేకుండా చెయ్యాలనే కృతనిశ్చయంతో రాత్రి దీక్షగా కూర్చుని రెండు పుస్తకా ల్లోని హోమ్ వర్క్ లను పూర్తిచేస్తాడు. అయినా రేపేమవుతుందో, టీచర్ ఏమంటారో నని అహ్మద్‌తో పాటు మనక్కూడా భయంగానే ఉంటుంది.

టీచర్ వీళ్ళ దగ్గరకొచ్చి అడిగినప్పుడు ఎవరి పుస్తకాలు వాళ్ళు చూపిస్తారు. మొహమద్ ని "గుడ్ బాయ్" అని టీచర్ మెచ్చుకుంటారు. ప్రేక్షకులు సంతోషంగా ఊపిరి పీల్చుకుంటారు. ఈ చిత్రం యొక్క నిశ్శబ్ద క్లైమాక్స్ కి సగటు సినిమా అభిమానుల నుంచే కాదు, ఆకతాయి పిల్లల నుంచి కూడా గాఢమైన ఊరట, ఆనందం పొందారనడానికి గుర్తుగా థియేటర్ లో వినిపించే హర్షాతిరే కాలు, చప్పట్లు మిన్ను ముడతాయి.

ఇక్కడ దర్శకులు చెప్పదలచుకున్న సంభ్రమం కలిగించే విషయం ఏమిటంటే, పుస్తకం మర్చిపోయి హోమ్ వర్క్ చెయ్యలేనప్పుడు నిజాయితీగా నిజం చెప్తే వ్యవస్థీకృత నియమాల ననుసరించే టీచర్ క్షమించలేరు గానీ చిన్న మోసం చేస్తే పొగడేశారు. ఇది ఎదిగిన వాళ్ళ తత్వం. నిజాయితీ కంటే మోసం మంచి పనిచేసింది!

"అబ్బాస్ కియరోస్తమి"- ఈ చిత్ర కథా రచయిత, స్క్రిప్ట్ రైటర్, ఎడిటర్, దర్శకులు. ఇరాన్ నుంచి వచ్చిన ప్రపంచ ప్రఖ్యాత దర్శకుల్లో కియరోస్తమి ఒకరు. ఇరాన్ దేశంలో సినిమాలపై ఉన్న ఆంక్షల వల్ల పిల్లల సినిమాల ద్వారా పిల్లలకి పెద్దలకి కూడా చెప్పే విషయాలను ఎంచుకుంటారు కియరోస్తమి!

"Where is my friend"s Home", "And Life goes on", "Through the Olive Trees" అనే మూడు సినిమాలను ఉత్తర ఇరాన్ లోని కోకేర్ గ్రామంలో కియరోస్తమీ చిత్రీకరించారు. ఈ మూడు సినిమాలనూ కోకేర్ త్రయంగా (Koker Triology) విమర్శకులు భావిస్తారు. మనకాలపు గొప్ప దర్శకులలో అబ్బాస్ ఒకరు.

ఎక్కడ మిత్రుణ్ణి స్కూలు నుంచి తీసేస్తారో ననే తీవ్ర మైన వేదనతో, ఆత్రుతతో రోజంతా శ్రమ పడతాడు అహ్మద్. ఇది పెద్దలకు చిన్నవిషయం అనిపించవచ్చు. కానీ అహ్మద్ చిన్నారి మనసుకి టీచర్ ఖచ్చితత్వం తెలుసు గనక అది అత్యంత వేగంగా తెల్లారేలోగా పరిష్కరించ వలసిన సమస్య గానే తోచింది. పెద్దలు పిల్లల్ని ఎప్పుడూ సతాయించేవారుగా, చికాకు పెట్టేవారుగా చూస్తారు. కానీ పిల్లలకు కూడా కొన్ని తీవ్రమైన ఒత్తిడులుంటాయని గమనించరు. ఇక్కడ నోట్ బుక్ తిరిగి ఇవ్వడం చాలా అవసరం అనే ఆరాటాన్ని తల్లి పట్టించుకోదు.టీచరేమో చదువుకునే పిల్లలకు చదువే ముఖ్యమంటారు.తలి-దండ్రులేమో స్కూలు ఐపోయాక ఇంటిపని చూడాలంటారు. ఎటూ చెప్పలేని పిల్లలు మధ్య నలిగిపోతారు. ఇది వారికొక గడ్డ పరిక్ష. ఇక్కడ మన హీరో తాను చాలామంచి పని అనుకున్నదాన్ని ఎన్ని అడ్డంకులెదురైనా చెయ్యడానికే సాహసిస్తాడు.

ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోగలిగిన అతి సాధారణమైన ముక్కుసూటిగా ఉన్న చిన్న కథ. కథనం సూటిగా, సహజంగా, సాగుతూ నడుస్తున్న కొద్దీ క్రమంగా సినిమా థీమ్ లోతుగా ప్రేక్షకులకు అర్థమవుతూ ఉంటుంది. అహ్మద్ తన స్నేహితుని కోసం పడే ఆరాటాన్నీ కేంద్రంగా చేసుకుని పిల్లల దృష్టి కోణం నుంచి తీసిన బాలల సినిమా. పిల్లల్లో నైతిక భావాలు ఎంత దృఢంగా ఉంటాయో చెప్పిన సినిమా ఇది. బాలుడు చేయదలచిన మంచిపనికి పెద్దవాళ్ళ ప్రపంచం నుండి ఎదురవుతున్న అడ్డంకులు చూస్తుంటే ప్రేక్షకుల హృదయాలు ఉద్విగ్నంగా పిల్లవాడి వైపుకి మొగ్గుతాయి!

తన స్నేహితుని ఇంటి కోసం అహ్మద్ రెండుసార్లు పరుగెడుతున్నప్పుడు ప్రేక్షకులు గ్రామసీమల స్వచ్ఛమైన శోభతో కూడిన, పచ్చని పైరులను, పచ్చిక బయళ్ళను ఆస్వాదిస్తారు. ఇరానియన్ గ్రామీణ ప్రజల సంప్రదాయాలు, విశ్వాసాలు, మురికివాడల లోని ఇళ్ళు, వీధులు, వాటిల్లో సంచరిస్తున్న పిల్లల్ని చాలా దగ్గరగా అద్భుతంగా చిత్రీకరించారు. ఈ సినిమా డాక్యుమెంటరీలా అనిపించదు. ఇరాన్ రోడ్లనూ, ప్రజలనూ శోభాయమానంగా దృశ్యీకరించిన అద్భుత చిత్రం. సినిమా ప్రయాణంలో ఆలివ్ చెట్ల మధ్య నుంచి కొండల్ని వంకర టింకరగా ఎ ఆకారంలో తొలిచి వేసిన దారుల గుండా అహ్మద్ రెండు సార్లు అటూ ఇటూ పరుగులు తీయడం వల్ల ప్రేక్షకులకు దారంతా తెలిసిపోతుంది. అనేక మలుపుల తోవలు చివరిలో ఒక చిన్న కొండ దానిని నియంత్రిస్తున్న సరిహద్దులు. అహ్మద్ స్వచ్ఛమైన మనసులోని సహానుభూతి - ప్రకృతి సహజ స్వేచ్ఛావరణం ఈ రెండూ కేంద్రంగా దృశ్యీకరణ మొత్తం సాగింది. అందుకే పిల్లవాడి దృష్టి కోణం నుంచి ఈ విషయం స్పష్టం చెయ్యడానికే కెమేరాను స్థిరంగా, దూరంగా ఫోకస్ చేస్తూ గ్రామీణ వాతావరణాన్నీ పరిగెడుతున్న దారుల్నీ ఎంతో హృద్యంగా దృశ్యీకరిస్తారు. కమర్షియల్ హంగులేమీ ఉండవు.

పెద్దవాళ్ళు నిజంగానే అంతగా పట్టించుకోని బాలల అమాయక ప్రపంచంలోకి ఒక అంతర్దృష్టిని ఈ సినిమా అందిస్తుంది. పిల్లలు పెద్దల

ప్రపంచంలో ఎలా కలిసి జీవిస్తున్నారు? పెద్దల విషయాలను వారు ఎలా గ్రహిస్తారు? వాటిని ఎలా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తారు? అనే విషయాలను చర్చిస్తుంది. పిల్లలు ఒకరి నొకరు అర్థం చేసుకోవడం, ఒకరి కొకరు సహాయం చేసుకోవడం, పెద్దల ఆదేశాల్ని పాటిస్తూ పిల్లలు ఎలా బతుకుతారో వివరిస్తుంది. చాలా బాగా తెలివిగా రాయబడిన సార్వకాలిక, సార్వజనీనమైన కథ. ఆ కథని ఉత్కృష్టమైన, అద్భుత దృశ్య కావ్యంగా మలిచారు కియరోస్తమి.

అసలు నటన ఏమాత్రం నటిస్తున్నట్లు కాకుండా చాలా సహజంగా, యదార్థంగా ఉంటుంది. నటన అంటే ఏమిటో తెలియని ఒక 8 సంవత్సరాల బాలుడు అహ్మద్‌గా నటించిన బాబెక్ అహ్మద్‌పూర్ (Babek Ahmed Poor) తో ఇంత తెల్విన, అర్థవంతమైన నటనను రాబట్టడమే ఒక అద్భుతం. మొహమ్మద్‌గా నటించిన అహ్మద్ అహ్మద్‌పూర్ (Ahmed Ahmed Poor), మిగిలిన నటీనట వర్గమంతా వారి వారి పాత్రలకు న్యాయం చేశారు. ఉత్తేజాన్ని, ఉత్కంఠను సడలనీయకుండా ఆసాంతం థ్రిల్లింగ్ గా నడుస్తుంది.

కథ చాలా సాధారణంగా అనిపించినప్పటికీ, పిల్లల మనస్తత్వశాస్త్రాన్ని పెద్దలకు సున్నితంగా విశదీకరించాలి కాబట్టి చిత్రీకరించడం సంక్లిష్టమే! ఇది పరిపూర్ణ సామర్థ్యం కలిగిన ఒక కళాఖండం. ఒక మహోన్నతమైన సంక్షిప్త కథ చదువుతున్న భావన కలుగుతుంది. మనం ఒక చిత్రం చూస్తున్నప్పుడు మన దృష్టిని సంగీతం ధ్వని, ప్రభావాలు అప్రయత్నంగా ఆకర్షిస్తాయి. ఒక్క పాట కూడా ఉండదు. చివరికి మనోహరమైన సరళతతో కూడిన కథ ప్రేక్షకుల మనసుని కమ్మేస్తుంది. ప్రతి పాత్ర, ప్రతి సన్నివేశం జీవితం పట్ల కియరోస్తమీ కున్న అవగాహననూ, పరిశీలననూ తెలియజేస్తుంది. అహ్మద్ కున్న కరుణ, సహానుభూతి, తన మిత్రుడి కేమవుతుందోనన్న ఆందోళన మంత్రముగ్ధుల్ని చేస్తాయి. ఒక బెంగ అతని చిన్ని మానసిక ప్రపంచాన్ని పట్టి వేధిస్తుంటే, మిగిలిన ప్రపంచానికి అది ఒక సమస్యే కాదు.

తాత బోధించే శిక్ష ద్వారా వచ్చే క్రమశిక్షణ, విధేయత కంటే గొప్పవైన నిస్వార్థం, మానవత్వం లాంటి విలువల్ని అప్పటికే తన అనుభవం ద్వారా నేర్చుకుని ఆచరణలో పెట్టే ప్రయత్నంలో ఉన్నాడు అహ్మద్. ఈ విషయాన్ని గమనించడంలో తలలు పండిన పెద్దవాళ్ళు కూడా విఫలమయ్యారు. మొహమ్మద్ ఎదురుగా లేకపోయినా తన బాధ్యతను విస్మరించలేదు అహ్మద్.

అబ్బాస్ సినిమాలు ప్రత్యేక ప్రభావాలు, అద్భుతమైన కెమెరా కోణాలే గాక శాంతి, మానవత్వం, జీవితంలోని అందాల్ని వివరిస్తాయి. పెద్దలు-పిల్లల మధ్య భావాలలో పెరుగుతున్న విభజన రేఖను స్పష్టంగా తెలియజెప్పూ అవసరమైతే తలిదండ్రులు విధించే నిబంధనలను మన అహ్మద్ లా పక్కకి పెట్టి, తోటి మనుషుల మౌలికమైన బాధల్ని పట్టించుకోవాలంటారు. ప్రతి ఫ్రేమ్ లో మానవత్వం తీవ్రస్థాయిలో ప్రతిధ్వనిస్తుంది. పిల్లల మానసిక భావోద్వేగాలను ఒడిసి పట్టిన గొప్ప చిత్రమిది.

ఈ సినిమాలో ఆహ్లాదపరిచి, ఆశ్చర్యపరిచే దృశ్యాలెన్నో ఉన్నాయి. తల్లి పక్కఊరికి వెళ్ళడానికి ఒప్పుకోనప్పుడు అహ్మద్ తన చొక్కా కింద పుస్తకాన్ని దాచి ఎప్పుడెప్పుడు బయటికి ఉడాయిద్దామా అని దొంగచూపులతో తొంగి చూసే సన్నివేశంలో అహ్మద్ భలే ముద్దొస్తాడు. ఇందులో నాకిష్టమైన దృశ్యం అహ్మద్ తాత తప్పు చేసినా చెయ్యకపోయినా పిల్లల్ని కొడుతూనే ఉండాలనీ, కొడితేనే గాని క్రమశిక్షణ అలవడదనీ అంటాడు. మా టీచర్ చిన్నప్పుడు తప్పు చేసిన ఒకమ్మాయిని కొడుతూ నాక్కూడా రెండు దెబ్బలు గట్టిగా అంటించింది." అబ్బ, నన్నెందుకు కొడతారు టీచర్, నేనేమీ చెయ్యలేదని నేనంటే, "నువ్వు చేసినప్పుడు నేను మళ్ళీ నీకోసం లేచొచ్చి కొట్టాలా, నువ్వెలాగూ అల్లరిదానివే, పనిలో పనిగా నీకూ ఇప్పుడే వడ్డించాను" అని అన్నారు. నాకిక్కడ నా బాల్యాన్ని నేనే చూసుకుంటున్నానా అనిపించింది. తరగతి గది దృశ్యాలు చూస్తున్న ప్రేక్షకులకు వారి వారి చిన్నతనాల్ని గుర్తుకి తెచ్చి మురిపిస్తాయి. ఇలా అనిపించడం ప్రేక్షకులకు తమ జీవితాలను తామే చూసుకుంటున్నామా అనుకోవడమే గొప్ప సినిమా లక్షణం.

"భారతీయ దర్శకుడు సత్యజిత్ రే మరణించినప్పుడు అంత గొప్ప సామాజిక వాస్తవ చిత్ర నిర్మాత మరొకరు లేరని నేను విచారించాను. కానీ ఇరానియన్ డైరెక్టర్ అబ్బాస్ కియరోస్తమి తీసిన "ఆలీవ్ ట్రీస్" (1992) చూసినప్పుడు రే లేని లోటు పూడ్చడానికి, మంచి సినిమా భరోసా కోసం అబ్బాస్ కియరోస్తమి ఉన్నారని నా విచారం పోయింది"- అని అన్నారు ఇంకో ప్రపంచ ప్రఖ్యాత అత్యుత్తమ దర్శకులు అకిరా కురోసావా

పిల్లల సినిమా గురించి చెప్పాలంటే ముందుగా ఇరానియన్ సినిమా గురించి చెప్పాల్సిందే! బ్రిటిష్ ఫిలిం ఇనిస్టిట్యూట్ ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఉత్తమ చిత్రాల్లో 50 అత్యుత్తమ చిత్రాలను ఎంపిక చేసింది. అందులో మళ్ళీ మొట్ట మొదటగా అవశ్యం చూడవలసిన 10 చిత్రాల్లో బాలల మనస్తత్వం మీద వచ్చిన అత్యుత్తమ చిత్ర మిది. 14 ఏళ్ళ లోపు పిల్లలూ, వారి తలి-దండ్రులూ, ఆ మాటకొస్తే అందరూ తప్పకుండా ఈ సినిమా చూడాలని ప్రపంచ సినీ మేధావులు హితవు చెప్తున్నారు!

నేనీ చిత్రాన్ని అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవం లోనూ, హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్ నిర్వహించిన "ఇరానియన్ ఫిల్మ్ ఫెస్టివల్" లోనూ చూశాను. చిన్నారి అహ్మద్ లా ప్రతిఒక్కరూ పక్కవారి పట్ల సహానుభూతితో ఆలోచిస్తే అసలు లోకంలో సమస్యలే ఉండవనిపించి ఈ సినిమా ఎప్పుడూ నా మనసులోనే స్థిరంగా ఉండిపోయింది. ఈ చిత్రాన్ని "చిల్డ్రన్ ఆఫ్ హెవెన్" తోనూ, మన 'పథేర్ పాంచాలీ' కి ప్రేరణగా నిల్చి, కనపడని ఫాసిజం దొంగను పట్టి చూపించిన 'బైసికిల్ థీఫ్' లాంటి గొప్ప సినిమాలతో పోల్చవచ్చు.

1987 లోకార్నో ఫిల్మ్ ఫెస్టివల్ లో ఒక అవార్డు గెలుచుకుంది.

అబ్బాస్ కియరోస్తమీకి ప్రకృతిలో మమేకమవడం ఇష్టం. దారులిష్టం. సీదాగా ఉండే దారులు, మెలికలు తిరిగే దారులు, కొండల్ని తొలిచి మలిచిన వంకర టింకర దారులు మొదలైన రకరకాల దారులిష్టం. ఎవరికైనా ఎప్పుడైనా జీవితంలో నేను సవ్యమైన దారి లోనే నడుస్తున్నానా లేక దారి తప్పానా అని సందేహం వస్తే అప్పుడు అబ్బాస్ కియరోస్తమీ సినిమా చూడాలని చెప్తారొక సినీ మేధావి.

అబ్బాస్ కియరోస్తమీకి కవిత్వమిష్టం. ప్రకృతిని, మానవత్వాన్ని ప్రేమించే ఆయన అభిమాన పార్శీకవి Sohrab Sepehrai పద్యం "Where is the friend's Home" నుంచే ఈ సినిమా సుందరమైన శీర్షికను ఎంచుకున్నారు.

అన్నిటినీ మించి అబ్బాస్ కియరోస్తమీ ప్రేక్షకులను మోసం చేయ్యనని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రేక్షకులను వంచించడమే పనిగా పెట్టుకున్న దర్శకులున్న ప్రస్తుత సందర్భంలో కియరోస్తమీ మన కోసం ఇంత సున్నితంగా ఆలోచించి, 2016, జులై 4న తన దారి తాను వెతుక్కుంటూ వెళ్ళిపోయి లోకాన్ని చీకటిలో ముంచేశారు! ఆయనకు నివాళిగా ఆయన సినిమాలన్నీ చూడడమే కియరోస్తమీ మనకు వదిలిపోయిన ఒకే ఒక్క దారి!

కట్టకముందే ...

ప్రాణాలు తోడేస్తున్న నేనో కెమికల్ ఫ్యాక్టరీ

● పి. వరలక్ష్మి

కర్నూలు జిల్లాలో ఒక మారుమూల గ్రామం. పేరు కొండజూటూరు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం వేదిక సిద్ధంగా ఉంది. అంతకు ముందే నంద్యాల డివిజన్ పరిధిలోని ఆరు పోలీస్ స్టేషన్ల నుండి రెండు వందల మండి దాకా పోలీసులు, ఎనిమిది మంది ఎస్.ఐ.లు, నలుగురు సి.ఐ.లు, ఒక డియస్పీ స్థాయి అధికారి బందోబస్తును పర్యవేక్షిస్తూ బయటి నుండి వచ్చే వాళ్ళ వివరాలు సేకరిస్తున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా పరిశ్రమ శాఖ అధికారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, ఆర్.డి.ఓ, తాసిల్దారు, తదితర అధికారులు, గ్రామ సర్పంచ్ తో పాటు ఆ ఊరి సమీపంలో ఏర్పాటు చేయబోయే రసాయన పరిశ్రమ చైర్మెన్ శాంతిరాముడు వచ్చారు. వచ్చీ రాగానే కలెక్టర్ గ్రామస్తులనుద్దేశించి 'టిఫిన్లు తిన్నారా' అని అడిగారు. "మీ ఊరికి రోడ్డెందుకు వేయలేదు? ఇంత బురద ఏమిటి? వెంటనే పరిష్కరించాలి అని అధికారులను హడావుడి పెట్టించారు. ఏమైనా సమస్యలుంటే చెప్పండని గ్రామస్తులను అడిగారు. వాళ్లేవో చెప్పుకుంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఇంతకూ శాంతిరాం నేనో కెమికల్ ప్రాజెక్ట్ రావటం ఎంత మందికి ఇష్టమో చేతులెత్తండి అంటే ఒక్కరూ కూడా ఎత్తలేదు.

శాంతిరాముడు, అతని కొడుకులు, వారు వెంటతెచ్చుకున్న గూండాలు అసహనంతో ఊగిపోయారు. ఆడవాళ్ళను బూతులు తిట్టారు. నేనో కెమికల్ ఫ్యాక్టరీ వ్యతిరేక ఉద్యమంలో క్రియాశీలకంగా ఉండే వ్యక్తిపై దాడి చేయబోయారు. మహిళలు తిరగబడ్డారు. రాళ్ళు తీసుకుని వెంటబడ్డారు. అధికారులు, పెట్టుబడిదారులు వారి అనుయాయులు పోలీసు రక్షణలో అక్కడి నుండి బైట పడ్డారు. ఈ ఘటన జరిగిన తర్వాత ఆ ఊరు పోలీసు పహారాలోకి పూర్తిగా వెళ్లిపోయింది.

సింగపూర్ కు చెందిన నానోమెటీరియల్స్ టెక్నాలజీ కంపెనీ, ఇక్కడి శాంతిరామ్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో 2015 లో ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం మేరకు సింగపూర్ వారి సాంకేతిక పరిజ్ఞానంతో ఇక్కడ నానో ప్రెసిపిటేటెడ్ కాల్షియం కార్బొనేట్ అనే రసాయనాన్ని ఉత్పత్తి చేయబోతున్నారు. నిజానికి ఇక్కడ జరుగుతున్నది సింగపూరు కంపెనీకి అవసరమైన భూమి, నీరు, ఇతర వనరులను చవకగా ఏర్పాటు చేయడం. విదేశీ కంపెనీలకు ఇండియాలో అన్ని వనరులతో పాటు చట్టాలు, ప్రభుత్వ విధానాలూ చవకే. కావాల్సినన్ని రాయితీలు ఇస్తారు. ('మేకిన్ ఇండియా' అని మనవాళ్లు బతిమాలుతున్నారు కూడా.) అందుకని అభివృద్ధి చెందిన దేశాలలో కన్నా ఇక్కడ పర్యావరణ అనుమతులను తక్కువ ఖర్చుతో పొందవచ్చు. నిర్వహణ కూడా సులువే. నిబంధనలు పాటించకపోయినా పట్టించుకోరు.

నేనో పరిశ్రమ కోసం శాంతి రామ్ కంపెనీ 150 ఎకరాల ప్రభుత్వ భూమిని ఈ ఏడాది ఫిబ్రవరిలో కొనింది. ఇక గ్రామ సభల అనుమతుల కోసం రాజకీయాలు మొదలయ్యాయి. ఆ భూమి పాణ్యం మండలం కొండజూటూరు గ్రామ పరిధిలో ఉంది. అది నీటి వసతి ఉన్న గ్రామం. కొండజూటూరు చెరువులో నీరు పుష్కలం. ఒకప్పుడు రెండు నెలలకు మించి అందులో నీరు ఉండేవి కావని, ఇప్పుడు కాలువ నీళ్ళు వస్తున్నందున చెరువు నిండుగా ఉంటోందని గ్రామ ప్రజలు చెప్తారు. రాయలసీమ సాధారణ స్థితికి భిన్నంగా, చాలా విచిత్రంగా ఊరికి మూడు వైపులా నీళ్లున్నాయి. ఏడాదికి రెండు పంటలు పుష్కలంగా పండుతున్నాయి. సుప్రసిద్ధమైన కర్నూలు సోనా మసూరి బియ్యం ఇక్కడి 90 శాతం పొలాల్లో సాగవుతోంది. నాణ్యత రీత్యా ఇక్కడి బియ్యం మొదటి శ్రేణిదని గ్రామస్తులు చెప్తున్నారు. ఇటు వంటి చోట ఒక ఫ్యాక్టరీ పెడుతున్నారని తెలిస్తే సాధారణంగా ఎటువంటి స్పందన వస్తుందో అదే వచ్చింది. ఇప్పుడు పరిశ్రమ కడుతున్న స్థలానికి 10 అడుగుల దూరంలో శ్రీశైలం కుడి కాలువ (ఎస్.ఆర్.బి.సి) ఉంది. కిలోమీటర్ దూరంలో గోరుకల్లు రిజర్వాయర్. గ్రామాలకు ఆదరువుగా కొండజూటూరు చెరువు, వద్దిగాండ్ల చెరువు. ఈ చెరువుల్లో నీటి ఊట ఎప్పుడూ ఉంటుంది. నేనో పరిశ్రమ వల్ల మొట్టమొదట ఇక్కడి సాగునీటి వనరు మీద దెబ్బ పడుతుంది. నీటి వనరు చూసుకునే పరిశ్రమ కోసం ఇక్కడ స్థలం సంపాదించుకున్నారన్నది ఎవరికైనా అర్థమవుతుంది. అదొస్తే ఎంత నీరు తోడేస్తారు అన్నది మొదటి ప్రశ్న. రెండోది ఈ నేనో టెక్నాలజీ, నేనో ప్రిసిపిటేటెడ్ కాల్షియం కార్బొనేట్, దాన్ని ఉత్పత్తి చేసే విధానం వంటి వాటి గురించి గ్రామస్తులే కాదు, చుట్టుపక్కల ప్రాంతాల వాళ్ళు, వివిధ పార్టీల వాళ్ళు కూడా ఎప్పుడూ విననైనా వినలేదు. దీనివల్ల ఏ కాలుష్యమూ ఉండదు అని తప్ప గ్రామస్తులు అడిగిన ఇంకే విషయాలు అధికారులు చెప్పలేదు. దీని వల్ల ఇక్కడి ప్రజలకు ఎంత ఉపాధి దొరుకుతుందని అడిగితే దానికీ అధికారుల వద్ద సమాధానం లేదు.

నేనో కెమికల్ పరిశ్రమ ప్రభావం కిందకి రాబోయే అతి సమీప గ్రామం కొండజూటూరు అయితే దాని చుట్టుపక్కల గ్రామాలు గోరుకల్లు, గొట్టాల, బలపనూరు, కౌలూరు, బాపనపాడు, వడగండ్ల, రసూల్ పేట, నేరవాడ, సుగాలిమెట్ట, రాంభూపాల్ రెడ్డి తాండ, అలమూరు, పాణ్యం, కొనిదేడుగ, గోపవరం. ఫ్యాక్టరీకి స్థలం కొన్న తర్వాత కాంపౌండ్ గోడ నిర్మాణం మొదలయ్యింది. ఎక్కడైనా పరిశ్రమ పెట్టాలంటే పాటించాల్సిన సాధారణ సూత్రాల గురించి ప్రజలు అడిగారు. గ్రామ సభల అనుమతి, పర్యావరణ ప్రభావ అంచనా ఏమీ లేకుండా కట్టడాలు ఎలా మొదలు పెడతారన్నది చాలా న్యాయమైన ప్రశ్న. అధికార్లులను, ఆ ఊరికొచ్చే, రాజకీయ నాయకులను, ప్రజాప్రతినిధులను ఈ విషయమై ఎన్నో సార్లు నిలదీశారు. ప్రజలకు నష్టం కలిగే పని మేమెప్పుడూ చేయం అని అందరూ చెప్తారు. అదే సమయంలో శాంతిరాముడి పనులకు ఆటంకం కలగకుండా చూసుకుంటారు. ఇట్లా ఉంటే జనం ఏం చేస్తారు? నిర్మాణాన్ని

కర్నూలు, కడప జిల్లాల నుండి 700 మంది పోలీసులను అక్కడ మోహరించారు. నెల రోజుల పాటు 144 సెక్షన్ విధించారు. సెప్టెంబర్ 29న తాసిల్దారు జారీ చేసిన 144 సెక్షన్ ఉత్తర్వుల్లో సురేఖ ఆత్మహత్య తదనంతర పరిణామాల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. సెప్టెంబర్ 14వ తేదీ ప్రజాభిప్రాయ సేకరణ సభలో జరిగిన ఘర్షణను గురించి ప్రస్తావిస్తూ 70 శాతం మంది ప్రజలు ఫ్యాక్టరీకి అనుకూలంగా ఉన్నారని, ఫ్యాక్టరీ వ్యతిరేకులకు వారికి తరచూ ఘర్షణ జరుగుతూ ఉన్నాయని రాశారు.

అడ్డుకున్నారు. కొండజూటూరు, బలపనూరు, వద్దిగాండ్ల, రసూల్ పేట్ గ్రామాలు నేనో కెమికల్ ఫ్యాక్టరీ కట్టడానికి ఎట్టి పరిస్థితుల్లో తాము అనుమతించమని గ్రామ సభలు పెట్టుకొని తీర్మానించాయి. ఆరు గ్రామాలకు చెందిన 700వందల మంది రైతులు కర్నూలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి తమ అభ్యంతరాలు ఒక్కొక్కరూ ఒక్కో పేపర్ చొప్పున 700 వినతి పత్రాలు రాసి అందజేశారు.

మరి పారదర్శకంగా వ్యవహరించాల్సిన అధికార్లు ఏం చేశారు? శాంతిరాముడి మనుషులు ఊర్లల్లో డబ్బులు పంచడం, కులపరంగా గుంపులు చేయడం, గ్రామస్తులను చీల్చి గొడవలు సృష్టించడం చేస్తుంటే కొందరు గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇట్లా డబ్బులు పంచుతున్నారు సార్ అంటే 'ఎలెక్షన్ కోడ్ ఏమైనా ఉందా అని పోలీసు అధికారి వెటకారం చేస్తాడు. శాంతిరాముడి మనుషులు నాపై దాడి చేశారంటే 'అసలు నువ్వే దాడి చేశావని ఫిర్యాదు ఉంది' అని ఎస్.ఐ అంటాడు. అంత నీతిగా ఫ్యాక్టరీ కడుతుంటే డబ్బులెందుకు పంచుతున్నారు అని గ్రామస్తుల ప్రశ్న. శాంతిరాముడి పట్ల అధికారుల ఎల్లలు దాటిన సేవాతాత్పరత చూసి ఏమనుకోవాలి అని ప్రశ్న. జిల్లాలో ఇప్పటికే ఎస్.పి.వై రెడ్డికి చెందిన అల్కైడ్ ఫ్యాక్టరీ చేస్తున్న కాలుష్యం చూస్తున్నారు. భూగర్భ జలాన్నంతటినీ తోడేసి అదే ఎస్.పి.వై రెడ్డి తక్కువ ధరకు మినరల్ వాటర్ సప్లై అని మాట్లాడుతున్న వైనం చూస్తున్నారు. ఆగ్రో కెమికల్ ఫ్యాక్టరీ కాలుష్యమూ చూస్తున్నారు. ఎక్కడా పారదర్శకత లేకపోవడం, అడుగడుగునా నిర్లక్ష్యం, ప్రజల ఆరోగ్యాల పట్ల, ప్రాణాల పట్ల లెక్కలేని తనం కనపడుతూనే ఉంది.

దీనికి అనుగుణంగానే ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) కర్నూలుకు చెందిన పర్యావరణ ఇంజనీరు 'అసలు ఈ నేనో ప్రిసిపిటేటెడ్ కాల్షియం కార్బొనేట్ పరిశ్రమకు ప్రజాభిప్రాయ సేకరణ, పర్యావరణ అనుమతి అక్కర్లేదు' అంటారు. అయితే ప్రజలకు కొన్ని అపోహలున్నాయని, అనవసరంగా భయభ్రాంతులకు గురై ఫ్యాక్టరీ పనులు అడ్డుకుంటున్నారని, అందువల్ల ఒక కమిటీని నియమించి, వారి ద్వారా గ్రామ ప్రజల అభ్యంతరాలు తీసుకోవాలని కర్నూలు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నిర్ణయించారు. ఈ కమిటీలో కర్నూలు పర్యావరణ ఇంజనీరు, నంద్యాల ఆర్.డి.ఓ, జిల్లా వైద్య అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్, అనంతపురం జె.ఎన్.టి.యు ఇంజనీరింగ్ కాలేజ్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగం బాధ్యులు ఉన్నారు. ఈ కమిటీ గ్రామంలో పర్యటించినప్పుడు గ్రామస్తులు అడిగిన వేటికీ సంతృప్తికరంగా సమాధానాలు చెప్పలేకపోయారు. గ్రామస్తులు తమ అభ్యంతరాలను కమిటీకి రాతపూర్వకంగా అందజేశారు. వినతులు, నిరసనలు, ప్రదర్శనలు ఎన్నో అయ్యాయి. అధికార పార్టీ తప్ప అన్ని రాజకీయ పార్టీలు ప్రజల ఆందోళనలకు మద్దతు తెలిపాయి. మరోవైపు డబ్బులు పంచడం వల్ల ఊర్లల్లో శాంతిరాముడి మద్దతుదారులు కూడా తయారైనారు. ఇదిలా ఉండగా సెప్టెంబర్ 2న జరిగిన ఒక సభలో ఘర్షణ జరిగింది. పోలీసులు కేసులు నమోదు చేశారు. పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాడుతున్న బాలప్పకు చంపుతామని, హైకోర్టులో వేసిన పిటిషన్ ఉపసంహరించుకోవాలని బెదిరింపులు వచ్చాయి.

ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 14న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో గ్రామస్తుల ఆందోళన, అధికారుల వ్యవహార శైలి, శాంతిరాముడి అత్యుత్సాహం అన్నీ వేదిక ముందు ప్రదర్శితమయ్యాయి. గ్రామస్తులు ఎంతగా ఉద్వేగానికి లోనయ్యారంటే ఒక యువకుడు ఒంటిపై కిరోసిన్ పోసుకుని కలెక్టర్ ముందుకొచ్చాడు. ఒక మహిళ పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించింది. మరెవరికో దేవత పూనింది. ఇంకొకరు నీళ్ళ ట్యాంకు ఎక్కారు. శాంతిరాముడు, అతని కొడుకు, వారి అనుయాయులు జనాల్ని నోటికొచ్చినట్లు తిట్టారు. జనం తిరగబడ్డారు. ఆ రోజలా ముగిశాక హఠాత్తుగా ఒక రోజు రాత్రి (సెప్టెంబర్ 28) బాలప్ప భార్య సురేఖ (28) ఉరేసుకుని చనిపోయింది. పోలీసులు తనపై కేసు నమోదు చేయడం, శాంతిరాముడి మనుషులు భర్తను నిరంతరం బెదిరించడం వల్ల మానసిక ఒత్తిడితో ఆమె ఆత్మహత్య చేసుకుంది. కొద్ది రోజుగా బాలప్పను ఏమైనా చేస్తారనే భయంతో హైదరాబాద్ వెళ్ళిపోయి ఉద్యోగం చూసుకోమని చెప్పింది సురేఖ. అంతలోనే అక్కడ ఒంటరివాడు కదా, దాడి చేసినా దిక్కు ఉండదని, పైగా ఊర్లో జనం అమ్ముడుపోయాడని అనుకొంటారేమోనని రకరకాల ఆందోళనలతో కుంగిపోయింది. దీనికి తోడు తనపై పోలీసు కేసు. సురేఖ ఆత్మహత్యకు శాంతిరాముడి మనుషులు, పోలీసుల వేధింపులే కారణమని గ్రామస్తులు మృతదేహంతో జాతీయ రహదారిపై దాదాపు ఆరు గంటలపాటు ధర్నాకు దిగారు. పోలీసు అధికారులు దిగి వచ్చి 11 మందిపై కేసులు నమోదు చేసి ఎస్.ఐ పై చర్యలు తీసుకుంటామని, చెప్పడంతో ఆందోళన విరమించారు. దీనంతటికీ కారణం శాంతిరాముడు, అతని ఫ్యాక్టరీ కనక గ్రామస్తులు పట్టుబట్టి సురేఖ శవాన్ని ఫ్యాక్టరీ స్థలంలో పూడ్చి పెట్టారు. ఒక ప్రాణం పోయాకైనా ఇదిలా ముగిసిపోవాలని అమాయకంగా వాళ్లనుకుని ఉంటారు. కానీ పెట్టుబడి కేవలం భావోద్వేగాలతో, సెంటిమెంట్లతో నిలిచిపోయేది కాదు.

అర్ధరాత్రి జనమంతా నిద్రలో ఉండగా పోలీసులు, రెవెన్యూ అధికారులు శవాన్ని తవ్వి తీసి ఎదురుగా ఉన్న జాగాలో పూడ్చారు. ఉదయాన్నే జిల్లా ఎస్.పి కొత్త సమాధి వద్దకు పోయి నివాళులర్పించి, బాలప్పను పరామర్శించి గ్రామంలో సమావేశం పెట్టి.. ఆవేశం అనర్థాలకు దారి తీస్తుందని, వారి ఆందోళన శాంతియుత పద్ధతుల్లో ఉండాలని హితవు చెప్పారు. కర్నూలు, కడప జిల్లాల నుండి 700 మంది పోలీసులను అక్కడ మోహరించారు. నెల రోజుల పాటు 144 సెక్షన్ విధించారు. సెప్టెంబర్ 29న తాసిల్దారు జారీ చేసిన 144 సెక్షన్ ఉత్తర్వుల్లో సురేఖ ఆత్మహత్య తదనంతర పరిణామాల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. సెప్టెంబర్ 14వ తేదీ ప్రజాభిప్రాయ సేకరణ సభలో జరిగిన ఘర్షణను గురించి ప్రస్తావిస్తూ 70 శాతం మంది ప్రజలు ఫ్యాక్టరీకి అనుకూలంగా ఉన్నారని, ఫ్యాక్టరీ వ్యతిరేకులకు వారికి తరచూ ఘర్షణ జరుగుతూ ఉన్నాయని రాశారు.

మరోవైపు సెప్టెంబర్ 14 జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సభ ఏ ప్రమాణాలు పాటించలేదని, కనీసం ప్రజలకు నెలరోజుల ముందు తెలియపరచడం, పత్రికల్లో ప్రకటించడం వంటిది కూడా చేయలేదని, పర్యావరణ ప్రభావ అంచనా గురించిన నివేదిక కూడా తయారు చేయలేదని ప్రజలు, ప్రజా సంఘాలు అంటే అసలు ఆ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ

సేకరణే అవసరం లేదని, ఆ రోజు జరిగిన సభ కేవలం ప్రజల అనుమానాలు నివృత్తి చేయడానికి ఏర్పాటు చేసినదని అధికారులు అంటారు. ఫ్యాక్టరీకి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి ఉందా అని ప్రజలు అడిగితే అసలటువంటిదేమీ అవసరం లేదన్నది శాంతిరామ్ సమాధానం. ఇదే మాట పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కూడా అన్నది. కానీ చివరికి ఫ్యాక్టరీకి అనుమతినిస్తూ (ఎందుకైనా మంచిదనేమో) కాగితాలిస్తుంది.

ఇంతకూ ఏమిటీ నేనో ప్రెసిపిటేటెడ్ కేల్షియం కార్బొనేట్? అది కాలుష్యకారక రసాయనం కాదని అధికారులు చెప్తున్నది ఎంత వరకు నిజం? కేల్షియం కార్బొనేట్ అంటే మనందరికీ తెలిసిన సున్నం. నేనో (nano) అనేది దాని పరిణామాన్ని సూచిస్తుంది. నేనో సైజు అంటే మిల్లీ మీటర్ లో 10,00,000వ వంతు. అంటే నేనో మీటర్ తో పోలిస్తే మిల్లీమీటర్ పది లక్షల రెట్లు పెద్దది. పదార్థాన్ని అంత చిన్న సైజులో తయారు చేస్తే నేనో పార్టికల్ అంటారు. కేల్షియం కార్బొనేట్ ను ప్రిసిపిటేషన్ పద్ధతి ద్వారా అంత సన్నటి పరిమాణంలోకి మారుస్తారు. ఈ తయారీ విధానంలో మరికొన్ని రసాయనాలు వాడొచ్చు. ఏవి వాడతారు, ఏ రసాయన సమ్మేళనం జరుగుతుంది, దాని వల్ల చుట్టుపక్కల ఎటువంటి ప్రభావాలు ఉండొచ్చు వంటివేమీ కంపెనీ వారు వెల్లడి చేయలేదు. ప్రెసిపిటేటెడ్ కేల్షియం కార్బొనేట్ కాగితపు పరిశ్రమలో, రబ్బరు తయారీలో, ఆఫ్ సెట్ ప్రింటింగ్ ఇంక్ వంటి చాలా వాటిల్లో ఇటీవల వాడుతున్నారు. సాధారణ కెమికల్ స్థానంలో నేనో కెమికల్ వాడితే నాణ్యత ఎన్నో రెట్లు పెరుగుతుందని చెప్తారు.

సాధారణ సున్నానికి దీనికి తేడా ఏమిటి అంటే దీని పరిమాణం అంత సన్నదిగా ఉంటుంది కాబట్టి ఇది శరీరంలోని చాలా భాగాల్లోకి సులువుగా చొచ్చుకుపోగలదు. మామూలుగా మన శరీరంలో అనేక ద్వారాల్లో దుమ్ము, ధూళి వంటి పదార్థాలను ఫిల్టర్ చేసే రక్షణ కవచాలు ఉంటాయి. అవేవీ ఈ నేనో సైజులో ఉండే పదార్థాలను ఆపలేవు. శ్వాస ద్వారా ఊపిరి తిత్తుల్లోని ఆల్వియోలి కణాలదాకా అవి చేరగలవు. నేరుగా చర్మ రంధ్రాల్లోకి వెళ్లిపోగలవు. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం నేనో పదార్థాలు ఏవైనా సరే అవి విషపదార్థాల(టాక్సిక్) వంటివే. అట్లాగే అవి పర్యావరణానికి హాని చేసేవే. డబ్ల్యూ.హెచ్.ఓ (ప్రపంచ ఆరోగ్య సంస్థ) నేనో కెమికల్ పదార్థాల వల్ల మనుషుల ఆరోగ్యాలపై దుష్ప్రభావాలను నిర్ధారించింది. కేలిఫోర్నియా యూనివర్సిటీ దీని మీద చాలా పరిశోధన చేసింది. నేనో కెమికల్ వల్ల రిస్క్ ఉంటుందనే అన్ని పరిశోధనలు చెప్తున్నాయి. వీటి మీద ఇంకా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. ఈ స్థితిలో ప్రపంచంలో ఎక్కడా లేనంత భారీ పరిశ్రమను కర్నూలు జిల్లాలో పెట్టబోతున్నారు. ఇక్కడి సున్నపు రాయి నిక్షేపాలు, చవకగా భూమి, రెడీగా ఎస్.ఆర్.బి.సి కాలువ నీళ్ళు, అన్నిటికీ మించి అల్ప స్థాయి నాణ్యతా ప్రమాణాలు సింగపూరు కంపెనీకి, మన దళారీ శాంతిరామ్ కంపెనీకి లాభదాయకంగా ఉంటాయి. ఇంతకూ ఫ్యాక్టరీ కోసం సున్నపు రాయి గనులు ఎక్కడ కేటాయించబోతున్నారన్న ప్రశ్నకూ సమాధానం లేదు. ఏదడిగినా చెప్పారు. నోరు మూసుకుని రామన్న రిస్క్ ను మోయాల్సింది ఇక్కడి ప్రజలు. అధికారికంగా, అనధికారికంగా లాభాలు పంచుకునేది కంపెనీ యజమానులు, వారికి సేవ చేసే అధికారులు. కట్టక ముందే నేనో కెమికల్ ఒకరిని బలి తీసుకుంది. ఇప్పుడే శాంతిరాముడి ఆగడాలు, అధికారుల తీరు ఇట్లా ఉన్నాయి. ఇక కెమికల్ ఫ్యాక్టరీ వస్తే తమ పరిస్థితి ఏమిటి? ఈ స్థితిలో ఇక్కడి ప్రజలు తమ ఆందోళకు మద్దతుగా నిలవమని ప్రతిపక్షాలను, ప్రజాస్వామికవాదులను కోరుతున్నారు. ఇది ఒక్క కొండజూటూరు కథే కాదు. కార్పొరేట్ అనుకూల, ప్రకృతి వినాశకర ప్రభుత్వ విధానాల వల్ల ఇంచుమించు ఇలాంటివే అనేక ఊర్లు దేశవ్యాప్తంగా ఉన్నాయి.

(63వ పేజీ తరువాత...)

ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతమంతా ఈ విధ్వంసం సాగుతున్నది. దీన్ని మావోయిస్టు ఉద్యమం ప్రతిఘటించి ప్రజల స్వావలంబన, స్వయం పాలన దిశగా ఏవోబీలో పురోగమిస్తున్నది. దీన్ని దెబ్బ తీయడానికి చంద్రబాబు నాయుడు, నరేంద్ర మోదీ కలిసి బెజ్జంగి మారణకాండకు పాల్పడ్డారు. చంద్రబాబు నాయుడు తన విధ్వంస అభివృద్ధి నమూనాకు ప్రత్యామ్నాయం మావోయిస్టుల దగ్గర ఉన్నందుకే ఈ మానవహననం చేశాడు. ఇలాంటి నష్టాలను అధిగమించి ప్రజా ఉద్యమాలు తప్పక పురోగమిస్తాయి. ఈ అమరుల స్ఫూర్తితో మనం నూరేళ్ల బోల్షివిక్ విప్లవం, యాభై ఏళ్ల చైనా సాంస్కృతిక విప్లవ వార్షికోత్సవాలను జరుపుకుందాం. మన అమర వీరులు ఒక సుందరమైన, మానవీయమైన సమాజం కోసం తమ ప్రాణాలు అర్పించారు. విప్లవోద్యమాలు ఇలాంటి ఆటుపోట్ల మధ్యనే విజయం సాధిస్తాయని గత విప్లవాల చరిత్రలో నిర్ధారణ అయింది. సోవియట్ యూనియన్‌లో దారుణ నిర్బంధం మధ్యే రాజకీయ, సైనిక పంథాలను మేళవించి విప్లవాన్ని ప్రజలు జయవంతం చేశారు. అది సకల జీవన రంగాలను విప్లవీకరించే మహత్తర ప్రజా ఆచరణ. మానవ సంబంధాలను, సంస్పందనలను, విలువలను, విశ్వాసాలను సోషలిస్టు రాజకీయార్థిక వ్యవస్థకు తగినట్లు పునర్నిర్మించే ప్రయత్నం జరిగింది. అది బోల్షివిక్ విప్లవానికి ముందు, ఆ తర్వాత కూడా ఒక్క చైనా అనుభవంలో తప్ప మరెన్నడూ, మరెక్కడా జరగని మానవీయ ప్రక్రియ. అది ఏకంగా మనిషినే పునర్నిర్మించడం. మానవత, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ అనే సార్వజనీన విలువల ప్రాతిపదిక మీద సాగిన సామూహిక ఆచరణ కాబట్టే ఆ వెలుగులో వచ్చిన అప్పటి రష్యన్ సాహిత్యం ఎల్లకాలాలకు కాంతి బావుటాలను ఎత్తిపడుతోంది. రష్యన్ విప్లవం, సోషలిస్టు ప్రయత్నం వలనే ఈ నూరేళ్లుగా అక్కడి సాహిత్యం పోరాట శక్తుల మేధస్సుపై, అంతరంగాలపై వెలుగు రేఖలను పూయిస్తూనే ఉంది. రష్యన్ ప్రజల సామూహిక అనుభవాల పొరల్లోపలికి వెళ్లి వాటి చారిత్రక అర్థాలను కాల్పనీకరించిన ప్రతిభావంతమైన రచయితలు, మేధావులు ఎందరో ఆ విప్లవంలో పురుడుపోసుకున్నారు. నవంబర్ విప్లవ పూర్వరంగంలోంచి.. సోషలిస్టు ఆచరణ కొనసాగినంత కాలం అలాంటి రచయితలను మనం చూస్తాం. కమ్యూనిస్టు పార్టీతో, విప్లవోద్యమంతో సాహిత్యకారులు ఎలా ఉండాలో తానే ఉదాహరణగా కామ్రేడ్ మ్యాగ్జిమ్ గోర్కీ నిలిచిపోయాడు. రష్యా, చైనా విప్లవ విజయాల వలె విప్లవానంతరం ఈ రెండు సమాజాల్లో జరిగిన సోషలిస్టు ప్రయత్నాలు, వాటికి లోపల.. బైటా ఎదురైన సవాళ్లు, వాటిని ఎదుర్కొన్న తీరు అంతే స్ఫూర్తిదాయకం. మానవజాతిని కొత్త చారిత్రక ఆవరణలోకి తీసికెళ్లిన ఈ విప్లవాలు, సోషలిజాలు అనేక కారణాల వల్ల తర్వాత్తర్వాత చరిత్రలో భాగమైపోయి ఉండవచ్చు. అవి ఉనికిలో ఉన్నప్పుడు, ఆ తర్వాత లోపలా, బైటా ఎన్నో విమర్శలకు గురై ఉండవచ్చు. కానీ అప్పుడూ, ఇప్పుడూ ఆ విప్లవాల వారసులు మహోపాధ్యాయులు లెనిన్, స్టాలిన్, మావోల పక్షాన నిలిచి.. వాళ్ల నాయకత్వంలో ప్రజలు సాధించిన విజయాలను గానం చేస్తూనే ఉన్నారు. ఆ విప్లవాలు జరిగిన సమాజాల ప్రత్యేకతలను సహితం పరిగణలోకి తీసుకొని వాటి విశిష్టతలను విశ్లేషిస్తూనే ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగానే విప్లవ శక్తులు గత అనుభవాల నుంచి నేర్చుకుంటూ 21వ శతాబ్దంలో సోషలిస్టు నిర్మాణానికి ఆలోచనా, ఆచరణ తలాల్లో సంఘర్షిస్తున్నారు. చారిత్రక భౌతికవాదాన్ని, వర్గపోరాటాన్ని, సోషలిజాన్ని ప్రజా శ్రేణుల్లోకి మరోసారి తీసికెళ్లడానికి యాభై ఏళ్ల సాంస్కృతిక విప్లవం, నూరేళ్ల బోల్షివిక్ విప్లవం గొప్ప చారిత్రక సందర్భాలు. బెజ్జంకి అమరుల స్ఫూర్తితో సాహిత్య, మేధో రంగాల్లో బోల్షివిజాన్ని ఎత్తిపట్టడానికి విరసం ఈ సభను నిర్వహిస్తోంది. అందరికీ ఇదే స్వాగతం.

- విరసం

వ్యాసం

క్యూబా విప్లవ సారథి కాస్ట్రో

● ఎ. నర్సింహా రెడ్డి

సామ్రాజ్యవాదుల 'వెన్నులో గన్ను'. పెట్టుబడిదారుల 'పక్కలో బల్లెం'. దోపిడీదారుల 'గుండెల్లో గునపం'. తాడిత, పీడిత వర్గాల ప్రతినిధి, విప్లవం ముద్దుబిడ్డ, అగ్రరాజ్య అమెరికాకి సింహస్వప్నం. అమెరికా సామ్రాజ్యవాదం నుండి క్యూబాకు విముక్తి సాధించిన ఉద్యమ నేత, విముక్తి ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాత. అలీనోద్యమాన్ని మనసారా ఆహ్వానించి కీర్తించిన వాడు కాస్ట్రో. సీఐఏ కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టిన ధీరోదాత్తుడు, సామ్యవాదం అజరామరమని నినదించిన యోధుడు, క్యూబా కమ్యూనిస్టు మేరునగధీరుడు, విప్లవానంతరం క్యూబా సమాజాన్ని ఐదు దశాబ్దాలపాటు ప్రగతి పథంలో నడిపిన యోధుడు, మహా సామ్రాజ్య ఆధిపత్యాన్ని ఎదుర్కొన్న ధిక్కార స్వరం ఫిడెల్ అలెజాండ్రో కాస్ట్రో రూయిజ్ నవంబర్ 25 శుక్రవారం రాత్రి 10.29 గంటలకు క్యూబా రాజధాని హవానాలో తుది శ్వాస విడిచారు.

ఆయన మరణంతో క్యూబా కన్నీరు మున్నీరవుతోంది. ఆయన వయస్సు 90 ఏళ్ళు, కొన్నేళ్ళుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మరణం క్యూబా ప్రజలతో పాటు ప్రపంచ ప్రజలకు దిగ్భ్రాంతి కలిగించింది. ఆయనకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు క్యూబాలో అణుశాస్త్రవేత్తగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

లాటిన్ అమెరికా ఖండంలో ఉన్న పురాతన చిన్న దేశం క్యూబా. అగ్రరాజ్యం అమెరికాకు 90 కిలోమీటర్ల దూరంలో ఉంది. 1492లో స్పెయిన్ నావికుడు క్రిస్టోఫర్ కొలంబస్ అప్పటి ఇటలీ ప్రభుత్వ సహకారంతో భారతదేశాన్ని కనుగొనాలని బయలు దేరి, దారి తప్పి అమెరికా సహా క్యూబాను కనిపెట్టాడు. అప్పటి నుంచి అక్కడికి స్పెయిన్ దేశీయుల వలస ప్రారంభమైంది. 1898 వరకు క్యూబా స్పెయిన్ వలస దేశమే. స్పానిష్ – అమెరికన్ యుద్ధం తరువాత 1898లో అమెరికా సైన్యం జోక్యం చేసుకుంది. నూతన ముసుగులో అమెరికన్ కార్పొరేట్లు, వ్యాపార సంస్థలు ప్రవేశించాయి. క్యూబా అమెరికా వలసగా మారింది. క్యూబాను అమెరికా స్వతంత్ర దేశంగా ప్రకటించినా, ఆ స్వతంత్రం నామమాత్రమే. స్వాతంత్ర్యం ముసుగులో నియంతృత్వం రాజ్యమేలింది. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో అమెరికా క్యూబాను పూర్తిగా తన గుప్పిట్లో పెట్టుకుంది. ఆ దేశ చెరుకు పంటను , చక్కెర ఉత్పత్తిపై అమెరికా తన గుత్తాధిపత్యంలో ఉంచుకుంది. దేశ ఆర్థిక రంగానికి మూలాధారమైన చక్కెర ఉత్పత్తి అమెరికా నియంత్రణలో ఉండడం వల్ల ప్రజల బతుకుతెరువు అగ్రదేశం దయాదాక్షిణ్యాల మీద కొనసాగింది.

అమెరికా బంటు జనరల్ ఫూల్‌గెన్సియా బాటిస్టా అనే ఒక తైనాతీతో కలసి కుట్ర పన్ని, 1952లో క్యూబా మీద అమెరికా ఆకస్మికంగా దాడి చేసింది. ఆ దీవికి అతడినే పాలకునిగా ప్రకటించింది. బటిస్టా నాయకత్వంలోని నియంతృత్వ ప్రభుత్వం కూడా అమెరికా కనుసన్నల్లో ఉండేది. ఆయన పాలనలో ప్రజలు దారిద్ర్యం, నిరుద్యోగంలో చిక్కుకొని విలవిల్లాడారు. చక్కెర పరిశ్రమలో, చెరుకు తోటలో పనిచేసే 30 శాతానికి మాత్రమే పని దొరికేది. మిగిలిన 70 శాతం నిరుద్యోగంలో లేదా అర్ధ నిరుద్యోగంలో కొట్టుమిట్టాడుతుండేవారు. ప్రజా ప్రయోజనాల కోసం కాకుండా, అమెరికా ఆర్థిక దోపిడీ లక్ష్యంగా నిర్మితమైన క్యూబా ఆర్థిక వ్యవస్థ ఆ దేశాన్ని పేదరికంలోకి నెట్టింది. నిత్యావసరాలైన పాలు, గుడ్లు, మాంసాహారం కూడా కరువయ్యాయి. దీంతో బటిస్టా ప్రభుత్వంతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారు. క్యూబా ప్రజానీకం విమోచన కోసం ఎన్నో పోరాటాలూ, త్యాగాలు చేశారు. ఆ క్రమంలోనే కాస్ట్రో విద్యార్థి నేతగా క్యూబా ఉద్యమాల్లో అడుగుపెట్టారు.

కాస్ట్రో ఆగస్ట్ 13, 1926న క్యూబాలో జన్మించాడు. చిన్నతనం నుంచే విప్లవ భావాలను పుణికిపుచ్చుకున్న కాస్ట్రో పదమూడేళ్ల వయస్సులోనే తండ్రి వ్యవసాయ క్షేత్రంలో సమ్మెను నిర్వహించాడు. .ఆయన సామాజిక ఆచరణ విద్యార్థి దశలో 'ఆర్థోడాక్స్' పార్టీ సభ్యునిగా

ప్రారంభమయింది. తల్లిదండ్రులిరువురూ నిరక్షరాస్యులైనప్పటికీ, ఫిడెల్‌ను బోర్డింగ్ పాఠశాలకు పంపారు. ఫిడెల్ కాస్ట్రో చురుకైన విద్యార్థి. హవాన వర్సిటీలో న్యాయ, సామాజిక శాస్త్రంలో పట్టా అందుకున్నారు. చదువు పూర్తయిన తరువాత హవానాలో న్యాయవాదిగా జీవితం ప్రారంభించాడు. పేదల కేసులే వాదించడంతో ఆర్థికంగా ఎదగలేక పోయాడు. ఈ నేపథ్యంలో క్యూబాలో నెలకొన్న ఆర్థిక అసమానతలను అర్థం చేసుకోసాగాడు. దేశాన్ని నియంత్రిస్తున్న అమెరికన్ వ్యాపారుల ఐశ్వర్యాన్ని, అంతస్తును అసహ్యించుకో సాగాడు. తిరుగుబాటు భావాలు పెరగసాగాయి.

21 సంవత్సరాల వయస్సులో, 1947లో క్యూబన్ పీపుల్స్ పార్టీలో సభ్యత్వం తీసుకున్నాడు కాస్ట్రో. అవినీతికి, అన్యాయానికి, బీదరికానికి, నిరుద్యోగానికి, చాలీచాలనీ జీతభత్యాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ఆ పార్టీ భావాలు ఆయనకు నచ్చాయి. ఐదేళ్లలోనే, 1952లో, ఆ పార్టీ పక్షాన ఎన్నికలలో పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపికయ్యాడు. సహజంగా మంచి వాగ్ధాటి కలిగిన కాస్ట్రోకు పార్టీలోని యువకుల మద్దతు బాగా లభించింది. క్యూబన్ పీపుల్స్ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్న తరుణంలో జనరల్ ఫుల్‌గెన్సియో బటిస్టా సైన్యం తోడ్పాటుతో అధికారాన్ని పూర్తిగా హస్తగతం చేసుకుని ఎన్నికలు జరగకుండా కుట్ర చేసాడు. అమెరికా కంపెనీలతో బటిస్టా లాలూచిపడి దోపిడీలో భాగస్వామిగా మారాడు. ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి, ఆగ్రహం పెల్లుబికాయి. ఆ దశలో యువత తిరగబడింది. శాంతియుత పద్ధతుల ద్వారా పరిపాలనలో మార్పు కోసం చేసిన కృషి విఫలమైంది. వృత్తిరీత్యా లాయరైన ఫిడెల్‌కాస్ట్రో, ఆయన సోదరుడు రావుల్ కాస్ట్రో కోర్టుల ద్వారా చేసిన న్యాయపోరాటం, బాటిస్టాను తొలగించమని చేసిన విన్నపం నిరాకరించబడింది. చట్టబద్ధమైన, శాంతియుత పోరాటం ద్వారా నియంతృత్వాన్ని తొలగించడం అసాధ్యమని స్పష్టమైన తర్వాత ఫిడెల్ కాస్ట్రో సాయుధ పోరాటానికి పిలుపు నిచ్చారు. ఆసమయంలోనే ప్రభవించిన విప్లవశక్తులు ఫిడెల్ కాస్ట్రో నాయకత్వంలో క్యూబా విమోచనకు సమాయత్తమైనాయి.

క్యూబా పోరులో కాస్ట్రో వెంట నడిచినవారు డాక్టర్ ఎర్నెస్టో చే గువేరా, అప్పుడే లాటిన్ అమెరికాలోని బొలీవియాలోనూ విప్లవం (1952) చెలరేగింది. యావత్తు లాటిన్ అమెరికా దేశాలను సందర్శించిన అనుభవంతో కాస్ట్రోతో ఆయన చేతులు కలిపారు. 1953లో క్యూబాలోని శాంటియాగోలో ఉన్న బాటిస్టా సైనిక కేంద్రం 'మంకాడా' బియామో సైనిక శిబిరం మీద 125 మంది కార్యకర్తలతో సాయుధ దాడి జరిగింది. క్యూబా విమోచన విప్లవానికి అంకురార్పణ జరిగింది. దీనికి కాస్ట్రో నాయకత్వం వహించారు. ఈ దాడి విఫలమైంది. కొందరు పోరాటంలో నేలకొరిగితే, ఇంకా అనేక మందిని అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేసి చంపారు. ఉపనాయకుడు అబెల్ సాంటోమారియాను అరెస్టు చేసి, అదేరోజు కాల్చి చంపారు. అప్పటికి తప్పించుకున్న కాస్ట్రో సోదరులను తర్వాత అరెస్టు చేశారు. దేశద్రోహ నేరం కింద వారిపై పెట్టిన కేసు రాజకీయ సంచలనమైంది. కాస్ట్రోను జైల్లో తీవ్ర నిర్బంధానికి గురిచేశారు.

న్యాయసహాయం నిరాకరించబడినందున ఫిడెల్ కాస్ట్రో తన కేసును తానే స్వయంగా వాదించుకున్నాడు. రాజులు, నియంతలు, ప్రభుత్వ అధినేతలు ప్రజలను నిరంకుశంగా పరిపాలిస్తే, ప్రజలకు తిరగబడే హక్కు ఉందని, వారిని తొలగించడం న్యాయమని వాదించాడు. ప్రపంచంలో విభిన్న దేశాల తత్వవేత్తల వాదనలు తన వాదనలో మేళవించాడు. . "మీరు నాకు శిక్ష విధించవచ్చు", "చరిత్ర నన్ను విముక్తిణ్ణి చేస్తుంది" అని తన వాదన ముగించాడు. ఆ అద్భుతమైన వాదన పుస్తకంగా ప్రచురించబడింది. కోర్టు ఫిడెల్ కాస్ట్రోకు 15 సంవత్సరాల జైలుశిక్షను, రావుల్ కాస్ట్రోకు 13 సంవత్సరాల శిక్షను విధించింది. వారిని విడుదల చేయాలని దేశ వ్యాపితంగా పోరాటం జరిగింది. బటిస్టా ప్రభుత్వం 1955లో చివరకు రాజకీయ ఖైదీలందరితో పాటు కాస్ట్రో సోదరులను విడుదల చేసింది. 1956లో క్షమాభిక్షతో జైలు నుంచి విడుదలకాగానే మెక్సికోకు వెళ్లిపోయారు.

అనతికాలంలోనే విప్లవకారులను సమకూర్చుకుని మెక్సికో అఖాతం మీదుగా గ్రాన్మా అనే నౌకలో క్యూబాపై 82 మంది గెరిల్లాలు దండెత్తారు. మళ్లీ తన సహచరులను కోల్పోయారు. దీంతో క్యూబా తూర్పు ప్రాంతంలోని సియెర్రా మేస్ట్రా పర్వతాల్లో తలదాచుకున్నారు. మళ్లీ దళాలను పునర్మించారు. గెరిల్లా పోరాటానికి కాస్ట్రో మూడు బృందాలుగా విడిపోయి బటిస్టా ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. 1957 నుండి 2 సంవత్సరాల పాటు తిరుగుబాటు పోరాటం జరిగింది. విప్లవకారులు కొన్ని వందల మంది, బాటిస్టా సైన్యం, పోలీసులు 37,000 మంది, అయినా మొక్కవోని ధైర్యంతో పోరాడారు. వారికి ప్రజల మద్దతు లభించింది. సాయుధ దళాలను ఓడిస్తూ 1959 జనవరి ఒకటి నాటికి పెద్ద విజయాలు సాధించారు. క్యూబా రాజధాని హవానాలో కమ్యూనిస్టు పార్టీ సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చింది. సైన్యం ఓటమి, ప్రజల సమ్మెతో కంగుతిన్న బటిస్టా అర్ధరాత్రి విదేశాలకు పారిపోయాడు. మరుసటి ఉదయం విప్లవకారులు దేశ రాజధానిలో అడుగుపెట్టారు. 1959 జనవరి 8న క్యూబా రాజధానిని స్వాధీనం చేసుకున్నారు. క్యూబా విప్లవం విజయవంతమైంది. రెవల్యూషనరీ డెమోక్రట్‌గా ఉన్న ఫిడెల్ కాస్ట్రో తన జూలై 26 ఉద్యమాన్ని క్యూబా కమ్యూనిస్టు పార్టీలో విలీనం చేశాడు.

అమెరికా పొరుగున ఉన్న క్యూబా వైశాల్యంలోనూ అతి చిన్న దేశమే అయినప్పటికీ వ్యూహాత్మకంగా విప్లవం విజయవంతం కావడానికీ, సోషలిజాన్ని నిర్మించడానికీ కఠోరమైన కృషి సాగించవలసి ఉంటుందని కాస్ట్రోకు ముందు నుంచే తెలుసు. కేవలం 80 మంది కార్యకర్తలతో ప్రారంభమైన విప్లవంలో దేశంలోని యాభైకి పైగా పార్టీలను, సంఘాలను ఏకం చేసి విశాల ఐక్య సంఘటన ఏర్పరచి, చివరికి నియంత బటిస్టా ఉద్వాసనకూ, క్యూబా విముక్తికి ఎన్నో త్యాగాలు చేయవలసి వచ్చింది. కాస్ట్రో, అనుచరులు శత్రుబలగాలకు చిక్కి నిర్బంధాలకు గురయ్యారు. అదొక సుదీర్ఘ పోరాటం. ఆ పోరులో అంతిమఘట్టం 1959లో ఆవిష్కృతమైంది. ప్రధానమంత్రిగా కాస్ట్రో ప్రమాణ స్వీకారం చేశారు. 1959లో క్యూబాలో ప్రజా ప్రభుత్వం స్థాపించినప్పుడు అది ప్రపంచ చరిత్రలోనే అసాధారణమైన సంఘటన అయింది. దక్షిణ అమెరికాను, కరేబియన్ సముద్రాన్ని తన సొంత పెరడుగా, జాగీరుగా భావించే అమెరికన్ సామ్రాజ్యవాదానికి దిమ్మతిరిగి పోయేలా కాస్ట్రో కరేబియన్ సముద్ర ద్వీపంలో అమెరికా పక్కలో బల్లేన్ని సృష్టించారు. శక్తిసంపన్నమైన అమెరికాను ఎదురించి ఈ చిన్న దేశం నిలవగలదా అనే సందేహాలను పటాపంచలు చేస్తూ ఐదు దశాబ్దాల పాటు విప్లవ ప్రభుత్వాన్ని నడిపారు.

అధికారంలోకి రాగానే విమోచన సమర లక్ష్యాలకు అనుగుణంగా కాస్ట్రో అనేక సంస్కరణలు చేపట్టారు. అమెరికన్ కంపెనీలను జాతీయం చేశాడు. భూ సంస్కరణలు అమలు జరిపి పేదలకు భూమి పంచాడు. పరాయి పెత్తనంతో చికికిపోయిన వ్యవసాయ రంగాన్ని పునరుద్ధరిస్తూ, కమతాలకు పరిమితిని ప్రకటించి రైతులకు కాస్ట్రో భూములను పంచిపెట్టారు. కాస్ట్రో తాను అధికారంలోకి రాగానే చిత్తడి భూమిని

ఆధునిక చరిత్రలో రాజకీయంగా నెగ్గుకొచ్చిన వారిలో కాస్ట్రో ఒకరు. ఇందుకు కారణం ఆయన ప్రజలు కూడా. కాస్ట్రో మూలంగా, విప్లవం వల్ల వారు ఆరోగ్యం, విద్యా హక్కులు పొందగలుగుతున్నారు. సుస్థిర సమూహాలు సజీవ సంస్కృతిని కాపాడుకోగలుగుతున్నాయి. తన చివరి రోజుల్లో వెనిజులాలో విద్యార్థులను ఉద్దేశిస్తూ "ఈ రోజు విముక్తి చెందాల్సిన వారు ఒక దేశంవారో, ఒక ప్రాంతంవారో కాదు. ఈ రోజు ప్రపంచం, మానవాళి అంతా ఒక బలమైన శక్తి ఆధిపత్యం కింద ఉంది. ఈ రోజు మొత్తం ప్రపంచం, మొత్తం మానవాళి విముక్తి చెందాల్సి ఉంది" అని స్పష్టం చేయటం గమనార్హం.

వ్యవసాయ భూమిగా అభివృద్ధి చేశాడు. విప్లవోద్యమ విజయ చిహ్నంగా ఆయన ప్రవేశపెట్టిన తొలి సంస్కరణ ఇదే. జూదశాలలు, వ్యభిచార గృహాలు మూతపడ్డాయి. లాటిన్ అమెరికాలో నూటికి నూరుపాళ్లు అక్షరాస్యత సాధించింది క్యూబానే.

దీంతో పాటు నగరాలలో పేదలకు ఇండ్లు ఇవ్వడం, పల్లె ప్రాంతాలలో భూ సంస్కరణలు మొదలైన సామాజిక కార్యక్రమాలు క్యూబా విప్లవానికి మంచి పేరు తెచ్చాయి. కాస్ట్రో నాయకత్వంలో క్యూబన్లు తమ దేశంలో అంటు వ్యాధులు లేకుండా నిర్మూలించుకోగలిగారు. మురికివాడలు తమ దేశంలో లేకుండా చేసుకోగలిగారు. ప్రజల భాగస్వామ్యం గల సంస్థలను రూపొందించుకున్నారు. 1961లో మేధావులను ఉద్దేశించి కాస్ట్రో ఇచ్చిన ప్రసంగం కీలకమైనది. 'విప్లవం పరిధిలోనే అంతా ఉండాలి. విప్లవానికి బయట ఏమీ ఉండదు' అని నిర్దేశించారు. 1960 దశకం యావత్తూ పార్టీ పంథాని కఠినంగా అమలైంది. విప్లవ వ్యతిరేక ప్రవర్తనపై నిఘా పెట్టారు. దీనిని సార్త్రే, డివోవర్‌తో సహా పాశ్చాత్య మేధావులు నిరసించారు. ఈ మేధావులు లాటిన్ అమెరికాను అర్థం చేసుకోలేక పోతున్నారు. అందులో భాగంగానే క్యూబాను, ఇక్కడి ప్రజలను అర్థం చేసుకోవడం లేదని కాస్ట్రో బదులిచ్చారు. అమెరికా 50 ఏళ్లపాటు విధించిన ఆర్థిక ఆంక్షలను తట్టుకుని నిలబడింది. అమెరికా సామ్రాజ్యవాదుల అదరింపులను, బెదిరింపులనూ లక్ష్యపెట్టకుండా క్యూబా ప్రజల కష్టాలను తొలగించే అనేక చర్యలు చేపట్టాడు. జాత్యాహంకారాన్ని రద్దు చేశాడు.

ఫిడెల్ కాస్ట్రో 1962లో క్షిపణ సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. క్యూబాపై అమెరికా ప్రత్యక్ష దాడికి సిద్ధమైంది. క్యూబా నుండి అమెరికా వలస వచ్చిన వారితో దాడి చేయించాలని చూసింది. ఆ సమయంలో సోవియట్ యూనియన్ క్యూబాకు అణ్వాయుధాలతో కూడిన రాకెట్లనిచ్చింది. ప్రపంచ వ్యాపితంగా సామ్రాజ్యవాద దేశాలు హాహాకారాలు వినిపించాయి. 'యుద్ధం అనివార్యమనే' పరిస్థితి వచ్చింది. 'బే ఆఫ్ పిగ్స్ క్రైసిస్'గా పేరు పొందిన క్యూబాలోని క్షిపణ కేంద్రాల గురించి అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య జరిగిన ప్రచ్ఛన్న యుద్ధమే ఈ క్షిపణి సంక్షోభం. అక్టోబరు 14 నుంచి 28వ తేదీ వరకూ జరిగిన ఈ సంక్షోభాన్ని అక్టోబరు సంక్షోభమని, కరేబియన్ సంక్షోభమని, మిస్సైల్ స్కేర్ అని కూడా పిలుస్తారు. 1962 క్షిపణి సంక్షోభం తలెత్తినప్పుడు కృశ్చేవ్, కెనెడీల మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో ఆయన మరే సోషలిస్టు నేత చేయనంతగా కృశ్చేవ్‌ను సవాలు చేశారు. సోవియెట్ - చైనాల మధ్య జరిగిన 'గ్రేట్ డిబెట్' సమయంలో ఆర్థిక అవసరాల రీత్యా సోవియట్ యూనియన్‌తో కాస్ట్రో ఉన్నారు. అయినా సోవియట్ విధానాలను తప్పు పట్టారు. మొదటి నుంచి కాస్ట్రో క్యూబా స్వతంత్రను కాంక్షించారు. చే గువేరా మాదిరిగా చిన్న దేశాల సౌహార్ధతను కోరుకున్నారు. క్షిపణి సంక్షోభం ముగిసిన అనంతరం కాస్ట్రో దేశంలో తాను నమ్మిన సోషలిస్టు సిద్ధాంతాలను అమలు చేశారు. ఆర్థికంగా అమెరికా వేధించినప్పటికీ, దూరం పెట్టినప్పటికీ, ఒంటరిని చేసినప్పటికీ సోవియట్ యూనియన్ సహాయంతో ముందుకు సాగారు. తనదైన శైలిలో రాజకీయ ప్రత్యర్థులను వణికించారు.

క్యూబాలో కాస్ట్రో సాధించిన మరో చెప్పుకోదగిన విజయం.. ప్రపంచ ఖ్యాతి గాంచిన బయోటెక్నాలజీ పరిశ్రమ. ఇక్కడ హెపటైటిస్ బి, మెనింజైటిస్‌తో పాటు కొన్ని రకాల క్యాన్సర్‌కు కూడా వ్యాక్సిన్‌లను రూపొందించారు. హెచ్ఐవి వ్యాక్సిన్ కోసం పరిశోధనలు సాగుతున్నాయి. లాటిన్ అమెరికాలో గెరిల్లాలకు ఆయుధ సరఫరా చేయడమే కాకుండా శిక్షణ శిబిరాలు నిర్వహించారు. 1965లో అల్జీరియా వామపక్ష నేత అహ్మద్ బెన్‌బెల్లాకు మద్దతు ఇచ్చారు. దక్షిణాఫ్రికా జాతి వివక్ష ప్రభుత్వ దాడి నుంచి కాపాడటానికి ఆ విప్లవ స్ఫూర్తితోనే 1970ల నాటి ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితుల మధ్యనే ఒక చిన్న కరేబియన్ (లాటిన్ అమెరికా) దేశంగా వేల మైళ్ల దూరంలో ఉన్న అంగోలా, ఇథియోపియా దేశాల యుద్ధ క్షేత్రాలలోకి తన వాలంటీర్లను, సైనికుల్ని 1976-81 మధ్య దూకించింది క్యూబా. రానున్న రోజుల్లో ఆఫ్రికా ప్రపంచ విప్లవానికి విశ్వవేదిక కాగలదని కాస్ట్రో విశ్వసించారు. 1980 దశకంలో ఆయన ప్రపంచవ్యాప్తంగా వైద్యులను, వైద్య నిపుణులను అందించడం ప్రారంభించారు. ప్రత్యేకించి దీనావస్థలో ఉన్న హైతీ, దక్షిణాఫ్రికా వంటి దేశాలకు తోడ్పడ్డారు. ఇప్పటికీ వివిధ దేశాల్లో క్యూబా వైద్యులు నలభై వేల మంది ఉంటారు జీ8 దేశాలన్నిటి కన్నా ఇది ఎక్కువ. వెనెజులాలో ఎంతో మంది క్యూబా వైద్యులు పనిచేస్తున్నారు. ఇందుకు కృతజ్ఞతగా వెనెజులా నేత హ్యూగో చావెజ్ క్యూబాకు చమురు సరఫరా చేశారు. కాస్ట్రో చావెజ్ జోడీ ఒక ప్రధానమైన అంతర్జాతీయ కూటమిగా చెప్పుకోవచ్చు.

అమెరికాలోని మియామిలో గల క్యూబన్ వలస ప్రజలు కాస్ట్రో వ్యక్తిత్వం మీదనే దాడి చేస్తుంటారు. కాస్ట్రో పోతే, ఆయన సోషలిజం కూడా సమాధి అవుతుందని అంటారు. కానీ విప్లవ సానుభూతి పరులు కాస్ట్రోను, ఆయన పార్టీ సభ్యులను పరివర్తనా సారథులుగా పేర్కొంటారు. సోవియట్ యూనియన్ కుప్ప కూలిన తరువాత, క్యూబా ఎన్నో వడిదుడుకులను ఎదుర్కొంది. క్యూబా కూడా వియత్నాం మాదిరిగా మార్కెట్ ఆర్థిక వ్యవస్థతో కూడిన మెతక విధానాన్ని అవలంబిస్తుందని పాశ్చాత్య దేశాల నాయకులు భావించారు. కానీ మారిన అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబడటానికి కాస్ట్రో నిరాకరించారు. ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభం, వాతావరణ సంక్షోభం, ఇంధన సంక్షోభం (ట్రిపుల్ క్రంచ్) పీడిస్తున్నప్పుడు క్యూబా ఆర్థిక వ్యవస్థ మాత్రం ఈ ఒత్తిళ్ళకు గురికాకుండా నిలదొక్కుకున్నదని లండన్‌లోని 'న్యూ ఎకనామిక్స్ ఫౌండేషన్' కూడా అంగీకరించింది. 2005లో కత్రినా తుఫాన్ తాకిడి వల్ల క్యూబా

ఛిద్రమైపోయింది. దాదాపు పది బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. ఈ వైపరీత్యాలను కాస్ట్రో సమర్థవంతంగా ఎదుర్కొన్నారు.

ఆధునిక చరిత్రలో రాజకీయంగా నెగ్గుకొచ్చిన వారిలో కాస్ట్రో ఒకరు. ఇందుకు కారణం ఆయన ప్రజలు కూడా. కాస్ట్రో మూలంగా, విప్లవం వల్ల వారు ఆరోగ్యం, విద్యా హక్కులు పొందగలుగుతున్నారు. సుస్థిర సమూహాలు సజీవ సంస్కృతిని కాపాడుకోగలుగుతున్నాయి. తన చివరి రోజుల్లో వెనిజులాలో విద్యార్థులను ఉద్దేశిస్తూ "ఈ రోజు విముక్తి చెందాల్సిన వారు ఒక దేశంవారో, ఒక ప్రాంతంవారో కాదు. ఈ రోజు ప్రపంచం, మానవాళి అంతా ఒక బలమైన శక్తి ఆధిపత్యం కింద ఉంది. ఈ రోజు మొత్తం ప్రపంచం, మొత్తం మానవాళి విముక్తి చెందాల్సి ఉంది" అని స్పష్టం చేయటం గమనార్హం. మన దేశంతో సహా ఇప్పుడు ప్రపంచ వ్యాపితంగా సాగుతూ ఉన్న కుల, మత, జాతి, వర్ణ, లింగ, ప్రాంతీయ పోరాటాలను మనం పరిశీలించుకుంటే అవి అంతిమంగా మార్క్సిస్టు దృక్పథాన్ని అలవరచుకుంటే తప్ప ఆయా గుర్తింపు (ఐడెంటిటీ)లకు చెందిన మొత్తం ప్రజలకు ప్రయోజనం చేకూర్చలేవని అర్థమవుతున్నది.

ప్రజల ప్రయోజనాలను మాత్రమే దృష్టిలో పెట్టుకోవడం వల్ల ఎప్పటికప్పుడు తన విధానాలను సమీక్షించుకొని క్యూబా ముందుకు పోతున్నది. మొదట రష్యా తరహాలో కేంద్రీకృత ప్రణాళికలను రూపొందించుకున్నప్పటికీ, ఆ తర్వాత చైనా, వియత్నాం పద్ధతుల్లో మార్కెట్ ఆర్థిక విధానాలను రూపొందించుకున్నది. ఇటీవల మరికొన్ని నూతన ఆర్థిక విధానాలను రూపొందించుకొని విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత లాంటి అంశాలు దెబ్బ తినకుండా సమయానుకూలంగా మార్చుకోవాలని ఆలోచిస్తున్నట్టు తెలుస్తున్నది. పారిశ్రామిక రంగంలో పెట్టుబడులకు కొంత వెసులుబాటు కల్పించి త్వరితగతిన వృద్ధిని సాధించాలని చూస్తున్నారు. గత అరవైయేళ్లుగా సామాజికార్థిక ప్రగతికి ప్రజలే కేంద్రబిందువుగా పాలనను అందిస్తూ అనేక దేశాల్లో సోషలిస్టు విధానాలు విఫలమైనప్పటికీ, తమ గడ్డమీద మాత్రం సోషలిజం నిజమని రుజువు చేసింది క్యూబా. కమ్యూనిజం శాశ్వత సత్యమని చాటి చెప్పింది.

సామ్రాజ్యవాదానికి తలవంచని పోరాట వీరుడు, విప్లవ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి దాకా పది మంది అమెరికా అధ్యక్షులు క్యూబాను శత్రువుగా పరిగణించారు. వాణిజ్య, ఆర్థిక ఆంక్షలు విధించారు. రాకపోకలు నిషేధించారు. చిన్న పిల్లలకు అవసరమైన ఔషధాలు కూడా దిగుమతి చేసుకోవడానికి వీలులేని స్థితి కల్పించారు. ఎప్పుడైనా క్యూబాను పేలుస్తామనే హెచ్చరికతో అణ్వాయుధాలు ఎక్కుపెట్టారు. 1959లో విజయవంతమైన విప్లవం ద్వారా అధికారంలోకి వచ్చిన కాస్ట్రోను – అంతమొందించేందుకు 1960 ఆగస్టు నెల నుంచే – అమెరికా గూఢచారి సంస్థ (సీఐఏ) అత్యంత రహస్య పథకాలను అమలు జరపనారంభించింది. కాస్ట్రో పరిపాలించిన 49 సంవత్సరాల కాలంలో ఆయనపై 638 హత్యాప్రయత్నాలు జరిగాయి. ధైర్యసాహసాలు, సిద్ధాంతం పట్ల విశ్వాసం ఉంటే తరతరాలుగా తమ కళ్లెదుట జరుగుతున్న దోపిడీ, దురన్యాయాలను ఎదిరించవచ్చని, న్యాయం, మానవీయత ఉట్టిపడే భావి సమాజాన్ని నిర్మించవచ్చని కాస్ట్రో నిరూపించారు.

2008 నుంచి ప్రభుత్వ పత్రిక గ్రాన్మాలో 'రిఫ్లెక్షన్స్' (కాలమ్) శీర్షికతో జాతీయ, అంతర్జాతీయ అంశాలు, పరిస్థితులపై తన వాణిని వినిపించాడు. అమెరికాకు వ్యతిరేకంగా ఆయన చేసిన ప్రసంగాలు క్యూబన్లను ఉత్తేజితులను చేశాయి. క్యూబాలో బహుళజాతి సంస్థల దోపిడీని పూర్తిగా రద్దు చేశాడు. ఆయన 1976 వరకు క్యూబా ప్రధానిగా... ఆ తర్వాత 2008 ఫిబ్రవరి వరకు దేశ అధ్యక్షునిగా పనిచేశారు. 2006 జులై 31వ తేదీన ఉదరకోశ సంబంధ వ్యాధితో శస్త్రచికిత్స చేయించుకున్న కాస్ట్రో తన పదవీ బాధ్యతలను – మొదటి ఉపాధ్యక్షుడూ, తమ్ముడూ అయిన రాల్ కాస్ట్రోకు అప్పగించారు. 2008 ఫిబ్రవరి 19వ తేదీన – దేశాధ్యక్షునిగా, సైనిక దళాల ప్రధాన నాయకుడిగా – ఆయన తన బాధ్యతల నుంచి వైదొలిగి – తాను మేథో సైనికునిగా పనిచేస్తానని ప్రకటించాడు. మిలిటరీ గ్రీన్ దుస్తులు, చేతిలో సిగార్‌తో ప్రత్యేక ఆహార్యం కాస్ట్రో సొంతం.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో మహా చర్చ జరిగి రెండు శిబిరాలుగా విడిపోయినప్పుడు సోవియట్ యూనియన్ పక్షం వహించినందుకు విప్లవ శక్తుల అసమ్మతిని మూటకట్టుకున్నప్పటికీ అమెరికాను ఎదిరించే దృఢ దీక్షలో భాగంగా దేశీయ అవసరాల కోసం ఆ వైఖరి తీసుకున్నారు. సోవియట్ యూనియన్‌లో సాగుతున్నది సోషలిజం కాదని నిర్మొహమాటంగానే చెప్పాడు. నిరాడంబర జీవితాన్ని గడుపుతూనే విప్లవోద్యమాల నిర్వహణలో తీవ్రమైన తప్పులు చేయకుండా ఎలా ఉండాలో విప్లవకారులకు, ఉద్యమకారులకు సలహాలు, సూచనలు ఇస్తూ తుది శ్వాస వరకూ ప్రజల శ్రేయస్సునే కాంక్షించారు. చిన్న దేశమైన క్యూబా వర్ధమాన దేశాలకు 'ఉన్నంతలోనే కొండంత' సాయంగా లాటిన్ అమెరికా దేశాలకు, ఆసియా, ఆఫ్రికా దేశాలకు గోధుమ, బియ్యమే కాక, భారీగా వైద్య సహాయ సహకారాలు అందించింది.

కాస్ట్రో మరణంతో ఆదర్శ క్యూబా కూడా అస్తమించినట్టేనని కొందరు బాధపడుతున్నారు. మరికొందరు సంతోషిస్తున్నారు. వ్యక్తులతోనే ఒక ప్రత్యేక తరహా పాలనలు అంతరించడం స్టాలిన్, మావోల తరువాత రష్యా, చైనాల్లోనూ, ఇప్పుడు కాస్ట్రో తరువాత క్యూబాలోనూ జరుగుతుందని సామ్రాజ్యవాద దేశాలు ఆశతో ఉన్నాయి. కాలక్రమంలో తాను 5 దశాబ్దాల నిత్య శ్రమతో, దీక్షతో శ్రేయో రాజ్యంగా నిర్మించిన దేశంలో అనివార్యంగా జరగబోయే మార్పులు ఏవో కాస్ట్రోకు బహుశా తెలిసి ఉండవచ్చు. వాటిని తన చేతుల మీదుగా అనుమతించడం ఇష్టం లేక ఆయన ఎనిమిదేళ్ల కిందట తప్పుకుని ఉండవచ్చు. మొన్నటికి మొన్న ఒబామా క్యూబాలో పర్యటించి వెళ్లిన తరువాత కూడా కాస్ట్రో "మనక్కావలసినవన్నీ మనం ఉత్పత్తి చేసుకోగలం, సాధించుకోగలం, ఎంపైర్ మనకేమీ ఇవ్వనక్కరలేదు" అని కటువుగా మాట్లాడాడు. ప్రపంచీకరణను, అమెరికాను తుదకంటా రాజీలేకుండా వ్యతిరేకించిన వ్యక్తిగా చరిత్ర గుర్తిస్తుంది .

సకల ఆధిపత్యాలకు వ్యతిరేకంగా సమరం సాగించేందుకు వర్గ పోరాటమే సరైన మార్గమన్న అవగాహనకు వచ్చిన కాస్ట్రో తన ఉద్యమ ప్రస్థానంలో వెనుదిరిగి చూడలేదు. వ్యక్తిగత, రాజకీయ, విదేశాంగ విధానాలలో కొన్ని లోపాలు ఉన్నట్టు అనిపించినా అమెరికాను ఏడు దశాబ్దాల పాటు స్థిరంగా ప్రతిఘటించి నిలిచిన మహత్తర సామ్రాజ్యవాద వ్యతిరేక స్ఫూర్తికి చిహ్నంగా కాస్ట్రో కలకాలం నిలుస్తారు. తొమ్మిది పదుల నిండు జీవితంలో సామ్రాజ్యవాదంపై అలుపెరుగని యుద్ధం చేసి, జన క్యూబాను నిర్మించిన ఫిడెల్ కాస్ట్రోను ప్రపంచ సోషలిస్టుగా, చిగురించిన కమ్యూనిస్టుగా శ్రామికప్రజలు నిరంతరం స్మరించుకుంటారు. కాస్ట్రో ఆశయాలు సామ్రాజ్యవాద అణచివేత ఉన్నంతకాలం, దోపిడీ కొనసాగుతున్నంత కాలం ప్రజలను పోరాటోన్ముఖం చేస్తూనే ఉంటాయి. బలమైన మట్టికాళ్ల మహారాక్షసిని ఒక గడ్డిపోచ కూడా ఎదురించి నిలవగలదని, మానవ శక్తి ముందు అణుశక్తి కూడా ఓడిపోక తప్పదని ఆయన తన జీవితంతో, పోరాటంతో రుజువు చేశాడు. కాస్ట్రో ఆచరణ ఒక క్రాంతిరేఖ, ఒక మార్గదర్శి.

పిల్లలకు, తల్లిదండ్రులకు 'పాల్గుణ' ఆదర్శం

● పచ్చల కిరణ్‌కుమార్

జీవించివున్నారో లేదో, మళ్ళీ కలుస్తారోలేదో తెలియని వాళ్ళ కోసం, ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు భార్యాబిడ్డలకు అంకితం చేసిన పాల్గుణ నవలిక కామ్రేడ్ వి.వి. రాసిన మనిషి స్పర్శ, కామ్రేడ్ అల్లం రాజయ్య రాసిన కొడుకులు కూతుళ్లు ముందు మాటలతో ఎంతో మంది తల్లితండ్రులు, భార్యబిడ్డల దుఃఖాల నుండి ప్రయాణిస్తుంది. వర్గ సమాజంలో వున్నది రెండే దారులు ఒకటి దోపిడీ వర్గం, రెండోది పీడిత ప్రజలు.. నేను ఎటువైపు అని ఎవరికి వారు తేల్చుకున్నప్పుడు పాల్గుణ ఎన్నుకున్న మార్గం ఆదర్శవంతమైనది.

నవలలో ఉన్న శ్యామ్ మావయ్య ఎవరి ఇంటికి వెళ్లినా ముందుగా ఆ ఇంట్లో వున్న చిన్నపిల్లలను పలకరించేవాడు. వారితో స్నేహం చేసేవాడు. వారికి చిన్న చిన్నగా ఉద్యమం గురించి చెప్తూ పనులు చేయించేవాడు. అట్ల బుజ్జి అనే అమ్మాయి ఇంటికి ఆయనకు వచ్చిపోవడంతో నవలిక మొదలవుతుంది. ఆమెకు తెలియకుండానే ఆమెతో పనులు చేయించే క్రమంలో ఆమెకు ఉద్యమం గురించిన అవగాహన కలిగిస్తాడు.

ఈ నవలలోని విప్లవకారుడు పాల్గుణను పోలీసులు మాయం చేస్తారు. ఉన్నడో లేదో తెలియక కుటుంబం తల్లడిల్లుతుంటుంది.

రుక్కమ్మ కళ్లెదుటే కొడుకును పోలీసులు పిలుచుకొనిపోతారు. ఆ తర్వాత ఇంటికి రాడు, స్టేషన్లో ఉండదు. పాల్గుణ కోసం ఎదురుచూస్తూ ఆ తల్లి.. 'బిడ్డలారా మీరు నమ్మతరో లేదో.... నాకు నిజం, మీకు అబద్ధం అప్పుడు బిడ్డ నా కండ్లలోకి తల్లి దగ్గర్నుంచి తీసుకుపోయేటప్పుడు లేగదూడ చూసినట్లు నా బిడ్డ చూసిండు. నా గుండెలు అవిసిపోయి, అట్టే దర్వాజలో కూలిపోయినా..' అంటుంది. అప్పటి

పాల్గుణ పై వున్న కేసులన్నీ ఎత్తేస్తారట పెద్దసారు పిలుస్తుండు రమ్మని పాల్గుణను తీసుకుపోయిన పోలీసులు నాలుగురోజుల పాటు చిత్రహింసలు పెట్టి చంపేసి ఎవరడిగినా ఏ పోలీసు స్టేషన్‌లో అడిగినా మేం తీసుకురాలేదు మాకు తెలియదంటూనే వున్నారు.

నెలగడిచిపోయింది, అందరూ పాల్గుణ మీద ఆశ వదిలేసుకున్నారు. పాల్గుణ అన్నలు, బావ అన్ని పోలీసు స్టేషన్లకి తిరిగి వచ్చారు. ఎవరెవరో రాజకీయ నాయకులతో మాట్లాడించారు. ఎక్కడ అనాథ శవం వున్నట్లు తెలిసినా వెళ్ళి చూసొచ్చేవారు. ఒక వైపు బతికి వుంటాడనే ఆశ వుంది కాని అదెంత సేపు! మళ్ళీ శవాలను వెదుక్కుంటూ తిరిగారు. ఆ కాలమంతా ఎవరు ఏది మాట్లాడినా అది పాల్గుణ గురించే అయ్యేది.

చివరికి పాల్గుణ పాలు పోసే డాక్టర్ పాల్గుణ చనిపోయిన సంగతి చెప్తాడు. ఆ వారంలో ఎక్కడెక్కడో తిరిగి ఆవులు మేకలు కాసే వాళ్ళను పట్టుకొని అడవుల్లో తిరిగి పోలీసులు పాల్గుణను చంపేసి శవాన్ని కాల్చి ఎముకలుగా మిగిల్చిపోయిన చోటు గుర్తుపడతారు. అక్కడున్న ఎముకలను దుప్పట్లో వేసుకొని వస్తారు. ఆ ఎముకలను చూసి ఆ అర్ధరాత్రి రుక్కమ్మ, మణి, సొమ్మసిల్లి పోయేలా ఏడ్చారు. ఆ ఎముకలను బొందపెట్టి ఇంటికి వస్తారు. కానీ మణికి పాల్గుణ చనిపోలేదని నమ్మకం. ఆ ఎముకలు పాల్గుణవి కావనే అనుమానం. బావ ఎప్పటికైనా వస్తాడని ఎదురుచూస్తునే వుంది. పాల్గుణ జ్ఞాపకాలన్నింటినీ ఒక చోట కుప్పగా పోగేసుకొని మణి దుఃఖంలో కూరుకుపోయింది. పాల్గుణలేని వెలితి ఆమె ప్రతి కదలికలోను కనిపిస్తూనే వుంటుంది.

కానీ, పాల్గుణ సమాధి కట్టిన దినాన ప్రతి ఏడాది మణి పెద్దబావ, పెద్ద యారాలు మిగతా అన్నదమ్ములు, వాళ్ళ పిల్లలు... ఊరికి వెళ్లి వస్తుంటారు. వేరే పని పెట్టుకోకుండా అక్కడికి వెళ్లి సమాధికి పూజలు చేసి వస్తుంటారు. ఆ పిల్లలకు తమ బాబాయి ఒక హీరో.

టేకుల బస్తీ దగ్గర విప్లవోద్యమం ఓ పెద్ద స్థూపం కట్టిస్తుంది . దాని మీద ఆ ప్రాంతపు అమరుల పేర్లు అన్నీ ఉంటాయి. పాల్గుణ పేరు కూడా ఉంటుంది. స్థూప ఆవిష్కరణకు ఆ అమరుల తల్లితండ్రులు, రక్తసంబంధీకులు అందరూ వస్తారు. వాళ్ల ఏడుపులతో అదొక దుఃఖ సాగరంగా మారింది. మణితో జెండా ఆవిష్కరింప చేశారు. అక్కడే నిలబడ్డ గజ్జెల గంగారామ్ తల్లి జోహార్ అమరవీరులకు, విప్లవం వర్ధిల్లాలి అని నినదించింది.

మొదట పెద్ద శంకర్ తల్లి చేయి పైకి లేచింది.

అది నినాదమో, తెగిన పేగు ఆక్రందనో మరి.. జనమంతా ఆమెతో గొంతు కలిపారు. తనకు తెలియకుండానే మణి కూడా పిడికిలి ఎత్తింది. అంత కాలం పాల్గుణ బతికే ఉన్నాడని నమ్ముతూ వచ్చిన మణికి ఇది పెద్ద సంక్షోభంగా మారింది. ఇక తాను పాల్గుణ లేడని, రాడని నమ్మాల్సి ఉందనే విషయం తెలుస్తూ ఉంటుంది. కానీ అది ఆమెకు ఇష్టం లేదు. దాన్ని భరించడం కష్టంగా ఉంటుంది. కానీ ఉద్యమం ఆయన అమరుడని ప్రకటించింది.

కాలం గడచిపోతుంటుంది. పాల్గుణ కూతురు పెద్దగ అవుతూ ఉంటుంది. ఒక సంవత్సరం పాల్గుణ సమాధి దగ్గరికి అందరూ వెళ్లి వచ్చిన రోజు రాత్రి బావ కొడుకు అనిల్ మణి దగ్గరికి వచ్చి పాల్గుణలాగా మాట్లాడుత్తాడు. అందరూ అనిల్‌ను పాల్గుణ పూనిండని అనుకుంటారు. అప్పుడు రచయిత్రి... హేతుబద్ధంగా ఆలోచించే వాళ్లం దీన్ని నమ్మం. నిజానికి ఇప్పుడు. పాల్గుణ సజీవమా? నిర్జీవమా? అనేది ఈ కాలానికి ప్రశ్నే కాదు. పాల్గుణ ఇప్పుడు ఒక పేరు కాదు ఆయన సర్వనామం. ఉద్యమంలో ఒక భాగం, పాల్గుణ ఎంతో మంది జ్ఞాపకాల్లో ఏ మేరకు ఉన్నాడనేది ముఖ్యం. ప్రజలకోసం అమరుడైన పాల్గుణను ఆ కుటుంబం ఊరు ఆరాధిస్తోంది.. అని అంటుంది.

ఇది పాల్గుణ సహచరి మణి, తల్లి రుక్కమ్మల దుఃఖమూ, శోకమూ కాదు. రాష్ట్రంలో దేశంలో ఎందరో అమరుల తల్లితండ్రులు, భార్యబిడ్డల కన్నీటి గాథ. ఈ నవలిక పాఠకులను దుఃఖంలో ముంచేయడమే కాదు, వర్గ కసిని రగిలిస్తుంది. ముఖ్యంగా ఈ నవల ఈ కాలంలోని యువతకు, వారి తల్లిదండ్రులకు ఒక ఆదర్శాన్ని చూపిస్తుంది. వివేక్, సూర్యం, శృతి, సాగర్‌లాంటి ఎందరో యువ విప్లవకారులు ఉద్యమంలో అమరులవుతున్న సమయంలో పాల్గుణ అమరత్వం గురించిన ఈ నవల ఈ కాలంలోని యువతకు ప్రేరణ కలిగిస్తుంది. ఇందులో ఉన్నన మణి, రుక్కమ్మలతో మనకు పరిచయం లేకపోయినా పాల్గుణ చదువుతున్నంతసేపు వాళ్ళు మన ఇంట్లో మనుషుల్లాగానే అనిపిస్తారు. పాఠకులుగా మనకే అలావున్నప్పుడు రచయిత్రి వారితో మాట్లాడుతున్నప్పుడు వారి మధ్య జరిగిన సంభాషణలను, అందులోని దుఃఖాన్ని మనసులో ఎంతగా రికార్డు చేసుకోకపోతే ఇలా రాయడం సాధ్యం కాదు. అటువంటి దుఃఖాలు ఎదురుపడినపుడు మనుషులు కూలబడిపోకుండా ఉండలేరు. అయితే ఈ నవలిక అంతా అయ్యేసరికి దుఃఖంలోంచి నిటారుగా లేచి నిలబడతారు.

(రోమన్ కేథలిక్కులకు ప్రశ్నలు-జవాబుల పద్ధతిలో మత విషయాలు బోధించే పద్ధతిని CATECHISM అంటారు. 1905లో లూయిస్ కాస్ ఫ్రై అనబడే అమెరికన్ మార్క్స్ 'పెట్టుబడి'ని ఈ పద్ధతిలో అందరికీ సులభ గ్రాహ్యంగా చెప్పటానికి ప్రయత్నించాడు. CATCHISM OF KARL MARX"S CAPITAL పుస్తకానికి తెలుగు అనువాదం సీరియల్‌గా అందిస్తున్నాం. - సం.)

కార్ల్ మార్క్స్ పెట్టుబడి - సరుకులు-డబ్బు

లూయిస్ కాస్ ఫ్రై
అనువాదం: ముక్తవరం పార్థసారథి

(గత సంచిక తరువాయి...)

(4)

132. అయితే సరుకుల గురించి మనం తెలుసుకోవలసిన విషయం మరొకటుంది. సరుకులకే మాటలొస్తే "మా ఉపయోగపు విలువలో మనుషులు ఆసక్తి కనపరుస్తారు. కాని, వస్తువులుగా అది మాకు సంబంధించిన విషయం కాదు, వస్తువులుగా మా విలువ మాత్రమే మాకు చెందుతుంది. సరుకులకూ, మాకూ ఉన్న ఆత్మీయ సంబంధమదే" అని ఘోషిస్తాయి. కాని సరుకుల గురించి అర్థికవేత్త లేమనుకుంటారో వినండి. "విలువ (మారకం విలువ) అనేది వస్తువుల లక్షణం. (ఉపయోగపు విలువ) మనుషులకు అవసరం"

"ఈ అర్థంలో విలువ అంటే మారకం. ఉపయోగపు విలువ (మారకానికి సంబంధించినంత వరకూ) అప్రస్తుతం.

మనిషికి ఉపయోగపు విలువ కావాలి. కాని సరుకులలో 'విలువ' ఉంటుంది.

ఓ వ్యక్తి ధనవంతుడు. ఓ వజ్రం మహా ఖరీదైనది కాని 'వజ్రం' యొక్క మారకం విలువను గురించి ఏ సైంటిస్టు ఇంతవరకూ పరిశోధన చెయ్యలేదు.

వ్యాపారస్తులు, బేహారులు ఈ రసాయనిక పదార్థం యొక్క ఉపయోగపు విలువను గుర్తించి, డబ్బు చేసుకుంటారు. ఇది కాకుండా, ఈ రసాయనిక సంయోగ ఫలితాన్ని 'విలువ' ఎంతో దానికే తెలియాలి.

అంటే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో, వస్తువులో సంపర్కం లోకి రాకుండానే మనకు దాని ఉపయోగపు విలువ తెలుస్తుంది. కాని మరకం ద్వారానే విలువను గ్రహిస్తాం.

రెండవ అధ్యాయం
మారకం (ఎక్స్ఛేంజ్)

133. సరుకులు వాటంతటవే విపణి చేరుకొని తమను తాము మార్చుకోవు గనక మనం వాటి యజమానుల గురించి మాట్లాడుకోక తప్పదు.

సరుకులు ప్రాణం లేని వస్తువులు. వాటి యజమానుల చర్యలను అవి ప్రతిఘటించలేవు. అందువల్ల యజమానులు వాటిని తమ ఇష్టానుసారం వాడుకొంటారు.

మరి సరుకులు, ఒకదానితో ఒకటి ఎలా సంబంధం పెట్టుకుంటాయి? యజమానులు తమ ప్రయోజనాలను వాటిలో నిక్షిప్తం చేస్తారు. అలాగే ఒకరి సరుకులు మరొకరు దొంగిలించకుండా లాగేసుకోకుండా జాగ్రత్త పడతారు. అంటే కేవలం పరస్పర అంగీకారంతోనే మార్పిడి జరగాలి.

యజమానులు తమ సరుకుల్లో ఏం గుర్తించారు? అవి తమకు చెందినవి. వాటి మీద తమకు పూర్తి హక్కులున్నాయి. అవి తమ ప్రైవేటు ఆస్తి.

అంటే మనం న్యాయ సంబంధమైన విషయాల గురించి ప్రస్తావిస్తున్నాం. సరుకుల మార్పిడి జరగాలంటే యజమానుల మధ్య ఒప్పందం జరగాలి. ఒప్పందం చట్టబద్ధమైనదై ఉండాలి. అది ఇద్దరు యజమానుల మధ్య ఏర్పడిన ఆర్థిక సంబంధం.

ఇక్కడ వ్యక్తులను మనం ఎలా గుర్తించాలి?

వాళ్ళు సరుకుల యజమానులు మాత్రమే.

ఆర్థిక రంగస్థలం మీద మనకు కనిపించేది ఆర్థిక సంబంధాలలో ఉన్న వ్యక్తులు మాత్రమే అని క్రమంగా తెలుస్తుంది.

134. సరుకుకూ, సరుకు యజమానికీ ఉన్న తేడా ఏమిటంటే, సరుకు మరొక సరుకుని విలువగా మాత్రమే గుర్తిస్తుంది.

సరుకుల దృష్టిలో అన్నీ సమానమే. విలువను బట్టి ఒక సరుకు తన శరీరాన్నీ, ఆత్మనూమరొక సరుకుకు అమ్ముకోగలదు. అది ఏ సరుకు ఎలాంటి సరుకు, మంచిదా, చెడ్డదా, పాపిష్టి సరుకా, పుణ్యాత్మురాలా అన్న ప్రశ్నే ఉత్పత్తి కాదు.

సరుకులలో లేని ఈ ఇంద్రియ జ్ఞానాన్ని యజమానిని తన ఇష్టాఇష్టాలను బట్టి వాటికి ఆపాదిస్తాడు.

ఆ సరుకు యొక్క ఉపయోగపు విలువను అతడను భవించడు. అలా అనుభవించే వాడైతే అతడు సరుకును బజారులో మార్పిడి కోసం తీసుకురాడు గదా!

అంటే, ఇతర్లు దాని ఉపయోగపు విలువను అనుభవించ బోతున్నారు.

దానివల్ల అతడికి తక్షణం ఉన్న ఉపయోగపు విలువ ఏమిటంటే, అందులో అతడికి మారకం విలువ కనిపించింది.

అంటే? వాటిని ఇతర సరుకులతో మార్పిడి చేసుకోవచ్చు.

అందువల్ల అతడు తన వద్దనున్న సరుకుల్ని, తన కవసరమైన సరుకుల కోసం మార్పిడి చేసుకుంటాడు.

సరుకుల్ని దేనికదిగా చూసినప్పుడు వాటి యజమానులకవి

ఉపయోగపు విలువలు కావు. తమను ఎలాగైనా దక్కించుకొనే వాళ్ళకు మాత్రమే అవి ఉపయోగకరంగా ఉంటాయి.

అంటే, అన్నీ ఈ మారకం లావాదేవీల్లో భాగం కావాల్సిందే. మొదట సరుకుల 'విలువ' ఏమిటో తెలిస్తే గాని దాని ఉపయోగపు విలువను నిర్ణయించటం సాధ్యంకాదు.

135. (సరుకుల) యజమాని తనకవసరం లేని సరుకుని తనకవసరమైన సరుకుతో మార్పిడికి సిద్ధపడతాడు.

ఈ దృష్టితో చూసినప్పుడు, 'మార్పిడి' అంటే కేవలం ఒక ప్రైవేటు లావాదేవీ మాత్రమే.

(సరుకుల) యజమాని తన సరుకు విలువ పొందాలనుకుంటాడు. తన సరుకును, అదే విలువున్న మరొక సరుకు కోసం మార్చుకోవాలనుకుంటాడు. ఆ సరుకు, ఎదటి మనిషికి ఉపయోగపు విలువగా ఉండబోతున్నదా లేదా అన్న విషయం ఇతడికి అనవసరం.

ఇలా చూస్తే, ఇదొక సామాజిక లావాదేవీ. అంటే ఏక కాలంలో అన్ని లావాదేవీలూ ప్రైవేటు లేదా సామాజిక లావాదేవీలుగా పరణమించే అవకాశం లేకపోలేదు.

136. సరుకు యజమాని అన్ని ఇతర సరుకుల్నీ తన సరుకు విలువతో పోల్చి చూస్తాడు.

తన సరుకు, ఇతర సరకుల్తో ఏ నిష్పత్తిలో మారగలతో తెలుసుకుంటాడు. అయితే, అందరు యజమానులూ ఇలాగే ఆలోచిస్తారు గనక ఏ ఒక్క సరుకు కూడా సార్వజనీనమైన మారకంగా ఉండే అవకాశం లేదు.

అంటే, ఇప్పటివరకూ మనం సరుకుల్ని సరుకులుగా కాక, ఉపయోగపు విలువగానే గుర్తించాం. యజమానులందరూ తమ సరుకు మాత్రమే సార్వత్రిక మారకంగా ఉంటే బాగుంటుందనుకొంటారు. కాని ఒక సరుకు, సార్వత్రిక మారకంగా మారటమనేది ఒక సామాజిక చర్య.

137. 'సార్వత్రిక మారకం' అనబడే ఈ సామాజిక చర్య పరిణామమే డబ్బు.

138. డబ్బంటే ఏమిటి? సరుకుల మారకం జరిగిన క్రమంలో ఏర్పడిన ఒక స్పటికం అన్ని సరుకుల విలువలూ ఈ స్పటికం. రూపంలోనే నిర్ధారించబడతాయి. దీని ఆధారంగానే అవి తిరిగి, ఇతర సరుకులుగా మారబడతాయి.

(సరుకుల) ఉపయోగపు విలువకూ, విలువకూ మధ్య ఉన్న వైరుధ్యమే మార్పిడి యొక్క చారిత్రక పరిణామ ఫలితంగా ఈ దశకు చేరుకుంది. ఈ వైరుధ్యానికి ఒక రూపం ఇవ్వవలసిన అవసరమెందుకొచ్చింది? వాణిజ్యపరమైన అవసరాలే ఇందుకు దారితీసాయి.

ఈ వాణిజ్య అవసరమే సరకులకూ, డబ్బుకూ మధ్య భేదం ఏర్పరిచింది. ఉత్పత్తి జరిగిన వస్తువులు సరుకులుగా మారిన క్రమంలోనే సరుకులు డబ్బు అనబడే ఒక ప్రత్యేకమైన సరుకుగా రూపాంతరం చెందాయి.

గమనిక: సరుకుల ఉత్పత్తిని కొనసాగిస్తూనే, డబ్బుకూ, సరుకులకూ మధ్యనున్న వైషమ్యాన్ని నిర్మూలిస్తామంటుంది పెటీ బూర్జువా సోషలిజం. "పోప్ లేకపోయినా కాథలిక్కు మతముంటుందిలే" అన్నట్టుగా ఉంది పోలిక!

139. వస్తు మార్పిడి విధానంలో, రకరకాల వస్తువులు మార్పిడి కోసం పోటీ పడతాయి. ఇప్పుడు మనకిది చాలా అనాగరికంగా, మొరటు పద్ధతిలాగ కనిపిస్తుంది. ఉపయోగపు విలువ, మారకపు విలువగా ఎప్పుడు మారుతుంది? అది యజమానికి "నిరుపయోగపు విలువ" గా పరిణమించినప్పుడు.

ఈ పరిస్థితి ఎప్పుడొస్తుంది?

ఆ సరుకు యజమాని అవసరానికన్నా ఎక్కువ ఉన్నపుడు. అలా అదనంగా ఉన్న సరుకునే అతడు మార్పిడి చేసుకోవాలనుకుంటాడు. వస్తువులంటే యజమాని లౌకిక సంపద. వాటినతడు ఒకదానికొకటి మార్పిడి చేసుకోగలడు. అంటే సరుకుల యజమానులందరూ, మర్పిడి చేసుకోగలిగిన వస్తువులు కలిగి ఉన్న భిన్న వ్యక్తులన్నమాట.

ప్రాచీన సమాజాలలో, అంటే, సమిష్టి సంపద ఉన్న దశలో ఈ లావాదేవీలకు ఆస్కారముండే అవకాశమే లేదు- అది పితృస్వామ్య వ్యవస్థ అయినా, లేదా భారతదేశంలోని ఆయా సమాజాలైనా, లేదా పెరూ (దేశంలోని) 'ఇన్‌కా' రాజ్య వ్యవస్థైనా.

ఒక సమాజం ఉత్పత్తి చేసిన వస్తువులు, సరుకులుగా మారినప్పుడేం జరుగుతుంది? కేవలం బాహ్య మార్పులే కాదు, సమాజ నిర్మాణాన్ని కూడా ప్రభావితం చేస్తుందిది.

మార్పిడి ఏ నిష్పత్తిలో జరుగుతుంది? ఇది చాలా చిన్న విషయం. పరిస్థితులను బట్టి నిష్పత్తి మారుతుంది. అసలు మార్పిడికి కారణమేమిటి? యజమానులు తమ వద్ద వున్న వస్తువుల్ని ఇతరుల కిచ్చి, వాళ్ళ వస్తువులు తాము తీసుకోవాలన్నుకునే కోరిక.

ఇది సామాజిక, దినసరి కార్యక్రమంగా ఎప్పుడు మారుతుంది? నిరంతరంగా మార్పిడి కొనసాగినప్పుడు. స్వంతంగా వాడుకోవటానికి ఉత్పత్తి చేసిన వస్తువుకూ, మార్పిడి కోసం తయారు చేసిన వస్తువుకూ తేడా ఏమిటి?

స్వంత వాడుక కోసమే అయినా, మార్పిడిని దృష్టిలో పెట్టుకుని ఎక్కువ పరిణామంలో ఉత్పత్తి చేస్తారు యజమానులు. అంటే ఆ క్షణం నుండీ, ఆ వస్తువుల ఉపయోగపు విలువ, మారకపు విలువగా మారినట్టే.

మార్పిడి నిష్పత్తి దేని మీద ఆధారపడి ఉంటుంది? ఉత్పత్తి పరిమాణం మీద. సరుకుల మార్పిడి విలువ ఎలా నిర్ణయించబడుతుంది? ఇది కేవలం ఆయా పరిస్థితుల ప్రత్యేక పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది.

140. వస్తు మార్పిడి పద్ధతిలో సరుకుకూ, యజమానికీ ఉన్న సంబంధమేమిటి? యజమాని నేరుగా తన వద్దనున్న సరుకును మరో సరుకుతో మార్పిడి చేసుకుంటాడు.

ఇతరుల దృష్టిలో ఆ సరుకుకున్న విలువ ఏమిటి? ఆ వస్తువు మార్పిడికి పనికొస్తుంది గాని, దాని వల్ల వాళ్ళకు ఉపయోగపు విలువ ఉన్నప్పుడు మాత్రమే.

అంటే ఈ దశలో ఆయా సరుకుల ఉపయోగపు విలువనే, మారకపు విలువలుగా ఉంటాయి. మార్పిడిదార్లు తమకు ఆ సరుకుల వల్ల ఉపయోగముందా? అని ప్రశ్నించుకుంటారు. విపణిలో సరుకుల సంఖ్య పెరిగినప్పుడు అవి మార్పిడిదార్లను బట్టి రకరకాల విలువలు సంతరించుకుంటాయి. ఈ దశలో (మార్పిడి) సమస్యకు తక్షణ పరిష్కారం లభిస్తుంది. ఎక్కువ పరిమాణంలో సరుకుల మార్పిడి ఏ దశలో జరుగుతుంది? అన్ని సరుకులూ ఇతర సరుకులతో మారగలిగినప్పుడే ఇది సాధ్యం. అంటే అన్ని సరుకులనూ, మార్పిడి చేయగల, మరో సరుకేదో కావాలన్నమాట.

అన్ని రకాల మార్పిడి వ్యవహారాలకూ ఉపయోగపడుతున్నది 'డబ్బు' అని మనకు తెలుసు. కాని డబ్బు రూపం (మనీ ఫామ్) ఎలా ఏర్పడింది? సంచారజాతులు దీనికి కారణం. ఎలా? సంచారజాతుల వద్ద స్థిరాస్తులేవీ ఉండవు. అన్ని వస్తువులూ వెంట తీసుకెళ్ళగలిగినవే. అంటే, మార్పిడి చేసుకోగలిగినవే. ప్రయాణాలలో, వాళ్ళు తమ వస్తువుల్ని ఇతరుల వద్ద ఉన్న వస్తువులతో మార్పిడి చేసకోవలసిన అవసరం కూడా కలుగుతుంది.

ఒకానొక సామాజిక పరిణామ దశలో, మనిషి, సాటి మనిషిని బానిసగా మార్చి, ఆ బానిసల మార్పిడి (కొనుగోలు-అమ్మకాలు) తో లావాదేవీలు కొనసాగించాక అంటే, అత్యంత ప్రాచీనమైన, ప్రాథమికమైన డబ్బు రూపం (మనీ ఫాం) మనిషే. (గమనిక: భూమిని మారకపు సరుకుగా ఎప్పుడూ ఉపయోగించలేదు)

ఈ లావాదేవీలు ఏ సమాజంలో జరిగాయి? బూర్జువా సమాజంలోనే ఇది సాధ్యపడింది. అంటే, పదిహేడవ శతాబ్ది ఉత్తరార్థంలో. అయితే, ఇది, జాతీయ వ్యాపారంగా అభివృద్ధి చెందింది మరో శతాబ్దం తరువాతే. అంటే ఫ్రెంచి బూర్జువా విప్లవకాలంలో.

141. ఒక సరుకు సార్వత్రిక మార్పిడి సాధనంగా రూపాంతరం చెందాలంటే, అది స్థానిక పరిమితులను అధిగమించ గలిగినదై ఉండాలి. అంటే చిరికది 'నైరూప్య మానవ శ్రమ' గా మారాలి. ఇలా, మార్పిడికి అనువైన అన్ని లక్షణాలనూ కలిగి ఉన్న ఏకైక సరుకు"డబ్బు".

మరే ఇతర సరుకల్ని 'డబ్బు'గా గుర్తించారు? విలువైన లోహాల్ని (వెండి, బంగారం)

142. నిజానికి, వెండి, బంగారాల్ని డబ్బు అనలేం. కాని డబ్బుకు మరో రూపం వెండి, బంగారం అనటంలో సందేహం లేదు. వెండి, బంగారాలతో నాణాలు ముద్రించటం మనకు తెలుసు. ఇప్పటి వరకు మనర డబ్బును సరుకుల విలువల్ని నిర్ణయించే సాధనంగా మాత్రమే గుర్తించాం.

143. డబ్బుకున్న ఉపయోగపు విలువ గురించి అన్ని సరుకుల విలువల్నీ డబ్బుతోనే గుర్తిస్తాం కనుక, 'డబ్బు' అన్ని సరుకులకూ ప్రతినిధి. అయితే, మారకం విలువ ఒక్కటైనంత మాత్రాన, ఉపయోగపు విలువ కూడా సమానమైనట్టు కాదని మనం ఇప్పటికే చెప్పుకున్నాం. అంటే, బంగారమంటే డబ్బే అని అంగీకరించినా, ఒక పౌండు బంగారం విలువ ఎంత? అంటే చెప్పలేం.

డబ్బు-వంద రూపాయలనుకోండి- విలువ ఎంత? అంటే, ఇతర సరుకులతో పోల్చినప్పుడు- మార్పిడి చేయగలిగినప్పుడు మాత్రమే దాని విలువ ఏమిటో తెలుస్తుంది. అంటే, వందరూపాయల మానవ శ్రమే వంద రూపాయలన్నమాట. వంద రూపాయల మానవ శ్రమతో ఉత్పత్తి అయిన ఏ వస్తువైనా వంద రూపాయలతో సమానమే.

పదిహేడవ శతాబ్దంలోనే డబ్బును సరుకుగా గుర్తించినప్పటికీ, అప్పటికి ఈ 'సరుకు' ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. డబ్బును సరుకుగా అంగీకరించడం సులభమే. సరుకు, డబ్బుగా మారిన క్రమాన్ని అర్థం చేసుకోవడమే కాస్త కష్టం.

144. ఇతర సరుకులన్నీ బంగార రూపంలో తమ విలువను నిర్ధారించుకొన్నందువల్ల బంగారం డబ్బుగా మారలేదు. సరుకులు తమ విలువను బంగారం రూపంలో ఎందుకు ప్రకటించుకుంటాయంటే, అది డబ్బు కాబట్టి. వెండి, బంగారాలు గనుల్లోంచి బయటపడిన వెంటనే వాటిని మానవ శ్రమ ఫలితంగా గుర్తిస్తాం. (ఇతర వస్తువుల్ని ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది).

మరి డబ్బులో ఉన్న ఇంద్రజాలిక ఆకర్షణే అది! ఇప్పుడు మనం చర్చిస్తున్న సామాజిక వ్యవస్థలో ఉత్పత్తి ప్రక్రియలో మనుషులు నిమిత్తమాత్రులుగా మారిపోయారు. ఉత్పత్తి ప్రక్రియ మీద వాళ్ళ నియంత్రణ అసాధ్యమవుతున్నది. వాళ్ళ వ్యక్తిగత ప్రతిస్పందనలకు విలువ లేకుండా పోతున్నది. ఇప్పటికి స్పష్టమయిందనుకుంటాను. ఈ పరిణామాల ఫలితంగానే ఉత్పత్తి అయిన వస్తువులు సరుకులుగా మారుతున్నాయి. ఈ సరుకుల ఉత్పత్తిదారుల సమాజమే ఒకానొక ఎంపిక చేసుకున్న సరుకును 'డబ్బు'గా గుర్తించింది. డబ్బును అర్థం చేసుకోవటంలోని చిక్కుముడి అంటే సరుకుల్ని వాటి స్వభావాల్ని అర్థం చేసుకోవటంలోని చిక్కుముడి అని అర్థం.

మూడవ అధ్యాయం

డబ్బు (సరుకుల చలామణి)

145. చర్చా సౌలభ్యం కోసం, బంగారమే "డబ్బు అనబడే సరుకు" అని అంగీకరిద్దాం. డబ్బు చేయవలసిన మొదటి పని ఏమిటి? సరుకుల విలువగా గుర్తింపబడటం.

146. అంటే అది విలువల కొలమానం. బంగారం కూడా ఇదే పని చేస్తుంది గనక, దాన్ని డబ్బుగా గుర్తించారు. డబ్బు ద్వారా మాత్రమే సరుకుల ధరలను పోల్చటానికి వీలవుతుందా? కాదు. సరుకులన్నీ మానవ శ్రమ ఫలితమే గనక వాటిని పోల్చటం వీలవుతుంది. డబ్బు అనే సరుకు మానవ శ్రమకు విలువ కడుతుంది.

147. మానవ శ్రమ అంటే ఉత్పత్తిలో ఉపయోగించిన మానవ శ్రమ

సమయం.

148. సరుకులన్నింటికీ విలువ ఉంటుంది. డబ్బు కూడా సరుకే. మరి, డబ్బు విలువ ఎంత? డబ్బుకు విలువ లేదు. అది ఇతర సరుకుల విలువను తెలియచేస్తుందే తప్ప దాన్ని కొలవటానికి మరే కొలమానం లేదు.

149. ఇనుము, గుడ్డ, ధాన్యం వంటి వాటికి డబ్బుతో సంబంధం లేకుండా కూడా విలువలున్నాయి. కాని డబ్బును బంగారంతో మాత్రమే విలువగట్టగలం. కాని ఇదంతా మనం ఊహించుకొన్నది మాత్రమే.

150. సరుకుల ధరల్ని ఇతర్లకు తెపటం ఎలా? యజమాని వాటి మీద ధరల చీటీ అంటించాలి. అయితే, అది అతడు ఊహించుకున్న ధర మాత్రమే. ఆశించటంలో తప్పు లేదు. కాని ఆ సరుకులో 'మానవశ్రమ' అంత దాగి ఉన్నదా అన్నదే ముఖ్యం. నిజానికి ఒకే సరుకుకు రెండు మూడు ధరలున్న సందర్భాలూ లేకపోలేదు.

151. 1870 లలో అమెరికాలో, ఒక సరుకు కొనుగోలు చేసి, ఇరవై డాలర్ల బంగారు నాణెం ఇస్తే, తిరిగి (పందొమ్మిదికి బదులు) ఇరవై వెండి డాలర్లు తిగి ఇచ్చారు అమ్మకం దార్లు. అంటే, సరుకు ధర, బంగారం రూపంలో పందొమ్మిది డాలర్లు, వెండి రూపంలో 20 డాలర్లు అన్నమాట. ₹100 విలువ గల బంగారం, వెండి రూపంలో ₹105 పలికింది.

153. డబ్బు రెండు రకాల విధులు నిర్వర్తిస్తుంది. సరుకు యొక్క విలువను నిర్ణయించినప్పుడది సామాజికంగా గుర్తింపబడిన మానవ శ్రమ. ధర అన్నప్పుడు అదో కరెన్సీ కాగితం లేదా నాణెం.

154. ధరల్లో పెరుగుదల ఎలా వస్తుంది? సరుకుల విలువ పెరిగినప్పుడు ధరలు కూడా ప్రభావితమవుతాయి. లేదా డబ్బు విలువ పడిపోయినప్పుడు కూడా ఇలా జరుగుతుంది.

155. ఈ డబ్బు అనబడేది మారకానికి అందరూ అంగీకరించిన ఒక మాధ్యమం గనక, దీనికి చట్టబద్ధత ఉంది. అంటే దీని విలువను ప్రభుత్వాలు నియంత్రిస్తాయి.

156. ధర అంటే ఏమిటి? సరుకు లోని శ్రమను డబ్బు రూపంలో వెలగట్టడమే ధర. దీని ద్వారా, ఏ నిష్పత్తిలో సరుకులు, డబ్బుగా మారతాయో, లేదా డబ్బు, సరుకుగా మారుతుందో అర్థం చేసుకోవచ్చు.

157. సరుకు ఏ అంశాల సమ్మేళనం? పదార్థం, శ్రమ కలిస్తే సరుకవుతుంది. మార్పిడికి అనుకూలమైన పరిస్థితిలో ఉండటం సరుకుకు చాలా ముఖ్యం. ఎందుకలా? శ్రమతో తయారు చేసిందే కావచ్చు, ఉపయోగపరమైందే కావచ్చు కాని స్వంత అవసరం కోసమే అనుకుంటే, మారకం కోసం కాదనుకొంటే అది సరుకు అనిపించుకోదు.

158. మారకానికి సిద్ధంగా ఉన్నదాన్ని మాత్రమే సరుకు అంటారు. అయితే సరుకు లక్షణాలేమీ లేనిది, శ్రమ ఫలితంగా ఉత్పత్తి కానిది, సరుకులతో మారకానికి సిద్ధంగా ఉన్నది- 'డబ్బు' మాత్రమే.

159. ధరలను నిర్ణయించేది, సరుకుల మారకం నిష్పత్తిని నిర్ధారించేది విలువ.

160. దీని గురించే మార్క్స్
"ఆర్థిక శాస్త్రంలో విలువ సిద్ధాంతం, భౌతిక శాస్త్రంలో గురుత్వాకర్షణ శక్తి సిద్ధాంతం లాంటిది" అన్నాడు.

161. అన్ని సరుకులూ విలువ సిద్ధాంతానికి కట్టుబడినవే. బరువైన వస్తువులన్నీ గురుత్వాకర్షణ శక్తికి లోబడినవే. అయితే, అప్పుడప్పుడూ ఇవి ప్రకృతి నియమాలను ధిక్కరించినట్టుగా కనిపిస్తాయి.

162. గాలిలోకెగిరిన వస్తువులన్నీ కిందపడక తప్పదు. కాని గాలి బలంగా వీచినప్పుడు వస్తువు నేరుగా కాక, కాస్త పక్కకు పడుతుంది. గాలికన్నా తేలికైన బెలూన్ గాలిలో తేలుతుంది. కాని శూన్యంలో కింద పడుతుంది.

163. అలాగే, బరువైన ఇనప ముక్క వేగంగా కిందపడుతుంది- పక్షి ఈక గాలిలో చక్కర్లు కొడుతుంది. కాని శూన్యంలో అన్ని వస్తువులూ ఒకే వేగంతో కిందపడతాయి. అయితే ఈ వైరుధ్యాలను అతి సులభంగా అర్థం చేసుకోవచ్చు.

164. అలాగే, పెండ్యులం నిలకడగా ఉండకుండా, కుడి ఎడమలకు తిరుగుతూ ఉంటుంది.

165. ఇక మనం సరుకుల విషయానికొస్తే, సామాజికంగా అవసరమైన శ్రమ నిష్పత్తిలో వాటి మారకం జరుగుతుంది- జరగాలి.

166. కాని "సప్లై-డిమాండ్" అనబడే పెట్టుబడిదారీ సుడిగాలి ఈ నిష్పత్తిని ప్రభావితం చేస్తుంది. అయితే, ధరలు పెరగటం, పడిపోవటం ద్వారా సరుకుల 'విలువ' తనను తాను వ్యక్త పరుచుకుంటూనే ఉంటుంది.

2. చలామణీ మాధ్యమం (మీడియం ఆఫ్ సర్క్యులేషన్) సరుకులు రూపాంతరం చెందే క్రమం (మెటామార్ఫోసిస్ ఆఫ్ కమొడిటీస్)

167. సరుకుల మారకంలో కొన్నిసార్లు వైరుధ్యాలు కూడా ఉంటాయని తెలుసుకున్నాం.

168. మారక ప్రక్రియ గురించి కొద్దిగా మాట్లాడుకుందాం. సరుకులు తమకు నిరుపయోగమనుకొన్న వ్యక్తుల నుండి ఉపయోగమనుకొన్న వాళ్ళ దగ్గరికి చేరే క్రమమే సరుకుల చలామణీ. 'ఉపయోగపు విలువ' గా గుర్తించిన వ్యక్తికి ఒక సరుకు చేరినప్పుడేం జరుగుతుంది? అక్కడ చలామణీ ఆగిపోతుంది. ఆ వ్యక్తి దాన్ని తన కోసం వాడుకుంటాడు.

169. వినియోగదారుడి గురించి మాట్లాడుకోవటానికేమీ లేదు. మారకం కలిగిన ప్రక్రియ గురించి మాత్రం మనం మాట్లాడుకున్నా అది అసంపూర్ణంగానే ఉంటుంది. ఎందుకలా జరుగుతుంది? ఈ మారకంలో రెండు సరుకులు పాలు పంచుకుంటాయి. ఒకటి సరుకుగా మారిన వస్తువు. మరొకటి 'డబ్బు' అనబడే సరుకు.

(ఇంకా ఉంది.)

పత్రికా ప్రకటన

మనకాలపు సాహిత్యకృషీవలుడు, దళిత రచయిత చిలుకూరి దేవపుత్ర గారికి నివాళి

ప్రముఖ కథా రచయిత, నవలాకారుడు చిలుకూరి దేవపుత్ర గారు (1952-2016) ఈ ఉదయం అనంతపురంలో గుండెపోటుతో మరణించారని తెలిసింది. ఆయన హఠాన్మరణం తెలుగు సాహితీలోకాన్ని విషాదంలో ముంచివేసింది. ఆయన రచనలు దళిత జీవిత చిత్రాన్ని గొప్పగా ఆవిష్కరించాయి. కరువు నేపథ్యం నుండి రాయలసీమ సమాజాన్ని లోతుగా చిత్రీకరించాయి. మానవ సమాజపు ఎన్నో భిన్న పార్శ్వాలను తడిమిన ఆయన రచనలు ఎంత సున్నితంగా ఉంటాయో అంతే సూటిగా, సరళంగా ఉంటాయి. అయిదు నవలలు, వంద కథలు ప్రచురించిన దేవపుత్ర రచనలు మొత్తం ఇటీవలే పునర్ముద్రణ అయ్యాయి. వంకర టింకర ఓ, ఆరు గ్లాసులు, ఏకాకి నౌక చప్పుడు, చివరి మనుషులు, బందీ అనే ఆరు కథా సంకలనాలుగా అవి వెలువడ్డాయి. అద్దంలో చందమామ, పంచమం, చీకటి పూలు, కక్షశిల ఆయన నవలలు. తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధ నవలగా 'పంచమం' ఎన్నో ముద్రణలు పొందింది. ఇంగ్లిషు, హిందీ, మరాఠీ, కన్నడ, ఒరియా భాషల్లోకి ఆయన రచనలు అనువాదమయ్యాయి. ఆయన రచన నిండా జనజీవనమూ, ఆయన దృక్పథం ప్రజాపక్షం. దేవపుత్ర గారు విరసం సభ్యులెందరికో ఆత్మీయ మిత్రులు. ఇంకా ఎన్నో రచనలు చేయవలసిన ఆ కలం ఆగిపోవడం విషాదం. తెలుగు సాహిత్యానికి తీర్చలేని లోటు. చిలుకూరి దేవపుత్ర గారికి విప్లవ రచయితల సంఘం వినమ్రంగా నివాళులర్పిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేస్తున్నది.

- పి.వరలక్ష్మి, కార్యదర్శి, పాణి, కార్యవర్గ సభ్యులు
ఆర్. శశికళ, అనంతపురం యూనిట్ కన్వీనర్
విప్లవ రచయితల సంఘం
18-10-2016

సామాజిక కార్యకర్తలపై హత్యానేరం మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ నందినీ సుందర్, జె.ఎన్.యు ప్రొఫెసర్ అర్చనా ప్రసాద్, సి.పి.ఐ(ఎం) ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర కార్యదర్శి సంజయ్ పరాటే, సి.పి.ఐ సభ్యుడు, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (IPTA)కు చెందిన వినీత్ తివారి, మంగల్ రామ్ కర్మ(సి.పి.ఐ), సుక్మా జిల్లా గుఫిడి గ్రామ సర్పంచ్ మంజు కవాసిల తదితరులపై ఛత్తీస్ ఘడ్ పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. కొద్ది రోజుల క్రితం సోమ్ నాథ్ బఘెల్ అనే వ్యక్తిని పోలీసు ఇన్ఫార్మర్ అని మావోయిస్టులు చంపేశారు. దీనిపై నమోదు చేసిన కేసులో పోలీసులు సామాజిక కార్యకర్తలను కూడా ఇందులో చేర్చారు. ప్రొఫెసర్లపై, సామాజిక కార్యకర్తలపై పబ్లిక్ సెక్యూరిటీ చట్టం, ఐ.పి.సి సెక్షన్ 302.(హత్య), 120బి (నేరపూరిత కుట్ర), 147, 148 (దాడులకు పాల్పడటం, మారణాయుధాలు ధరించి ఉండటం) కింద కేసులు నమోదు చేశామని, తగిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ జనరల్ కల్లూరి స్వయంగా మీడియాతో చెప్పారు.

ప్రజాస్వామిక హక్కుల మీద ఇది బరితెగించిన దాడి. ఛత్తీస్ ఘడ్ కొంత కాలంగా హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులపై దాడులు, వేధింపులు, తప్పుడు కేసుల గురించి వార్తల్లో ఉంది. ఆదివాసులపై పోలీసు బలగాలు చేస్తున్న అకృత్యాల గురించి మాట్లాడుతున్నందుకు గత కొన్ని సంవత్సరాల నుండి సామాజిక కార్యకర్తలు మూల్యం చెల్లించుకుంటున్నారు. ఇప్పుడు తాజాగా నమోదైన ఈ తప్పుడు కేసు నేపథ్యం కూడా అదే. వీళ్ళంతా నిజనిర్ధారణ బృందంగా బస్తర్ వెళ్ళి బూటకపు ఎన్ కౌంటర్లు, ప్రజలపై దాడులు, ఆదివాసీ మహిళలపై పోలీసు బలగాల అత్యాచారాల గురించి మాట్లాడటమే కాదు, పోలీసు ఇన్ఫార్మర్ ను మావోయిస్టులు చంపిన ఘటనను గురించి కూడా మాట్లాడారు. వీళ్ళెవరూ మావోయిస్టు రాజకీయాలను సమర్థించేవారు కూడా కాదు.

పోలీసుల ఎన్ కౌంటర్ హత్యలను, ఆదివాసులపై రాజ్యం చేసే అకృత్యాలను, దండకారణ్యంలో ప్రభుత్వం తలపెట్టిన ప్రజలపై యుద్ధాన్ని, కార్పోరేట్ కంపెనీల కోసం అడవిని నాశనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడుతున్నవారు. మావోయిస్టులని చెప్పి చట్టం, జైలు, బెయిలు, వంటి వాటికి అర్థాలే తెలియని వేలాది మంది ఆదివాసీలను తప్పుడు ఆరోపణలతో సంవత్సరాల తరబడి నిర్బంధించి హింసిస్తున్న వైనాన్ని ప్రపంచానికి చాటుతున్నారు. ఈ విషయాలు ఎవరు మాట్లాడినా ఇప్పుడు మావోయిస్టులే. పబ్లిక్ సెక్యూరిటీ చట్టం కింద వాళ్ళను అరెస్టు చేయొచ్చు. డా.బినాయక్ సేన్ లాగా, ప్రొ.సాయిబాబా లాగా వాళ్ళను జైల్లో పెట్టొచ్చు. సంవత్సరాల పాటు చీకటి కొట్లో ఒంటరి నిర్బంధానికి గురిచేయవచ్చు. హక్కుల గురించి మాట్లాడితే శాంతి భద్రతలకు ముప్పు అని పోలీసు భాషలో రాజ్యం బెదిరిస్తున్నది. ప్రజాస్వామ్యం అంటే ఎవరి శాంతి, ఎవరి భద్రత? రాజ్యాన్ని ప్రశ్నించే గొంతుకలను దుర్మార్గంగా అణిచివేసే ఈ నియంతృత్వ పోకడలను ప్రజాస్వామికవాదులందరూ నిరసించాలని విరసం విజ్ఞప్తి చేస్తున్నది. నందినీ సుందర్, అర్చనా ప్రసాద్, సంజయ్ పరాటే, వినీత్ తివారి, మంగల్ రామ్ కర్మ, మంజు కవాసిల తదితరులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

-పి. వరలక్ష్మి (విరసం కార్యదర్శి)
వరవరరావు (వ్యవస్థాపక సభ్యులు)
పాణి (కార్యవర్గ సభ్యులు)
11-11-2016

అరుణోదయ కార్యాలయంపై పోలీసులు దాడి చేసి సీజ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

డిసెంబర్ 2వ తేదీన హైదరాబాద్ దోమలగూడలోని అరుణోదయ సాంస్కృతిక సంస్థ కార్యాలయంపై పోలీసులు దాడి చేసి సీజ్ చేశారు. ప్రజాసంఘాల కార్యాలయాలను సీజ్ చేయడం చరిత్రలో ఎన్నడూ లేదు. దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. 2015 మార్చి నాటి ఒక కేసులో అప్పట్లో ఆరుగురిని అరెస్టు చేశారు. ఆ కేసుతో సంబంధం ఉందని తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ సహాయ కార్యదర్శి భీం భగత్ ను అక్రమంగా అరెస్టు చేసి అనేక కేసులు పెట్టారు. కార్యాలయంలో విప్లవ సాహిత్యం ఉందని అంటున్నారు. విప్లవ సాహిత్యం, పాటలు నేరం కాదు.

తెలంగాణ ఉద్యమంలో ఆట పాటతో అరుణోదయ కళాకారులు గ్రామ గ్రామాన తిరిగి ప్రజల్లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తమ వంతు కృషి చేశారు. ఆ సంస్థ కార్యాలయాన్ని దౌర్జన్యంగా మూసేయడం అత్యంత నిరంకుశమైన చర్యగా విరసం భావిస్తున్నది. ప్రజా ఉద్యమాలను అణచివేసే దిశగా ప్రభుత్వం వివిధ ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, కళాకారులు, రచయితలపై, ప్రజాస్వామికవాదులపై తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నది. దీనిని ప్రతి ఒక్కరూ నిరసించాలని కోరుతున్నాం. అరుణోదయ కార్యాలయాన్ని తిరిగి తెరవాలని, అక్రమ కేసుల్ని ఎత్తివేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని విరసం డిమాండ్ చేస్తున్నది.

-పి.వరలక్ష్మి, గీతాంజలి, కాశీం, వరవరరావు
విప్లవ రచయితల సంఘం
03-12-2016

కామ్రేడ్ చలసాని ప్రసాద్ మొదటి వర్ధంతి సభ

కార్యక్రమం

తేది: 14 అక్టోబర్ 2016
సమయం: సాయంత్రం 6గంటలకు
స్థలం : తెలంగాణ సారస్వత పరిషత్తు, బొగ్గులకుంట, హైదరాబాద్
అధ్యక్షత: గీతాంజలి
చలసాని ప్రసాద్ సాహిత్య సర్వస్వం-1 ఆవిష్కరణ: కాకరాల

చలసాని సాహిత్య వ్యక్తిత్వం
వక్తలు: అమ్మంగి వేణుగోపాల్, బజారా, వరవరరావు, చంద్రయ్య

కామ్రేడ్ చలసాని ప్రసాద్ అమరుడై ఏడాదయింది. ఆయనతో కలిసి ఆలోచించి, రాసి, మాట్లాడి, పని చేసిన అనుభూతులు సజీవంగా ఉన్నాయి. మానవ సంబంధాలపై, మేధో, సృజన కలాపాలపై ఆయన ముద్ర గాఢమైనది. వర్గపోరాటాలు, వాటి విలువలు, సంస్కృతి సాధిస్తున్న నూతన మానవ వికాస క్రమంలో చలసాని భాగం. ఈ ఏడాదిగా సాహిత్యాభిమానుల దగ్గరి నుంచి దండకారణ్య రచయితలు, కళాకారుల దాకా, విప్లవోద్యమ నాయకుల దాకా చలసానిని సన్నిహితంగా, ప్రేమగా, విమర్శనాత్మకంగా ఇలాగే అర్థం చేసుకుంటున్నాం.

భారత కమ్యూనిస్టు ఉద్యమంతోపాటు, మరీ ముఖ్యంగా రెండో ప్రపంచ యుద్ధకాలంనాటి ఫాసిస్టు వ్యతిరేక సాహిత్య, సాంస్కృతిక, మేధో ఉద్యమాల్లో నిర్మాణమైన చలసాని ప్రసాద్ దండకారణ్య ప్రజా ప్రత్యామ్నాయం దాకా, క్రాంతికారీ జనతన సర్కార్ దాకా బుద్ధిజీవిగా, రచయితగా విస్తరించాడు. కామ్రేడ్ చలసాని ప్రసాద్ వర్గపోరాటం రూపొందించిన నూతన మానవుడు. మనిషిని మార్కెట్ ధ్వంసం చేస్తే వర్గపోరాటం మనిషిని తిరిగి సమాజానికిస్తుంది. అటువంటి విప్లవ మానవుడు చలసాని ప్రసాద్ మొదటి వర్ధంతి సందర్భం 50 ఏళ్ల మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ సందర్భంతో కలిసి వచ్చింది. ప్రపంచవ్యాపంగా శ్రామికవర్గ పోరాటాలకు సైద్ధాంతిక, ఆచరణాత్మక స్ఫూర్తిని అందించిన చైనా శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం భారతదేశంలో నక్సల్బరీ వసంత మేఘమై గర్జించింది. పాత విగ్రహాలను ధ్వంసం చేసింది. కొత్త విలువలను అందించింది. శ్రీకాకుళ పోరాటంలో, పాణిగ్రాహి పాటల్లో కళాసాహిత్యాలు కొత్త ఒరవడి దిద్దుకున్నాయి. అటువంటి చారిత్రక సన్నివేశంలో విప్లవ రచయితల సంఘం ఆవిర్భావానికి కార్యకర్తృత్వం వహించిన చలసాని విరసం శ్వాసగా, విప్లవం ధ్యాసగా జీవించాడు. సాహిత్యాన్ని ప్రాణప్రదంగా ప్రేమించాడు. ప్రతి సాహితీ బృందం, ప్రతి ఉద్యమ కార్యకర్త ఎంతగానో ప్రేమించే చలసాని ప్రసాద్‌ది ఎల్లలు లేని స్నేహశీలత. రాజకీయ భిన్నాభిప్రాయాలు వేరు, వ్యక్తుల మధ్య మానవ సంబంధాలు వేరు అని అందరికీ స్నేహాన్ని, ప్రేమను పంచిన సి.పి వ్యక్తిగత జీవితమంతా సమాజపరమే. ఆయన విస్తారమైన మానవ సంబంధాలను కూడా ఏదో ఒక కొస నుండి ఉద్యమానికి ఉపయోగపడేలా చేయగలిగేవాడు.

సాహిత్యం మానవ సమాజ హృదయమని గోర్కీ అన్నాడు. చలసాని హృదయం నిండా మనుషులు, పుస్తకాలు. వర్గపోరాట రాజకీయ ఆచరణతో ముడివేసుకున్న సాహిత్య వ్యక్తిత్వం ఆయనది. కనుక ఆయనే కాదు తెలుగు సాహిత్యాన్నే నక్సల్బరీ పక్షాన నిలబెట్టడానికి కృషి చేశాడు. తెలుగు సాహిత్య రంగంలో ఆయన కృషి విలక్షణమైనది. ఆయన పరిశోధించి సంకలనం చేసిన రచనలు యూనివర్సిటీలు, అకాడమీలు కూడా చేయలేనివి. అది ఒక ఎత్తైతే ఆయన సాహిత్య వ్యాసాలన్నీ సేకరించి చూస్తే తెలుగు సమాజ సాహిత్య చరిత్రకు అవసరమైన ముడి సరుకు వాటిలో విస్తారంగా దొరుకుతుంది. విరసం చలసాని ప్రసాద్ సాహిత్య సర్వస్వం మొదటి భాగం ఆరువందల పేజీలు ప్రచురించింది. ఇంకా సంకలనం చేయవలసిన వ్యాసాలు, కవిత్వం, ఉపన్యాసాలు, ఇంటర్వ్యూలు, లేఖలు ఎన్నో ఉన్నాయి. చలసాని మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన సాహిత్య సర్వస్వం మొదటి సంపుటిని ఆవిష్కరించుకుంటున్నాం.

మూడు తరాల విరసం సభ్యులకు స్నేహితుడు, ఉపాధ్యాయుడు, నిరంతర స్ఫూర్తి సి.పి. తను జీవితమంతా సేకరించిన వేల కొద్ది గ్రంథాలను తన తదనంతరం విరసానికి చెందాలని పదేపదే చెప్పేవాడు. విరసానికి అరుణతారనిచ్చి, అది ఎప్పటికీ ప్రకాశిస్తూనే ఉండాలని హామీ తీసుకున్నాడు. అరుణతార ఏ ఇబ్బందులూ లేకుండా నడవడానికి తగిన ఏర్పాట్లు చేయాలని ఎంతగానో ఆరాటపడ్డాడు. ఆయన చివరి సంతకం, ఆయన చివరి ఉత్తరం అరుణతార గురించే. విరసం పతాకలో అరుణతార వెలుగుల్లో కామ్రేడ్ చలసాని ఎప్పటికీ ప్రకాశిస్తూనే ఉంటాడు. 50 ఏళ్ల శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ సందర్భంలో కామ్రేడ్ చలసాని ప్రసాద్ ను స్మరించుకుంటూ ఆయన వర్గపోరాట సాంస్కృతిక ఆచరణను కొనసాగిస్తామని ప్రతినబూనుదాం.

- విరసం, సిటీయూనిట్

కరపత్రం

నూరేళ్ల బోల్షివిక్ విప్లవానికి యాభై ఏళ్ల మహత్తర శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవానికి జేజేలు పలుకుదాం బెజ్జంగి అమరుల స్ఫూర్తితో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేద్దాం

సోషలిజమే ప్రత్యామ్నాయమని ఎలుగెత్తి చాటుదాం!

మానవజాతి చరిత్రలో మహోద్భుత ఘట్టం బోల్షివిక్ విప్లవం. ఈ నవంబర్ 7 నుంచి రష్యన్ విప్లవ శత వసంతోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. చరిత్ర గతిని మార్చేసిన అనేక తిరుగుబాట్లలో రక్త తర్పణ చేసిన కష్టజీవులు మొట్ట మొదటిసారి తమ విముక్తి కోసం, తమ రాజ్యం కోసం చేసిన విప్లవం అది. అందుకే తొట్టతొలి కార్మిక వర్గ విప్లవమది. అంతక ముందు ప్యారిస్ కమ్యూన్ అనుభవమున్నప్పటికీ.. రష్యా కార్మిక వర్గం విప్లవాన్ని విజయవంతం చేయడమేగాక విప్లవకర నియంతృత్వాన్ని అమలు చేసింది. దాని నీడలో సోషలిస్టు నిర్మాణ ప్రయత్నం చేసింది. అత్యంత ఊహాశాలి అయిన మనిషి వేల ఏళ్ల నుంచి తన సమస్త కల్పనాశక్తులను వెచ్చించి కూడా ఒక కలగానైనా కనలేని అద్భుతం బోల్షివిక్ విప్లవంలో జరిగింది. బానిస సమాజం నుంచి ఎన్నో చారిత్రక అగడ్తలను దాటుకుంటూ వచ్చిన మనిషి సాధించిన విజయం అది. రష్యన్ విప్లవమూ, విప్లవానంతరం కార్మిక వర్గ రాజ్యస్థాపన, సోషలిస్టు నిర్మాణ ప్రయత్నం రోమాంచితాలు. మనుషులు ఇంత శక్తి సంపన్నులు ఎలా అయ్యారని నూరేళ్ల తర్వాత కూడా ప్రతి తరం కాల్పనికావేశానికి గురయ్యే చారిత్రక అనుభవం అది.

కమ్యూనిజంలోకి వెళ్లడానికి సోషలిజం ఒక మధ్యంతర దశ. ఆ దశ ముగిసే వరకు వర్గాలు ఉంటాయి... వర్గాలు ఉన్నంత కాలం వర్గపోరాటం జరగాల్సిందే అనే మావో ఆలోచనకు ఆచరణ రూపమే చైనా సాంస్కృతిక విప్లవం. విప్లవ రాజ్యాధికారం పెట్టుబడిదారీశక్తుల బారినపడుతోంటే తిరిగి వర్గపోరాటం ద్వారా చైనా కార్మిక వర్గం తన అధికారాన్ని నిలబెట్టుకోడానికి చేసిన రెండో రాజకీయ విప్లవమే సాంస్కృతిక విప్లవం. అది కేవలం రాజకీయాధికారం కోసమే గాక విప్లవం తర్వాత కూడా అన్ని జీవన రంగాల్లో పాతుకపోయిన భూస్వామ్య విలువలను, విధానాలను, కొత్తగా పెచ్చరిల్లిపోతున్న పెట్టుబడిదారీ శక్తులను, వాటికి రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలోని రివిజనిస్టులను ధ్వంసం చేయడానికి సాగిన సాంస్కృతిక, భావజాల విప్లవం కూడా. అది నూతన మానవులను ఆవిష్కరించిన ప్రక్రియ. కృశ్చేవ్ నాయకత్వంలో సోవియట్ కమ్యూనిస్టు పార్టీ చేపట్టిన వర్గ సామరస్య విధానానికి వ్యతిరేకంగా మావో నాయకత్వంలో పదేళ్లపాటు గ్రేట్ డిబేట్ జరిగింది. ఈ ప్రేరణతో ప్రపంచ వ్యాప్తంగా 80 మార్క్సిస్టు లెనినిస్టు పార్టీలు ఏర్పడ్డాయి. ఆ తర్వాత చైనాలో శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే మన దేశంలో రివిజనిజాన్ని ఓడిస్తూ 1967 మే 23న నక్సల్బరీ ప్రజ్వలనం భారత విప్లవోద్యమ పంథాను అందించింది. అది వర్గపోరాట మార్గం. దాని వెలుగులో దేశ ప్రజలు నూతన ప్రజాస్వామిక విప్లవంలో కొనసాగుతున్నారు.

దేశంలోని సకల ప్రజల విముక్తి కోసం, దోపిడీ నిర్మూలన కోసం సాగుతున్న విప్లవోద్యమాన్ని దెబ్బతీయడానికి భారత పాలకవర్గాలు ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడో దశను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగమే అక్టోబర్ 23వ తేదీ ఆంధ్రా ఒడిషా సరిహద్దు ప్రాంతంలోని బెజ్జంగి మారణకాండ. కోవర్ట్ ఆపరేషన్ ద్వారా వేలాది బలగాలు చుట్టు ముట్టి ఏకపక్షంగా కాల్పులు జరిపి 31 మంది విప్లవకారులను కాల్చేశారు. అదుపులోకి తీసుకున్న వాళ్లలో ఇప్పటికి ముగ్గురిని ఒకసారి, ఇద్దరిని ఒకసారి కాల్చేశారు. గ్రేహౌండ్స్ కూంబింగ్ ఇప్పటికీ కొనసాగుతునే ఉన్నది. ఆ పేరుతో తమ ఆధీనంలో ఉన్న మావోయిస్టు కార్యకర్తలను, ఆదివాసీ గూడేల వాళ్లను కాల్చేస్తున్నారు. అమరులైన వాళ్లలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, ఛత్తీస్‌ఘఢ్, పశ్చిమ బెంగాల్ కామ్రేడ్స్ ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది పాతికేళ్లలోపు యువతీ యువకులే. ఆంధ్రా ఒడిషా సరిహద్దు ప్రాంత కమిటీ సభ్యులు, డివిజన్ కమిటీ సభ్యులు, పిఎల్‌జిఏ విభాగం బాధ్యులు, ప్రజా మిలీషియా సభ్యులు, సాధారణ ప్రజలు కూడా ఉన్నారు. పోలీసు అధికారులు ఎన్‌కౌంటర్ అని చెప్పుకుంటున్న ఈ ఘటన సామూహిక మానవ హననం. కుట్ర పూరితంగా, ఏక పక్షంగా దాడి చేసి విప్లవకారులను దారుణ హింసలకు గురిచేసి హత్య చేశారు. అత్యున్నత న్యాయస్థాన మార్గదర్శకాలను తుంగల్లో తొక్కి మృతదేహాలను చెక్క పెట్టెల్లో కుక్కి మల్కాన్‌గిరి ఎస్పీ ఆఫీసు ఆవరణలో పడేశారు. మృతదేహాల్లో ఒక మహిళా కామ్రేడ్‌కు శిరస్సు లేదు. ఇద్దరు మహిళల వక్షోజాలు కోసేశారు. ప్రజా కళాకారుడు కామ్రేడ్ ప్రభాకర్, ఎ.ఒ.బి. కమిటీ సభ్యుడు కామ్రేడ్ దయ, కామ్రేడ్ మున్నా శరీరాలను ఛిద్రం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాశవిక స్వభావానికి ఇది పరాకాష్ట. దాదాపుగా ఈ మారణకాండలో అమరులైన వాళ్లందరినీ దారుణంగా హింసించి హత్య చేశారని తెలుస్తోంది. భారత విప్లవోద్యమ చరిత్రలో ఇదే అతి పెద్ద నష్టం. ఏవోబీ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలను మావోయిస్టుల నాయకత్వంలో ఆదివాసులు చాలా కాలంగా సాయుధంగా ప్రతిఘటిస్తున్నారు. అడవిలోని సహజ సంపదను దోచుకోడానికి కార్పొరేట్ శక్తులు మోహరించాయి.

(మిగతా 51వ పేజీలో)

విరసం సభ
2016 నవంబర్ 7, సోమవారం
మధ్యాహ్నం 2.00 గంటల నుంచి రాత్రి 9.00 గంటల దాకా
సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్

2.00 గంటలకు
బెజ్జంగి అమరుల త్యాగాలు ఎత్తిపడదాం
అధ్యక్షత : **గీతాంజలి**
బెజ్జంగి మారణకాండ
పద్మకుమారి, దేవేంద్ర, దేవేందర్
విప్లవోద్యమంలో ఆటుపోట్లు - ప్రజల విజయం
పాణి
విప్లవోద్యమంలో కవులు, కళాకారులు- కా. ప్రభాకర్ ఆదర్శం
కాశీం
సాయంత్రం 5.00 గంటల నుంచి
నూరేళ్ల బోల్షివిక్ విప్లవం, యాభై ఏళ్ల సాంస్కృతిక విప్లవం
అధ్యక్షత : వరలక్ష్మి
అక్టోబర్ విప్లవ చరిత
ఎన్.వి.ఎస్ నాగభూషణ్
తెలుగు సాహిత్యంపై రష్యన్ విప్లవ ప్రభావం
బి. అనూరాధ
సాంస్కృతిక విప్లవం లేవనెత్తిన మౌలిక అంశాలు
వరవరరావు
ప్రజా కళామండలి సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రస్తుతం మా వద్ద అందుబాటులో ఉన్న విరసం, ఇతర ప్రచురణలు, వాటి ధరలు

కథ, నవల, కవిత్వం, సాహిత్య విమర్శ

1.	కొడవటిగంటి కుటుంబరావు - 7 (నవలలు)	250-00
2.	కొడవటిగంటి కుటుంబరావు - 8 (నవలలు)	250-00
3.	కొడవటిగంటి కుటుంబరావు - 9 (నవలలు, కథలు నాటికలు)	250-00
4.	కొడవటిగంటి కుటుంబరావు - 11 (చరిత్ర వ్యాసాలు)	150-00
5.	కొడవటిగంటి కుటుంబరావు - 12 (రాజకీయ వ్యాసాలు)	400-00
6.	కొడవటిగంటి కుటుంబరావు - 13 (సంస్కృతి వ్యాసాలు)	300-00
7.	కొడవటిగంటి కుటుంబరావు - 14 (సినిమా వ్యాసాలు-1)	300-00
8.	కొడవటిగంటి కుటుంబరావు - 15 (సినిమా వ్యాసాలు-2)	250-00
9.	కొడవటిగంటి కుటుంబరావు - 16 ఎ (సాహిత్య వ్యాసాలు-1)	300-00
10.	కొడవటిగంటి కుటుంబరావు - 16 బి (సాహిత్య వ్యాసాలు-2)	300-00
11.	కొడవటిగంటి కుటుంబరావు - 17 (తాత్విక వ్యాసాలు)	150-00
12.	కొడవటిగంటి కుటుంబరావు - 18 (లేఖలు)	125-00
13.	కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (మొదటి భాగం)	300-00
14.	కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (రెండవ భాగం)	250-00
15.	కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (మూడవ భాగం)	250-00
16.	కె.వి.ఆర్. సామాజిక వ్యాసాలు (నాల్గవ భాగం)	300-00
17.	కె.వి.ఆర్. మహోదయం	200-00
18.	వసంతగీతం (అల్లం రాజయ్య)	250-00
19.	కొమురం భీం (అల్లం రాజయ్య)	150-00
20.	సృష్టికర్తలు (అల్లం రాజయ్య)	150-00
21.	సాహిత్య సమాలోచన (కృష్ణాబాయి)	300-00
22.	భావవిప్లవకారుడు కొకు	80-00
23.	కొకు సమకాలీనత - విశ్లేషణా వ్యాసాలు	50-00
24.	అక్షరతుణీరం (కె.వి.ఆర్. సాహిత్య విమర్శ వ్యాసాలు)	20-00
25.	సుబ్బారావు పాణిగ్రాహి కవిత్వం, పాటలు	25-00
26.	అంతస్సూత్రం (వరవరరావు కవిత్వం)	40-00
27.	బీజభూమి (వరవరరావు కవిత్వం)	100-00
28.	గుమ్మెటమోత (పాణి నవల)	100-00
29.	కలిసి పాడాల్సిన గీతమొక్కటే (పాణి కవిత్వం)	10-00
30.	చలసాని ప్రసాద్ రచనలు	100-00
31.	దండకారణ్య కథలు (2005-2012)	125-00
32.	తెలుగు భాష - కొన్ని సంగతులు (వి.చెంచయ్య)	15-00
33.	సామాజికం (వి. చెంచయ్య)	30-00
34.	సాహిత్యధోరణులు - విప్లవ దృక్పథం	30-00
35.	కథల పంట-3	120-00
36.	కదిలే కథ	80-00
37.	తీత్వాల్ కుక్క, మరికొన్ని కథలు (సాదత్ హసన్ మంటో)	60-00
38.	జాజిపూల పరిమళం (షహీదా కథలు)	150-00
39.	ఒక మాట, ఒక సంభాషణ (షహీదా కవిత్వం)	75-00
40.	సామాన్యుల సాహసం (నిత్య, మైనా, సుజాత కథలు)	60-00
41.	ఫాల్గుణ (పద్మకుమారి నవలిక)	30-00
42.	లాల్‌బనో గులామీ ఛోడో బోలో వందేమాతరం (ఎన్కె దీర్ఘ కవిత)	25-00
43.	తెహెల్కా అద్దంలో సర్కారు బింబం మరికొంత కవిత్వం (బాసిత్)	100-00
44.	ఆఖరి బిడ్డ (బాసిత్ నాటిక)	10-00
45.	కిటికీ పిట్ట (పి. మోహన్ కవిత్వం)	10-00
46.	మంజీరా మూడ్స్ (మంజీరా కవిత్వం)	25-00
47.	కవితా ఝంకార్ (విరసం కవితా సంకలనం)	75-00
48.	ఎర్రనక్షత్రం (చైనా నవల)	50-00
49.	నెగడు (కథలు) (నల్లూరి రుక్మిణి)	90-00
50.	పరామర్శ (నల్లూరి రుక్మిణి)	80-00
51.	ఒంద్రుమట్టి (నవల)	170-00
52.	Wake of Telangana? - A docu-drama by Basith	10-00
53.	యంత్రాల మధ్య	35-00
54.	అక్షర కిరణం (కె.వి.ఆర్.)	50-00
55.	డావిన్సి (మోహన్)	150-00
56.	మార్క్సిస్టు సాహిత్య విమర్శ (డా. శ్రీనివాస్)	100-00
57.	అగ్నిశిఖ	80-00
58.	కార్మిక వర్గ పుత్రుడు	70-00
59.	బలహీనుడి బలం	25-00
60.	పాలమూరు వలస బతుకు చిత్రాలు - గీతాంజలి	150-00
61.	ఏది నేరం?! (హజారీబాగ్ జైలు గాథలు) - బి. అనూరాధ	75-00
62.	వెలుగు రవ్వల జడి (ఆలూరి భుజంగరావు)	70-00
63.	అరణ్య పర్వం (ఆలూరి భుజంగరావు)	120-00
64.	ప్రజలు అజేయులు (ఆలూరి భుజంగరావు)	25-00
65.	మైనా (ఆలూరి భుజంగరావు)	50-00
66.	గమ్యం దిశగా గమనం (ఆలూరి భుజంగరావు)	30-00
67.	దిక్కు మొక్కు లేని జనం (ఆలూరి భుజంగరావు)	30-00
68.	సాహిత్య వ్యాసాలు (చలసాని ప్రసాద్)	100-00
69.	కలం యోధుడు చెరబండరాజు (వి. చెంచయ్య)	20-00
70.	ఫాలింగ్ (నల్లూరి రుక్మిణి కథ)	20-00
71.	దండకారణ్య కథలు (2013-2015)	70-00
72.	లొంగిన ప్రతిసారీ (కిరణ్ కవిత్వం)	50-00
73.	చిగురించే పాదం (మేడక యుగంధరరావు కవిత్వం)	40-00
74.	అమర శ్రుతి (వరంగల్ యూనిట్ కవిత్వం)	25-00
75.	మందిపాట ఒరవడిలో (సిటీయూనిట్ కవిత్వం)	40-00
76.	కాశీం కవిత్వం	140-00
77.	తెలంగాణ సాహిత్య వ్యాసాలు (కాశీం)	140-00
78.	కవిత్వంతో ములాఖత్ (ఎన్.వేణుగోపాల్)	120-00
79.	వెలివాడె తొలిపొద్దై	70-00
80.	విప్లవ స్వాప్నికుడు కా. రవూఫ్	50-00
81.	దండకారణ్య కథలు (2013-2015)	70-00
82.	నల్లమల (పి.చంద్)	225-00
83.	అబూజ్‌మడ్ (పాణి)	50-00
84.	మేమున్నాం (పాలమూరు అధ్యయన వేదిక)	60-00

85. నదీ బాల్యం (రివేరా) 30-00
86. ఏప్రిల్ పండు (రివేరా) 30-00
87. పిల్లనగ్రోవి తుఫాన్ (డి. ఉదయభాను) 20-00
88. ఒక ఆకుపచ్చని కల (కెనరి) 40-00
89. లక్ష్మింపేట (విరసం) 25-00
90. వివేచన (వి. చెంచయ్య) 50-00
91. సుబ్బారావు పాణిగ్రాహి (విరసం) 25-00
92. కలిసి పాడాల్సి గీతం ఒక్కటే (పినాకపాణి) 10-00
93. అవ్వజెప్పిన తొవ్వ (శాఖమూరి రవి) 10-00
94. పోస్టుమార్టం రిపోర్టు (వడ్డెబోయిన శ్రీనివాస్) 10-00
95. విప్లవ సాహిత్య విమర్శ (విరసం) 25-00
96. ఎదురగ్గి (నవల) కనుంపల్లి రాజారాం 100-00
97. చలసాని ప్రసాద్ సాహిత్య సర్వస్వం-1 270-00
98. ముడిమనిషి (అరుణతార కథలు 1) 30-00
99. చేపలు (అరుణతార కథలు 2) 30-00
100. కథ అడ్డం తిరిగింది (అరుణతార కథలు 3) 30-00
101. కో...బలి (అరుణతార కథలు 4) 30-00
102. అడవిలోని వెన్నెల (అరుణతార కథలు 5) 30-00
103. నెలవు (అరుణతార కథలు 6) 30-00
104. ఒక వీరుడు మరణిస్తే (అరుణతార కథలు 7) 30-00
105. బదిలీ (అరుణతార కథలు 8) 30-00
106. అరణ్య పర్వం (అరుణతార కథలు 9) 30-00
107. పద్మ (అరుణతార కథలు 10) 30-00
108. విప్లవంలో మాతృత్వం (అరుణతార కథలు 11) 30-00
109. కొండపందికొక్కు (అరుణతార కథలు 12) 30-00
110. ఓడిపోయిన కథలు (అరుణతార కథలు 13) 30-00
111. దాడి (అరుణతార కథలు 14) 30-00
112. తుఫాను (అరుణతార కథలు 15) 30-00
113. కొండవాగు (అరుణతార కథలు 16) 30-00
114. డిసెంబరు ఆరు కథ (అరుణతార కథలు 17) 30-00
115. భూమి (అరుణతార కథలు 18) 30-00
116. ఫ్యూచర్ (అరుణతార కథలు 19) 30-00

సంస్కృతి, చరిత్ర, రాజకీయార్థిక, సైద్ధాంతిక రచనలు

1. సామ్రాజ్యవాద సంస్కృతి (జేమ్స్ పెట్రాస్ వ్యాసాలు) 125-00
2. మావో రచనలు - 1 220-00
3. మావో రచనలు - 2 220-00
4. రివిజనిజం (మావో) 75-00
5. మార్క్సిజం, లెనినిజం, మావోయిజం 170-00
6. మార్క్సిస్టు తత్వశాస్త్రం 80-00
7. చారుమజుందార్ 8 డాక్యుమెంట్లు 50-00
8. మంద్రస్థాయి యుద్ధం 100-00
9. విద్యార్థి యువజనోద్యమాలు (లెనిన్) 30-00
10. రాజకీయ కృషి - మన కృషి అంతటికీ జీవనాడి (చైనా విప్లవోద్యమన పత్రిక హాంకీ వ్యాసాలు) 35-00
11. నక్సల్బరీ వెలుగులో (భారతదేశ నక్సలైట్ ఉద్యమ చరిత్ర) 180-00
12. జగిత్యాల జంగల్‌మహల్ (1) 75-00
13. జగిత్యాల జంగల్‌మహల్ (2) 100-00
14. స్టోలిపిన్ అభివృద్ధి నిరోధక కాలంలో 15-00
15. అంతర్జాతీయ విప్లవోద్యమాల్లోని ఆటుపోట్లు 60-00
16. భారతదేశంలో ఉత్పత్తి విధానం - ఉత్పత్తి సంబంధాలు 20-00
17. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయోత్పత్తి సంబంధాలు 30-00
18. నేటి రాయలసీమ 100-00
19. గతాన్ని సమీక్షించుకుందాం 50-00
20. చూటే ఏరిన రచనలు 125-00
21. మావో సే టుంగ్ 80-00
22. గెరిల్లా యుద్ధం 60-00
23. చైనా ప్రజా విముక్తి సైన్యం 40-00
24. భూమి సంస్కృతి నాగరికత 15-00
25. స్త్రీవాద ఉద్యమం (అనురాధ గాంధీ) 25-00
26. కొత్త చూపు (ఆర్.ఎస్. రావు) 120-00
27. అభివృద్ధిని ఇలా చూద్దాం (ముదునూరి భారతి) 80-00
28. In Search of Method (Mudunuri Bharati) 200-00
29. On Education (Mudunuri Bharati) 180-00
30. Crisis and Development in Marxian Frame Work (Mudunuri Bharati) 80-00
31. Individual, Sub-Groups, Groups and Freedom (Mudunuri Bharati) 75-00
32. Methodology of Social Enquiry (Mudunuri Bharati) 150-00
33 Fifty Years of Andhra Pradesh 1956-2006 300-00
34. జనతన సర్కార్ కావాలి మేక్ ఇన్ ఇండియా కాదు 15-00
35. విద్యార్థి ఉద్యమాల్లో విప్లవ దిద్దుబాటు 30-00
36. జాతుల సమస్య రిజర్వేషన్లు కార్మిక వర్గ దృక్పథం 25-00
37. తత్వశాస్త్రం మాయాజాలం కాదు 20-00
38. వైరుధ్యాలు 20-00
39. చైనా తాత్విక రంగాన మూడు ప్రధాన పోరాటాలు 1949-64 20-00
40. జనతన రాజ్యం (పాణి) 300-00
41. మార్క్సిస్టు మహోపాధ్యాయుల జీవన రేఖలు 20-00
42. దండకారణ్య సాంస్కృతికోద్యమ చరిత్ర (పునర్ముద్రణ) 100-00
43. సీమ గొంతుక వినండి (అరుణ్ వ్యాసాలు) 70-00
44. ఈలం విముక్తి పోరులో మహిళలు 50-00
45. సామ్రాజ్యవాద దోపిడి మండలాలు (రత్నమాల) 50-00
46. డిటెన్యూ డైరీ (కె.వి.ఆర్.) 170-00
47. సమగ్ర తెలంగాణ (సంపాదకులు - ఎన్. వేణుగోపాల్) 295-00
48. విప్లవ పథంలో వరంగల్ విద్యార్థి ఉద్యమం (విరసం) 40-00
49. వామపక్ష కమ్యూనిజం-ఒక బాలారిష్టం (ఎన్.వి.ఎస్. నాగభూషణ్) 30-00
50. ఐక్య సంఘటన (దిక్సూచి) 35-00
51. బాలగోపాల్ తాత్విక గందరగోళం (సమీర్) 50-00

వర్తమాన సమాజం, ప్రజా ఉద్యమాలు

1.	ముజఫర్‌నగర్ మరో మానని గాయం	20-00
2.	ఆకాస ఉద్యమ అమరులు	10-00
3.	దండకారణ్యంలో గ్రీన్‌హంట్	60-00
4.	ఉద్యమ ఆకాశంలో సగం	15-00
5.	తూర్పు మధ్య భారతంలో విస్థాపన-ప్రజా ప్రతిఘటన	20-00
6.	జనతన జైత్రయాత్ర	20-00
7.	ఫిలిప్పీనో ఉద్యమం	15-00
8.	ఖైదీల సైరన్	60-00
9.	విముక్తిబాటలో నారాయణపట్నా	50-00
10.	అంతర్యుద్ధంలో ఆదివాసులు	30-00
11.	నిత్య జీవితంలో సోషలిజం (భూసారం శివన్న)	100-00
12.	ఆకుల భూమయ్య రచనలు	40-00
13.	అమలు కానీ హామీల చరిత్ర (శశికళ)	100-00
14.	ది ఫ్లేమ్స్ ఆఫ్ నారాయణ పట్నా	60-00
15.	దాక్షిణ్య వాదం నుంచి దండకారణ్యం దాకా (రత్నమాల)	200-00
16.	నూతన సంభాషణ (రత్నమాల)	80-00
17.	జర్నలిజం ప్రొఫెషన్ (రత్నమాల)	50-00
18.	సాహిత్య ధోరణులు విప్లవ ధోరణులు	30-00
19.	ప్రాణహిత (అల్లం నారాయణ)	150-00
20.	గ్రీన్‌హంట్ ఉత్పాదాలు (విరసం)	25-00
21.	ఆకాసంలో సగం పా. సగం మహిళ విముక్తి (విరసం)	35-00
22.	లాంగ్ మార్చ్ (తెలంగాణ జర్నలిస్టులు)	100-00
23.	పచ్చని బతుకులపై నిప్పులు కురుస్తున్న రాజ్యం (బిడి దమయంతి)	15-00
24.	కృష్ణానది నీళ్ళు (ఎం. రాఘవచారి)	20-00
25.	మండుతున్న గాయాలు (బిడి దమయంతి)	40-00
26.	సముద్రంలో సంభాషణ (పి. వరలక్ష్మి)	20-00

స్మృతి సాహిత్యం

1.	ఖాన్‌దాదా (ఎం.టి.ఖాన్ స్మృతి)	10-00
2.	ఆదర్శజీవులు అమరులు	30-00
3.	గంటి ప్రసాదం రచనలు	25-00
4.	సూర్యుడు మరణించడు	60-00
5.	చిరునవ్వు సితార	80-00
6.	గెరిల్లా డైరీ	10-00
7.	మన్యం వెలుగులు	15-00
8.	అక్షర కిరణం	20-00
9.	అడవి పుత్రుడు మంగన్న	10-00
10.	గజ్జెల సరోజ	15-00
11.	మహిత	10-00
12.	కోటి జ్ఞాపకాలు	50-00
13.	అమరుల యాదిలో	50-00
14.	అమరుల జీవిత చరిత్ర	30-00
15.	వేగుచుక్కల వెలుతురులో	10-00
16.	లంకపల్లి అమరులకు విప్లవ జోహార్లు	10-00
17.	శారద స్మృతి శకలాలు	30-00
18.	దండకారణ్యంలో చలసాని ప్రసాద్	10-00
19.	సాహసయోధురాలు (గజ్జెల సరోజ రచనలు)	40-00
20.	అమరుడు కామ్రేడ్ సంజయ్	10-00
21.	రైజింగ్ సన్ (సూర్యం స్మృతి)	20-00
22.	అజ్ఞాత విప్లవ యోధుడు కొండన్న (దిక్సూచి)	50-00
23.	పువ్వర్తి అమరులు (దిక్సూచి)	20-00
24.	చిరునవ్వు సితార (విరసం)	70-00
25.	కా॥ సహస గెరిల్లా యోధుడు మాసా (దిక్సూచి)	50-00
26.	కె. దాసారావు కనకచారి (దిక్సూచి)	10-00
27.	మృత్యుంజయులు మొద్దుగుట్ట అమరులు	20-00
28.	బొట్టెం అమరుల జీవిత చరిత్ర (అమరుల బంధుమిత్రుల సంఘం)	40-00
29.	గెరిల్లా అమ్మ (అమరుల బంధుమిత్రుల సంఘం)	20-00
30.	కన్నబిడ్డల కలల యాది (అమరుల బంధుమిత్రుల సంఘం)	20-00
31.	దండకారణ్య విప్లవ మహిళ కా॥ హేమ్లాలచ్చి (దిక్సూచి)	10-00
32.	ప్రజాయుద్ధ వీరుడు కా. నగేష్ (దిక్సూచి)	10-00

డివిడిలు

1.	అరుణతార సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక (1977-2013)	125-00

మా ప్రచురణలు లభించే పుస్తక కేంద్రాలు :

నవోదయ బుక్ హౌస్,

ఆర్యసమాజ్ ఎదురుగా, కాచిగూడ చౌరస్తా,

హైదరాబాద్‌లోనూ లభిస్తాయి. ఫోన్ : 040-24652387

నవ తెలంగాణ,

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాదు-500020.

ఫోన్ : 040-27608107, 9490099373

అనేక బుక్ స్టాల్,

30-5-26/1, కోకా చలపతిరావు స్ట్రీట్, ఏలూరు రోడ్,

విజయవాడ-520002. ఫోన్ : 8977493465

-: స్వీకారం :-



తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్ చరిత్ర
రచన, కూర్పు :
సి. కాశీం
ప్రచురణ :
నడుస్తున్న తెలంగాణ
వెల : రు. 150/-
పేజీలు : 216



కామన్ స్కూల్ కల
అధ్యాపకజ్వాల సంపాదకీయాలు
ప్రచురణ :
అధ్యాపకజ్వాల
డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్
వెల : రు. 80/-
పేజీలు : 176



మా బతుకులు
దళిత స్త్రీ ఆత్మకథ
బేబీ కాంబ్లే
తెలుగు అనువాదం
బి. అనూరాధ
ప్రచురణ :
మలుపు ప్రచురణ
వెల : రు. 130/-
పేజీలు : 176



Operation Greenhunt
An attack on ADIVASIS
Published by
Civil Liberties Committee Telangana & AP
Co-ordination of Democratic Rights Organisation (CDRO)
Price : Rs. 50/-
Pages : 64

దాలి
తెలంగాణ దీర్ఘకవిత
సుంకిరెడ్డి నారాయణరెడ్డి
వెల : రు. 30/-
పేజీలు : 66



తావు
కవిత్వం
ప్రచురణ :
మధువని ప్రచురణలు
సుంకిరెడ్డి నారాయణరెడ్డి
వెల : రు. 40/-
పేజీలు : 112



చెరువు
అరుణతార కథలు
(1996)
సంకలనం - 20
ప్రచురణ :
చరిత
వెల : రు. 30/-
పేజీలు : 88



యాతర
అరుణతార కథలు
(1997)
సంకలనం - 21
ప్రచురణ :
చరిత
వెల : రు. 30/-
పేజీలు : 88



ఊట
అరుణతార కథలు
(1997-98)
సంకలనం - 22
ప్రచురణ :
చరిత
వెల : రు. 30/-
పేజీలు : 96

దండకారణ్యంలో
మావోయిస్టు ఆచరణ
జనతన రాజ్యం
పాణి
ప్రచురణ :
విరసం ప్రచురణలు
వెల : రు. 300/-
పేజీలు : 565
రెండవ ముద్రణగా...





చలసాని ప్రసాద్ సాహిత్య సర్వస్వం-1
ప్రచురణ :
విరసం ప్రచురణలు
వెల : రు. 270/-
పేజీలు : 615

ఈ పుస్తకాలు హైదరాబాద్ బుక్‌ఫెయిర్ 2016
అరుణతార స్టాల్ 242, 243లో అందుబాటులో ఉన్నాయి

KLVA101M194

ARUNATARA RNI Regn.No.21152/72 Published on 14/12/2016 December 2016 Vol. : 44 Issue : 11
Hyderabad
A Literary and Cultural Telugu Monthly Journal of Viplava Rachayitala Sangham (VIRASAM - Revolutionary Writers' Association)

అరుణతార నిర్వహణకు విరాళాలివ్వండి
శాశ్వత నిధి ఏర్పాటుకు సహకరించండి

విప్లవ రచయితల సంఘం అధికార పత్రిక అరుణతార 1977 నవంబర్ నుంచి మాస పత్రికగా వస్తోంది. సాహిత్య సాంస్కృతిక సంస్థగా విరసం విప్లవ, విప్లవ సాహితోద్యమాల్లో నిర్వచించుకున్న తన రాజకీయ, సాహిత్య, మేధో పాత్రకు వాహికగా తెలుగు సమాజంపై ప్రభావం వేస్తున్నది. గత మూడు తరాలుగా ఎందరో రచయితల, బుద్ధిజీవుల ఆలోచనా వికాసానికి వేదికగా ఉన్నది. సాహిత్య పత్రిక అయినప్పటికీ సామాజిక, రాజకీయార్థిక, సిద్ధాంత విశ్లేషణలకు, చర్చలకు, అన్వేషణకు సృజనశీలమైన మాధ్యమంగా కొనసాగుతున్నది. నక్సల్బరీ శిశువుగా విరసం తాను ఎంచుకున్న విప్లవోద్యమ ప్రచార కర్తవ్యంలో అరుణతార పాత్ర గణనీయం. 1970లలో ఉత్తర తెలంగాణలో విప్లవోద్యమ పునర్నిర్మాణ దశ నుంచి ఇవాళ దేశవ్యాప్తంగా సాగుతున్న విప్లవ, ప్రజా పోరాట సంచనాలను అరుణతార తన శక్తినంతా వెచ్చించి అక్షరబద్ధం చేస్తున్నది. మరీ ముఖ్యంగా చత్తీస్‌ఘడ్‌లో సల్వాజుడుం దుర్మార్గాలు మొదలైనప్పటి నుంచి ఇవ్వాల్టి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడో దశ, సాల్వాజుడుం రెండో దశ దాకా దండకారణ్య ప్రజా యుద్ధాన్ని, ప్రజారాజ్యాధికారాన్ని, ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్నీ, అక్కడ సాహిత్య, సాంస్కృక వికాసాన్నీ తెలుగు పాఠకులకు పరిచయం చేస్తున్నది, విశ్లేషిస్తున్నది. దండకారణ్య విప్లవోద్యమానికి సంఘీభావ హస్తాన్ని అందిస్తున్నది. ఈ పనిలో ఇతర ప్రజాస్వామిక పత్రికల పాత్ర కూడా ఉన్నప్పటికీ అరుణతార దాన్నే ఒక ప్రధాన కర్తవ్యంగా స్వీకరించింది. ఇటీవల పెరిగిపోయిన హిందూ ఫాసిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామిక కంఠస్వరాన్ని బలంగా వినిపిస్తున్నది. వేర్వేరు సామాజిక ఉద్యమాల ఆకాంక్షలను ఎత్తిపడుతూ వాటి న్యాయబద్ధతను విశ్లేషిస్తున్నది.

ప్రజాఉద్యమాల్లోని కార్యకర్తల సృజనాత్మక వ్యక్తీకరణలకు అరుణతార అవకాశం ఇవ్వడం వల్ల వాళ్లలోంచి ఎందరో ప్రతిభావంతులైన ఆలోచనాపరులు, రచయితలు తయారువుతున్నారు. అరుణతార ఈ పని ఆది నుంచి చేస్తున్నది. అందువల్ల ఒక పక్క లబ్ధప్రతిష్టుల రచనలతోపాటు ఎప్పటికప్పుడు కొత్త గొంతులు అరుణతారలో వినిపిస్తుంటాయి.

అయితే మొదటి నుంచీ అరుణతార అనేక ఆర్థిక, నిర్వహణ సమస్యలను ఎదుర్కొంటున్నది. ఒక్కోసారి ఈ ఇబ్బందులు కాస్త తక్కువగా ఉన్నా, ఇటీవల తీవ్రమైన సంక్షోభాల మధ్య ఎప్పటికప్పుడు అభిమానుల, మిత్రుల అండదండలతో నడుస్తున్నది. గతంలో ఒకసారి అరుణతారకు విరాళాలు వద్దు.. చందాలు కట్టండనే ఆదర్శాన్ని కూడా అమలు చేసింది. అయితే నానాటికి పెరుగుతున్న ప్రెస్ ఛార్చిలు, నిర్వహణ ఖర్చులు మోయలేని భారమయ్యాయి. దీంతో రెండు నెల్లకో సంచిక వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. అయితే పేజీలు పెంచి పాఠకులకు మరిన్ని రచనలు అందిస్తూ వచ్చాం.

ఈ అన్ని అనుభవాల దృష్ట్యా అరుణతారకు శాశ్వత నిధి తయారు చేయకుండా ఇక పత్రికను నాలుగు కాలాల పాటు నడపడం అయ్యేపని కాదని తేలింది. ఇంత కాలం అభిమానుల సహకారంతోనే నడుస్తూ వచ్చిన అరుణతార ఈసారి శాశ్వత నిధి కోసం మీ ముందుకు వచ్చింది. ఇవాళ ఉన్న విప్లవోద్యమ ప్రత్యేక పరిస్థితుల్లో అరుణతార అవసరం ఎంత ఉన్నదో పాఠకులకు తెలుసు. తెలుగు నేల మీద, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో ఉన్న అసంఖ్యాక విప్లవాభిమానులు తలా ఒక చేయి వేస్తే శాశ్వత నిధి సమకూరడం కష్టమేమీ కాదని మా నమ్మకం. దాంతోనే మీ ముందుకు వచ్చాం. విప్లవోద్యమ రాజకీయ, సాంస్కృతిక వేదిక అరుణతారకు మీవంతు విరాళాలు ఇవ్వాలని, ఇప్పించాలని కోరుకుంటూ...

డి.వి. రామక్రిష్ణారావు, అరుణతార సంపాదకుడు
పి. వరలక్ష్మి, విరసం కార్యదర్శి
వరవరరావు, టి. కృష్ణాబాయి, సిఎస్‌ఆర్ ప్రసాద్, జి. కళ్యాణరావు, వి. చెంచయ్య,
అల్లం రాజయ్య, ఎం. రత్నమాల, సి. కాశీం, పాణి

విరాళాలు ఆన్‌లైన్‌లో పంపడానికి వివరాలు :
డి.వి. రామక్రిష్ణారావు, అకౌంట్ నెం. **10243583773**, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బి.ఐ.)
ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ నెం. ఎస్.బి.ఐ.ఎన్.**0007112**, లాలాగుడ, సికింద్రాబాద్.
ఎం.ఓ.లు, డ్రాఫ్టులు, చెక్‌లు డి.వి. రామక్రిష్ణారావు పేరిట ఎం.ఐ.జి. - **14**, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి, హైదరాబాద్ - **500 040** చిరునామాకు పంపగలరు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DUVVURI VENKATA RAMAKRISHNA RAO, PRINTED AT CHARITA IMPRESSIONS, DOOR NO: 1-9-1126/B, AZAMABAD, HYDERABAD – 500020, TELANGANA STATE, PUBLISHED AT 12-15-963, MANIKESWARNAGAR, OSMANIA UNIVERSITY CAMPUS, TARANAKA, HYDERABAD – 500007, TELANGANA STATE, EDITOR: DUVVURI VENKATA RAMAKRISHNA RAO.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M194
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	64
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	naima
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Sharmila
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good